# 1 భాష మరియు సమాజం

**విషయక్రమం**

1.0 ఉపోద్ఘాతం
1.1 భాష – స్వభావము
1.1.1 భాష – గతిశీలత
1.1.2 భాష యొక్క విధులు, ప్రయోజనాలు
1.1.3 భాష ద్వారా అనుభవాల వ్యక్తీకరణ
1.1.4 భాష ఒక నియమానుసార నిర్వహణ కృత్యం
1.2
1.2.1 భాష సంస్కృతి, సంజ్ఞాన మరియు భావప్రసారాల సమ్మిళితం
1.2.2 మాట్లాడే వ్యక్తుల ఉద్దేశ్యానుసారంగా, సందర్భానుసారంగా పదాల అర్థాలను అవగాహన చేసుకోవాలి
1.3 భాష మరియు సమాజం
1.3.1 భారతదేశంలో బహుభాషా వైవిధ్యం
1.3.2 భాష ద్వారా సామాజిక, రాజకీయ మరియు ఆర్థికాభివృద్ధి
1.3.3 ప్రామాణిక – అప్రామాణిక భాషారూపాలు
1.4
1.4.1 భాష : ప్రథమ, ద్వితీయ మరియు తృతీయ భాషలు
1.4.2 భాషారూపాలు
1.4.3 మాండలికాలు
1.4.4 వ్యక్తిగత భాష
1.4.5 గృహభాష

1.4.6 పరిసరాల భాష

1.4.7 భావవ్యక్తీకరణ సాధనంగా భాష

1.4.8 బోధన మాధ్యమంగా తెలుగుభాష

1.4.9 జాతీయ సమైక్యత – భాష

1.4.10 అంతర్జాతీయ అవగాహన – భాష

1.4.11 భాష – పాలనా వ్యవహారాలు (అధికారభాషగా తెలుగు)

1.5 మూల్యాంకనం

## 1.0 ఉపోద్ఘాతం

సమస్త జీవరాశిలోనూ మానవుడు సమున్నత స్థానానికి చేరడానికి మూలకారణం భాష. "భాషే నేను కట్టుకున్న గోపురం; భాషే నాకు దేవుడిచ్చిన వరం" అంటాడు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥ సి.నారాయణరెడ్డి. "నరుడు నవ్వును; జంతువుల్ నవ్వవు" అన్న మహాకవి జాషువా మాటలు ఎంతో అర్థవంతమైనవి! కొన్నిరకాల ప్రాణులు ఏవేవో ధ్వనులు చేయగలవేమో కాని, మనలాగా మాట్లాడలేవు. మాటలులేని మానవప్రపంచాన్ని ఒక్కసారి ఊహించండి. భాష మనిషికి శ్వాసలాంటిది. మానవునికి ఉన్న అమూల్యమైన శక్తి మాట్లాడగలగడం. ముఖయంత్రలోపాలు గల వారు తప్ప, మానవులందరూ మాట్లాడగలరు. భాషకు సంబంధించి క్రీస్తుపూర్వం సుమారు నాలుగువేల సంవత్సరాల నుండీ లిఖిత ఆధారాలు ఉన్నట్లు సమాచారం. భాష అంటే కొన్ని ధ్వనుల సముదాయం. కొన్ని భాషానిర్వచనాలను పరిశీలిద్దాం.

"బుద్ధి జీవులయొక్క అనుభవాల అభివ్యక్తియే భాష" - ఐస్లర్

"ధ్వనిని ఉత్పత్తిచేసే తన అవయవాల సాయంతో వ్యక్తంచేసే ధ్వనుల పరంపరే భాష" - సైమస్ పాటర్

"మాట్లాడే అలవాట్ల సంక్లిష్ట వ్యవస్థ భాష" - హాకెట్

"మనస్సులోని భావపరంపరను ఏ పదాల ద్వారా, ఏ వాక్యాలద్వారా ఎదుటివారికి అందిస్తామో ఆ పదాలే, ఆ వాక్యాలే భాష" - రామచంద్ర వర్మ.

ఆధునిక భాషాశాస్త్రం ప్రకారం చెప్పాలంటే "ప్రజలు మాట్లాడుకునే తీరే భాష". "ధ్వని మరియు లిఖిత సంకేతాలతో, భావగ్రహణ మరియు వ్యక్తీకరణలు చేయుటకు మానవుడుపయోగించే సాధనమే భాషగా" భావించవచ్చు. మానవుడు వాగ్రూప సంకేతాలను ముఖయంత్రం ద్వారా ఉత్పత్తి చేస్తే, లిఖితరూప సంకేతాలను చేతి కండరాల ద్వారా ఉత్పత్తి చేస్తున్నాడు.

ప్రపంచంలో మాట్లాడే భాషలు సుమారు 7000 వరకు ఉన్నాయి. ఇందులో మండేరియన్ (చైనీస్) భాషను ఎక్కువమంది మాట్లాడే భాషగా (1,213,000,000 మంది) పరిగణిస్తున్నారు. ఈ భాషల్లో 90% భాషలు ఒక లక్షలోపు జనాభా మాట్లాడేవే. ఒక మిలియన్ కంటే ఎక్కువమంది మాట్లాడే భాషలు 150-200 వరకు ఉన్నాయి. ఒక్కొక్క వ్యక్తి మాట్లాడే భాషలు 46 వరకు ఉన్నాయి. భవిష్యత్తులో అంతమైపోయేందుకు సిద్ధమౌతున్న భాషలు 2500 వరకు ఉన్నాయని UNESCO హెచ్చరించింది. 17వ శతాబ్దంనుండి నేటివరకు సుమారు 200 భాషలు కృత్రిమంగా సృష్టించబడ్డాయి. భాష రెండు రూపాల్లో ఉంటుంది. అవి వాగ్రూపం మరియు లిఖితరూపం.

## 1.1 భాష - స్వభావము

జీవరాశిలో మానవునికి విశిష్టస్థానాన్ని ఇచ్చింది భాష. **"మనస్సులోని భావాలను ధ్వనులరూపంలో వ్యక్తం చేయగల సాధనం భాష".** ఇది భాషయొక్క మొదటి రూపం. తరువాతి కాలంలో ఈ వాగ్రూప భాషకు లిఖితరూప సంకేతాలను కూడా సమకూర్చుకొని భాషతో భావాలను అనువంశికంగా అందించే ప్రయత్నం చేశాడు మానవుడు. ఇది భాషయొక్క రెండవ రూపం. మానవభాషకు ఏడు ముఖ్య లక్షణాలు ఉన్నాయి. అవి

1. నిర్మాణవైవిధ్యం
2. ఉత్పాదకశక్తి

3. శబ్దార్థసంబంధ కృత్రిమత
4. వక్తృశ్రోతృవిపరిమాణం
5. ప్రత్యేకత
6. ప్రేరణదూరత
7. సాంస్కృతిక ప్రసరణ

2XVZ1V

**1.1.1 భాష – గతిశీలత:** ఏకమూల భాషావాదం అనుసరించి చూస్తే మానవప్రపంచ ప్రారంభంలో ఒకే భాష ఉండేదనీ, అందులోంచి క్రమక్రమంగా అనేక భాషలు పుట్టుకొచ్చాయనీ భాషావేత్తల అభిప్రాయం. ప్రస్తుతం ప్రపంచంలో 5000 భాషలున్నాయని భాషావేత్తల అంచనా. ఒకేభాష కాలగతిలో జరిగిన వలసలు, జాతివైవిధ్యాలనుబట్టి, అనేకానేక సామాజిక, సాంకేతిక, సాంస్కృతిక అవసరాలనుబట్టి అనేక మార్పులను సంతరించుకొని ఇన్ని భాషలుగా మారిందా? ఆలోచించండి. రోజురోజుకు సరికొత్త రూపాన్ని సంతరించుకుంటున్న ప్రాపంచిక విషయాలన్నిటికీ చార్లెస్ డార్విన్ "పరిణామ సిద్ధాంతమే" మూలాధారం.

ఉదాహరణకు మన తెలుగు భాషనే పరిశీలిస్తే సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో గల భౌగోళిక ప్రాంతాలను 4 భాషా మండలాలుగా 1) పూర్వమండలం, 2) మధ్యమండలం, 3) దక్షిణమండలం, 4) ఉత్తరమండలాలుగా విభజించినప్పటికీ, అప్పటి 23 జిల్లాల్లో గల భాషావైవిధ్యాలనుబట్టి 23 తెలుగు మాండలికాలుగా పేర్కొనవచ్చు. కాబట్టి భాష గతిశీలమైనదని, దేశ, కాల, సాంప్రదాయ, అవసరాలకనుగుణంగా మారుతుందనేది సుస్పష్టం. నన్నయ్యకాలం నాటి తెలుగు భాషకు నేటి వ్యవహారిక తెలుగు భాషకు ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. భాష మడికట్టుకొని కూర్చోకూడదు. నూతన పదజాలాన్ని; సరికొత్త భావజాలాన్ని; కమ్మని పలుకుబడినీ తనలో కలిపేసుకుంటూ గలగలపారే సజీవ స్రవంతిలా పరవళ్లుతొక్కుతూ ప్రవహించాలి. ప్రజల నాల్కలపై ఏ భాషైతే నిరంతరం నాట్యం చేస్తుందో అదే సజీవ భాష. సామాన్య ప్రజలకు దూరమైన భాష కాలక్రమేణా మృతభాషగా మారిపోతుంది. తెలుగు భాష అలా కాకుండావుండాలంటే కాలానుగుణంగా వస్తున్న మార్పులకు మనం స్వాగతం పట్టాలి. ఆధునిక మార్పులకు మనం స్వాగతం పట్టాలి. ఆధునిక ధోరణులను అలవర్చుకోవాలి. ఆధునిక వాడుకభాషకు ఆద్యుడైన గిడుగు రామ్మూర్తి పంతులుగారిని గురించి; ఆయన భావాలకు అండదండగా నిల్చిన మహాకవులు గురజాడ, శ్రీశ్రీ తదితరులను గురించి మీకు తెలుసా? పెద్దవారిని అడిగి తెలుసుకొని చర్చించండి.

వాగనుశాసనుడు నన్నయ మన తెలుగు భాషను సంస్కరించిననాటినుండి నేటికీ తెలుగు భాష ఒకేలా ఉందా? ఎంతో మారింది. భాషకు గతిశీలత (ఎప్పటికప్పుడు మారడం) సహజలక్షణం. నన్నయకాలంలో "రామః" అను ధాతువును తీసుకొని దానికి తెలుగు ప్రత్యయం "డు" చేర్చి 'రాముడు' అనే పదాన్ని తయారుచేసి చూపిస్తే ఉపయోగిస్తున్నాము. ఇదే ఒరవడిలో రోడ్, కంప్యూటర్ మొదలైన ఆంగ్లపదాలకు చివర అజంత భాషగా అచ్చును చేర్చి రోడ్డు, కంప్యూటరు అనే తెలుగు పదాలుగా మార్చుకున్నాం. అలాంటి మార్పులు సంభవించకపోతే భాష మరుగునపడిపోయే ప్రమాదముంది. ఎన్ని అదనపు భావవ్యక్తీకరణ శబ్దాలు భాషలో వచ్చి చేరితే భాష అంత విస్తరిస్తుంది. అంత పునర్చలనం చెందుతుంది. తెలుగులో ప్రతిపదం అచ్చుతో అంతమవుతుంది. అందుకే మనది అజంతభాష. అచ్+అంతం = అజంతం. పదాలు అచ్చుతో అంతం కావడంవల్ల భాషకు ఒక శ్రావ్యత వస్తుంది. వినసొంపుగా వుంటుంది. అందుకే మన తెలుగుభాషను "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని కొనియాడారు. పాశ్చాత్య

దేశాల్లో ఇటలీభాష ఎంత మధురమైనదో అంతకన్నా మధురమైనది మన తెలుగుభాష. ఈ మాధుర్యానికి కారణం ఈ రెండూ అజంతాభాషలు కావడమే!

అయితే తెలుగు తనలో లేని ఎన్నో మాటలను అక్కర పడినచోట అరువుతెచ్చుకొని తనలో విలీనం చేసుకొంది. వాటిని తన స్వంత మాటలుగా మార్చుకుంది. ఈ మార్పులో "లక్ష్మీ-లచ్చిమి, బ్రహ్మ-బమ్మ, భాష-బాస, అంబ-అమ్మ" మొదలైన పదాలు తెలుగు భాషలో తియ్యదనాన్ని సంతరించుకొని మూడుపువులారుకాయలుగా వర్ధిల్లాయి.

భాష రోజురోజుకు మారుతోంది. ప్రపంచంలో మారందంటూ ఏదీలేదు. భాష పరిణామక్రమాన్ని మనం నమోదు చేయగలం. గుఱ్ఱబు-గుఱ్ఱంబు-గుఱ్ఱమ్ము-గుఱ్ఱము-గుర్రం-గుఱ్ఱం ఇలా రూపాంతరం చెందడం మన కళ్ళముందే చూస్తున్నాం. సందర్భాన్నిబట్టి, వ్యక్తినిబట్టి, వేగాన్నిబట్టి, ఒక పదాన్ని పలికే తీరునుబట్టి కూడా భాషలో మార్పులు కోకొల్లలుగా చూడవచ్చు. ఇందులో ఏది సరైనది (లాక్షణికమైనది)? ఏది సరైనది కాదు? అంటే ఎవరి భాష వారికి సరైనది. అంటే పండితునికి గుఱ్ఱము సరైనది. మనకు గుర్రం సరైనది. 'మాయాబజార్' సినిమా చూశారా? అందులో "ఘటోత్కచుడి పాత్రను మీరెంత ఇష్టపడతారు?" ఎవ్వరూ పుట్టించకపోతే కొత్తమాటలు ఎలా పుడతాయి?" అంటాడాయన ఒకచోట! మీకు గుర్తిందికదూ!

పై అనుభవాలనుబట్టి భాష సాంకేతికమని, సామాజికమని, అర్థవంతమని, అనుకరణ సాధ్యమని, నిర్మాణాత్మకమని, పరిణామశీలమనీ మనం గ్రహించగలుగుతాం.

**1.1.2 భాష యొక్క విధులు, ప్రయోజనాలు (Varied functions & utilities of a language) :** భాష ప్రపంచానికి వాకిలి లాంటిది. ఆ వాకిలి తెరిస్తేనే మనం సర్వజగత్తును అర్థం చేసుకోగలం. విద్య వలన వినయం, వినయం వలన పాత్రత, పాత్రత వలన ధనం, ధనం వలన ధర్మం, ఆ ధర్మం వలన ఇహ, పర లోకాల సౌఖ్యాన్ని మనిషి పొందగలుగుతాడు.

**భాషా ప్రయోజనాలు :**

- భావగ్రహణం మరియు భావ వ్యక్తీకరణం చేయడానికి తోడ్పడుతుంది.
- మానవుని నిత్యవ్యవహారంలో ఉపయోగపడుతుంది.
- సంస్కృతీ, సాంప్రదాయాల పరిరక్షణలో ఉపయోగపడుతుంది.
- వ్యక్తివికాసానికి, సమాజ పురోభివృద్ధికీ భాష తోడ్పడుతుంది.
- భాష రసానుభూతిని కలిగిస్తుంది.
- కళాత్మక భావాలను పెంపొందిస్తుంది.
- ప్రకృతి సౌందర్యం పట్ల ఆరాధనాభావం కలిగిస్తుంది.
- భావసమైక్యతా సాధనంగా, జాతీయ సమైక్యతకు దోహదపడుతుంది.
- బోధనకు, అభ్యసనానికి భాష ఒక సాధనం.
- విజ్ఞానానికి ఆధారమై, జ్ఞానాన్ని భావితరాలకు అందించే సాధనంగా ఉపకరిస్తుంది.
- సాహిత్యరూపాలైన సృజనాత్మక రచనలకు ద్వారాలు తెరుస్తుంది.
- వివిధ వృత్తుల నిర్వహణలో నైపుణ్యం కలిగిస్తుంది.

- నైతిక, ఆధ్యాత్మిక విలువలను అందరికీ అందిస్తుంది.
- వివిధ సాహితీ ప్రక్రియతో వున్న వైవిధ్యాన్ని గ్రహించేటట్లు చేస్తుంది.
- విశ్వమానవతా భావాలను పెంపొందిస్తుంది.

క్రషెన్ మరియు టెర్రెల్ (1983) లో భాషాపరమైన ఏ భావప్రకటన లక్ష్యాలనైనా సన్నివేశాల ద్వారా, సందర్భాల కల్పన ద్వారా, చర్చల ద్వారానే ఇవన్నీ సాధిస్తామని 1983 లో క్రషన్ మరియు టెరైల్ సూచించారు.

ఇందుకుగాను తరగతి గదిలో ఒక సన్నివేశాన్ని సృష్టించాలి. భాషను ఎలా ఉపయోగిస్తారో ప్రతి విద్యార్థిచేత ఒక్కొక్క కృత్యం చేయించాలి. ఇలా కృత్యాలను చేయించడం వలన విద్యార్థులు భాషాపరంగా బహుళ ప్రయోజనాలను పొందుతారు.

కొన్ని భాషావిధులు : సలహా కోరడం, ఆప్యాయతను వ్యక్తం చేయడం, ధన్యవాదాలు చెప్పడం, నచ్చిన విషయాలను ప్రశంసించడం, సౌందర్యాన్ని ఆరాధించడం, చమత్కారంగా మాట్లాడడం ఇవన్నీ మనం భాష ద్వారానే నేర్చుకుంటాం.

ఇందుకోసం ఒక్కొక్క సన్నివేశంలో భాషాభివృద్ధి నిచ్చెనలు (language ladders) తయారుచేసుకోవాలి. ఈ భాషాభివృద్ధి నిచ్చెనలలో, ఒకవ్యక్తి తన భావాలను భాషావిధులద్వారా క్రమబద్ధమైన వ్యక్తీకరణలను చేసే విధానం ప్రతిఫలిస్తుంది. ఒక్కొక్క నిచ్చెనను ఒక్కొక్క భాషావిధి ఆధారంగా తయారుచేస్తారు.

భాషను నేర్చుకునే విద్యార్థులకు బహువిధ సందర్భాలలో / సన్నివేశాలలో తమ వ్యక్తిగత అనుభవాలను, అభిప్రాయాలను వివిధ భాషావిధులద్వారా వ్యక్తీకరించడానికి ఈ భాషాభివృద్ధి నిచ్చెనలు ఎంతో సహకరిస్తాయి. ఇవి నూతన అంశాలను తెలియజేయడం లోనూ పాతవాటి పునర్విమర్శలోనూ ఉపకరిస్తాయి. తరగతిగదిలో ప్రతిరోజూ ఉపయోగించే సంబోధనలు, వ్యక్తీకరణలను అభివృద్ధి చేయడానికి ఉపయోగపడతాయి. విద్యార్థి యొక్క వ్యక్తిగత సృజనాత్మకత వ్యక్తీకరణ అభివృద్ధికి దోహదం చేస్తాయి.

**1.1.3 భాష ద్వారా అనుభవాల వ్యక్తీకరణ (Language is a way to express experience):** మన భావాలను, అనుభవాల వ్యక్తీకరణను భాష అనే సాధనం ద్వారానే వ్యక్తీకరిస్తాము. అనుభవాల వ్యక్తీకరణ స్థాయి వ్యక్తిగత అనుభవాన్నిబట్టి మారుతుంది. అనుభవం మరో కొత్త అనుభవాన్ని ఎదుర్కోవడానికి తోడ్పడుతుంది.

ఉదా : ఒక ఉపాధ్యాయుడు వెన్నెలను ఇలా అడిగాడు “వెన్నెలా! ఒక శతక పద్యం చెప్పు!” వెన్నెల సుమతీశకత పద్యాన్ని చాలా చక్కగా చెప్పింది. మళ్లీ ఉపాధ్యాయుడు ఇలా అడిగాడు – “పద్యం చాలా బాగా చెప్పావు. ఇలాగే నీకు నచ్చిన ఏ కవి పద్యమైనా చెప్పు”. వెన్నెల ఇలా చెప్పింది.

మేడిపండు చూడ మేలిమై యుండు
పొట్టవిప్పి చూడ పురుగులుండు
బిరికి వాని మదిని బింకమీలాగులా
విశ్వదాభిరామ వినురవేమ

దీని ద్వారా మనకు ఏం తెలిసింది? వ్యక్తి, వ్యక్తికి మరియు అనుభవం–అనుభవంలో వైవిధ్యం ఉంటుంది. కానీ ఆ విభిన్న అనుభవాల్ని విభిన్న పద్ధతుల్లో మనం వ్యక్తీకరిస్తాం.

ఈ వ్యక్తీకరణలో భాషాసామర్థ్యమే ప్రధానపాత్ర వహిస్తుంది. కాబట్టి పిల్లల అనుభవ వ్యక్తీకరణలను భాష ద్వారా చేసేటప్పుడు వారికి స్వేచ్ఛను ఇవ్వాలి. వారి స్పష్టమైన, వైవిధ్యభరితమైన వ్యక్తీకరణలో మనం సహాయం చేయడానికి ప్రయత్నించాలి. “ఒక వ్యక్తి గ్రాహ్యకశక్తిని ఇతరులకు వ్యక్తంచేసే అతీతశక్తియే ప్రజ్ఞ” అంటాడు సర్ ఫ్రాన్సిస్ గాల్టన్.

**1.1.4 భాష ఒక నియమానుసార నిర్వహణ కృత్యం (Language is a rule governed activity):** లియోనార్డ్ బ్లూమ్ ఫీల్డ్ (1933), అతని అనుయాయులు అంతా భాష సంపాదితం "acquired activity" అంటారు. నోమ్ చామ్‌స్కీ (Noam Chomsky) రంగంలోకి రాకముందు భాషాశాస్త్రం ఒక శాస్త్రంగా నిలదొక్కుకోవటానికి ఇతర శాస్త్రాల సహాయం తీసుకునేది. కానీ చామ్‌స్కీ రంగంలోకి దిగిన తర్వాత (1957–2000) భాషాశాస్త్రమే ఇతర శాస్త్రాలకు మార్గదర్శకమైంది. భాషాశాస్త్రంలో ఆయన తెచ్చిన మార్పును “చామ్‌స్కీ విప్లవం” అంటారు. ఇతడు ప్రవేశపెట్టిన ‘పరివర్తన వ్యాకరణ సిద్ధాంతం’ భాషలో వాక్యనిర్మాణానికి ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చింది.

5HIC6I

పిల్లలు బడికి రాకముందునుంచే భాషను నేర్చుకుంటారు. పిల్లలు నేర్చుకునే భాష తల్లిదండ్రులనుండి, గృహంలో నివసిస్తున్న సభ్యులనుండి, పరిసరాలలో గల సభ్యులనుండి, సమాజంలోని సభ్యులనుండి అనుకరణలద్వారా భాషను నేర్చుకుంటారు. పిల్లలు ఎవరివద్దనుండి భాషను నేర్చుకుంటారో వాళ్ళందరూ భాషానియమాలననుసరించి భాషను నేర్చుకున్నవాళ్ళే! కావున అలాంటి నియమాలతో కూడిన భాషను పిల్లలు తమకు నియమాలు తెలియకుండానే అనుకరణ ద్వారా భాషానియమాల చట్రంలోనే భాషాభ్యసన కొనసాగిస్తారు. పిల్లలు సందర్భానుసారంగా భాషను ఉపయోగించగలుగుతారు. భాషోపయోగంలో పెద్దలు వాడుతుండే నియమాలనన్నింటినీ, పిల్లలు అనుకరణద్వారా సాధించిన సామర్థ్యాలను ఉపయోగించి తమ భావాలను వ్యక్తీకరిస్తారు. ఇవి భాషానియమాలకు, వ్యాకరణ నియమాలకు, ధ్వన్యుత్పత్తి పద్ధతులకు, ఉచ్చారణాపద్ధతులకు లోబడే పిల్లల్లో అభ్యసనం జరిగిపోతుంది. అందుకే భాష ఒక నియమానుసారంగా నిర్వహించే కృత్యంగానే భావించాలి.

ఉదాహరణకు ఓ అయిదారేండ్ల విద్యార్థి “నేను రేపు ఊరికి వెళ్తాను” అని చెప్తాడు తప్ప “నేను రేపు ఊరికి వెళ్ళాను” అని చెప్పడు. “అతడు వస్తున్నాడు” అని చెప్తాడు తప్ప “అతడు వస్తున్నది” అని చెప్పడు.

కావున విద్యార్థి యొక్క అనుకరణ కొన్ని భాషానియమాలకు లోబడి, తనకు తెలియకుండానే జరిగిపోతుంది. అందువల్లనే పిల్లల్లో “భాషాభ్యసనం ఒక నియమానుసార కృత్యం (Language is a rule governed activity)” అని చెప్తాం. ఇదే పిల్లల భాషాసంపాదనలో చామ్‌స్కీ తెచ్చిన విప్లవాత్మక ప్రతిపాదన!

**1.2.1 భాష సంస్కృతి, సంజ్ఞాన మరియు భావప్రసారాల సమ్మిళితం (Language is a inclusive activity of culture, cognition and communication):** క్రీస్తుపూర్వం నుండి తెలుగు భాష మాట్లాడే ప్రజల సంస్కృతి విభిన్నంగా ఉండేది. తెలుగుభాషకు క్రీస్తుపూర్వ కాలంనుంచీ లిఖితపూర్వ ఆధారాలు లేనప్పటికీ, ఆంధ్రప్రాంతాన్ని పరిపాలించిన తెలుగు రాజులు, శాతవాహనరాజులు చరిత్రలో నిలిచేవున్నారు. నన్నయ నాటికే తెలుగు జానపద సాహిత్యం వాడుకలో ఉంది. నాటినుండి తెలుగు మాట్లాడే ప్రజల జీవనవిధానం, ఆచారవ్యవహారాలు అనువంశికంగా అమలవుతూ, వారి విశిష్టతను కాపాడుకొంటున్నారు. ఈరోజు తెలుగుభాష భారతదేశంలోనే ఎక్కువమంది మాట్లాడే మూడవభాషగా నిలిచింది. ఇది మనకు గర్వకారణం కదూ!

ఒక జాతికి ఆదినుండి లభ్యమైన సంస్కృతిని గూర్చి పరిశోధన చేసేటప్పుడు ఆ జాతి మాట్లాడే భాషే ప్రధానంగా పరిగణనలోకి వస్తుంది. ఆదిమానవుడు తన భావప్రకటనలో కోపోద్రేకాలు, ఆనందం మొదలైన ప్రవృత్తుల్ని తెలిపే ఆంగికసంజ్ఞలు, హావభావాలు, వాటిని వ్యక్తంచేసే సంకేతాలనుంచే భాష పుట్టిందని మనకు తెలుసు.

ఎరుక గలవారి చరితలు
గరచుచు సజ్జనుల గోష్ఠి గదలక ధర్మం
బెరుగుచు, ఎరిగిన దానిని
మరువ కనుష్ఠించునది సమంజసబుద్ధిన్

అంటుంది మహాభారతం. జ్ఞానవంతుల గురించి తెలుసుకోవాలి. మంచివారితో సాంగత్యం చేయాలి. మంచి చెడ్డలను విశ్లేషించి చూడాలి. విచక్షణతో కూడిన జ్ఞానాన్ని ఆచరించి ఆనందించాలి. సద్వివేకమే జ్ఞానం. జ్ఞాన శబ్దానికి ఎన్నో పర్యాయపదాలున్నాయి. అభిజ్ఞానము, అయోగము, ఉపలబ్ధి, ఎరుక, ఎరుకువ, చిట్టు, చేతన, చైతన్యము, తెరకువ, తెలివి, మతి, మెలకువ, విజ్ఞానము, శాస్త్రము, సంభూతి మొదలగునవి.

విద్యుత్ ఒక శక్తి, దానిని ఎలా వాడుకోవాలని తెలిపేది జ్ఞానం. దానిని సరైన పద్ధతిలో వినియోగించుకొంటే లాభం. అలాకాకుండా విద్యుత్ ఎలా ఉంటుందో చూద్దామని తాకితే ఏం జరుగుతుందో మనకు తెలుసు. తెలిసికూడా తాకితే, అదే అజ్ఞానం.

రిచర్డ్ ఎం. దార్శన్ జానపదవిజ్ఞానాన్ని నాలుగు విధాలుగా విభజిస్తూ భాషకు, సమాజానికి మరియు సంస్కృతికీ గల అవినాభావ సంబంధాన్ని నిరూపించారు.

1. మౌఖిక సంప్రదాయం
2. జానపద సాంఘికాచారాలు
3. వస్తుసంస్కృతి
4. జానపద ప్రదర్శన కళలు

ఆ వర్గీకరణ ముఖ్యాంశాలను పరిశీలిస్తే భాషకు, జాతి సంస్కృతికి ఉన్న పరస్పర సంబంధం అవగతమౌతుంది. భాష కూడా జాతి సంస్కృతిని నిర్ధారిస్తుంది. 'జాతికి జీవన నాళిక – జానపదగీతిక' అంటాడు మహాకవి శ్రీశ్రీ.

ఒక జాతి మాట్లాడే భాషకు, ఆ జాతి సంస్కృతికి, ఆచారవ్యవహారాలకు అవినాభావ సంబంధం ఉంటుంది. తమిళులు సౌరమానాన్ని పాటిస్తే, తెలుగువారు చాంద్రమానాన్ని పాటిస్తారు. అందుకు తగినట్లుగానే పండుగలు, పూజలు చేస్తారు. పూజలు, వేడుకలకనుగుణంగా పదజాలం తయారౌతుంది. కొన్ని భాషలు మార్పును త్వరగా స్వీకరించవు. కొన్ని భాషలు త్వరితంగా మారతాయి. సంస్కృతంచేత తెలుగు భాష ప్రభావితమైనంతగా తమిళం ప్రభావితం కాలేదు. ఇది తెలుగుభాష విస్తృతికి దోహదం చేసింది. తమిళ ప్రాంతంలో వైష్ణవం, కన్నడ ప్రాంతంలో శైవమతం రాజ్యమేలిన సందర్భాల్లో కూడా తెలుగునాట హరిహర అభేదం పాటింపబడింది. సంస్కృతం తర్వాత మహాభాగవతం వెలసింది మన తెలుగు భాషలోనే. ఈ గౌరవం ఇతర భాషలకు దక్కలేదన్నది చారిత్రక సత్యం. ఒక చేత కలం పట్టి కవితలు రాస్తూ మరోచేత్తో హలం పట్టి పొలం దున్నిన సహజకవి పోతన మహాభాగవతం రాయడం మన తెలుగుజాతి చేసుకున్న పుణ్యం! ఆయన పద్యాలు మందార మకరంద మాధుర్యాలు!!

మన వివాహ వ్యవస్థలో కూడా భారతదేశంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాల ప్రభావం కనిపిస్తుంది. దీనికి అనుగుణమైన పదజాలం వ్యాప్తిలో ఉంది. ఉదాహరణకు తలంబ్రాలు, ఒడిబియ్యం, సారెపెట్టె.

**1.2.2 మాట్లాడే వ్యక్తుల ఉద్దేశ్యానుసారంగా, సందర్భానుసారంగా పదాల అర్థాలను అవగాహన చేసుకోవాలి:** తెలుగులో రెండు రకాల పదాలున్నాయి. వ్యుత్పత్తి ఉన్నవి, వ్యుత్పత్తి లేనివి. వ్యుత్పత్తి అంటే Etymology అని అర్థం. మౌలికమైన అర్థం అన్నమాట. ఒక పదాన్ని ఒక ప్రత్యేకమైన అర్థంలో ఎందుకు వాడుతున్నామో చెప్పగలిగితే ఆ పదానికి వ్యుత్పత్తి ఉన్నట్టు. చెప్పలేకపోతే వ్యుత్పత్తి లేనట్టు.

ఉదాహరణకు 'కూడు' అనే పదాన్ని తీసుకుంటే, ప్రాచీనకాలంనుంచి ఇది అన్నం అనే అర్థంలో వాడబడుతున్న పదం. ఈ అర్థంలో ఎందుకు వాడబడుతుందో తెలుసుకోవాలంటే ఈ పదం మూలాన్ని ఆలోచించాలి. కూడు అనే ఈ పదం 'కుడుచు' అనే ధాతువునుండి వచ్చింది. కుడవడమంటే తినడం అని అర్థం. ఏది కుడవబడుతుందో అది కూడు అన్నమాట. మన రెండు చేతుల్లో కుడిచే చేతిని 'కుడి చేయి' అని అంటాము.

తిలలనుండి తీసినది తైలం. (నువ్వులనుండి తీసిన నూనె). ఇది ఈరోజు, దాని పరిమితమైన అర్థం పోగొట్టుకొని సామన్య అర్థంలో స్థిరపడిందన్నమాట. అందుకే మనం కొబ్బరినూనె (కొబ్బరి తైలం), ఆవనూనె అని వాడుతున్నాం.

ఎదుటి వ్యక్తులు వ్యక్తం చేసే భాషలో పదాల అర్థాలను వారి ఉద్దేశానుసారంగా, ఏ సందర్భంలో ఆ పదాన్ని ఉపయోగించారో అవగాహన చేసుకోవలసిన అవసరం ఉంది. ఉదాహరణకు "sickle moon" అనే ఆంగ్లపదబంధాన్ని తెలుగులోనికి అనువాదం చేసేటప్పుడు అనువాదకుడు దాన్ని “కొడవలి చంద్రుడు” అని అనువాదం చేస్తే సరైన అర్థం స్ఫురించదు. దీనికి భాషలో గల జాతీయాలైన 'నెలవంక / చంద్రవంక' లాంటివి ఎన్నుకోవాలి.

ఈవిధంగా మనం పదాల మూలాల్లోకి వెళ్లి పరిశీలించినపుడు వాటి మౌలికమైన అర్థాలు మనకు గోచరమౌతాయి.

## 1.3 భాష మరియు సమాజం

బహుభాషావ్యవహర్తల ద్వారా భాషాలక్షణాలు ఒక భాషనుండి ఇతర భాషలకు వ్యాపిస్తాయి. ఇలా వ్యాపించడానికి ఆ భాషలు పరస్పరం జన్మ సంబంధం కలిగి ఉండడం వలన కావచ్చు, జన్మ సంబంధం లేనివి కావచ్చు. జన్మసంబంధం లేకపోయినా తుల్య లక్షణాలు కలిగిఉన్న భాషలు మాట్లాడే ప్రదేశాన్ని బహుభాషా ప్రదేశం (Linguistic Area) అంటారు.

మన భారతదేశమే బహుభాషాప్రదేశానికి చక్కటి ఉదాహరణ అని భాషాశాస్త్రజ్ఞులు నిరూపించారు. మన దేశంలో ఇండో-ఆర్యన్ భాషాకుటుంబం, ద్రావిడ భాషాకుటుంబం, ఆస్ట్రో-ఏషియాటిక్ భాషాకుటుంబం, సైనో-టిబెటియన్ భాషాకుటుంబం, థాయ్-కడాయి భాషాకుటుంబం, గ్రేట్ అండమాన్ భాషల భాషాకుటుంబం అనే ఆరు భాషా కుటుంబాలున్నాయి. ద్రావిడ భాషలకు సహజమైన ట, డ, ణ, ళ అనే మూర్ధన్య ధ్వనులు పైన పేర్కొన్న భాషా కుటుంబాల్లో చాలా భాషలకు వ్యాపించాయి.

**1.3.1 భారతదేశంలో బహుభాషా వైవిధ్యం:** లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియాలో గ్రియర్‌సన్ 1098-1928 వరకు భారతదేశంలో 179 భాషలు మరియు 544 మాండలికాలు ఉన్నట్లుగా పేర్కొన్నారు.

5X277U

2001 భారతదేశంలో జరిగిన జనాభా లెక్కల ప్రకారం 122 ప్రధానభాషలు మరియు 1599 ఇతరభాషలు ఉన్నట్లుగా పేర్కొన్నారు. ఇందులో భారతప్రభుత్వం షెడ్యూల్‌లో పేర్కొన్న, గుర్తింపబడిన భాషలు 22. భారతదేశంలో మాట్లాడబడుతున్న మాతృభాషలు 1365 ఉన్నాయి. వీటిలో ప్రభుత్వంచే గుర్తించబడిన మాతృభాషలు 234.

**1.3.2 భాష ద్వారా సామాజిక, రాజకీయ మరియు ఆర్థికాభివృద్ధి:** భావవినిమయ సాధనం అయిన భాషను ఎంత చాకచక్యంగా వినియోగించుకుంటే సమాజంలోని సభ్యులమధ్య అంత చక్కటి సంబంధ బాంధవ్యాలేర్పడతాయి. వ్యక్తులమధ్య ఇలాంటి మంచి సంబంధాలున్న సమాజాన్ని పురోగామి లేదా అభివృద్ధి చెందిన సమాజంగా మనం అంచనా వేస్తాం. భాష ద్వారా సమాజంలో ఉన్న సభ్యులమధ్య సత్సంబంధాలేర్పడతాయి. ఈ సంబంధాలతో ఒక మంచి సమాజంగా, పరిపాలనా సంబంధాలు మెరుగుపరచుకోవడం, ఆర్థికాభివృద్ధి సాధించడానికి భాషను ఒక పదునైన ఆయుధంగా వాడుకోవడంలో భాషానైపుణ్యాలను అభివృద్ధి చెందించడం ద్వారా ఉపయోగించుకోగలుగుతారు. ఈ అభివృద్ధి భాష ద్వారానే మనం సాధించగలుగుతాం.

మంచి భాషా సామర్థ్యమున్న వ్యక్తి రాజకీయాల్లో కూడా ఇట్టే రాణించగలుగుతాడు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడు. వ్యాపార సంబంధమైన లావాదేవీల్లో అభివృద్ధి చెందుతాడు. మంచి వ్యక్తిగా గుర్తింపబడతాడు. తద్వారా మంచి సమాజం రూపొందుతుంది. అందుకే అన్ని వికాసాలకు భాషా వికాసమే పట్టుగొమ్మ!

**1.3.3 ప్రామాణిక - అప్రామాణిక భాషారూపాలు:** ఏ భాషకైనా, ఆ భాష మాట్లాడే ప్రజలందరికీ భాష అర్థం కావాలంటే ఆ భాషకు ఒక ప్రామాణిక భాషారూపం అవసరం. ఏ ప్రామాణిక భాషైనా, ఆ భాషలోగల ఒక మాండలిక భాషను ఆధారంగా చేసుకొని అభివృద్ధి చెందుతుంది.

ప్రామాణిక భాష మార్పుల్ని ఆహ్వానిస్తూ, మార్పుల్ని అంతర్భూతం చేసుకొంటూ స్థిరంగా కొనసాగుతుంది. ఈనాటి మన తెలుగు ప్రామాణికభాషను శిష్టవ్యావహారిక భాష అని పిలుస్తున్నాం. ప్రస్తుతం పత్రికల్లో మనం చదువుతున్న భాషంతా ప్రామాణిక వాడుకభాషే! ప్రామాణిక భాషలో వాడే పదాలు ఎక్కువమందికి, ఇంచుమించు అందరికీ అవగాహన అవుతాయి. కానీ నిరక్షరాస్యులు ప్రామాణికపదాల ఉచ్చారణలోను, లిఖితరూప ప్రయోగాలలోనూ విఫలమౌతున్నారు. తత్ఫలితంగా భాషలో అప్రామాణిక రూపాలు ఎక్కువ అవుతున్నాయి. ఇట్టి అప్రామాణిక రూపాల వాడక వలన వాటి అర్థాలు పరిమితమయిన పరిధిలో గలవారికి మాత్రమే అర్థమౌతాయి. అందరికీ అర్థం కావు. ఇలాంటి పదప్రయోగాలతో మాట్లాడే భాషను అప్రామాణిక భాష అనవచ్చు.

ఉదాహరణకు క్రింది రూపాలను పరిశీలిద్దాం.

| **ప్రామాణిక భాషారూపం** | – | **అప్రామాణిక భాషారూపం** |
|---|---|---|
| వీరయ్య | – | ఈరయ్య |
| వాడు | – | ఆడు |
| జనం | – | జనాలు |
| ప్రజ | – | పెజ |
| ప్రాణం | – | పేనం |
| ఘోరం | – | గోరం |
| సన్యాసి | – | సన్నాసి (సన్నాసోడు) |

కావున అప్రామాణిక భాషారూపాలను భాషలో ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వాటిని పత్రికల్లోనూ, దృశ్యశ్రవణ మాధ్యమాల్లోనూ సందర్భాన్నిబట్టి, పాత్ర తీరుతెన్నులనుబట్టి మాత్రమే ఉపయోగబడేటట్లు చూసుకోవలసిన బాధ్యత విద్యావంతులపై ఎప్పుడూ ఉంటుంది. తెలుగు మాటల పద స్వరూపాన్ని కూడా తెలుగు పత్రికా రచయితలు అర్థం చేసుకోవాలి. 'అల్లుడుతోసహా ఏడుగురు అరెస్ట్' అన్న శీర్షికలో అరెస్ట్ అన్న ఆంగ్లపదాన్ని అజంతపదంగా మార్చుకోవలసిన అవసరం లేదు. ఎంచేతనంటే అలాంటి పదాలు జనజీవన స్రవంతిలో కలిసిపోయాయి. ఒకవేళ "అల్లుడుతోసహా ఏడుగురు అరెస్టు" అని రాసినవాళ్ళు కూడా అల్లుడితోసహా అని రాయలేకపోవడం మన తెలుగు పఠితల దురదృష్టం. అయితే ఆధునిక భాషాశాస్త్రంలో ఇప్పుడు వీస్తున్న గాలినిబట్టి వీటిని అంత తీవ్రంగా తీసుకోవలసిన అవసరం లేదేమో! మనం ప్రస్తుతం ప్రామాణిక వాడుకభాషగా గుర్తిస్తున్న భాషలో కూడా కాలం గడిచేకొద్దీ మార్పులు సంభవిస్తాయి.

**1.4.1 భాష : ప్రథమ, ద్వితీయ మరియు తృతీయ భాషలు :** "భాష్యతే ఇతి భాషః" భాషింపబడే దానిని భాష అని అంటారు. మనుష్యుల మధ్య మాట్లాడే ప్రక్రియ కొనసాగినంత కాలం భాష ఉపయోగిస్తున్నట్లే భావించాలి. భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన తరువాత 1956 లో కేంద్రప్రభుత్వ విద్యా సలహాసంఘం (CABE) త్రిభాషాసూత్రాన్ని ప్రవేశపెట్టింది. 1961 లో రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో త్రిభాషాసూత్రాన్ని అన్ని రాష్ట్రాలు అమలుచేయాలని అంగీకరించడం జరిగింది. 1964-66 సంవత్సరంలో కొఠారీ కమీషన్ కూడా తన నివేదికలో త్రిభాషాసూత్రాన్ని అనుసరించింది.

బహుభాషా విలసితమైన భారతదేశంలో కేంద్రప్రభుత్వం జాతీయ సమైక్యతను, అంతర్జాతీయ అవగాహనను దృష్టియందుంచుకొని భారతదేశపు పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థి కనీసం మూడు భాషలు నేర్చుకోవాలనే సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి రాష్ట్రాలవారీగా కొన్ని సూచనలను చేసింది.

భారతదేశంలో అనేకభాషలు ఉండటంచేత ప్రతి పాఠశాల విద్యార్థీ కనీసం మూడు భాషలు నేర్చుకోవాలనే నియమాన్ని పెట్టింది. దీనినే త్రిభాషాసూత్రం అంటారు. దీని ప్రకారం పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి ప్రథమ భాషగా తన మాతృభాషనుగాని లేదా ప్రాంతీయభాషనుగాని నేర్చుకోవాలి. ద్వితీయభాషగా జాతీయభాష అయిన హిందీని నేర్చుకోవాలి. హిందీ మాతృభాషగా కలిగినవారు దక్షిణాది భాషలలో ఏదోఒక భాషను ద్వితీయ భాషగా నేర్చుకోవాలి. ఇక తృతీయభాషగా అంతర్జాతీయభాష అయిన ఆంగ్లం లేదా యూరోపియన్ భాషలలో ఏదోఒకటి నేర్చుకోవాలి.

ఉత్తరాది రాష్ట్రాలు దక్షిణాదిభాషల్లో ఏదో ఒక భాషను నేర్చుకోవాలి. అలాగే దక్షిణాదివారు జాతీయభాష అయిన హిందీ ఆవశ్యకతను గుర్తించి నేర్చుకోవాలి. చాలా రాష్ట్రాల్లో తమ ప్రజలు మాతృభాషను తప్పనిసరిగా ప్రథమభాషగా నేర్చుకోవాలని తపన పడుతున్నపుడు ఆంధ్రరాష్ట్రంలో పాలకులకు ఈ విషయం తెలియకపోవడం విచిత్రంగా అనిపిస్తోంది. ఒక్క ఆంధ్రరాష్ట్రంలోనే పాఠశాల విద్యార్థులు తెలుగు భాష చదవకుండానే విద్యను పూర్తి చేయగలుగుతున్నారు. దీనివలన భవిష్యత్తులో తెలుగు భాష అంతరించిపోయే ప్రమాదముందని కూడా UNESCO హెచ్చరించింది. వారి హెచ్చరిక మనలో కలవరం కలిగిస్తోంది. తల్లడిల్లిపోతున్న తల్లిభాషను కాపాడుకోవడం తెలుగుజాతి బాధ్యత. అందుకు తగిన వాతావరణాన్ని సృష్టించడం ప్రభుత్వ కర్తవ్యం!

**1.4.2 భాషారూపాలు (Forms of language):** ఆధునిక తెలుగు భాషలో వాగ్రూపభాషకు, లిఖితరూప భాషకు చాలా తేడాలుండటాన్ని మొట్టమొదట గమనించింది విశాఖపట్నం డి.ఇ.ఓ.గా పనిచేసిన ఏట్స్ దొరగారు. ఈ తేడాలను అవగాహన చేసుకోలేక సందేహనివృత్తి కోసం గిడుగు రామ్మూర్తి పంతులుగార్ని మరియు గురజాడ అప్పారావుగారిని కలిస్తే, మొట్టమొదటి ప్రధానోపాధ్యాయుల సమావేశంలో గిడుగువారు మాట్లాడడంతో వ్యవహారిక భాషా ఉద్యమం ప్రారంభమైంది. వ్యవహారిక భాష ఉద్యమానికి గిడుగువారు ఆంధ్రదేశమంతటా తిరిగి సభలూ, సమావేశాలు నిర్వహించి అందరి మద్దత్తూ కూడగట్టడానికి ప్రయత్నిస్తే, తొలిసారిగా వ్యవహారికభాషలో "కన్యాశుల్కం" నాటకాన్ని రాసి వ్యవహారిక భాషాఉద్యమాన్ని గూర్చి ప్రజల్లో చైతన్యం రగిలించారు గురజాడ. నాటి ఉద్యమఫలితంగానే ఈనాటి వ్యవహారికభాష విశ్వరూపం ధరించింది. ఆ మహోద్యమం గిడుగు, గురజాడలతో ప్రారంభమైనప్పటికీ, తన నవ్యకవిత్వంతో వ్యవహారిక భాషోద్యమాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చింది మాత్రం మహాకవి శ్రీశ్రీయే! నన్నయనాటి గ్రాంథికభాషారూపానికి నేటి వ్యవహారిక భాషారూపానికి మధ్య ఎంతో వైవిధ్యం ఉంది.

**1.4.3 మాండలికాలు (Dialects):** ఒక నిర్దుష్ట భౌగోళిక ప్రాంతంలో ప్రజలు ఉపయోగించే భాష్యావ్యవహార రూపాన్ని మాండలికం అంటారు. ఆ భాష మాట్లాడే ప్రజలలో భిన్న భౌగోళిక మాండలికాలున్నప్పటికీ ఏదోఒక మాండలికాన్ని ప్రామాణిక భాషగా ఉపయోగిస్తారు. ఈ ప్రామాణిక భాషకు ఏదో ఒక మాండలికభాష ఆధారంగా ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రధానంగా నాలుగు మాండలిక ప్రాంతాలుండేవి. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మూడు మాండలిక ప్రాంతాలే మిగిలిఉన్నాయి. ఇంకా సూక్ష్మపరిశీలన చేస్తే పదమూడు జిల్లాల్లో పదమూడు భిన్న మాండలికాలు కన్పిస్తాయి. మాండలికాలను ప్రధానంగా నాలుగు రకాలుగా విభజించారు. అవి. 1. ప్రాంతీయ మాండలికం, 2. సామాజిక మాండలికం, 3. చారిత్రక మాండలికం, 4. జీవశాస్త్రానుసార మాండలికం.

ఒకే వ్యక్తి మాట్లాడే భాషను ప్రభావితం చేసేవి, గృహంలో మాట్లాడుకొనేటప్పుడు ప్రభావితం చేసేవి, పరిసరాలపైన ప్రభావం చూపేవి పై నాలుగు మాండలిక రూపాలు.

ఉదా : ఒక ఐదేళ్ల పిల్లాడు "అమ్మా బువ్వ పెట్టవా?" అని అడుగుతాడు.

ఓ అరవై ఏళ్ళు దాటిన వృద్ధుడైతే "ఏం కోడలా! ఇంత అన్నమైనా పెడతావా?" అని అడుగుతాడు.

యవ్వనప్రాయంలోవాళ్లైతే "లైట్ తీస్కో", 143 (I Love You), "అంత సీన్ లేదులే" లాంటి పదాల వాడకం ఉంటుంది. "నీకంత సీన్ లేదులే!" అనేమాట నిరక్షరాస్యులు సైతం ఉపయోగిస్తున్నారు.

నీ యవ్వారం మాకుతెలీదా? (నిరక్షరాస్యులు)

"గాబునిండా నీళ్లున్నాయి" పల్నాడుప్రాంతంవాళ్లు

"సినిమా ఫస్ట్ షోకి" (నిరక్షరాస్యుల ఆదాయం పెరిగేటప్పటి భాష)

"అరుంధతికి" – "ఆరంజోతి" (కులమాండలికం) ఇలాంటి అనేక ఉదాహరణలను గమనిస్తే మాండలికాల పరిశీలనను ఇంకా సూక్ష్మదృష్టితో చేయవచ్చు.

1. వైయుక్తిక భాషామాండలికం
2. ప్రాంతీయ భాషామాండలికం
3. కుల/వృత్తి/జాతి/మాట/వయోభేదం/లింగభేదం గల మాండలికం

4. సాహిత్య మాండలికం
5. సందర్భ మాండలికం. వీటిని విశ్లేషించి వైవిధ్యాలను పేర్కొనవచ్చు.

**మాండలిక భాషల ప్రయోజనాలు :**

1. మాండలికం వలన భాష వైవిధ్యాన్ని సంతరించుకుంటుంది.
2. వైవిధ్యం వలన భాషకు సౌందర్యం కలుగుతుంది.
3. సాహిత్యంలోని పాత్రలకు సహజత్వం వస్తుంది.
4. విషయాన్ని బలంగా చెప్పవచ్చు.
5. ఒకేరకమైన కొత్త భాష రూపొందుతుంది.

భాషలన్నీ పరస్పరాశ్రితాలు. భిన్నత్వం కలగలిసినప్పుడు ప్రభావితమౌతాయి. "సంప్రదాయసిద్ధ నిర్మాణానికి విరుద్ధమైన భాషాలక్షణం కన్పిస్తే అది ఆదానపదమని" గుర్తించాలి. ఇందు ధాతృభాష – స్వీకృతభాష అని రెండు ఉంటాయి. ఇతర భాషాసంపర్కం వలన వచ్చిన పదాలను అన్యదేశ్యాలు అంటాము.

**1.4.4 వ్యక్తిగతభాష (Individual Language):** ఏ వ్యక్తి మాట్లాడే భాషైనా వేరొక వ్యక్తి భాషతో పోలిస్తే కనీస వైవిధ్యాన్ని కలిగిఉంటుంది. ఈ విషయంలో మీరు ఏ ఇద్దరు మాట్లాడే భాషనైనా పరిశీలించి నిర్ణయించుకోండి. ఈ ప్రత్యేకతనే వ్యక్తిగతభాష లేదా వైయుక్తిక భాష అని అంటాము. ఒకే ఇంటిలో కలిసి జీవిస్తున్నప్పటికీ అదే ఇంటిలో వ్యక్తులు మాట్లాడే భాషలో వైవిధ్యం స్పష్టంగా కన్పిస్తుంది. ఆ వ్యక్తి ఉచ్చారణలోను, పదబంధాల వాడుకలోను, సందర్భోచిత పదాల ప్రయోగంలోనూ ఇతరుల భాషతో కనీస తేడాలైనా కలిగిఉండడాన్ని గమనించగలం. మనిషి–మనిషికీ గల తేడాలాగే మనిషి–మనిషి మాట్లాడే భాషకూ ఉండే తేడాయే వైయుక్తికభాష ప్రత్యేకత.

**1.4.5 గృహభాష (Home language):** పిల్లలు బాల్యదశలో నేర్చుకొనే భాషను గృహభాషగా భాషావేత్తలు అంగీకరిస్తున్నారు. ఇంతవరకు మనం ఈ భాషనే మాతృభాష అని అనుకొంటున్నాము. కానీ బాల్యదశలోనే పిల్లలు రెండు భాషలు నేర్చుకొనే పరిస్థితులు ఉన్నపుడు, అంటే వేర్వేరు మాతృభాషల తలిదండ్రుల పిల్లలు తండ్రినుండి, తల్లినుండి వేర్వేరు భాషలను ఒకే సమయంలో నేర్చుకొనే సందర్భాలలో రెండు భాషలను నేర్చుకోవలసి వస్తుంది. అప్పుడు ఆ పిల్లలు వాడే గృహభాష విభిన్నతతో కూడి ఉంటుంది. బాల్యంలో ద్విభాషాగ్రాహకులైన పిల్లలు అత్యంత ప్రతిభావంతులౌతారని భాషావేత్తలు నిర్ధారిస్తున్నారు.

**1.4.6 పరిసరాల భాష (Language in the surroundings):** వ్యక్తిగతభాషకు, గృహభాషకు భిన్నమైనది పరిసరాల భాష. మనం ఏ పరిసరాలలో నివసిస్తున్నామో ఆ పరిసరాలలో నివసించే భిన్న జాతులప్రజలు, భిన్న వృత్తుల ప్రజలు, భిన్నమతాల ప్రజలు, భిన్న కులాల ప్రజలు సామాన్య అవసరాలు తీర్చుకోవటానికి వారి వారి భాష నేపథ్యాన్నిబట్టి వారు మాట్లాడే భాషలో పదాలను ఉపయోగిస్తారు. ఈ పదాల భాషద్వారానే ఇచ్చట భావవినిమయం, వ్యవహారం పూర్తవుతుంది. ఇలా పరిసరాలలో లభించే భాషనే పరిసరాల భాష అంటున్నాము.

ఉదా: ఏంవోయ్! బాగున్నావా? (ఒకప్పుడు)

గురూ! బాగున్నావా?

అన్న! ప్లీజ్ చెప్తావా? ఇలాంటి పలకరింపులు లింగాన్నిబట్టి, వయస్సునుబట్టి, మాతృభాషనుబట్టి, ప్రాంతాన్నిబట్టి ఆయా పరిసరాలలో వాడే భాషనుబట్టి మారుతూనే కన్పిస్తుంటాయి. ఇలాంటి పరిసరభాష ప్రభావం గృహభాషపైన, వ్యక్తిగతభాషపై కచ్చితంగా ఉంటుంది.

**1.4.7 భావవ్యక్తీకరణ సాధనంగా భాష (Language is a tool for thought and expression):** సమాజంలోని సభ్యులు భాషను పరస్పర భావవినిమయం కోసం ఉపయోగిస్తారు. స్పష్టమైన భావగ్రహణంనకు, స్పష్టమైన వ్యక్తీకరణకు పదములు విద్యలో నేర్చుకొని ఉపయోగిస్తుంటారు. కావున మన భావాలను ఎదుటివారికి స్పష్టంగా అవగాహన అయ్యేటట్లు తెలియజేయడానికి భాషను ఒక సాధనంగా ఉపయోగిస్తాము.

భావవ్యక్తీకరణలో భాషయొక్క సౌందర్యాన్ని ఇనుమడింపజేసేవి లోకోక్తులు, జాతీయాలు, నుడికారాలు మొదలైనవి. ఇవి కావ్యభాషలోనైనా, జానపద భాషలోనైనా భాషాసౌందర్య లక్షణాన్ని గుబాళింపజేస్తాయి. అభ్యుదయం, నాగరికత పోయే మతాలకోసం ఆగదు, ఆగకూడదు. మనది వ్యవసాయదేశం. భారతీయ ఆత్మ పల్లెల్లో ఉందని చెప్పుకొనేవారు, యంత్రాలు రంగప్రవేశం చేసినతరువాత ఎన్నో మాటలు, పనిముట్లు మూలపడ్డాయి. ఎలపటెద్దు, దాపటెద్దు, చెర్నాకోలా మొదలైనవి. భాష సజీవమైనది. పాతవి పోతూఉంటే కొత్తవి వస్తూఉంటాయి. మునుపు వయసు మళ్ళిన అత్తగారు 'కీలు దానికాడుంది. అది తిప్పినట్టు యాడాడతాడు' అని కోడలు, కొడుకు గురించి వ్యాఖ్యానించేది. ఇప్పుడు, "రిమోట్ దానిదగ్గరనుంది. ఆడ మీటనొక్కుతావుంటే ఈడ బొమ్మ మారుతావుంటది.

**1.4.8 బోధన మాధ్యమంగా తెలుగు భాష:** 'Medium of Instruction' అనే ఆంగ్లపదానికి మనం తెలుగు భాషలో 'బోధన మాధ్యమం' అనే పదాన్ని ఉపయోగిస్తున్నాం. బ్రిటిష్ వాళ్ళు పాలించిన కాలం నాటి నుండి భారతదేశంలో 1835 లార్డ్ మెకాలే మన విద్యాలయాల్లో ఆంగ్లాన్ని బోధనాభాషగా ప్రవేశపెట్టాడు.

మహాత్మాగాంధి మాతృభాష మాధ్యమంగా రూపొందాలని, మాతృభాషా ప్రాధాన్యతను గూర్చి 09-07-1938 నాటి 'హరిజన' పత్రికలో రాశారు. 1948 నాటి రాధాకృష్ణన్ కమీషన్, 1952 నాటి మొదలియార్ కమీషన్, 1962 లో భారత జాతీయ సమైఖ్యతా సమితి, 1964-66 కొఠారి విద్యాకమీషన్‌తో సహా అన్నీ పాఠశాల స్థాయినుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని సూచించాయి. ప్రాథమిక స్థాయిలో బోధనామాధ్యమంగా తెలుగునే ఉపయోగిస్తున్నారు. సుమారు ఈ దశలో, స్థితిలో ఉన్న తెలుగును 1969 నుండి ఇంటర్మీడియట్ స్థాయిలోను, 1971 నాటి నుండి డిగ్రీ స్థాయిలోను రాష్ట్రమంతటా బోధన మాధ్యమం చేశారు. ప్రస్తుతం కొన్ని విశ్వ విద్యాలయాలు పోస్టుగ్రాడ్యుయేట్ స్థాయిలో కూడా తెలుగు మాధ్యమాన్ని వినియోగిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమంలో లభించే ఎన్నో గ్రంథాలు పఠనీయ గ్రంథాలుగా అనుకరణీయ గ్రంథాలుగా తెలుగులో అనువదించి అందుబాటులో ఉంచుతున్నారు.

స్వతంత్ర్యం వచ్చాక చాలా వరకు మాతృభాషా మాధ్యమంలోకి వచ్చామని అనుకుంటున్న దశలో మళ్ళీ చరిత్ర వెనక్కు మళ్ళటం ప్రారంభించింది. ఆంగ్ల మాధ్యమం పూర్వ ప్రాథమిక దశ నుండే తన విశ్వరూపం ప్రదర్శిస్తోంది. ఇలాంటి మారిన పరిస్థితులలో విద్యాబోధన ఏ భాషలో సాగాలి అనే అంశంపై సమాజంలో మేధావి వర్గంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆంగ్ల విద్య వ్యక్తి జీవితానికి భరోసానిస్తుందన్న అభిప్రాయం పెద్ద ఎత్తున పాతుకుపోతోంది.

ఆంగ్ల భాషపై పట్టు సాధించడం అవసరమే అయినప్పటికి మాతృభాషలో సాధికారత కూడా అంతే అవసరమైన అంశంగా గుర్తించాలి. మాతృభాషలో ఉన్నతంగా ఆలోచన, వ్యక్తీకరణ సామర్థ్యం అన్యభాషలో సాధ్యంకాదని భాషాశాస్త్రవేత్తలు అభిప్రాయపడుతుంటారు. ఏది ఏమైనప్పటికి బోధనా మాధ్యమం పేరిట అందించే విద్యానాణ్యతలో ఎలాంటి వ్యత్యాసాలు ఉండరాదు. ఈ విషయాన్ని వాస్తవిక దృష్టితో పరిశీలించాలి. ప్రాథమిక స్థాయినుండి గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థలన్నింటిలోను ఇటు మాతృభాషలోనూ, అటు ఆంగ్లంలోనూ సమాంతరంగా విద్యాబోధన జరగడానికి చర్యలు తీసుకోవాలి. డబ్బున్న వారికే ఆంగ్లమాధ్యమం చదువులు అన్న అపోహ తొలగిపోతుంది. వర్గరహిత సమాజ నిర్మాణానికి ఇది దోహదం చేస్తుంది. ఆంగ్లమాధ్యమంలో చదువుకొనేవారు కూడా మాతృభాషను ఒక తప్పనిసరి విషయంగా చదవాలనే నియమం ఉండాలి. మాతృభాషలో బోధన జరుగుతున్నప్పటికి పాఠ్యపుస్తకభాష, ఉపాధ్యాయుని భాష రెండు కూడా పిల్లలభాషకు (ఇంటిభాష) పొంతన లేనివిగా ఉండడంవల్ల మాతృభాష బోధనకుంటుపడుతుంది.

ప్రొ॥ కృష్ణకుమార్‌గారు రాసిన "పిల్లలభాష – ఉపాధ్యాయుడు" పుస్తకాన్ని చదవండి. దీని గురించి సహాధ్యాయులతో చర్చించండి.

**1.4.9 జాతీయ సమైక్యత – భాష:** ఒక దేశంలో విభిన్న కులాలు, మతాలు, సంస్కృతులు, మరియు భాషలు కలవారంతా కలిసి మెలిసి దేశాభివృద్ధి కృషిలో పాల్గొనడం జాతీయ సమైక్యత. పూర్వం భారతదేశంలో ఒకేజాతి గల చిన్న చిన్న రాజ్యాలుండేవి. అన్నీ వర్గాలవారు ఏకభావనతో కలిసి ఉండటం. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రసిద్ధి. భారతదేశంలోని పౌరుడు మొదట భారతీయుడు, తరువాత మిగిలిన వర్గాలన్నీ 1962లో మనదేశంపై చైనా దురాక్రమణకు దిగినప్పుడు, 1971లో పాకిస్తాన్ మనపై కాలుదువ్వినప్పుడు భారతదేశంలోని ప్రజలందరూ ఒక్క తాటిపై ప్రభుత్వానికి అండగా నిలిచారు.

జాతి మొత్తం సమైక్యభావంతో ఉండాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వాలు కొన్ని చర్యలు చేపడుతున్నాయి. భిన్న భాషలుగల భారతదేశంలో ప్రతి పాఠశాల విద్యార్థి కనీసం మూడు భాషలు నేర్చుకోవాలనే ఉద్దేశ్యంతో త్రిభాషా సూత్రాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ జాతీయ పండుగలను నిర్వహించడం చేస్తుంది. అంతర్‌జిల్లా, అంతర్ రాష్ట్ర ఆటల పోటీలను నిర్వహిస్తూ జాతీయ సమైక్యతకు ప్రభుత్వాలు దోహదం చేస్తున్నాయి. భిన్న ప్రాంతాల్లో నివసించే గ్రామీణ విద్యార్థులకై నవోదయ పాఠశాలలను ఏర్పాటుచేసింది. విద్యను ఉమ్మడి బాధ్యతగా కేంద్రం చేపట్టింది. భారతజాతి యావత్తు ఏకత్రాటిపై నిలవాలనే అనేక చర్యలను ప్రభుత్వాలు చేపడుతూనే ఉన్నాయి.

**1.4.10 అంతర్జాతీయ అవగాహన – భాష:** నేడు ఆధునిక సమాచార సాంకేతిక విప్లవాలతో ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిపోయింది. భారతదేశంలో ఒకప్పుడు మాతృ మరియు ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యత ఉన్నా నేడు ఆంగ్లాభ్యసనకే ఎక్కువమంది ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ రోజుల్లో విదేశాలలో ఉద్యోగాలు చేసి అధిక సంపాదన ధ్యేయంగా ప్రవర్తిస్తున్నారు. ఈ ప్రాధాన్యతలో వివిధ దేశాల వ్యక్తులతో, వ్యవస్థలతో సంప్రదింపులు చేసుకోగలిగే అవగాహనతో చదువుకున్న వారందరు అభివృద్ధిపథంలో దూసుకుపోతున్నారు. ఇది శుభ పరిణామం. అభివృద్ధిచెందిన ప్రపంచదేశాలలో భారతీయులు పోషిస్తున్న కీలకపాత్ర మరువరానిది.

**1.4.11 భాష-పాలనా వ్యవహారాలు (అధికార భాషగా తెలుగు):** అశోకుని మరణానంతరం దక్షిణాపథంలో శ్రీముఖుడు స్వతంత్రంగా ఆంధ్రరాజ్యాన్ని స్థాపించాడు. క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దంలో శాతవాహనుల పాలనకు ఇది నాంది. నాలుగున్నర శతాబ్దాలపాటు ముప్ఫైమంది శాతవాహన రాజులు పరిపాలన సాగించారు. వీరు సంస్కృతాన్ని మన్నిస్తూ, ప్రాకృతాన్ని పాలనా భాషగా స్వీకరించారు. ఇందుకు పండితులు, పరిశోధకులు చెప్పే కారణాలు.

1. ఆకాలంలో ప్రాకృత, సంస్కృత భాషలు ప్రాముఖ్యతను సంతరించుకొన్నాయి. ప్రభువులు వాటిపట్ల ఆదరణ చూపేవారు. వాటిని ఆస్థాన భాషలుగా ఉపయోగించడం వైభవంగా భావించేవారు. మంత్రులు, అధికారగణం ఈ భాషలనే బలపరిచేవారు.
2. నాటి రాచరికపు వ్యవస్థలో ప్రభువులు మెచ్చిన భాషలోనే పాలన సాగేది. ప్రజల భాషకు లభించేది రెండవస్థానమే.
3. శాతవాహన సామ్రాజ్యం తూర్పున బంగాళాఖాతం నుంచి పడమర పడమటి కనుమల వరకు విస్తరించి ఉండేది. ఇందులో వేర్వేరు దేశభాషలవారున్నారు. పరిపాలనలో తగిన పదసంపద లోపించి ఉండవచ్చు. ఆనాటి రాజులు కావ్యభాషపట్ల మన్నన చూపేవారు.

శాతవాహనుల తర్వాత తెలుగు ప్రాంతాన్ని ఏలిన ప్రభువులు ఇక్ష్వాకులు, బృహత్పలాయనులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు, పల్లవులు. ఈ రాజవంశాల కాలంలో కూడా అధికార భాషగా ప్రాకృతం కొనసాగింది.

8GNJCH

ఈనాటికీ మనం పాలనలో 'టాటెన్‌హోమ్' అనే విలక్షణ విధానాన్ని పాటిస్తున్నాం. అంటే ఏ విషయంలోనైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలంటే సంబంధిత దస్త్రాన్ని కింది గుమాస్తా రాయాలి. సోపానక్రమంలో పైస్థాయికి, అంటే అధికారి స్థాయికి చేరుతుంది. ఆనాటి అధికారులందరూ ఆంగ్లేయులే. ఈ గుమాస్తాలను తయారుచేయడానికి శక్తివంతమైన బీజాలువేసింది లార్డ్ థామస్ బాబింగ్టన్ మెకాలే. బ్రిటీషు పాలన చురుకుగా సాగాలంటే గుమాస్తాలకు ఇంగ్లీషు బాగా రావాలి. బ్రిటిషు వారు భారతదేశ భాషలకు పెట్టిన పేరు 'వెర్నాక్యులర్స్'. వెర్న అనే లాటిన్ పద అర్థాన్ని దృష్టిలో ఉంచుకొని వాడారు. అంటే 'బానిస' అనే అర్థం. భారతీయ భాషలన్నీ బానిస భాషలని వారి ఉద్దేశ్యం.

1892 గాంధీజీకి గురుతుల్యులైన దాదాభాయి నౌరోజీ భారతీయుల్ని ఉన్నత పదవుల్లో నియమించాలని, భారతదేశంలో కూడా ఐ.పి.ఎస్. పరీక్షలు నిర్వహించాలని గట్టిగ వాదించారు. పాలనలో మనకు స్థానం లభించాలన్నదే ఆయన అభిమతం. స్వరాజ్యం అన్న పదాన్ని మొదట గళమెత్తి పలికినది ఆయనే. 1927 ఫిబ్రవరి 10వ తేదీన 'యంగ్ ఇండియా' అనే పత్రికలో గాంధీజీ ఇలా వ్యక్తంచేశారు. "ఇంగ్లీషు మాట్లాడే భారతీయులు దేశానికి విశేష సేవ చేశారనడం నిర్వివాదాంశం. అయితే వారు ప్రజల భాష నేర్చుకోకపోవడం వలన దేశప్రగతి కుంటుపడుతోంది". ఈ మాటలు ఈ నాటి పరిస్థితులకూ వర్తింపజేసేవే అని మాత్రం మరిచిపోకూడదు.

రాజ్య నిర్వహణలో ఉపయోగించే భాషనే అధికార భాషగా పేర్కొంటాం. మన రాష్ట్ర పరిధిలో చూస్తే 1953లో భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా విడివడినప్పటికీ, తెలుగు ఆనాటి నుండి అధికార భాషగా లేదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగును అధికార భాషగా అమలుచేయటానికి ఉత్తర్వులనిచ్చింది. తెలుగును అధికార భాషగా చిత్తశుద్ధితో అమలుచేయటానికి జి.ఒ.ఎం.ఎస్. నం. 113 తేది. 19-03-1974 లో అధికార భాషా సంఘం ప్రభుత్వ శాఖగా ఏర్పడింది. తెలుగును పరిపూర్ణంగా అమలుచేయడానికి "తెలుగు అధికార భాషా సంఘం" ను నియమించి పర్యవేక్షణ

బాధ్యతలను అప్పగించారు. దీనిలో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లో గల ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రతి నెలలో జరిపే ఉత్తర-ప్రత్యుత్తరాలు, ఎన్ని తెలుగులో జరిపారో అధికార భాషాసంఘం పరిశీలిస్తూ ఉంటుంది. తెలుగు భాషా వ్యాప్తికి తగిన చర్యలు చేపట్టడానికి సూచనలను చేస్తుంది.

అయితే అధికార భాషాసంఘం ఏర్పడినా కూడా మార్పు కనిపించని పరిస్థితిని తీవ్ర సమస్యగా గుర్తించిన ముఖ్యమంత్రులలో నందమూరి తారక రామారావుగారి ప్రభుత్వం 1988 సంవత్సరం అక్టోబర్ 28న ఒక నోటిఫికేషన్ జారీచేసింది. దీన్ని అనుసరించి రాష్ట్రస్థాయి నుండి మండల స్థాయి వరకు అన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ ఉత్తర్వులకు, ఉత్తర, ప్రత్యుత్తరాలకు తెలుగు భాషను వాడాలి. ఇంగ్లీషు వాడరాదు. అప్పటికి తెలుగు భాష వాడుకలో కొంత పురోభివృద్ధి కనిపించింది.

తేదీ 18-03-1988న ప్రారంభమయిన 'విభవ' తెలుగు సంవత్సరాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికార భాష సంవత్సరంగా పరిగణించింది. అప్పటి ముఖ్యమంత్రితో సమావేశమైన భాషాసంఘం ప్రభుత్వ శాఖలలో తెలుగు వాడకానికి ఆరు సూత్రాలను సూచించింది.

1. ఫైళ్ళలో మాట్లాడే భాష రాయాలి. ప్రజలకు అర్థంకావడమే పరిపాలనా భాష పరమ ప్రయోజనం.
2. తెలుగులో అనుకొని తెలుగులోనే రాయాలి. ఇంగ్లీషులో ఉన్న పూర్వ దృష్టాంతపు కాగితాలను మార్గదర్శకంగా తీసుకొని తెలుగులోనే రాయాలి. కానీ వాటిని అనువదిస్తూ తలలు పట్టుకోరాదు.
3. తెలుగు పదం వెంటనే స్ఫురించనప్పుడు ఇంగ్లీషు మాటను తెలుగు లిపిలో రాయవచ్చు.
4. ఏదైనా ఇంగ్లీషు మాటకు, మన పదకోశాలలో అర్థం లభ్యం కానప్పుడు దానికి సరైన అనువాదం అనుకొని మనం ఒక తెలుగు పదాన్ని రాసినప్పుడు ఆ ఆంగ్లపదాన్ని బ్రాకెట్లలో చూపించాలి.
5. అధికార భాష అమలును ఎప్పటికప్పుడు సమీక్షించాలి.
6. అధికారులు తెలుగు దినపత్రికలను చదవడం అలవాటు చేసుకోవాలి. ఈ అలవాటువల్ల అన్నీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

ఈనాడు పాఠశాల దశలలో ఆంగ్లమాధ్యమంపై మోజుతో మాతృభాషను మరిచిపోయే పరిస్థితికి వస్తున్నారు. అదనపు భాషలు నేర్చుకోవడంలో తప్పులేదు. ఈ ప్రయత్నంలో మాతృభాషను మరచిపోవడమే ప్రమాదకరమైనది. పాఠశాల దశలో మాతృభాషా బహిష్కారం 30% దాటితే, ఆ భాష క్షీణదశకు చేరుకున్నట్లే అని యునెస్కో హెచ్చరించింది. కాబట్టి ఈ ప్రమాదాన్ని అధిగమించాలి. మాతృభాష మరవకూడదు.

తెలుగులో మాట్లాడండి.
తెలుగులో రాయండి
తెలుగులో జీవించండి.
తెలుగులోనే కలలు కనండి
తెలుగు కలలను సాకారం చేయండి.

కింది పద్యంలోని అంతరార్థాన్ని గ్రహించండి.

"ఎంత చదువు చదివి ఎన్ని సాధించినా
మాతృమూర్తినెపుడు మరువరాదు!
అమ్మలేని నీ జన్మ చిమ్మ చీకటికదా!
భాస్కరార్యుమాట! ప్రగతిబాట!!

## మూల్యాంకనం

### వ్యాసరూప ప్రశ్నలు 8 మార్కులు

1. భాషను నిర్వచించి విధులను తెలియజేయండి?
2. భాష యొక్క స్వరూప స్వభావాలను వివరింపుము?
3. భాషా లక్షణాలను వివరించండి.
4. ప్రథమ భాషగా తెలుగును బోధించడంలోగల ఉద్దేశ్యాలను వివరింపుము?
5. బోధనా మాధ్యమంగా తెలుగు భాష తీరుతెన్నులను వివరించుము?

### సంక్షిప్త సమాధాన ప్రశ్నలు 4 మార్కులు

1. పరిపాలనా భాషగా తెలుగు ప్రాధాన్యతను తెలపండి?
2. ప్రామాణిక, అప్రామాణిక భాషా రూపాలను తెలియజేయండి?
3. గ్రాంధికభాష అంటే ఏమిటి? నిర్వచించి లక్షణాలను రాయండి?
4. మాండలికం అంటే ఏమిటి? నిర్వచించి లక్షణాలను రాయండి?
5. భాషా ప్రయోజనాలను తెలపండి?
6. మాండలికాలు ఏర్పడడానికి గల కారణాలను వివరించండి?

### లఘు సమాధాన ప్రశ్నలు 2 మార్కులు

1. చిత్రలిపి అనగానేమి?
2. ప్రాథమిక దశలో విద్యార్థులకు ఎటువంటి అభ్యసన అవసరం?
3. భాష నియమానుసార నిర్వహణ కృత్యం అని ఎలా చెప్పగలవు?
4. ద్వితీయ భాషగా తెలుగు అధ్యయనం ఎవరు అభ్యసిస్తారు?
5. త్రిభాషా సూత్రం అంటే ఏమిటి?
6. వ్యక్తిగత భాష అంటే ఏమిటి?
7. గృహభాష అంటే ఏమిటి?
8. వ్యావహారిక భాష అంటే ఏమి?

### బహులైచ్ఛిక ప్రశ్నలు ½ మార్కు

1. 2001 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో ప్రధాన భాషల సంఖ్య ( )
   అ) 122 ఆ) 120 ఇ) 130 ఈ) 150
2. ఏ తెలుగు సంవత్సరాన్ని ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం అధికార భాషా సంవత్సరంగా పరిగణించింది. ( )
   అ) ప్రభవ ఆ) శుక్ల ఇ) విభవ ఈ) ప్రమోదూత
3. భారత ప్రభుత్వం గుర్తించిన అధికార భాషల సంఖ్య ( )
   అ) 20 ఆ) 21 ఇ) 23 ఈ) 22
4. భారతదేశంలో ఆంగ్లాన్ని బోధనా భాషగా ప్రవేశపెట్టిన ఆంగ్ల అధికారి ( )
   అ) లార్డ్ మెకాలే ఆ) వెలస్లీ ఇ) రూధర్‌ఫర్డ్ ఈ) థామస్ మన్రో

5. వ్యావహారిక భాషలో గురజాడ రాసిన నాటకం ( )

అ) కన్యాశుల్కం ఆ) మెటిల్డా ఇ) ముత్యాలసరాలు ఈ) హరిశ్చంద్ర

**ఖాళీలను పూరింపుము** ½ మార్కు

1. బ్రిటీషువారు భారతదేశ భాషలకు ............ పేరు పెట్టారు. (వెర్నాక్యులర్స్)
2. అన్ని ప్రభుత్వ శాఖల్లో తెలుగు వినియోగాన్ని తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీచేసిన ముఖ్యమంత్రి (ఎన్.టి. రామారావు)
3. తెలుగు భాషలోని 56 అక్షరాలను .......... అంటారు. (వర్ణమాల)
4. సాధారణ ప్రజలు వ్యవహరించే భాషను ............. అంటారు. (వ్యావహారిక భాష)
5. మూడు భాషల అధ్యయన విధానాన్ని ............. అంటారు. (త్రిభాషా సూత్రం)
6. CABE ని విస్తరించుము.... (కేంద్ర సలహా సంఘం) (Central Advisory Board of Education)

**జతపరచండి.** ½ మార్కు

| | | | |
|---|---|---|---|
| 1. | కన్యాశుల్కం | ( 2 ) | అ) మహాత్మాగాంధీ |
| 2. | యంగ్ ఇండియా | ( 3 ) | ఆ) భౌగోళిక భాషారూపం |
| 3. | మాండలికం | ( 5 ) | ఇ) కొఠారీ కమీషన్ |
| 4. | తృతీయ భాష | ( 1 ) | ఈ) గురజాడ |
| 5. | త్రిభాషా సూత్రం | ( 4 ) | ఉ) ఆంగ్ల భాష |

# 2 ప్రారంభ భాషా సముపార్జన భాషాభ్యసనం

> *"మానవ భాషను మనమొక సహజ పరిణామంగా భావించాలి. మానవ శరీర నిర్మాణాన్ని ఎలా అధ్యయనం చేయగలుగుతామో అలాగే భాషా నిర్మాణాన్ని కూడా మనం అధ్యయనం చేయవచ్చు"*
>
> **- ఎరిక్. హెచ్. లెన్నెబెర్గ్**

**విషయక్రమం**

2.0 లక్ష్యాలు
2.1 పరిచయం
2.2 జంతువులు, మానవుల భాషలు - పూర్వభాషా సామర్థ్యాలు
2.3 వివిధ దశలలో భాషాభివృద్ధి
2.4 బహుళ అక్షరాస్యతలు
2.5 పాఠాల రకాలు
2.6 విద్యాప్రణాళికలో బాలసాహిత్యం వినియోగం - ప్రయోజనాలు
2.7 ప్రత్యేక అవసరాలుగల పిల్లలు - భాషాభ్యసనం అవసరాలు - లోపనిర్ధారణ - ప్రారంభ భాష జోక్యం

## 2.0 లక్ష్యాలు

ఈ అధ్యాయం చదవడం ద్వారా ఛాత్రోపాధ్యాయులు:

1. జంతువులు, మానవుల భాషలమధ్యగల వ్యత్యాసాలను గుర్తిస్తారు.
2. భావప్రసారంలో ప్రాక్ భాషాసామర్థ్యాలు కూడా ఉంటాయని గ్రహిస్తారు.
3. భాషాసముపార్జన మరియు భాషాభ్యసనం స్వతస్సిద్ధంగా పుట్టుకతో సంక్రమించిందని తెలుసుకుంటారు.
4. అక్షరాస్యత బోధనలో సంకేతికత (Coding), విసంకేతికత (De-coding) ప్రధానపాత్ర పోషిస్తాయని తెలుసు కుంటారు.

5. వర్తమాన పాఠశాల సందర్భంలో ప్రారంభ అక్షరాస్యత ప్రాధాన్యతను అర్థం చేసుకుంటారు.
6. బహుళ అక్షరాస్యత భావనలు గురించి తెలుసుకుంటారు.
7. పుస్తకపఠనం భాషాభ్యసనాన్ని వేగవంతం చేస్తుందని అవగాహన చేసుకుంటారు.
8. విద్యాప్రణాళికలో భాష ప్రాధాన్యతను తెలుసుకుంటారు.
9. భాషాభ్యసనానికి భాష ద్వారా అభ్యసనానికి గల భేదాలను అవగాహన చేసుకుంటారు.
10. ప్రత్యేకావసరాలు గల పిల్లలకు భాషాబోధనలో ఎదురయ్యే సమస్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలు తెలుసుకుంటారు.

## 2.1 పరిచయం

మానవుడు సంఘజీవి. జంతుజాలం నుంచి మానవుడు క్రమపరిణామం పొందినా మానవుడు భావవినిమయానికి అర్థవంతమైన శబ్దాలు అలవరచుకొని భాషాభివృద్ధి సాధించాడు.

జంతువుల భాషలో మానవుల భాషలో ఉన్నట్లుగా ధ్వని, దాని అర్థానికి ఉన్న స్వేచ్ఛాయుత సహసంబంధం ఉండదు. మానవుల భాషలో నిశ్చితమైన ధ్వనులు తిరిగి అదే అర్థంలో వాడతారు. మానవులు వివిధ భాషలను అలవర్చుకుంటారు. ఈ భాషలన్నీ సంప్రదాయబద్ధమై లిఖితరూపం కలిగిఉంటాయి. లిపి లేని భాషలు తమదైన సంస్కృతిని, ఊహాలోకాన్ని / భావోద్వేగాలను ప్రదర్శిస్తాయి.

భాషాభ్యసనం జైవిక, సామాజిక, వ్యక్తిగత కారకాల ఫలితం. పిల్లలు భాషను పొందే శక్తి పాఠశాలనుండి, పరిసరాలనుండి ఎటువంటి భాష వింటారో ఆ భాష అభ్యసనంమీద ప్రభావం చూపుతుంది. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి అభ్యసన సందర్భాలను అభివృద్ధి చేయడం ద్వారా భాషా ప్రావీణ్యత పెరుగుతుంది.

పఠన, లేఖనాభ్యసనాలు గతిశీలక పరిణామ ప్రక్రియలు. పాఠశాలల్లో చేరిన పిల్లలకు 'చదువుట నేర్పుట' ఉపాధ్యాయులెదుర్కొనే సవాళ్ళలో మొదటిది. పాఠశాలల్లో అక్షరాస్యత బోధనలో సంకేతిత (Coding), విసంకేతిత (De-coding) నైపుణ్యాలు కీలకమైనవని భాషావేత్తలు భావిస్తారు.

ప్రాథమికదశలో భాషాభివృద్ధికి భయంలేని పరిసరాలలో మాట్లాడే స్వేచ్ఛను పిల్లలకు కల్పించే వాతావరణం తరగతి గదులలో కల్పించాలి. జీవితంలో పిల్లలు భాషను నేర్చుకుంటున్న క్రమాన్నే పాఠశాలల్లోను పాటించాలి.

భాషానైపుణ్యాలు పిల్లల పుస్తకాలతో ముడిపడి ఉన్నాయి. పిల్లలు చూసే బొమ్మల పుస్తకాలు మరియు వారు ఇంట్లో, సమవయస్కులతో వినే కథలు, ఆడే ఆటలు భాషాభ్యసనం మీద, అక్షరాస్యత మీద ప్రభావం చూపుతాయి.

బాలసాహిత్యం భాషాభ్యసనాన్ని వేగవంతం చేస్తుందని అనేక పరిశోధనలు తెలుపుతున్నాయి. విద్యార్థుల నేపథ్యం, సంస్కృతి మొదలైన వాటిని అర్థంచేసుకొని ఆ పుస్తకాలను ముందుగా విద్యార్థులకు పరిచయం చేయాలి.

పిల్లల భాష, తరగతిగది భాష, పరిసరాల భాష ఆధునిక తరగతి గదిలో వినిపిస్తుంది. పిల్లల ఇంటి భాష, పరిసరాల భాషను అనుసంధానిస్తూ తరగతిగది భాషాభ్యసనానికి ఉపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

ప్రత్యేకావసరాలు గల పిల్లల భాషాభ్యసన అవసరాలు ఉపాధ్యాయులు గుర్తించి భాషా బోధనలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

## 2.2 జంతువులు, మానవుల భాషలు – పూర్వభాషా సామర్థ్యాలు (Language of Animals and Humans, pre linguistic capabilities to communicate)

జంతువులు తమ భావాలను వ్యక్తం చేయడానికి ధ్వనులు చేస్తాయి. అదేక్రమంలో మానవులు కూడ తమ తమ భావాల వ్యక్తీకరణకు ధ్వనులు చేస్తూ అవయవాల కదలికల ద్వారా, సైగల ద్వారా భావప్రకటన, భావగ్రహణ చేస్తారు. పశు, పక్షి, కీటకాలలో కూడా కొన్నింటిలో వార్తాప్రసారం జరుగుతుంది. కాని జంతువుల భాష మానవ భాషలంత కష్టమైనది కాదు, భావగర్భితమైనది కాదు. మనిషికి సందర్భానుసారంగా తన భాషను మార్చుకునే తెలివితేటలు ఉన్నాయి. మానవుల భాషలో నిశ్చితమైన ధ్వనులు తిరిగి తిరిగి అదే అర్థంలో వాడతారు. కాని జంతువుల భాషలో అలా జరుగదు.

8W7EDT

- గతానికి భవిష్యత్తుకూ చెందిన అంశాలు మానవభాషలో చెప్పడానికి అవకాశముంది. జంతువులకి ఆ అవకాశం లేదు.
- మానవులు చిన్న పదాలతో ఒక వాక్యక్రమాన్ని ఏర్పరుస్తారు. జంతువులు అలా చేయలేవు.
- మానవులు గంటలకొద్దీ అనర్గళంగా మాట్లాడగలరు. జంతువులు అలా మాట్లాడలేవు.
- మానవ భాషలో ప్రత్యేక పదాలు వాటికి అర్థాలుంటాయి. జంతువుల విషయంలో ఇలా ఉండవు. జంతువులు భాషలను (ధ్వనులను) భాషాశాస్త్రవేత్తలు పరిశీలించి నమోదుచేశారు. పక్షులు, కోతులు భయం, అనురాగం కలిగినపుడు అరుపులు అరుస్తాయి. భయం కలిగినపుడు అరుపులు పెద్ద ధ్వనితో ఉంటాయి.
- కోతులలో Vervet Monkey అనే తెగ అధమపక్షం ఆరురకాల అరుపులు అరుస్తాయి. వీటికి అపాయం కల్గించే చిరుతపులులు, పాములు, గద్దల వంటి ఒక్కొక్క రకం జంతువుని చూసినప్పుడు ఒక్కొక్క రకం అరుపు ఇవి అరుస్తాయి.
- చీమలలో రసాయనిక సంకేతాలు ఉన్నాయి. చీమలు ఆహారం ఉన్నచోట కనుక్కొని పుట్టకు తిరిగి వచ్చేటప్పుడు వాసన వేసే రసాయన పదార్థాన్ని దోవపొడుగునా వదులుతాయి. మిగిలిన చీమలు ఈ పదార్థం ఉన్న దోవలో వెళ్ళి ఆహారాన్ని చేరుకుంటాయి.
- తేనెటీగలలో స్పర్శ సంకేతం ఉంది. మధువును చూసిన తేనెటీగలు పట్టుకు తిరిగివచ్చి నాట్యం చేస్తాయి. మిగిలిన తేనెటీగలు వీటిని రాసుకుంటూ నాట్యంలో చేరి మధువు ఉన్న దిక్కు, దూరం తెలుసుకుంటాయి.
- వేటకుక్కలు వేర్వేరు రకాల జంతువులను చూసినపుడు వేర్వేరు ధ్వనులు చేస్తాయి. పులిని చూసినపుడు ఒకలాగా, సింహాన్ని చూసినపుడు ఒకలాగ ధ్వని చేస్తాయని డా॥ స్లొబొడ్ షికాఫ్ పరిశోధనలో తేలింది.
- నీటిసింహాలు సైతం ఒకదానితో ఒకటి మాట్లాడుకుంటాయి. అయితే మూలుగులు, అరవడాలు, సన్నని ధ్వనులు మాత్రమేకాక శరీరాలను వివిధ ఆకృతులలో మలచి తమ భావాలను ఇతర నీటిసింహాలకు చేరవేస్తాయి.

జంతువులు, కీటకాలకు తమదంటూ ఒక భాష ఉంటుందని పై సమాచారం ద్వారా గ్రహించవచ్చు. అందుకే మానవుల భాష జంతువుల భాషకంటే భిన్నమైనదై కింది లక్షణాలను కలిగి ఉంటుందని భాషాశాస్త్రవేత్తల అభిప్రాయం.

- అభివృద్ధి చెందిన ధ్వనివ్యవస్థ మానవునికి వుంది. నోరు, దంతాలు, స్వరపేటిక; నాలుక, అంగిలి, ఊపిరితిత్తులు అన్నీ కలిసి ధ్వనులను ఉత్పత్తి చేయడమే కాకుండా ముఖం ద్వారా శారీరక కదలికల ద్వారా హావభావాల ద్వారా తన భావాలను ప్రకటించగలడు / వ్యక్తీకరించగలడు / ప్రదర్శించగలడు.
- ధ్వని వచ్చిన దిశను మానవులు కచ్చితంగా గుర్తించగలరు. అవగాహనతో జాగ్రత్తగా విని స్పందించగలరు. అయితే ఈ విషయంలో జంతువులు కొంత సందిగ్ధతకు లోనవుతాయి.
- మానవులు చేసే ధ్వనులు తొందరగా ముగుస్తాయి. పదాలు తొందరగా పూర్తిఅవుతాయి. కాని జంతువులు తమ శరీరం ద్వారా ఉత్పత్తిచేసే కొన్ని వాసనలు శత్రువుల నుండి వాటిని రక్షిస్తాయి. పైగా వాసన దీర్ఘకాలం కొనసాగుతుంది. ఇది మానవునిలో జరుగదు.
- మానవుడు తానందుకున్న సమాచారానికి ప్రతిస్పందిస్తాడు. జంతువుల్లో ప్రతిసారి ప్రతిస్పందనలు అంతగా కనబడవు.
- ప్రత్యేక ధ్వనులను పుట్టించడం ద్వారా మానవులు తమ భావాలను తెలియజేస్తారు. కాని జంతువులు స్థిరమైన ధ్వనులనే తిరిగి తిరిగి చేయగలవు.
- మానవులు వాక్యనిర్మాణం చేయగల సమర్థులు. జంతువులకు ప్రత్యేక వాక్యనిర్మాణమంటూ ఏమీ ఉండదు.
- మానవులు వివిధ భాషలు నేర్చుకునే / సముపార్జించే / పొందే (acquisition) సామర్థ్యం జన్మతః కలిగివున్నారు. జంతువులకీ సామర్థ్యం జన్మతః లేదు.

**భాషా సముపార్జన – భాషాభ్యసనం (Acquisition of Language and Language Learning)**

భాషను గ్రహించే శక్తి పిల్లలకు పుట్టుకతోనే ఉంటుంది. జన్యుపరంగానే మానవ శిశువులకు ఒక భాషావ్యవస్థ సంక్రమించింది. దానినే విశ్వవ్యాకరణం (Universal Grammar) అన్నారు నోమ్‌చామ్‌స్కీ (Noam Chomsky). ప్రకారం భాషా సముపార్జన (acquisition) అనేది శిశువులోని ఈ అంతర్గత శక్తిని ఆవిష్కరించటమే.

- శిశువులలో గల భాషను పొందే శక్తి ఏ భాషనైనా నేర్చుకోవడానికి తోడ్పడుతుంది. దీనిని సార్వత్రిక భాషా విభాగంగా (Universal Language Faculty) గుర్తించవచ్చు. వివిధ సన్నివేశాలలో ప్రత్యక్షంగా పాల్గొనినప్పుడు వినియోగించుకునే సందర్భం ఎదురైనపుడు తనలోని గ్రాహ్యకశక్తిని ఉపయోగించుకొని భాషను అభివృద్ధి చేసుకుంటారు. తమకు అందుబాటులోనున్న ఏ భాషలోనైనా పట్టు సాధించగలుగుతారు. ఏకకాలంలో రెండు మూడు భాషలనైనా నేర్చుకోగలుగుతారు. వివిధ భాషలను మాట్లాడే వారి సాన్నిహిత్యం సాంగత్యం వల్ల కూడా భాషను గ్రహించడం మనం గమనించవచ్చు.

భాష సంక్లిష్టమైనది. పరిణామం చెందే గుణం కలది. భాషలో ఎన్ని నియమ నిబంధనలున్నప్పటికీ పిల్లలు ధారాళంగా మాట్లాడగలరు. సులభంగా నేర్చుకోగలరు. పిల్లలు మొదట అనుకరించి భాషను నేర్చుకోరు. వారు ధ్వనులను సృష్టించుకుంటారు. తర్వాత అనుకరిస్తారు. వారు చేసే ధ్వనులకు అర్థం వారికి తెలుసు. పిల్లలు భాషను

వినడం నేర్చుకుంటారు. మాట్లాడుతూ భాషణం నేర్చుకుంటారు. తమ అవసరాలకు తగినట్లుగా శబ్దాలను సమన్వయం చేసుకుంటారు. అభ్యసించే క్రమంలో తప్పులు చేస్తూ భాషను సవరించుకుంటారు. అందుకే చిన్నపిల్లల భాషాపరమైన దోషాలను మనం భూతద్దాల్లో చూడకూడదు!

సహజంగా పిల్లలు అర్థవంతమైన సన్నివేశాల ద్వారా సందర్భానుసారంగా భాషను పొందుతారు. ఆ భాషను గ్రహించే క్రమంలో తప్పొప్పులకు తావులేదు. తప్పులు చేస్తూనే నేర్చుకుంటారు. ఇలా ఈ భాషా వినమయాన్ని సహజ వాతావరణం నుంచే నేర్చుకుంటూ తమ తప్పుల్ని తామే సరిదిద్దుకుంటారు. అలాంటి అవకాశం వారికి కలిగించాలి.

భాషా సంపాదన / సముపార్జన చక్రీయ పద్ధతిలో ప్రగతి సాధిస్తుంది. రేఖీయ పద్ధతిలోగాని, సమీకృత పద్ధతిలోగాని కాదు. భాషాసంపాదనలో అనుకరణకు ప్రాధాన్యత తక్కువ. మనం అనుకరణగా భావించే అంశాలు శిశువుకు జన్మతః అలవడిన జ్ఞానం మాత్రమే.

- కేవలం పరస్పర సంబంధంలేని, ఒంటరి (isolated) పదాలు, వాక్యనిర్మాణాల ద్వారా భాష అలవడదు. పలు సందర్భాలలో జరిగే వ్యక్తీకరణల వల్ల భాష అలవడుతుంది.
- భాష కేవలం శ్రవణం; పఠనం; లేఖనం; భాషణం అనే నాలుగు నైపుణ్యాల సమాహారం కాదు. ఈ నైపుణ్యాలను ప్రదర్శించుటకు అవసరమైన అంతర్గత శక్తుల మొత్తం మాత్రమే.
- భాష పొందడమనేది మొత్తం నుండి భాగాలవైపు (wholistic approach) పయనిస్తుంది. కాని భాగాలనుండి మొత్తం వైపుకు కాదు. పిల్లలకు భాషా వినియోగం సందర్భాలను పరిచయం చేసి ఆయా సందర్భాలలో పిల్లల వ్యక్తీకరణకు అవకాశం కల్పిస్తే అందుకు ఫలితంగా పిల్లలు భాషా సామర్థ్యాన్ని పొందగలుగుతారు.
- పరస్పర సహకారమున్న సందర్భాల్లోనే భాషా సంపాదన జరుగుతుంది (Vygotsky, Bruner). ఈ సన్నివేశాలలోనే పిల్లలు పరస్పర వైయక్తిక అభివృద్ధిలో పాలుపంచుకుంటారు.

**పిల్లలు భాషను నేర్చుకునే క్రమం :**

ప్రతి శిశువు సుమారు మూడు సంవత్సరాలు వచ్చేటప్పటికే భాషను నేర్చుకుంటాడు. అది మాతృభాష అయితే మరింత ధారాళంగా వచ్చితీరుతుంది. మొదట క, త, ద, ప, బ, మ అనే ధ్వనులను నేర్చుకుని తాత, పాప, మామ మొదలగు పదాలను పలకడం నేర్చుకుంటారు. ఆతర్వాత సరళవాక్యాలు, ప్రశ్నార్థకాలు ఇలా ఒకదాని తర్వాత ఒకటి నేర్చుకుంటారు. భాషానియమాలు పాటించడంలో ఎక్కడా గందరగోళం కనిపించదు. సందర్భాలను బట్టి అర్థాలను గ్రహిస్తారు.

**భాషా జ్ఞాననిర్మాణం అంటే ఏమిటి ?**

పిల్లలు భాషను పొందే క్రమంలో వివిధ స్థాయిలలో జ్ఞాననిర్మాణం జరుగుతుంది. సహజంగా సందర్భోచితంగా అర్థవంతమైన సన్నివేశాలలో పిల్లలు పాల్గొనడం ద్వారా జీవజాలం, వస్తుజాలంతో పరస్పర ప్రతిచర్యలు పొందడం ద్వారా పదాలు, పదబంధాలు వాటి అర్థాలు, వాక్యాలను సృష్టించగలగడమే భాష విషయంలో జ్ఞాననిర్మాణం అనవచ్చు. ఇది సాధారణంగా వివిధ రూపాలను కలిగిఉంటుంది. కథ కావచ్చు, నాటిక కావచ్చు, పద్యం కావచ్చు, గేయం కావచ్చు. చర్చించడం, వ్యాఖ్యానించడం, వర్ణించడం, విమర్శించడం, ప్రశ్నించడం, నాటిక, ఏకపాత్రాభినయం వంటి అనేక రూపాలలో భాషాజ్ఞానం రూపుదిద్దుకుంటుంది.

అంటే భాషలో సృష్టించబడ్డ జ్ఞానం పైరూపాలలో ఉంటుందని చెప్పవచ్చు. సాధారణంగా ఒకపదం ఇచ్చి పిల్లలను సొంత వాక్యం చెప్పమంటే తాము గతంలో విన్నదో చూసిందో చదివిందో చెబుతారు. ఇది పునరుక్తి మాత్రమే. వాస్తవంగా ఒక నూతన పదం; నూతన వాక్యం తమ అనుభవాల ఆధారంగా ఆలోచనల్లోంచి పుట్టడమే భాషలో జ్ఞాననిర్మాణం అని చెప్పవచ్చు.

ఉదా : ఆకాశం, చందమామ, వెన్నెల

పై మూడుపదాలనుపయోగించి పిల్లల్ని ఒక్కొక్క వాక్యం చెప్పమనండి. ఒకరు చెప్పిన వాక్యం మరొకరు చెప్పకూడదని సూచనలిచ్చినప్పుడు పిల్లలు పూర్వజ్ఞానం ఆధారంగా వాక్యనిర్మాణం చేస్తారు.

## 2.3 వివిధ దశలలో భాషాభివృద్ధి

పూర్వ పాఠశాల దశ, ప్రారంభ పాఠశాల దశలలో అనగా తొలి బాల్యదశ, ప్రారంభ పాఠశాల బాల్యదశలలో (Pre school and early school years) బాలల అనుభవాలను బట్టి భాషను పొందుతారు / సముపార్జిస్తారు / నేర్చుకుంటారు.

భాష నేర్చుకోవడం మొదలుపెట్టిన స్థితి ప్రారంభస్థితి అని భావిస్తే అనుభవం భాషాస్థితిని క్రోడీకరిస్తుంది, మార్పులు చేస్తుంది. అభ్యాసకులు భాషను అర్థంచేసుకునే స్థితి చివరిస్థితి.

పై విషయాన్ని మనం సమీకరణం ద్వారా చూపవచ్చు.

$S_0$ అభ్యాసకుని ప్రారంభస్థితి $\rightarrow$

అనుభవం (Experience) $\rightarrow$

$S_T$ భాష సంపూర్ణంగా నేర్చుకున్న స్థితి

$L = (S_0 + E) = S_T$

77CVA6

భాష సంపూర్ణంగా నేర్చుకున్న స్థితిలో సృజనాత్మక రచనలు చేస్తారని కాదు. తమ భావాలను సరిగ్గా వ్యక్తీకరించే స్థితికి చేరుకుంటారని అర్థం. ఈ స్థితిలో వారు భాషపై పట్టు సాధిస్తారు. పాఠశాలకు వచ్చిన తర్వాత అందులో ఉన్న సూత్రాలను అర్థం చేసుకుంటారు. వారికి పలు ఉదాహరణలతో ఉపాధ్యాయుడు బోధిస్తే ఇది సాధ్యమవుతుంది.

భాష గుణాత్మకతను సంతరించుకోవటానికి పాఠశాల బోధన ఉపయోగపడుతుంది. నిజానికి పెద్దవాళ్ళలా ఆలోచించడం, మాట్లాడగలగడం ఒక సామర్థ్యం. పిల్లలకు భాష నేర్చుకునే స్థితిలో ఈ సామర్థ్యం అలవడుతుంది. పిల్లలు ఏర్పర్చుకున్న వ్యాకరణం సార్వజనీన వ్యాకరణం ప్రభావమేనని అది పెద్దలనుంచే సంక్రమించిందని భాషా శాస్త్రవేత్తల అభిప్రాయం. అంటే పెద్దలు మాట్లాడే భాషను పిల్లలు కొనసాగిస్తారని అర్థం. ఈవిధంగా పిల్లల భాషాభివృద్ధిపై వారి శారీరక యోగ్యత, పరిసరాలు, పాఠశాల, వారి వ్యక్తిగత అనుభవాలు ప్రభావం చూపుతాయి.

**భాషాభ్యసనం – ప్రారంభ శిక్షణ (Language Learning - Apprentiship)**

ఉపాధ్యాయుడు బోధిస్తాడు. విద్యార్థి వింటాడు. కాని వృత్తిశిక్షణ కేంద్రంలో (Professional Training Centre) వివిధ వ్యక్తులు, ఏవిధంగా తన మార్గదర్శి దగ్గర పనిచేస్తూ వృత్తిసామర్థ్యాలు నేర్చుకుంటాడో అదేవిధంగా విద్యార్థితో

కలసి ఉపాధ్యాయుడు సహపఠనం చేసే / భాగస్వామ్య అభ్యసనం చేసేవిధంగా, ఉపాధ్యాయుడు సౌలభ్యకర్తగా విద్యార్థుల భాషాభ్యసనాన్ని పర్యవేక్షించాలని నేటి భాషాశాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఫలితంగా...

- ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి అభ్యసన సందర్భాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా విద్యార్థులు భాషలో పట్టు సాధిస్తారు. స్వయంగా అభివ్యక్తీకరించే సామర్థ్యం పొందుతారు.
- విద్యార్థులు స్వతంత్రంగా సందర్భసహిత సన్నివేశాలలో, సహజవాతావరణంలో భాషాభ్యసన కృత్యాలలో పాల్గొనడం వలన భాషపై అధికారం సాధిస్తారు. పదజాలాన్ని నూతన సందర్భాలలో వినియోగిస్తారు.

**భాషాభ్యసనంలో సంప్రదాయ పాటలు, కథలు, నాటికలు – ప్రాధాన్యత (Significance of Play, stories and songs)**

- పాటలు, గేయాలు, కథలు, నాటికలు భాషాభ్యసనానికి బాగా తోడ్పడతాయి. ముఖ్యంగా జానపద పాటలు, కథలు సాంస్కృతిక విలువలు కలిగి ఉండటమేకాక ఉచ్చారణను సరిచేస్తాయి. బాలబాలికలలో సృజనాత్మకతను పెంచడానికి దోహదం చేస్తాయి.

ఉదాహరణకు పరంపరాగత బాలగేయం ఒకటి చూద్దాం.

చిలుకా చిలుకా ఏ వూరు? నీదే వూరు?
చినరావూరు మావూరు
కాకీ కాకీ ఏ వూరు? నీదే వూరు?
కాశీపట్నం మావూరు
పిచ్చుకా పిచ్చుకా ఏ వూరు? నీదే వూరు?
పిఠాపురం మావూరు

"ఒక్కమాటలో చెప్పాలంటే పిల్లలకు మాటలే ఆటవస్తువులు; మాటలతో ఆటలు సృజనాత్మకతనూ, శక్తినీ వ్యక్తం చేయడానికి గొప్ప సాధనాలుగా ఉపయోగపడతాయని ప్రొ॥ కె. కృష్ణకుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

- పిల్లల ఆటల్లో పాత్రపోషణ ద్వారా అమ్మ, నాన్న, కలెక్టరు, డాక్టరు మరియు ఉపాధ్యాయుల 'పాత్రపోషణ' (Roleplay) ద్వారా స్వంతంగా సంభాషణలు చెప్పగలరు.
- కథలు చెప్పడంలో, వినడంలో పిల్లలు సిద్ధహస్తులు.
- పిల్లల భాషాభివృద్ధి కావడానికి బాలగేయాలు, కథలు, నాటికలు, పాత్రపోషణ దోహదం చేస్తాయి. వీటి ద్వారా పిల్లలకు భాషాభ్యసనం ఉత్సాహంగా, ఆనందంగా, వినోదంగా ఉంటుంది. పదాల అల్లిక, ఉదాత్త, అనుదాత్త స్వరాలు, వాక్యనిర్మాణం ఇవన్నీ పిల్లలకు అలవడతాయి. ఆ మాటకు వస్తే వీటిని ఉపయోగించే ఉపాధ్యాయుడు కూడా చిన్నపిల్లవాడైపోయి పిల్లలతో ఆడి పాడి తరగతిగదిలో ఆనందం వెల్లివిరిసేటట్లు చేస్తాడు.

**అక్షరాస్యత – విసంకేతికం – సంకేతికం (Literacy - Decoding and Coding)**

అక్షరాస్యత అంటే చదువడం (Reading), రాయడం (Writing), లెక్కలు చేయడం (Arithmetic) అని ఒక ప్రాచీన అభిప్రాయం. పాఠశాలల్లో చేరిన పిల్లలకు 'చదువుట నేర్పుట' అనే సవాలును ఉపాధ్యాయులు ప్రప్రథమంగా

ఎదుర్కొంటారు. పాఠశాలలో చేరిన పిల్లలు చదవడానికి; రాయడానికి; లెక్కలు చేయడానికి సంసిద్ధులౌతారు. చదువుట నేర్పుట కష్టమైనదని ఇందుకు పలు నైపుణ్యాలు అవగాహనా సామర్థ్యాలు అవసరమని ప్రొఫెసర్ కృష్ణకుమార్ (పిల్లలభాష) అభిప్రాయపడ్డారు.

చదవడం; రాయడం; లెక్కలు చేయడమే అక్షరాస్యత అనే అభిప్రాయం ఉన్నా ఆధునిక కాలంలో భాషోపయోగం, అంకెల వినియోగం, చిత్రాలు, ఆకృతులు, గణనయంత్రాలు మున్నగు సాంకేతిక ఉపకరణాల వినియోగాన్ని తెలిసి ఉండటాన్ని కూడా సంబంధిత అక్షరాస్యత అంటున్నారు. ఉదా॥ సంగణక అక్షరాస్యత (Computer literacy) మొదలైనవి.

UNESCO ప్రకారం అక్షరాస్యత అంటే వివిధ సందర్భాల్లో సంబంధమున్న ముద్రిత, లిఖిత సామగ్రి గుర్తించడం, అర్థంచేసుకోవడం, వ్యాఖ్యానించడం, సృజించడం, వ్యక్తీకరించడం, గణనచేయడం, శక్తియుక్తులు కలిగి ఉండడం (Ability to identity, understand, interpret, communicate and compute using printed and written materials associated with varying contexts in literacy) “లక్ష్యసాధనకు తద్వారా జ్ఞానాభివృద్ధికి, సమాజంలో సమర్థ భాగస్వామ్యం కోసం వ్యక్తులు జరిపే నిరంతర అభ్యసన ఫలితమే అక్షరాస్యత” అని వికీపీడియా చెబుతోంది.

"The ability of a person aged 7 years and above to both write and read with understanding in any language is literacy". ఏడేండ్లు పైబడిన వ్యక్తులు/పిల్లలు ఏ భాషలోనైనా రాయడం, అవగాహనతో చదవగల శక్తి గలవారైతే వారిని ‘అక్షరాస్యులు’ అంటారు. ఆ ప్రక్రియను ‘అక్షరాస్యత’ అని అంటారని - Registar General and census Commissioner of India నిర్వచనం.

అభిప్రాయాలను, భావనలను, ప్రతిస్పందనలను లిపి రూపంలో సంకేతాలుగా వెలిబుచ్చడం లేఖనం. అందువల్ల అక్షరాస్యతలో సంకేతిత, విసంకేతిత (coding and decoding) నైపుణ్యాలు కీలకమైనవని భాషావేత్తల భావన. అక్షరాస్యతా సంపాదన / బోధనలో భాగంగా లిపి గల భాషలను అభ్యసించడంలో అక్షరాకృతులను గుర్తించడం ద్వారా పఠన నైపుణ్యాన్ని అలవరచుకోవచ్చు. ఈవిధమైన పఠనాభ్యాసానికి అక్షరపద్ధతి / సూత్రం (Alphabetic Principle) తోడ్పడుతుంది / సహాయపడుతుంది.

అక్షరరూపాలను చూచి అవి వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను గ్రహించడాన్ని విసంకేతిత (decoding) అని, అభిప్రాయాలను అక్షరరూపంలో చూపించడాన్ని / రాయడాన్ని / పొదగడాన్ని సంకేతిత (coding) అంటారు. అంతేకాకుండా కంప్యూటరును ఉపయోగించడం ఇతరులతో తమ భావాలు పంచుకోవడానికి చరవాణి (Mobile) ల్యాప్‌టాప్ (Laptop), ట్యాబ్ (Tab) మొదలైనవి ఉపయోగించడం, మన సంస్కృతిలో గల అనేక చిహ్నాలను అర్థం చేసుకోవడం ఇవన్నీ వచ్చిఉంటేనే వారిని అక్షరాస్యులనవచ్చునని భాషాశాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో 74.04% అక్షరాస్యులున్నారు. అంటే మనదేశ జనాభాలో 25.94% మంది అంటే సుమారు 30 కోట్లమంది నిరక్షరాస్యులున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ళు అయినప్పటికీ మనం సంపూర్ణ అక్షరాస్యత సాధనలో వెనుకబడిపోయాం. జనాభాలో పురుషుల అక్షరాస్యతా శాతం 82.14% కాగా స్త్రీలు 65.46% శాతంతో వెనుకబడి ఉన్నారు. అయితే కేరళ 93.91%, మిజోరం 91.58% తో మనదేశంలో అత్యధిక అక్షరాస్యత సాధించిన రాష్ట్రాలుగా ఉన్నాయి.

అక్షరాస్యతే దేశాభివృద్ధికి సూచిక కాబట్టి సంపూర్ణ అక్షరాస్యత సాధించడానికి దేశాలు సమర్థ వ్యూహాలు అమలు చేయాలి. అక్షరాస్యత ఒక గతిశీల సమాజాన్ని (dynamic society) తయారుచేస్తుంది.

"Literacy is a fundamental human right and the foundation for lifelong learning. It is fully essential to Social and human development in its ability to transform lives" అని పెద్దలు చెప్పిన మాటలు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. అంటే అక్షరాస్యత మానవుల ప్రాథమిక హక్కు అనీ, జీవితాంత అభ్యసనానికి ఇది పునాది అని చెప్పవచ్చు. సామాజిక వ్యక్తిత్వ వికాసానికి సామాజిక వైయక్తిక జీవితాలలో పరివర్తన కల్గించే శక్తియుక్తులు గల ఈ అక్షరాస్యత మానవాళిలోకి అందుబాటులోకి వచ్చిన అద్భుత వరమని భావించవచ్చు.

**అక్షరాస్యత – పఠనం (Literacy and Reading)**

ప్రాథమిక పాఠశాలల్లో చేరిన పిల్లలకు పఠనం అభ్యసించడం / నేర్పడం ప్రథమలక్ష్యం. పఠనాభ్యసన ప్రక్రియలో పాఠకుని పాత్ర ప్రధానమైనది. పఠనం పాఠకునిపై, అతని అంతర్గత ప్రేరణపై, ఉపాధ్యాయుని ప్రేరణపై ఆధారపడి ఉంటుంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమవయస్కులు కేవలం ప్రోత్సాహక, సౌలభ్యకర్తల పాత్ర పోషించాలి. ఇందుకు పిల్లలు ధ్వన్యాకృతులను గుర్తించగలగాలి. ధ్వన్యాకృతులను గుర్తించడం అనుకున్నంత సులభం కాదు. ప్రధానంగా తెలుగు భాషలో 56 అక్షరాలు. వాటిలో 37 అక్షరాలకు గుణింతాలు, ఒత్తులు, సంయుక్తాలు, సంశ్లిష్టాలతో కూడి దాదాపు వెయ్యికి పైబడిన అక్షర రూపాలుంటాయి. ఆంగ్లం తదితర భాషలు చదవడం కొంత సులభం. చదవడం అంటే పదాలు, శబ్దాలు చదవడం కాదని వాటిని అర్థం చేసుకుంటూ చదవడమని భాషావేత్తలు భావిస్తారు. వారి అభిప్రాయంలో పఠనం సృజనాత్మక, సంరచనాత్మక ప్రక్రియ. పిల్లల పూర్వఅనుభవాలు ప్రస్తుత పఠన అనుభవాలతో జోడించబడితే పఠనం ఆశించిన ఫలితాలనిస్తుంది.

మరికొందరి భాషావేత్తల అభిప్రాయంలో భాషాభ్యసనానికి, లేఖనాభ్యసనానికి పఠనం దగ్గరిదారి. Dam Lancy అభిప్రాయం "Men are human because they can talk, they are civilized because they can read" అంటే మనుషులు మాట్లాడుతూ మానవులయ్యారు, రాస్తూ నాగరికులయ్యారు. ఈ దృష్ట్యా సమాచారాన్ని సంపాదించడమే పరమార్థంగా జరిగే పఠనం పిల్లల్లో ధనాత్మక ప్రవర్తనకు కారణమవుతుంది. ఆలోచనా ప్రక్రియను సుసంపన్నం చేస్తుంది. ఇది ఓవిధంగా దృశ్యరూపం గల మానసిక దృగ్విషయంగా Dam Lancy భావించాడు. Become reading maketh a full maketh a full man అన్నాడు. అంటే పఠనం మానవుణ్ణి పరిపూర్ణ మానవుడిగా తీర్చిదిద్దుతుంది.

2012 లో కొందరు విద్యావేత్తలు పరిశోధకులు పఠనం విషయంలో జరిపిన అధ్యయనాల ప్రతిపాదనలు ఈ దిగువ విధంగా ఉన్నాయి.

నిరంతరం అచ్చుపుస్తకాలు అందుబాటులో ఉంచగలిగితే పిల్లలు సహజంగా పఠనాన్ని అలవాటు చేసుకుంటారు. నియత పాఠశాలల్లో పిల్లలు చేరకముందే వారి వయస్సులకు సరిపోయిన లిఖిత సామగ్రి వారి పఠనాన్ని అభివృద్ధి చేస్తుందని ఏవిధమైన దుష్ప్రభావాలకు పిల్లలు లోనుకారని కూడా ఈ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం తోడై (Technology Assisted reading 'TARA' Abiting) అను భావన విద్యారంగంలో అంకురిస్తుందని తద్వారా పూర్వ అక్షరాస్యులు లిఖిత భాషా లక్షణాలను అవగాహన చేసుకొని చదవడం స్వయంగా నేర్చుకుంటారని భావిస్తున్నారు.

## 2.4 బహుళ అక్షరాస్యతలు (Multiple kinds of literacy)

సాధారణ అక్షరాస్యత అను భావనేకాక అక్షరాస్యతకు చెందిన మరికొన్ని భావనలు ఇవి :

- ☐ ప్రజ్ఞా నైపుణ్యాల వినియోగం అంకాత్మక రూపంలో జరిగితే అంకాత్మక అక్షరాస్యత (digital literacy).
- ☐ సంగణకం (Computer) వాడకంలో మెలకువలు తెలిసి ఉంటే సంగణక అక్షరాస్యత (Computer literacy).
- ☐ ప్రసార మాధ్యమాలలోని ప్రసారాలను విశ్లేషించగలిగే అక్షరాస్యత ప్రసార మాధ్యమాల అక్షరాస్యత (Media literacy).
- ☐ సమాచారాన్ని విశ్లేషించి, సమాచారం కల్పితమా? లేక వాస్తవమా? అన్న అవగాహన ఉంటే అదే సమాచారరంగ అక్షరాస్యత (Information domain literacy).
- ☐ అందుబాటులో ఉన్న సాంకేతికతను సమర్థంగా ఉపయోగించుట సాంకేతిక అక్షరాస్యత (Technical literacy).
- ☐ రాజకీయరంగంలో వస్తున్న మార్పులను విశ్లేషించే సామర్థ్యం రాజకీయ అక్షరాస్యత (Political literacy).
- ☐ మన జాతి సంస్కృతిని గురించిన అవగాహన కలిగిఉండే అక్షరాస్య సాంస్కృతిక అక్షరాస్యత (Cultural literacy).
- ☐ ఇతర సమాజాల సంస్కృతులు, వాటిలో అభినందించగల అంశాలపట్ల అవగాహన కలిగిఉండే అక్షరాస్యత సాంస్కృతిక అక్షరాస్యత (Multiple cultural literacy)
- ☐ ప్రతిమలు, బొమ్మలు, ప్రతిబింబాలు, ఆకృతులు మొదలైనవాటిని విమర్శనాత్మకంగా చూడగలిగే అక్షరాస్యత దృశ్య అక్షరాస్యత (Visual literacy)

వీటితోపాటు బహుళ అక్షరాస్యత (Multiple literacy), ప్రాయోగిక అక్షరాస్యత (Functional literacy), విమర్శనాత్మక అక్షరాస్యత (Critical literacy) మరియు Rhetorical literacy అను భావనలు కూడ ఇటీవలికాలంలో వ్యాప్తిలోకి వచ్చాయి.

487N47

ఈ దృష్ట్యా Literacy is a fundamental human right and the foundation for the life long learning. It is fully essential to solid and human development in its ability to transform lives." అన్న మహితోక్తి ఎల్లప్పుడూ జ్ఞాపకముంచుకోదగింది. అంటే అక్షరాస్యత మానవుల ప్రాథమిక హక్కు అనీ, జీవితాంత అభ్యసనానికి పునాది అనీ చెప్పవచ్చు. సామాజిక, వైయక్తిక జీవితాలలో పరివర్తన కల్గించే శక్తియుక్తులు గల ఈ అక్షరాస్యత మానవాళికి అందుబాటులోకి వచ్చిన వరమని భావించవచ్చు.

### అక్షరాస్యత మరియు పఠనం (Literacy and Reading)

ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశం పొందిన పిల్లలకు పఠనాన్ని అభ్యసించుట, నేర్చుట లక్ష్యాలుగా వుంటాయి. పఠనాభ్యసన ప్రక్రియలో పఠిత పాత్ర ప్రధానమైనది. ఉపాధ్యాయులు, తదితరులు సౌలభ్యకర్తలు, ప్రోత్సాహకులు మాత్రమే. ఇందుకు పిల్లలు ధ్వన్యాకృతులను గుర్తించగలగాలి. ధ్వన్యాకృతులను గుర్తించడం అనుకున్నంత సులభం కాదు. ప్రధానంగా తెలుగులో 56 అక్షరాలు, వాటిలో 37 అక్షరాలకు గుణింతాలు, ఒత్తులు, సంయుక్తాలు,

సంశ్లిష్టాలతో వెయ్యికి పైబడిన అక్షర రూపాలుంటాయి. ఆంగ్లాది భాషలు చదవడం కొంత సులభం. ఇలాంటి సందర్భంలో కేవలం పదాలను శబ్దాలను చదువుట కాదని, వాటిని అర్థంచేసుకుంటూ చదవడమని భాషావేత్తలు భావిస్తారు.

- ప్రయాణంలో రోడ్లమీద ఉండే గుర్తులపట్ల అవగాహన, వాటిని పాటించడం, రోడ్డు ఖాళీగా వున్నా నియమాలు పాటించటం అవగాహనగల అక్షరాస్యత రవాణా అక్షరాస్యత (Transports literacy).
- అయితే ఆధునిక కాలంలో ఈ అక్షరాస్యతలను నేర్చుకొని ఆచరించేవాళ్ళు తక్కువగా ఉంటారని సామాజిక శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.
- ఆధ్యాత్మిక అక్షరాస్యత, పర్యావరణ అక్షరాస్యత, వైద్యసంబంధ అక్షరాస్యత, వినియోగవస్తువుల అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత అనే భావనలు కూడా నేడు సమాజంలో కనబడుతున్నాయి.

**ప్రస్తుత పాఠశాల సందర్భం – ప్రారంభ అక్షరాస్యత ప్రాధాన్యత**

**(Significance of early literacy in the context of current schooling)**

- భాషాభివృద్ధి మానవ జీవితంలో శైశవదశనుండే ప్రారంభమవుతుంది. శైశవదశలోనే పరిసరాలు ఇంట్లో మాట్లాడే భాషలను పిల్లలు నేర్చుకోవడం మొదలుపెడతారు. పిల్లల అక్షరాస్యతా సముపార్జన/ సంపాదన పలు సామాజిక, జైవిక, వైయక్తిక కారణాలపై ఆధారపడుతుంది. భయరహిత పరిసరాలలోనే పిల్లలు స్వేచ్ఛగా భాషను నేర్చుకుంటారు. ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరం. తల్లిదండ్రులు ఇంట్లో భయం లేని వాతావరణం కల్పించి స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం పిల్లలకు కల్పించాలి. ఇలాంటి అనుభవాలు కల్పిస్తే ప్రారంభ పాఠశాల దశలో పిల్లలకు భాషాభ్యసనం సులభమవుతుంది.
- ప్రాథమిక తరగతులలో ముఖ్యంగా 1, 2 తరగతుల పిల్లల నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని తరగతి భాషకు అనుసంధానం చేయాల్సిన బాధ్యత కూడా ఉపాధ్యాయులపై ఉంది.
- గతంలో చదవడం, రాయడం, మాట్లాడడం, అర్థంచేసుకోవడం ఒకదానికొకటి భిన్నమైన పద్ధతులని భావించేవారు. నిజానికి పిల్లలు ముందు వింటారు. తర్వాత మాట్లాడతారు. తర్వాత అక్షరాలను గుర్తుపడతారు, చదువుతారు, తర్వాత రాస్తారు. కానీ దీనికి భిన్నంగా పిల్లలు బడికి రాగానే ఈ వరుసక్రమాన్ని పాటించకుండా అక్షరాలు దిద్దించడం జరుగుతోంది. చదువు చెప్పడం రాయడంతో మొదలుపెడుతున్నామన్నమాట.

కానీ ఆధునిక కాలంలో (1980 నుండి) పిల్లలు ఏవిధంగా చదువుతారు? రాస్తారు? భాషానైపుణ్యాలు ఎలా అలవరచుకొంటారు అనే అంశాలపట్ల విద్యావేత్తల దృక్పథంలో మార్పులు వచ్చాయి. ఈ మార్పులు భాషావికాసంలో ఆధునిక దృక్పధానికి అద్దం పడతాయి.

- భాష నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ
- వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం, ఒకదాని తర్వాత ఒకటి అలవడతాయి.
- వినడం, మాట్లాడడమనేవి చదవడంకంటే ముందే అలవడతాయి. రాయడం (లేఖనం) అనేది అన్నింటికంటే క్లిష్టప్రక్రియ. కనుక దీనిని చివరిలో నేర్పాలి.
- ఇంట్లో పిల్లలు నేర్చుకుంటున్న క్రమాన్నే పాఠశాలలోను పాటించాలి.

అంటే అక్షరాస్యత శైశవదశనుండే ప్రారంభమవుతుంది. దానికి పరిసరాలు దోహదం చేస్తాయి. బడికి రాకముందే పిల్లలు భాషను నేర్చుకుంటున్నారు / పొందుతున్నారు / సముపార్జిస్తున్నారు. పిల్లల తల్లిదండ్రులు, సంరక్షకులు, సామాజిక పరిసరాలు ఒకవిధంగా ఈ విధిని నిర్వరిస్తున్నాయి.

- □ భాషానైపుణ్యాలు పొందడానికి పిల్లలకు పుస్తకాలు అందుబాటులో ఉంచడానికి ధనాత్మక సంబంధమున్నట్లు పలు అధ్యయనాల సారాంశం. పిల్లలు చూసే బొమ్మల పుస్తకాలు, వారు ఇంట్లో లేదా సమవయస్కులతో వినే కథలు, ఆడే ఆటలు పిల్లల భాషాభ్యసనం, అక్షరాస్యత మీద ప్రభావం చూపుతాయి.
- □ పిల్లలకు కథలు చదివి వినిపించడం వలన భాష మరింతగా పట్టుపడుతుందని జాతీయ పఠనాభివృద్ధి మిషన్ (1985) లో తేల్చిచెప్పింది. తల్లిదండ్రులు, సంరక్షకులు ఈ బాధ్యత నిర్వహించినట్లయితే ఒకటి నుండి 5 సం॥ల వయస్సున్న పిల్లలు ప్రారంభ పాఠశాల దశలో భాషాభ్యసనంలో ముందంజలో ఉంటారు. కనుక వారికి అనేక రకాల కథలు చదివి వినిపించాలి. ఇలా చేస్తే వారిలో కథాపఠనాభిరుచి పెంపొందుతుంది.
- □ కానీ ఈ బాధ్యత తల్లిదండ్రులు, సంరక్షకులు సరిగా నిర్వర్తించడం లేదు. ప్రపంచీకరణ ప్రభావంతో పెరిగిన జీవనవ్యయం భరించడానికి తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చెయ్యడం, గ్రామీణ ప్రాంతాల్లో పనులకు వెళ్ళడం జరుగుతోంది. ఈ కారణాన పిల్లలకు కథలు చెప్పేవాళ్ళు, కథలు వినిపించేవాళ్లు కరవవుతున్నారు. ఇప్పుడున్న చిన్న కుటుంబాలు ఉమ్మడి కుటుంబాలు కానందున ఈనాడు శిశు సంరక్షణ కేంద్రాలు శిశుపాఠశాలలకు ప్రాధాన్యత లభిస్తోంది. తల్లిదండ్రులు, పెద్దలు తమ పిల్లల భాషాభ్యసనంలో భాషాభివృద్ధికి కొంత సమయం కేటాయించగలిగితే శైశవదశలోనే అక్షరాస్యత సంపాదనలో పిల్లలు సఫలమవుతారు. భాషపై పట్టు సాధిస్తారు.

అంతేకాదు పెద్దలు ఇంట్లో మాట్లాడే భాష పిల్లల అక్షరాస్యత మీద భాషాభ్యసనం మీద ప్రభావం చూపుతుంది. భార్యాభర్తలిద్దరూ వేర్వేరు భాషలు మాట్లాడేవాళ్ళయి, పరిసరాల భాష మరొకటయితే భాషాభ్యసనంలో మూడు భాషల ప్రభావముంటుంది. అయితే పాఠశాలలో మాట్లాడే భాష సమవయస్కులతో కాబట్టి త్వరగా అలవడుతుంది. ఈ సందర్భంలో విద్యాప్రపంచంలో ఈనాటి తల్లిదండ్రుల పాత్రను గుర్తు చేస్తూ “తల్లిదండ్రులు ప్రతిరోజూ చదవాలి. కొత్త విషయాలు తెలుసుకోవాలి. లేకపోతే వారి పిల్లలు జీవితంలో ఉత్తీర్ణులు కారు” అని విద్యావేత్తలంటున్నారు.

### భాషాభ్యసనం – సాహిత్యం పాత్ర (Role of literature in language learning)

ఒక మంచి పుస్తకం సంతోషాన్ని కలిగించడమే కాకుండా భాషాభ్యసనాన్ని వేగవంతం చేస్తుంది. ఒక మంచి పుస్తకం భాషానైపుణ్యాలు పెంపొందిస్తుంది. అయితే ప్రతి వ్యక్తికీ పుస్తకం చదవడానికి కారణం ఉంటుంది. కాని చాలావరకు ఎవ్వరూ భాషను నేర్చుకోవడానికి పుస్తకం చదువుతున్నామన్న కారణం మాత్రం చెప్పరు.

పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను మొట్టమొదట ప్రస్తావించిన భాషావేత్త స్టీఫెన్ క్రేషన్ (1980).

ఫిజీ దేశంలో 500 మంది విద్యార్థులపై చేసిన పఠన పరిశోధన విధానమిది. పరిశోధనకు 12 పాఠశాలలు ఎన్నుకొన్నారు. ఎనిమిదింటిని పరిశోధనకు మిగిలిన నాల్గింటిని సాధారణ నియంత్రణకు ఎంపికచేశారు. ప్రయోగానికి ఎన్నుకొన్న ఎనిమిది పాఠశాలలకు 250 కథల పుస్తకాలు, సాహిత్య పుస్తకాలు అందజేశారు. మిగతా నాల్గు పాఠశాలల్లో ఏ ఇతర పుస్తకాలు అందించకుండా తరగతి పుస్తకాల మీదనే ఆధారపడి పాఠాలు చెప్పారు. ఎనిమిది

పాఠశాలల్లో పిల్లలందరికీ 20 నుండి 30 నిమిషాలు కథలు ఇతర సాహిత్య పుస్తకాలను చదవడాన్ని ప్రోత్సహించారు. రెండేళ్ళ తర్వాత విస్తృతంగా పిల్లల భాషాపాటవంపై వివిధరకాల పరీక్షలు నిర్వహించినప్పుడు ప్రయోగం జరిగిన ఎనిమిది పాఠశాలల పిల్లలు, జరుగని నాల్గు పాఠశాలల పిల్లలకంటే చదవడంలోను, అవగాహన చేసుకోవడంలోను, రాయడంలోను, ప్రాయోగిక వ్యాకరణాంశాలను ప్రస్తావించడంలోనూ ఎంతో ప్రతిభ కనబరచి ముందంజలో ఉన్నారు. ఈ పరిశోధన ఫలితంగా సాహిత్యపఠనం, భాషాభ్యసనంపై ఎంతో ప్రభావం చూపుతుందని ఋజువుచేశాడు. అంతేకాకుండా ఆయన ఇదే ప్రయోగాన్ని సింగపూర్‌లో మరో మూడువేలమంది విద్యార్థులపై చేశాడు. అక్కడా ఇవే ఫలితాలు నమోదయ్యాయి.

మనదేశంలో కూడా 'గిజూబాయిబదేకా' తన దక్షిణామూర్తి విద్యాసంస్థలలో పిల్లల శిక్షణలో కథలకు, సాహిత్యానికి ప్రాధాన్యతనిచ్చి ఇవే ఫలితాలను సాధించాడు.

సంగీతంలాగానే చక్కని సాహిత్య పఠనం ద్వారా; పాఠకుడు ఆనందం అనుభవించగలడు.
ఇది కళాత్మక భావనలకు దారితీస్తుంది. – **గిజూబాయి బదేకా**

సాహిత్యం ఆనందాన్ని ప్రసాదిస్తుంది. పిల్లలకు భాష పట్ల మక్కువ కలిగిస్తుంది. గిజూబాయి ననుసరించి భాషా శిక్షణలో ముఖ్యమైన అంశం భాషా పరిచయమే. రసాత్మకమైన పుస్తకపఠనం, శ్రవణం వల్ల పిల్లలకు భాషా పరిచయం కలుగుతుంది. భాషాపరిచయం, భాషాదర్శనం, భాషానుభవం, భాషాసేవనం, భాషాస్వాదనం అన్నీకూడా సమగ్ర భాషారూపంలో జరుగుతాయి. అప్పుడే భాషాసౌందర్యాన్ని సంపూర్ణంగా దర్శించగలగాలి. దీనికి అనువైన మార్గం కథలను ఇతర సాహిత్య ప్రక్రియలను పిల్లలకు పరిచయం చేసి వారిచేత రకరకాల పుస్తకాలు చదివించడమే!

పిల్లలకు బాలసాహిత్యం అందజేసేముందు ఈకింది జాగ్రత్తలు తీసుకోవాలి.

**పిల్లల అవగాహన స్థాయి:** పిల్లలు వయసుకు తగిన, అవగాహన స్థాయికి తగిన పుస్తకాల ఎంపిక జరగాలి. మొదటి దశలో నిఘంటువును ఉపయోగించి పదాలు వాటి అర్థాలు గ్రహించేటట్లు పుస్తకాల ఎంపిక ఉండకూడదు. నిఘంటువులు లేకుండానే పిల్లలు పుస్తకాలు చదివి ఆనందించగలగాలి. వాటిలో అక్కడక్కడా కఠినపదాలుంటే పిల్లలు సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోగలరు కూడా. క్రిస్టీన్ నటల్ అనే విద్యావేత్త పిల్లల పుస్తకాల్లోని భాష వారికి అందుబాటులో ఉండేటట్లు చూసి సాహిత్య పుస్తకాలు వారితో చదివించాలని సూచించింది.

**పుస్తకాల అందుబాటు:** పిల్లలు చదవగలిగే పుస్తకాలు వారికి అందుబాటులోకి తేవాలి. ప్రచురణసంస్థలు ఏయే పుస్తకాలు పిల్లలకోసం ప్రచురిస్తున్నాయో చూడాలి. అవి పిల్లల స్థాయికి తగినట్లున్నాయో లేదో చూసుకోవాలి. సి.డి.ల ద్వారా కథలు వినే అవకాశముంటే పుస్తకాలతోపాటు రికార్డు చేసిన అవే కథలు సరఫరా చేయగలరేమో చూడాలి. ఆ సి.డి.లు విన్నతర్వాత మరోసారి పిల్లలతో చదివించినట్లయితే ఎటువంటి విరామాలతో వాక్యాలు చదివించాలో పిల్లలకు అర్థమవుతుంది.

**కాలనిర్ణయ పట్టికలో పఠనానికి సమయం కేటాయింపు:** ప్రతిరోజూ కాలనిర్ణయ పట్టికలో పఠనానికి ఇరవై నుండి ముప్పై నిమిషాల సమయం కేటాయించాలి. దీనివల్ల పఠనం పట్ల ఆసక్తిలేని పిల్లలు కూడా విధిగా చదవడం మొదలుపెట్టి ఆతర్వాత అది అలవాటుగా మార్చుకుంటారు. సరియైన పుస్తకాలను ఎంపికచేసి ఉపాధ్యాయుడు పిల్లలను చదవడానికి ఒప్పించాలి. తప్పనిసరిగా పిల్లలలో పఠనాసక్తిని రేకెత్తించాలి.

**చదవడానికి ప్రతి ఒక్కరికీ అవకాశం కలిగిద్దాం!**

ముఖ్యంగా ఛాత్రోపాధ్యాయులు పఠనం మీద దృష్టిపెట్టి తమ శిక్షణాకాలంలో అనేక పాఠ్యేతర పుస్తకాలు చదవగలిగితే తప్పనిసరిగా మంచి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులుగా రూపొందుతారు. పఠనాన్ని ఒక వినోద, విజ్ఞాన కార్యక్రమంగా గుర్తించినపుడు దానిమీద ఆసక్తి చూపుతారు. వారికి పఠనం అనుభవంలోనికి వచ్చినతర్వాత తమ విద్యార్థుల్లో కూడ వారు పఠనాసక్తిని పెంపొందించడానికి కృషి చేస్తారు. ఇక్కడ చదవడమే ప్రధానం. దానిలో మళ్లీ పరీక్షలు పెట్టడం వంటివి చేయగూడదు. కాని పిల్లల్లో ఎవరైనా తాము చదివిన పుస్తకాలను గురించి తమ అనుభవాలను పంచుకోవాలని భావిస్తే వారికి అవకాశం కల్పించాలి.

ఛాత్రోపాధ్యాయులు అనేక పుస్తకాలను చదవడం వలన తమ విద్యార్థులకు ఎటువంటి పుస్తకాలు సమకూర్చాలో గుర్తిస్తారు. ఆ పుస్తకాలలో నాటికలుగా మార్చదగిన పుస్తకాలుంటే పిల్లలతో ఆ పని చేయిస్తే పిల్లలు మరింత శ్రద్ధగా పుస్తకాలను చదువుతారు. కవిత్వరచన, కవిత్వ పఠనం కూడ ఇతర పుస్తకాల పఠనం వంటిదే. పిల్లల్ని చుట్టూ కూర్చోబెట్టుకొని రెండు మూడు సార్లు ఉపాధ్యాయుడే కవితలు, పద్యాలు, గేయాలు చదివి వినిపించాలి. తర్వాత పుస్తకం మూసి గానం చేయాలి. కవిత్వం సులభంగా ఉంటే పిల్లలకు త్వరలోనే కంఠస్థమయిపోతుంది. వారుకూడా ఆ కవిత్వాన్ని లేక పద్యాన్ని చదువుతారు. అర్థంకాకపోతే అడిగి తెలుసుకుంటారు. కొద్దిరోజులకు ఆ పద్యంలోని పదాలను విడివిడిగా తేలికగా గుర్తించగలుగుతారు. ఈవిధంగా పిల్లల్లో భాషా సముపార్జన సులభమవుతుంది. వేగవంతమవుతుంది.

## 2.5 పాఠాల రకాలు (Types of Texts)

విద్యావేత్తలు పాఠాల రకాలు రచనా శైలినిబట్టి నాలుగు రకాలుగా విభజించారు. పుస్తకాలలోని మూలపాఠాన్ని బట్టి అది విద్యార్థులకు తగిన పుస్తకమా? కాదా? అని నిర్ణయించుకొని ఎంపిక చేసుకోవాలి. పుస్తకాలలోని మూలపాఠాల స్వభావాన్నిబట్టి నాలుగు రకాలుగా విభజించారు. అవి :

1. కథనాత్మక మూలపాఠం / సాహిత్యం (Narrative text / literature)
2. వర్ణనాత్మక మూలపాఠం / సాహిత్యం (Descriptive text / literature)
3. వివరణాత్మక మూలపాఠం / సాహిత్యం (Expository text / literature)
4. వాదనాత్మక మూలపాఠం / సాహిత్యం Argumentative text / literature)

**కథనాత్మక మూలపాఠం / సాహిత్యం**

కథనాత్మక మూలపాఠం / సాహిత్యం చాలా రకాలుగా ఉండవచ్చు. అద్భుత గాథలు (Fairy tales), మర్మగాథలు (Mysteries), విజ్ఞానశాస్త్ర గాథలు (Science fictions), ప్రేమగాథలు (Romances), భయానక గాథలు (Horror stories), సాహసగాథలు (Adventure stories), నీతిగాథలు (Fables), పురాణ గాథలు (Myths), చరిత్రాత్మక గాథలు (Historical narratives), జానపద గాథలు (Ballads), జీవన గాథలు (Biographies) – ఇవన్నీ ఆసక్తికరంగా ఉండి చదివించేవిగా ఉంటాయి.

మూడోతరగతి తెలుగు వాచకంలో (తొలకరి చినుకులు) 'వింతలోకం' అనే అద్భుత కథను పరిశీలిద్దాం...

అనగనగా ఒకరాజు. ఆ రాజుగారి రాజ్యంలో ఒక తోట ఉంది. ఆ తోటకు కాపలాదారు రామయ్య. అతని భార్య కాంతమ్మ. వాళ్ళు తోటలోనే కాపురం ఉండేవాళ్లు....

వింతవింతల లోకాన్ని అందుకోవాలని పైన ఉన్న దేన్నో ఆధారంచేసుకొని ఒకరిని పట్టుకొని ఒకరు నిచ్చెనలా వ్రేళ్లాడుతున్నారు. అందరికన్నా చివర్లో శాంతమ్మ వేలాడుతున్నది. ఆమెకు ఒక సందేహం వచ్చింది. ఓపిక పట్టలేకపోయింది. "వింత వింతల లోకంలో గుమ్మడికాయలు ఎంత పెద్దగా ఉంటాయి?" అని తన పైనున్న వ్యక్తిని అడిగింది. అతను తన పైనున్న వారిని అడిగాడు. అలా ఒకరిని ఒకరు అడిగారు. రామయ్య ఉత్సాహాన్ని ఆపుకోలేకపోయాడు. గుమ్మడికాయలు ఇంత పెద్దగా ఉంటాయని చూపుతూ రెండు చేతులను పక్కలకు చాపాడు. తర్వాత ఏమయిందో కథను ఊహించండి.

**ఉద్దేశం:** ఈ కథ ద్వారా పిల్లలలో విభిన్నంగా ఆలోచించి వివిధ రకాల ముగింపులు చెప్పి వారి ఊహాశక్తికి పదునుపెట్టుకుంటారు. చదువు – ఆనందించు – అభివృద్ధిచెందు అనే విధానానికి అనుకూలంగా పాఠ్యపుస్తకాలలో అదనపు పఠనాభ్యాసాలు చేర్చారు.

**వర్ణనాత్మక మూలపాఠం / సాహిత్యం**

పుస్తకాలలో ప్రభావశీలమైన వర్ణనలు ఎక్కువగా ఉన్నట్లయితే దానిని వర్ణనాత్మక మూలపాఠం అంటారు. ఎక్కువగా ప్రకృతిని, మనుషులను, వారి స్వభావాలను, స్థలాలు వస్తువులు సంఘటనలు వర్ణించేట్లుగా మూలపాఠం ఉంటుంది.

లోగడ వచ్చిన 5వ తరగతి తెలుగు భారతిలో కుందా భాస్కరరావు రాసిన "పల్లెకు పోదాం" కథ వర్ణనాత్మకతకు అద్దం పడుతుంది – "పొలంగట్టున చింతచెట్టు కింద కూర్చుని, అత్తమ్మ కట్టిన అన్నంమూట విప్పుకొని తింటుంటే ఎంతైనా తినాలినిపించేది. పచ్చని ప్రకృతి మహిమో? ఏమో! తనను ఎంత ఆకర్షించిందో ఆ పల్లెటూరి జీవితం! రణగొణధ్వనులు లేని ప్రశాంత వాతావరణం, చక్కగా అలికి ముగ్గులుపెట్టిన ఇళ్లు; మనుషుల్లో చక్కటి కలివిడితనం! ప్రకృతి మాతకు పచ్చని చీరకట్టినట్లు ఊరుచుట్టూ కన్నులపండుగ చేసే పంటచేలు, చెంగుచెంగున చెంగలించే కోడెదూడలు; కాడికట్టిన ఎద్దుల మెడలో గణగణ మోగే మువ్వల సవ్వళ్లు; కల్లాకపటం లేని కర్షకులు; ఆప్యాయత నిండిన వారి పలకరింపులు... ఇలా సాగుతుంది ఈ పాఠం.

**ఉద్దేశం:** వినడం, మాట్లాడడం, చూడడం, పరిశీలించడం, శ్రద్ధ చూపడం వంటి జీవన నైపుణ్యాలను తెలియజేయడమే ఈ వర్ణనాత్మక మూలపాఠం ఉద్దేశం.

**వివరణాత్మక మూలపాఠం / సాహిత్యం**

- సంక్లిష్టమైన వాస్తవ నివేదికలను వివరించడానికి పూనుకొనేది వివరణాత్మక మూలపాఠం. పిల్లలతో సంభాషించడం ద్వారా వారు కోరే అనేక వివరణలు మనం తెలుసుకోవచ్చు.

మూడోతరగతి 'తొలకరి చిరుజల్లులు' లో 'మన పండుగలు' అనే పాఠం వివరణాత్మక మూలపాఠానికి, సంభాషణ ప్రక్రియకు మంచి ఉదాహరణ. (పేజి నెం. 63).

ఈ పాఠంలో సంభాషణల ద్వారా భారతదేశంలోని వివిధ మతాలవారు జరుపుకొనే పండుగలు సంస్కృతి గురించి వివరించారు.

సంభాషణకున్న వివిధ ఉపయోగాలను గురించి తెలుసుకోవాలంటే మనం పిల్లల సంభాషణలను వినే అలవాటు చేసుకోవాలి. ఇది మామూలు విషయంగానే కనిపిస్తుంది. కాని కష్టమయిన పని. ఎందుకంటే పిల్లలు ఏం చేయాలో చెప్పడమే మన పని అనీ, వినడం వాళ్ల పని అని అనుకోవడం మనకు అలవాటు. ఇటువంటి నమ్మకం పిల్లల

సంభాషణలకు మనల్ని మంచి శ్రోతలు కాకుండా నిరోధిస్తుంది. మంచి శ్రోత అంటే సంభాషణ ఎందుకోసం జరుగుతూ వుందో, అది ఏయే అభ్యసన మార్గాలకు దారితీస్తుందో ఓర్పుగా గమనించే వ్యక్తి అని అర్థం! (పిల్లల భాష – ఉపాధ్యాయుడు – కె. కృష్ణకుమార్)

**ఉద్దేశం:** మంచి శ్రోత గూర్చి వివరించడం

**లక్షణాలు:** సంభాషణలకున్న ఉపయోగాలు తెలుసుకోవాలంటే 'మంచిశ్రోత' కావాలి

**భాష:** ఇక్కడ సంభాషణలకున్న ఉపయోగాన్ని వివరించడమే కాకుండా శ్రోత లక్షణాలు కూడా వివరించబడ్డాయి.

**వాదనాత్మక మూలపాఠం / సాహిత్యం**

సమస్యను మూల్యాంకనం చేసి తగిన నిర్ణయాన్ని తీసుకుని దాని పరిష్కారానికి తగిన ప్రాతిపదికను తయారు చేసుకోవడం వాదనాత్మక మూలపాఠం.

పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు సాక్షి పేరుతో రాసిన వ్యాసాలలో 'స్వభాష' ఒకటి. అందులో భాగంగా మన భాష గొప్పతనాన్ని గురించి 'జంఘాల శాస్త్రి' అనే పాత్ర ఉపన్యాసం ద్వారా తెలియజేశారు.

"మీకసత్యముగా దోచవచ్చును – నాయనలారా! అసత్యము కాదు. ఆయన యాంధ్రుడు. కృష్ణాతీరమున బుట్టినవాడు.... న్యాయవాద వృత్తిని నిరాఘాటముగా నిరంకుశముగా నిర్వర్తించుచున్నవాడు... ఇది పానుగంటివారి ఉపన్యాసక వాదనాత్మక మూలపాఠం.

**మరొక ఉదాహరణ:** మొదట మనం వ్యాసం అంటే ఏమిటి? అది ఎలా రాస్తారు? అనేది తెలుసుకుంటే పాఠశాలలో దానికి చోటు ఇవ్వవచ్చా, వద్దా? అని చర్చించుకోవచ్చు.

"ఏదో ఒకటి రాసేయడం వ్యాసం అనిపించుకోదు. ఒకరు కాగితంపై రాస్తారు. మరొకరు కంప్యూటర్‌పై రాస్తారు. రచయిత రాస్తాడు. చెప్పాలంటే ప్రెస్‌లోని కంపోజిటర్ కూడ రాస్తాడు. అయితే వారి రాతలన్నీ వ్యాసాలని ఎవరూ చెప్పరు. వ్యాపారి తన వ్యాపారానికి సంబంధించిన ఉత్తరం రాస్తాడు. స్నేహితుడు తన లేఖలో స్నేహితుడికి మనస్సులోని విషయాలు చెప్పుకుంటాడు. ప్రేమికుడు ప్రేమలేఖలు రాస్తాడు. యాత్రికుడు తాను చేసిన యాత్రానుభవాలు వివరిస్తాడు. ఉద్యోగి తాను పై అధికారికి దరఖాస్తులు రాస్తాడు. ఇవన్నీ కూడా ఒకవిధంగా వ్యాసరచనే అవుతుంది. ఇది చిత్రం అనిపించినా నిజమే (గిజూబాయి సంపుటి పేజి 131)

**పుస్తక పఠనంలో నిమగ్నత (Engaging with texts)**

గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘికశాస్త్రం మొదలైన సబ్జక్టుల అభ్యసనానికి భాష అత్యంత ప్రధానం. కాబట్టి భాషాభ్యసనానికి తగిన పుస్తకాలను ఉపాధ్యాయులు ఎన్నుకోవాలి. విద్యార్థుల నేపథ్యం, సంస్కృతి మొదలైన వాటిని అర్థంచేసుకొని ఆ పుస్తకాలను ముందుగా విద్యార్థులకు పరిచయం చేయాలి. అయితే విదేశీ కథలను, సంస్కృతిని వెంటనే పరిచయం చేయకూడదు. పంచతంత్ర కథలు పిల్లలకు పరిచయం చేసి వాటిని చదవడానికి ప్రోత్సహిస్తే పిల్లల్లో పఠన కుతూహలం పెరుగుతుంది.

- అప్పుడప్పుడూ పిల్లలు చదివిన పుస్తకాలలో వారికి నచ్చిన కథనుగాని, అంశాన్నిగాని తరగతి గదిలో ఇతర పిల్లలతో పంచుకొమ్మని ప్రోత్సహించాలి.

పిల్లలు పుస్తకపఠనంలో ఏకాగ్రతతో నిమగ్నం కావడానికి కింది జాగ్రత్తలు తీసుకోవాలి.

A6I3G5

- ఎంపిక చేస్తున్న పుస్తకాలు పిల్లల భావ వికాసానికి; భాషా వికాసానికి తోడ్పడేటట్లు ఉండాలి.
- పిల్లలకవసరమైన భాషా నైపుణ్యాలు (పఠనం, లేఖనం) పుస్తకాల ద్వారా అభివృద్ధి చేయాలి.
- ఎంపికచేసిన పుస్తకాలు వివిధ నేపథ్యాలనుండి, సంస్కృతినుండి వస్తున్న పిల్లల అవసరాలకు తగినట్లుగా ఉండాలి.
- పిల్లల ఇంటి భాషకు, వారి వ్యక్తిత్వాలకు, సంస్కృతికి భిన్నమైన పుస్తకాలు ఎంపిక చేయరాదు.
- పిల్లల అనుభవాలకు భిన్నమైన అనుభవాలు పుస్తకాలలో ఉండరాదు.
- పిల్లల వైవిధ్య అవసరాలకు తగిన విభిన్న పుస్తకాలు సరఫరా చేయాలి.
- పిల్లలు పుస్తకాలు పూర్తిగా చదివిన తర్వాత చర్చకు అనుమతించాలి / అవకాశం కల్పించాలి.
- పుస్తకాల ఆధారంగా పిల్లల భాషాభ్యసనానికి కొత్త కృత్యాలు నిర్దేశించే అవకాశం కల్పించాలి.
- పుస్తకాలలో సూచించిన వనరులు పిల్లలకు తరగతి వెలుపల సమకూరే అవకాశాలు పరిశీలించాలి. ఉదా॥ పుస్తకంలో సంగణకం వాడకం ఉన్నట్లయితే అది తరగతి వెలుపల వారికి లభించే అవకాశం ఉన్నదేమో పరిశీలించాలి.
- మొదటి అయిదు తరగతుల పుస్తకాలలో ఆకర్షణీయమైన బొమ్మలు ఉండేటట్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎందుకంటే పెద్దలైనా పిల్లలైనా బొమ్మలను ఇష్టపడతారు.
- అక్షరాల పరిమాణం ప్రాథమిక తరగతుల పిల్లలు చదువటానికి వీలుగా ఉండేటట్లు కథకు బొమ్మలకు చక్కని సంబంధం ఉండేటట్లు చూడాలి.

## 2.6 విద్యాప్రణాళికలో బాలసాహిత్యం వినియోగం – ప్రయోజనాలు :

బాలసాహిత్యం పిల్లలచేత చదివించడం వల్ల విద్యార్థి స్వతంత్ర పాఠకుడుగా ఎదుగుతాడు. పిల్లల భాషాభ్యసనాన్ని వేగవంతం చేస్తుంది.

- విద్యాప్రణాళికలో బాలసాహిత్యాన్ని ఉపయోగించుట వలన విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెరుగుతుంది.
- బాలసాహిత్యం పిల్లలు చదవడం వల్ల విద్యాప్రణాళికలో విద్యార్థుల సంలగ్నత (Engagement) పెరుగుతుంది.
- విద్యార్థుల అభ్యసనానికి అవరోధాలు/అడ్డంకులైన అవగాహన చేసుకోలేకపోవడం, విద్యపై మనస్సు లగ్నం కాకపోవడం వంటివి తొలగిపోతాయి.
- పఠించిన / చదివిన విషయాలు విద్యార్థులు స్వయంగా విశ్లేషణ చేసుకోగలుగుతారు.
- పఠనం, లేఖనం, శ్రవణం, భాషణం నైపుణ్యాలు ఒక అర్థవంతమైన వాతావరణంలో, సమగ్రంగా విద్యార్థులకు అర్థమవుతాయి / అలవడుతాయి.
- సంప్రదాయ పఠనాభ్యసనం కంటే బాలసాహిత్య పఠనం విద్యార్థుల పురోభివృద్ధికి తోడ్పడుతుంది.
- విద్యాప్రణాళికలో నిర్దేశించిన ప్రమాణాలకంటే ఉన్నత ప్రమాణాలను విద్యార్థులు సులువుగా చేరుకోగలుగుతారు.
- సాహిత్యపరమైన; భాషాపరమైన విలువలు సంతరించుకుంటారు.

- H భవిష్యత్తులో మంచి కవులుగా; కథకులుగా మారుతారు.
- H చక్కని సాహిత్యపఠనం జీవితాన్ని ప్రేమించడానికి; సాటి మనిషిని అర్థంచేసుకోడానికి దారితీస్తుంది.
- H సాహిత్యంలోని మంచి పాత్రలతో వారు మమేకం చెందుతారు.

ఈవిధంగా వివిధ ప్రయోజనాలు కల్గించే బాలసాహిత్యం గుణాత్మక విద్యను పెంపొందిస్తుంది. కాబట్టి పాఠశాలలో ఒక బోధన వనరుగా ఉపాధ్యాయులు బాలసాహిత్యాన్ని ఉపయోగించవచ్చు. చింతాదీక్షితులు; నాళం కృష్ణారావు; నండూరి రామమోహనరావు; ముళ్లపూడి వెంకటరమణ; బాపు తదితరులు బాలసాహిత్యంలో కొత్త కోణాలను ఆవిష్కరించారు.

**విద్యాప్రణాళికలో భాష (Language across curriculum)**

- □ విద్యాప్రణాళికలో భాష వినిమయం తప్పనిసరి. ఈనాడు ఏ విషయమూ (Subject) ప్రత్యేకంగా విడదీయబడి బోధించడానికి సాధ్యం కాదు. గణితంతో సైన్స్, పర్యావరణ విజ్ఞానశాస్త్రంతో సాంఘికశాస్త్రం భాషతో అన్ని విషయాలు ముడిపడి ఉన్నాయి. మరోరకంగా చెప్పాలంటే "Every subject teacher is basically a language teacher" ప్రతి ఉపాధ్యాయుడు తన బోధనలో అందుకు అనుబంధంగా వున్న ఇతర పాఠ్యాంశాలను, దైనందిన ప్రాపంచిక విషయాలను సహసంబంధ పరచాలి (correlation) ఇది ఉపాధ్యాయుని సృజనాత్మకతపై ఆధారపడి వుంది.
- □ అభ్యాసకుని భాష, బోధించే ఉపాధ్యాయుని భాష ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు, ఆంగ్లం, సరిహద్దు జిల్లాలైన చిత్తూరు, అనంతపురం, కర్నూలులో కన్నడం, తమిళం కలగాపులగంగా అందరూ వాడటం. ఆధునిక తరగతి గదిలో కన్పిస్తుంది. అంతేకాదు పాఠశాలల్లో బోధించే అన్ని విషయాలు భాషామాధ్యమం ద్వారా మాత్రమే బోధిస్తారు.

అయితే విద్యాప్రణాళికలో భాష ఒక ప్రముఖపాత్ర పోషిస్తున్నది.

ప్రతి సబ్జక్టులో భాషను అర్థవంతంగా వాడాలంటే ప్రస్తుత ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా భాషను మల్చడానికి తగిన ప్రయత్నం జరగాలి. **– లీ, కివాన్, వాల్మెస్**

**తరగతిగదిలోను, తరగతిగది వెలుపల–భాష–విధులు (Language - Inside and outside class rooms - functions)**

తెలుగు మాతృభాషగా గల రాష్ట్రాలలో తరగతి లోపల పిల్లలు, ఉపాధ్యాయులు భాష మాట్లాడేటప్పుడు పలు భేదాలను గుర్తించవచ్చు.

- □ తరగతి గదిలో ఎప్పుడూ వినిపించని మాటలు తరగతి గది వెలుపల అభ్యాసకులు వినిపిస్తారు.
- □ నేటి సినిమా, టి.వి. మాధ్యమాల సంభాషణల ద్వారా విచిత్రమైన ఊతపదాలను పిల్లలు అలవాటు చేసుకునే అవకాశముంది.
- □ ఆయా ప్రాంతాలలో మాండలికాల పరిచయం కల్గుతుంది.
- □ కొన్ని సందర్భాలలో తరగతిగదిలో మాట్లాడే పదాలు విద్యార్థులకు కష్టంగా, క్లిష్టంగా ఉన్నట్లు కన్పిస్తాయి. ఆయా పదాలకు తరగతి గదిలో అడిగి అర్థాలు తెలుసుకోవలసి వస్తుంది. కాని తరగతిగది వెలుపల వీటిని ఉపయోగించి మాట్లాడే అవకాశం అరుదుగానే ఉంటుంది.
- □ తరగతి వెలుపల మాట్లాడే భాషనే ఎక్కువగా విద్యార్థులు మాట్లాడటంలో ఉపయోగిస్తారు.

- □ రాతకోతల్లో కూడ తరగతిగది భాషాప్రభావం అధికంగా ఉంటుంది.
- □ తాను నివసించే ప్రాంతంలోని యాసరూపంలోని భాషకు అలవాటుపడితే తరగతి గదిలోని భాషకు అలవాటు పడటానికి పిల్లలకు కొంత సమయం పట్టవచ్చు. అయితే విద్యార్థులు తాము ఏ పరిసరాలనుండి వచ్చారో అందుకు సంబంధించిన యాసలో మాట్లాడేటప్పుడు వారిని మనం ఈసడించుకోకూడదు. ప్రతి యాసలోనూ భాషను సజీవంగా ఉంచే శ్వాస ఉందని మనం గ్రహించాలి.

BFTRIG

## 2.7 ప్రత్యేక అవసరాలు గల పిల్లలు-భాషాభ్యసనం అవసరాలు-లోపనిర్ధారణ-ప్రారంభ భాష జోక్యం

పిల్లలు భాషాభ్యసనంలో వెనుకబడటానికి ప్రధానమైన కారణాలు రెండు.

- □ అభ్యసన సామర్థ్యం కొరవడటం వల్ల తగిన భాషానైపుణ్యాలను ప్రదర్శించలేకపోవుట.
- □ శారీరక, అవయవాల, మానసికాభివృద్ధి లోపం వల్ల తగిన నైపుణ్యాలు పొందలేకపోవుట.
- □ శారీరక అవయవాల లోపం భాషాభివృద్ధి / అభ్యసనాభివృద్ధి లోపానికి కారణమని నిర్ధారణ జరిగితే అలాంటి పిల్లలను "ప్రత్యేక అవసరాలు" గల పిల్లలుగా గుర్తించి అలాంటి స్థితికి కారణమేమిటో పరిశీలించాలి. దిగువ పట్టికను చూడండి.

| క్ర.సం. | పిల్లల్లో గమనించిన ప్రవర్తన | అభ్యసన కొరవడిన పిల్లలు | ప్రత్యేక అవసరాలు గల పిల్లలు |
|---|---|---|---|
| 1. | అక్షరాలను గుర్తుపట్టడంలో పఠనంలో వెనుకబాటుతనం | తెలుగుభాషలో తగిన పరిచయం లేకపోవడం, తెలుగు నేపథ్యం లేకపోవడం, వాక్యనిర్మాణం, పదాలు తెలియకపోవడం, తెలుగు భాషపట్ల సరియైన జ్ఞానం లేకపోవడం | జ్ఞాపకశక్తి లోపాలు, ధ్వనిని గుర్తుపట్టకపోవడం, పదాలను చదవడంలో వెనుక నుండి చదవడం, వెనుకనుండి రాయడం, రాస్తూ రాస్తూ తిరగేసి రాయడం (డిస్‌లెక్సియా వ్యాధి) |
| 2. | అవగాహన లేక చదివింది అర్థం చేసుకోలేకపోవడం | భాషానైపుణ్యాలు అంతగా అభివృద్ధి చెందకపోవడం, తెలుగు నేపథ్యం లేకపోవడం | భాషాక్రమాన్ని గుర్తించలేకపోవడం, జ్ఞాపకశక్తి లోపాలు, పదాలమధ్య గల సంబంధాలను గుర్తించలేకపోవడం |
| 3. | లేఖన నైపుణ్యాలు సరిగ్గా లేకపోవడం | భాషతో పాటే రావాల్సిన ఈ నైపుణ్యం విద్యార్థికి తగిన భాషానైపుణ్యాలు లేక దోషాలు దొర్లడం | భాషను క్రమపద్ధతిలో రాయలేకపోవడం, క్రమానుగతంగా కర్త, కర్మ, క్రియలను వాడలేకపోవడం జ్ఞాపకశక్తి లోపాలు, ఊహ లేకపోవడం, చేతివేళ్ళలో పటుత్వం లేకపోవడం |

| క్ర.సం. | పిల్లల్లో గమనించిన ప్రవర్తన | అభ్యసన కొరవడిన పిల్లలు | ప్రత్యేక అవసరాలు గల పిల్లలు |
|---|---|---|---|
| 4. | ఏకాగ్రత లేకపోవడం, దృష్టి మరల్చడం | అర్థం కాకపోవడం, దృశ్యాలు, బొమ్మలు అవసరం కావడం, అలసిపోవడం | ఉపాధ్యాయుల మాటల వేగాన్ని అందుకోలేకపోవడం, ఏకాగ్రతా లోపం, అతిక్రియాత్మక జాడ్యం Attention deficit Hyperactivity Disorder - ADHD |
| 5. | నిర్దేశాలను పాటించడంలో తడబాటు | ఉపాధ్యాయుని మాటలను అర్థం చేసుకోలేకపోవడం; అర్థంచేసుకొని అనుసరించలేకపోవడం | క్రమానుగతంగా పదాలు అర్థం కాకపోవడం, జ్ఞాపకశక్తి లోపం, ఏకాగ్రత లేకపోవడం, భాషను అర్థం చేసుకోవడంలో తడబాటు |
| 6. | బోధితవిషయం గుర్తుండకపోవడం | అనేక అంశాలగూర్చి ఆలోచించడం, గృహ సమస్యలు ఉండడం (తల్లిదండ్రుల పోట్లాట, తండ్రి తాగుబోతుతనం) | భాషను అర్థంచేసుకోలేకపోవడం, జ్ఞాపకశక్తి లోపం |
| 7. | పదాలను ఉపయోగించడం, మార్చడం, మాట్లాడేటప్పుడు మళ్ళీమళ్ళీ సరిచూసుకోవడం | వ్యాకరణంమీద పట్టులేకపోవడం, కొత్తపదాలు వాడకంలో తడబాటు | జ్ఞాపకశక్తి లోపం, మౌఖికంగా సమాచారం అందించలేకపోవడం, పదాలను గుర్తించలేకపోవడం |
| 8. | కథను తిరిగి వినిపించడంలో కష్టం | కథను సరిగ్గా అర్థంచేసుకోక పోవడం, పదాలు కొత్తవికావడం | కథాక్రమాన్ని గుర్తించలేకపోవడం, జ్ఞాపకం అసలే లేకపోవడం |
| 9. | పదాలను లెక్కలను గుర్తించక పోవడం | పదాలు తెలియకపోవడం, సాంస్కృతికంగా సమస్యలపట్ల అవగాహన లేకపోవడం | భాష అర్థంకాకపోవడం, హేతుబద్ధత లేకపోవడం, లెక్కించడం తెలియక పోవడం (జాస్ క్యాలికులై వ్యాధి) |
| 10. | దూకుడు స్వభావం లేక అంటీముట్టని స్వభావం | విద్యానుభవం లేకపోవడం, భిన్న సాంస్కృతిక నేపథ్యం కావడం, మౌనం పాటించడం | ఆందోళన, ఉద్విగ్నత, ఇతరులతో ప్రవర్తన సరిగ్గా లేకపోవడం, స్వయం నియంత్రణ లేకపోవడం, మందకొడితనం |
| 11. | సాంఘిక మరియు భావోద్వేగ సమస్యలు | ఇంట్లో, సమాజంలో ఒత్తిడి, కులపరమైన సమస్యలు | మానసిక ఆరోగ్యం సరిగా లేకపోవడం, అభ్యసన కష్టతరం అనిపించడం, మనోవైఫల్యం |

పిల్లలలో గమనించిన ప్రవర్తనలకు కారణాలు గుర్తించి అభ్యసనంలో వెనుకబడిన పిల్లలను, అభ్యసన లోపాలున్న పిల్లలను ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఉపాధ్యాయులు గుర్తించాలి. ఇందుకు ఉపాధ్యాయులు ఆలోచించి, పరిశీలించి విద్యార్థుల అభివృద్ధి పట్ల ఆసక్తి కలిగిఉండాలి. ప్రత్యేక అవసరాలున్న పిల్లలు ముఖ్యంగా

- ☐ అభ్యసనంలో ప్రగతి చూపరు.
- ☐ మిగతా వారికంటే వెనుకబడి ఉంటారు.
- ☐ ప్రజ్ఞాన/సంజ్ఞాన నైపుణ్యాలు తక్కువగా ఉంటాయి.
- ☐ పదాలను సరిగ్గా గుర్తుపట్టడంకాని, చదవడం కాని చేయలేరు. లేఖన లోపాలు ముమ్మరంగా ఉంటాయి.
- ☐ రాయడం కష్టతరంగా ఉంటుంది.
- ☐ మాట్లాడడంలో రాయడంలో పరిమిత పదాలను మాత్రమే ఉపయోగిస్తారు.
- ☐ వ్యాకరణ నియమాలు, ధ్వనుల ఉచ్చారణ సరిగా ఉండవు.
- ☐ అన్ని భాషలలో అన్ని సబ్జక్టులలో కొంత వెనుకబడి ఉంటారు.

**ప్రత్యేక అవసరాలు గల పిల్లల భాషాబోధనలో తీసుకోవాల్సిన చర్యలు / జాగ్రత్తలు**

- ☐ ప్రత్యేకావసరాలు గల పిల్లలకు సంతోషం కలిగించే కృత్యాల ద్వారా భాషనుబోధించాలి.
- ☐ పదజాలాభివృద్ధి కోసం వివిధ వ్యూహాలను అన్వేషించాలి.
- ☐ ప్రత్యేకావసరాలు గల పిల్లలు నిరంతరం సమవయస్కులతో / సహాధ్యాయులతో గడుపుతారు కాబట్టి ప్రత్యేకావసరాలు గల పిల్లలకు ఎలా బోధించదలుచుకున్నారో చర్చించి వారి సాయం అర్థించాలి.
- ☐ ప్రత్యేకావసరాలు గల పిల్లలలోని లోపాలను గమనించి నివారణ చర్యలను చేపట్టాలి.
- ☐ ప్రతి బాలుడు/బాలిక ప్రత్యేకత కల్గినవారు కాబట్టి ఒకే బోధనాపద్ధతి వర్తించదని తెలుసుకోవాలి.
- ☐ ప్రత్యేక అవసరాల పిల్లల అభ్యసనాభివృద్ధి కొరకు ఉపాధ్యాయులు సమ్మిళిత తరగతి గది బోధనా వ్యూహాలు అమలుచేయాలి.
- ☐ ఇతర ఉపాధ్యాయులతో చర్చించి సమిష్టి కార్యాచరణ అమలుచేయాలి.
- ☐ ప్రత్యేక అవసరాలు గల పిల్లల వయస్సుకు తగిన విధంగా కృత్యాలు బోధన పద్ధతులు ఎంపిక చేసుకోవాలి.
- ☐ మానసిక వైద్యుల సలహాలను అవసరమున్నపుడు పొందాలి. అలాగే ప్రత్యేక అవసరాలున్న పిల్లల బోధనలో నిష్ణాతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సలహా తీసుకోవాలి.
- ☐ ప్రత్యేకావసరాలు గల పిల్లల రోజువారీ కృత్యాల నిర్వహణ, ప్రగతిక్రమాలను నమోదుచేయాలి.
- ☐ ప్రత్యేకావసరాలు గల పిల్లల నేపథ్యం తెలిసిఉండాలి.

పై అంశాలు దృష్టిలో పెట్టుకొని తరగతి గదిలో విలీన/సహిత తరగతిగది బోధనావ్యూహాలు (Inclusive classroom strategies) అమలుచేస్తే ప్రత్యేకావసరాలు గల పిల్లలు కూడా భాషా సముపార్జన/భాషను పొందడంలో ఏమాత్రం వెనుకంజ వేయరని విద్యావేత్తలు భావిస్తున్నారు.

## మూల్యాంకనం

### వ్యాసరూప ప్రశ్నలు — 8 మార్కులు

1. భాషాభ్యసనంలో సాహిత్యం యొక్క పాత్రను వివరింపుము.
2. జంతువులు, మానవుల భాషల మధ్యగల వ్యత్యాసాలను వివరించండి?
3. భాషాభ్యసనం స్వతఃసిద్ధంగా పుట్టుకతోనే సంక్రమిస్తుందని ఎలా చెప్పగలవు?
4. పాఠాలలోని రకాలను తెలిపి? వాటిని గురించి వివరించండి?
5. బహుళ అక్షరాస్యత భావనలను తెలియజేయండి?

### సంక్షిప్త సమాధాన ప్రశ్నలు — 4 మార్కులు

1. సంకేతికత, విసంకేతికత అనగానేమి?
2. విద్యాప్రణాళికలో బాలసాహిత్యం వినియోగం? ప్రయోజనాలు తెలపండి?
3. ప్రత్యేక అవసరాలుగల పిల్లల భాషాబోధనలో తీసుకోవలసిన జాగ్రత్తలేవి?
4. భాషా జ్ఞాన నిర్మాణం అంటే ఏమిటి?
5. వివిధ దశలలో భాషాభివృద్ధిని వివరింపుము?

### లఘు సమాధాన ప్రశ్నలు — 2 మార్కులు

1. అక్షరాస్యతకు ఏవైనా రెండు నిర్వచనాలను నిర్వచించండి?
2. భాషావిధులను రెండింటిని తెలుపండి?
3. భాషాభ్యసనంలో కథలపాత్ర ఏమిటి?
4. ప్రారంభ అక్షరాస్యత అనగానేమి?
5. వర్ణనాత్మక సాహిత్యం అంటే ఏమిటి?
6. ప్రత్యేక విద్య అనగానేమి?

### బహుళైచ్ఛిక ప్రశ్నలు — ½ మార్కు

1. జంతువులు తమ భావాలను ఎలా వ్యక్తంచేస్తాయి ( ఆ )
   అ) సంజ్ఞలు ఆ) ధ్వనులు ఇ) చేష్టలు ఈ) మాటలు
2. శిశువు సుమారుగా ఎన్ని సంవత్సరాలకు భాషను నేర్చుకుంటాడు. ( ఈ )
   అ) 1 ఆ) 4 ఇ) 6 ఈ) 3
3. చదవడం, రాయడం, లెక్కలు చేయడం అంటే ( అ )
   అ) అక్షరాస్యత ఆ) పఠనం ఇ) అభ్యసనం ఈ) వివరించడం
4. జన్యుపరంగానే మానవ శిశువులకు ఒక భాషా వ్యవస్థ సంక్రమిస్తుందని చెప్పినవారు ( ఇ )
   అ) డార్విన్ ఆ) చార్లెస్ ఇ) నోంచామ్‌స్కీ ఈ) స్లోబోద్‌షికాఫ్
5. 2011 సంవత్సరం జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో అక్షరాస్యత శాతం ( ఆ )
   అ) 70.05% ఆ) 74.04% ఇ) 64.04% ఈ) 69.05%

**ఖాళీలను పూరింపుము** ½ మార్కు

1. చీమలు, పావురాలు ............ ద్వారా భావాన్ని వ్యక్తీకరణ చేస్తాయి.(రసాయనిక సంకేతాలు)
2. తెలుగు వర్ణమాలలో గుణింత అక్షరాల సంఖ్య .......... (37)
3. పఠనం వల్ల కలిగే ప్రయోజనాన్ని ప్రస్తావించిన మొట్ట మొదటి భాషావేత్త ..... (స్టీఫెన్ క్రేషన్)
4. కాలనిర్ణయ పట్టికలో ........ నిమిషాలు సమయాన్ని కేటాయించాలి (20 నుండి 30)
5. భాషాభ్యసనంలో ప్రముఖపాత్ర వహించేవి....... (ఆటలు, పాటలు, కథలలో ఏదో ఒకటి)

**జతపరచండి.** ½ మార్కు

| | | | |
|---|---|---|---|
| 1. | పాణుగంటి లక్ష్మీనరసింహారావు | ( 2 ) | అ) స్పర్శసంకేతం |
| 2. | తేనెటీగల భాషాభివ్యక్తం | ( 4 ) | ఆ) నిరంతర ప్రక్రియ |
| 3. | బాలసాహిత్యం | ( 1 ) | ఇ) సాక్షి వ్యాసాలు |
| 4. | భాషాభ్యసనం | ( 5 ) | ఈ) 1985 |
| 5. | జాతీయ పఠనాభివృద్ధి మిషన్ | ( 3 ) | ఉ) గుణాత్మక విద్య |

# 3 ప్రాథమిక స్థాయిలో భాషా సామర్థ్యాల అభివృద్ధి

**విషయక్రమం**

3.1 పరిచయం
3.2 ప్రాథమిక స్థాయిలో భాషాసామర్థ్యాల అభివృద్ధి – లక్ష్యాలు
3.3 శ్రవణం – భాషణం
3.4 పఠనం – లేకనం
3.5 సృజనాత్మకత ఊహ / కల్పన

## 3.1 పరిచయం

ఈ అధ్యాయంలో భాష అంటే ఏమిటి? భాషా సామర్థ్యాలు – రకాలు, వాటిని అభివృద్ధి చేసుకొనే మార్గాలను గురించి విశ్లేషింపబడతాయి.

**భాష:** భాషింపబడేది భాష. భాషించడమంటే మనస్సులోని భావాలను కంఠ ధ్వనుల ద్వారా తెలియజేయడం. పరస్పర భావ వినిమయం కోసం చేసే వాగ్వ్యవహారమే భాష. అటువంటి భాషను మాట్లాడేశక్తి ఈ సృష్టిలోని ప్రాణికోటిలో కేవలం ఒక్క మానవజాతికే ఉంది. అందుకే భాష మనిషిని జంతువు నుండి వేరుచేస్తోంది. గొప్పవానిగా తీర్చిదిద్దుతుంది. మానవ జీవితాన్ని సఫలం చేసే విశిష్టమైన సాధనం భాష. మన సంస్కృతి, వారసత్వం, సాహిత్యం అన్నీ భాష మీదే ఆధారపడి ఉంటాయి.

మానవుని దైనందిన కార్యకలాపాలకు, పరస్పర భావగ్రహణ – భావ వ్యక్తీకరణకు ఏకైక ఆధారం భాష. భాషాబోధనోద్దేశాలు ప్రాథమిక స్థాయిలో మొగ్గలా ఉంటాయి. మాధ్యమిక దశలో పువ్వులా వికసిస్తాయి. ఉన్నత దశలో పండులా నిండుదనం సంతరించుకుంటాయి. మన అభిప్రాయాలను స్పష్టంగా ఇతరులకు భాషణ (మాటలు) రూపంలో తెలియజేస్తాము. ఇలా చేయడాన్నే భాషణం అంటారు. భాషణం శిశువుకు పుట్టుకతో రాదు. కుటుంబంలోని వ్యక్తుల భాషణ అనుసరణ ద్వారా నేర్చుకుంటారు. అనేక రూపాల్లో భాషా సృష్టి చేయగల నేర్పు మానవునికి ఉంది. అయినప్పటికీ ఈతరం విద్యార్థులలో ఆశించినంతగా భాషాభివృద్ధి జరగడం లేదు. కాబట్టి భాష యొక్క ఉద్దేశాలు, ప్రయోజనాలు, భాషలో ఎప్పటికప్పుడు వస్తున్న సరికొత్త పోకడలు, భాషాభివృద్ధిలో ఉపాధ్యాయుని పాత్ర మున్నగు అంశాలను గురించి

విపులంగా తెలుసుకోవాలి. అప్పుడే భాషోపాధ్యాయుడు విద్యార్థులలో ఆశించిన భాషాభివృద్ధిని సాధిస్తాడు. మానవునిలోని మానసిక, సాంఘిక, ఉద్వేగ, సాంస్కృతిక, కళావికాసాలన్నింటికీ భాషే పట్టుగొమ్మ. మనిషి మూర్తిమత్వ వికాసానికి మూలం భాష!

**విద్యావ్యవస్థలో పిల్లలు, ఉపాధ్యాయులు కీలకమైనవారు, పిల్లలను జ్ఞాన నిర్మాతలుగా భావించినపుడు ఉపాధ్యాయులలో, పాఠ్యపుస్తకాలలో, బోధనాభ్యసన ప్రక్రియలలో బృహత్తరమైన మార్పులు చోటు చేసుకోవాలి. జ్ఞాన నిర్మాణానికి దోహదపడేలా బోధనాభ్యసన ప్రక్రియలు పిల్లలకు అనేకరకాలైన అనుభవాలను కల్గించాలి. దీంట్లో పిల్లల భాష కీలకమైనది. తరగతిగదిలో పిల్లలభాష, వారి జ్ఞాన నిర్మాణానికి తోడ్పడాలి. భాషా తరగతిగదిలో కథలు చెప్పడం, గేయాలు, లయబద్ధమైన పాటల వంటి వ్యవహార రూపాల్లో భాషా సముపార్జన ఉండాలి. ఈ రూపాలు భాషను నేర్చుకునేలా చేస్తాయి.**

**– ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధిపత్రం 2011**

## 3.2 ప్రాథమిక స్థాయిలో భాషా సామర్థ్యాల అభివృద్ధి – లక్ష్యాలు

భాషకుగల రెండు ముఖ్య ప్రయోజనాలు భావగ్రహణం, భావవ్యక్తీకరణ. ఈ రెండు ముఖ్య ప్రయోజనాలను కల్గిన భాషను ఒక క్రమ పద్ధతిలో (శాస్త్రానుగుణంగా) నేర్చుకుంటే పిల్లవాడు చక్కని సామర్థ్యాలను కలిగి ఉంటాడు. ఆ సామర్థ్యాలనే భాషా సామర్థ్యాలు లేదా భాషా నైపుణ్యాలు అంటారు. శ్రవణ, భాషణ, పఠన, లేఖన సామర్థ్యాలను సాధించడమే భాషాభ్యసనమని భావించడం జరుగుతోంది. అయితే భాషాభ్యసనం సామర్థ్యాల సాధనకు మాత్రమే పరిమితం కాకూడదు. భాషా నైపుణ్యాలకు మధ్య గల అంతర సంబంధాలను కూడా గుర్తించి సందర్భోచితంగా వివిధ సన్నివేశాలలో సమగ్రంగా భాషను వినియోగించడమే నిజమైన అభ్యసన ఫలితమని చెప్పవచ్చు. తరగతి వారీగా పిల్లలు సాధించవలసిన సామర్థ్యాలను గురించి ఉపాధ్యాయుడికి పూర్తిగా అవగాహన ఉన్నప్పుడే – పిల్లల్లో ఆ సామర్థ్యాలను మనం సాధించగల్గుతాం. భాషా సామర్థ్యాన్ని / నైపుణ్యాన్ని సాధించడానికి విద్యార్థులు నాలుగు ముఖ్యమైన సామర్థ్యాలను కలిగి ఉండాలి.

1. సరిగా వినడం (శ్రవణం)
2. నిర్దుష్టంగా సంభాషించడం (భాషణం)
3. దోషరహితంగా చదువడం (పఠనం)
4. సక్రమంగా రాయడం (లేఖనం)

మాతృభాషను బోధించే విషయంలో ప్రాథమిక దశ విద్యార్థులకు ఈ శ్రవణ, భాషణ, పఠన, లేఖనాలు ముఖ్య లక్ష్యాలని విద్యావేత్తలు అంటున్నారు. వీటినే చతుర్విధ భాషా నైపుణ్యాలని, భాషా చతుష్కమని, చతుర్విధ భాషా పరికర్మలని పిలుస్తున్నారు. వీటితోపాటు–

BVCLJS

5. పదజాలాభివృద్ధి
6. సృజనాత్మకత
7. ప్రశంస / ప్రాజెక్టులు
8. భావావగాహన
9. ప్రాయోగిక వ్యాకరణం అనేవి కూడా పాఠశాల స్థాయిలో బోధనా లక్ష్యాలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాప్రణాళికా చట్టం, భాష ఆధార పత్రంలో పేర్కొనబడ్డాయి.

**భాషా సామర్థ్యాల అభివృద్ధి**

భాషకు మూలాధారాలైన ప్రాథమిక భాషా నైపుణ్యాల్లో, పిల్లలకు ప్రాథమిక స్థాయిలోనే "సమగ్ర శిక్షణ" ఇవ్వడం ద్వారా సామర్థ్యాలను అభివృద్ధి చేయవచ్చు. ఇప్పటికీ ఎక్కువ మంది ఉపాధ్యాయులు బడిలో చేరిన వెంటనే పిల్లలతో సంప్రదాయపద్ధతి అంటూ అక్షరాలను మొండి పద్ధతిలో దిద్దిస్తున్నారు. ఇది పూర్తిగా మనోవైజ్ఞానిక సూత్రాలకు వ్యతిరేకం. నైపుణ్యాలను నేర్పడంలో శ్రవణ, భాషణ, పఠన, లేఖన క్రమాన్ని పాటించాలే తప్ప, దానికి విరుద్ధంగా నిర్వహించకూడదు. ఈ నాల్గింటిని అశాస్త్రీయ పద్ధతిలో ఒకేసారి నేర్పడం కంటే "శాస్త్రీయ పద్ధతిలో" పైన చెప్పిన వరుస క్రమంలో శిక్షణ ఇస్తే విద్యార్థులలో నైపుణ్యాల అభివృద్ధి జరుగుతుంది.

ఒక శాస్త్రీయ పద్ధతిలో

1. బోధనానుభవం
2. అభ్యసనానుభవం
3. వినియోగం
4. సాధారణీకరణ
5. భాగస్వామ్యం
6. పోల్చడం
7. ప్రతిస్పందన – వీటి ద్వారా భాషా సామర్థ్యాల అభివృద్ధి సాధించవచ్చునని భాషా శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

**భాష – కనీస అభ్యసన స్థాయిలు**

ఇటీవలనే ప్రొఫెసర్ ఆర్. హెచ్. ధవేగారి నాయకత్వంలో ఒక కమిటీ ఏర్పడి ప్రతి సబ్జెక్టులోనూ కనీస అభ్యసనస్థాయిలు నిర్ణయించారు. కనీసాభ్యసనస్థాయిలంటే ఏమిటి? విద్యార్థి ఒక తరగతి నుండి మరో తరగతికి ఉత్తీర్ణుడైనప్పుడు అతడు ఆ సంవత్సరాంతానికి కనీసం నేర్చుకోవలసిన సామర్థ్యాలనే కనీస అభ్యసన స్థాయిలు లేక కనీస అభ్యసన సామర్థ్యాలు అంటారు. వీటిని ప్రవేశపెట్టడంలోని లక్ష్యాలు –

1. విద్యలో నాణ్యత (Quality)
2. సమానత్వం (Equality)
3. ఉపాధ్యాయుల్లో జవాబుదారితనం (Accountability)

ఒక్క మాటలో చెప్పాలంటే విద్యార్థిలో పరిపూర్ణ వికాసం తీసుకురావడం. నాలుగు ప్రాతిపదిక నైపుణ్యాలు 1. శ్రవణం, 2. భాషణం, 3. పఠనం, 4. లేఖనంతోబాటు కనీస అభ్యసన సామర్థ్యాల ద్వారా మరో అయిదు సామర్థ్యాలు 1. భావావగాహన, 2. ప్రాయోగిక వ్యాకరణం, 3. స్వీయ అధ్యయనం, 4. భాషోపయోగం, 5. శబ్దజాలంపైన అధికారం వీటితో కలపటం జరిగింది. పైన చెప్పిన అన్నిటిని కలిపితే భాషలో కనీస అభ్యసన సామర్థ్యాలు మొత్తం 9. వీటికి సంఖ్యాపరమైన సంకేతం ఇవ్వబడింది. ఉదాహరణకు 2.5.3 అంటే మధ్య ఉన్న 5 తరగతిని తెలియపరుస్తుంది. మొదట ఉన్న 2 సామర్థ్యాలను తెలియపరుస్తుంది. చివరి 3 ఉపసామర్థ్యాలను తెలియపరుస్తుంది.

కనీస అభ్యసన సామర్థ్యాలు ప్రవేశపెట్టడం ద్వారా ఉపాధ్యాయులు తమ సబ్జెక్టులో విద్యార్థులకు ఖచ్చితంగా

నేర్పవలసిన లేక రాబట్టవలసిన సామర్థ్యాలు ఏవో నిర్ణయింపబడ్డాయి. ఉపాధ్యాయుడు తన పాఠ్యబోధనను ఈ తొమ్మిది సామర్థ్యాలపై కేంద్రీకరించాలి. దీనివల్ల ప్రాథమిక విద్య పూర్తయ్యే లోపల విద్యార్థిలో చక్కని భాషా వికాసం వెల్లివిరుస్తుంది.

**భాషా నైపుణ్యాలు – లక్ష్యాలు**

భాష ప్రాథమిక ప్రయోజనం భావ వినిమయం. ఈ ప్రయోజనం చక్కగా నెరవేరడం కొరకు భాషను వినియోగించుకొంటాం. వివిధ రూపాలలో భాషను నేర్చుకొనే ఈ నైపుణ్యాలను భాషా నైపుణ్యాలు అంటారు. ప్రాథమిక స్థాయిలోని విద్యార్థులకు మాతృభాషా బోధనలో ఇవి ముఖ్య లక్ష్యాలుగా ఉంటాయి. ఈ నైపుణ్యాలు భాషలో మూలకాలవంటివి. మూలకాల కలయికతో మిశ్రమ లోహాలు ఏర్పడినట్లే ఈ నైపుణ్యాలు కూడా కొన్ని కలిసిపోయి మిశ్రమ నైపుణ్యాలు ఏర్పడతాయి. ఉదా : వినియోగ నైపుణ్యం, వ్యక్తీకరణ నైపుణ్యం, సృజనాత్మక నైపుణ్యం.

అయితే ఈ ప్రాథమిక దశలో సులభం నుండి కఠినం వరకు, తెలిసిన దాని నుండి తెలియని దాని వరకు... అనే మనో విజ్ఞాన సూత్రాన్ని అనుసరించి విద్యార్థులకు శ్రవణం, భాషణం, పఠనం, లేఖనం అను నాలుగు నైపుణ్యాలను ఒక క్రమంలో నేర్పాలి. ఆ నాలుగు నైపుణ్యాలను ఒక శాస్త్రీయ విధానంలో నేర్పితే విద్యార్థులు కనీస అభ్యసన సామర్థ్యాల్లో మంచి పట్టు సాధిస్తారు.

ప్రాథమిక స్థాయిలో పిల్లల్లో ప్రాతిపదిక నైపుణ్యాలను భాషా బోధనా లక్ష్యాలుగా పెంపొందించాల్సి ఉంటుంది. మిగిలిన సబ్జెక్టుల సామర్థ్యాల సాధన కూడా భాషా సామర్థ్యాన్ని అనుసరించే ఉంటుంది. అంటే పిల్లలు భాషలో సామర్థ్యాన్ని సంపాదించిన దానిని బట్టే మిగిలిన సబ్జెక్టుల్లో కూడా సామర్థ్యాన్ని కలిగి ఉంటారు. అందుకే Every subject teacher is basically a language teacher అన్నారు. ప్రాథమిక స్థాయిలో అనగా 5వ తరగతి పూర్తి అయ్యేసరికి పిల్లల్లో ఈ క్రింది స్థాయి భాషా నైపుణ్యాలను మనం ఆశించాలి.

**1) శ్రవణం (వినడం):** ఉపాధ్యాయుడు బోధించే అంశాలను శ్రద్ధగా వినడం, ఉపాధ్యాయుడు చెప్పే కథలను, సూచనలను విని అర్థం చేసుకోగలగడం.

1. వివిధ ధ్వనులను గుర్తించడం.
2. ఆ ధ్వనులకు సంబంధించిన వర్ణాలను గుర్తించడం.
3. భావాన్ని అర్థంచేసుకోవడం
4. పదజాలాన్ని అభివృద్ధి చేసుకోవడం
5. ఆలోచనా శక్తిని అభివృద్ధి చేసుకోవడం
6. మంచి ఉచ్చారణ దక్షతను పెంపొందించుకోవడం

ఇక్కడ ఒక విషయం గమనించాలి. ఉపాధ్యాయుడు చెప్పే విషయాలు ఆనందదాయకంగా, ఆసక్తికరంగా ఉంటేనే విద్యార్థులు మనస్సుపెట్టి వింటారు. అదే జాయ్‌ఫుల్ లెర్నింగ్ (ఉత్సాహభరితమైన అభ్యసనానికి) కు దారితీస్తుంది.

**2) భాషణం (మాట్లాడడం) :** పిల్లలు తమ భావాలను నిర్దుష్టంగా చెప్పగల్గడం, తనకు కలిగిన అనుభవాలను, ఆలోచనను సొంత మాటల్లో వ్యక్తీకరించగల్గడం, తమ ఇంటిని గురించి, పండుగను గురించి, కుటుంబాన్ని గురించి, ఒక వస్తువును గురించి పది మాటలు చెప్పగల్గడం. తన చుట్టూ ఉన్న పరిసరాలను గురించి సరికొత్త పదజాలంతో వర్ణించి చెప్పగలగడం.

1. ధ్వనిదోషాలు, భాషాదోషాలు, భావదోషాలు లేకుండా నిర్దుష్టంగా మాట్లాడడం.
2. తగు వేగంతో ధారాళంగా మాట్లాడడం.
3. విషయ దోషాలు / భావదోషాలు లేకుండా మాట్లాడడం
4. చక్కని స్వరం, స్పష్టమైన ఉచ్ఛారణ ఉండేటట్లు మాట్లాడడం.
5. సభాకంపం లేకుండా మాట్లాడడం.
6. సందర్భానికి తగినట్లు మాట్లాడడం
7. నిత్య వ్యవహారంలోని సజీవమైన వాడుక భాషలో మాట్లాడగలగడం

EUHTQR

**3) పఠనం (చదవడం) :** వివిధ రూపాలలో అనగా లిపి, చిత్రాలు మొదలగు సంకేతాలను గుర్తించి అందులోని భావాన్ని గ్రహించడమే పఠనం అని భావించవచ్చు. పిల్లలు పాఠశాలలో చేరడానికి ముందే చిత్రాలు, దృశ్యాలు, టి.వీ.లో వచ్చే ప్రకటనలను చదువగలిగే నైపుణ్యం కలిగి ఉంటారు. పాఠశాలకు వచ్చిన తరువాత అక్షరాలను, పదాలను, వాక్యాలను పలకడానికి, విషయాన్ని గ్రహించడానికి, విలువలు, వైఖరులను పెంపొందించుకోవడానికి ఉపాధ్యాయుడు సహాయపడాలి.

**పఠనం లక్ష్యాలు**

1. భావయుక్తంగా చదవగల్గడం.
2. విరామ చిహ్నాలను పాటిస్తూ నిర్దుష్ట ఉచ్చారణతో, దోష రహితంగా చదవగలగడం.
3. గోడ పత్రికలను, బాల సాహిత్యానికి చెందిన కథలను, వార్తా పత్రికలను, ఉత్తరాలను చదివి అర్థం చేసుకోగలగడం.
4. సరళంగా ఉండే కవుల పద్యాలను, గేయాలను చదవగలగడం.
5. తడబడకుండా చదవడం.
6. తగిన వేగంతో ధారాళంగా చదవడం
7. ధ్వనిదోషాలు లేకుండా చదవడం
8. ద్విత్వాక్షరాలను, సంయుక్తాక్షరాలను స్పష్టంగా చదవడం
9. భాషాజ్ఞానాన్ని పెంపొందించుకోవడం
10. వాచికాభినయంతో చదవడం
11. ఆంగికాభినయంతో చదవడం
12. ఆనందానుభూతితో చదవడం
13. విరామ సమయాన్ని సద్వినియోగపర్చుకోవడం
14. రచయితల భావాలను గ్రహించడం
15. స్వీయశైలిని ఏర్పరచుకోవడం
16. చదివిన విషయాలను పునఃశ్చరణ చేసుకోవడం
17. వివిధ కవుల రచనా శైలిని ప్రశంసించడం.

**4) లేఖనం (రాయడం)**

1. తనకు తెలిసిన విషయాలను దోష రహితంగా, పదాలకు – వాక్యాలకు సమానమైన ఖాళీతో అందంగా రాయగలగడం.
2. అందమైన దస్తూర్తి అలవరచుకోవడం.
3. సొంతంగా చిన్న చిన్న లేఖలు, కథలు, కథకు ముగింపులు రాయగలగడం.
4. విరామ చిహ్నాలను పాటించగలగడం.
5. ఏకవచన, బహువచనాలను, భాషా భాగాలను, వాక్య నిర్మాణాలను గుర్తించగలగడం.
6. కొన్ని పదాలకు పర్యాయ పదాలను, వ్యతిరేక పదాలను అనుదిన వ్యవహారంలో ఉపయోగించడం.
7. చిన్న చిన్న సామెతలను వాక్యాల్లో ప్రయోగించగలగడం.

G4THT3

విద్యార్థి ఈ కింది నైపుణ్యాలను కూడా కలిగి ఉండాలి.

1. అందంగా రాయగలగడం.
2. అక్షరదోషాలు లేకుండా రాయగలగడం
3. భావదోషాలు, భాషాదోషాలు లేకుండా రాయడం.
4. పదాలకు, వాక్యాలకు, పంక్తులకు సమతను పాటిస్తూ రాయడం.
5. తగిన వేగంతో రాయడం.
6. ఊనికతో రాయడం.
7. విమర్శనాత్మకంగా రాయడం
8. అవసరమైతే ఉన్న విషయాన్ని క్లుప్తంగా రాయడం.
9. జాతీయాలు, సామెతలు ఉపయోగించి రాయడం.
10. నేటితరానికి సంబంధించిన అంశాలను భావితరాల వారికి అందించడం.
11. ఇతర భాషల నుండి అవసరమైన అంశాలను తన భాషలోనికి తర్జుమా చేసి రాయగలగడం.
12. ఆకర్షణీయమైన ప్రామాణిక వాడుకభాషలో సొంత శైలిలో రాయడం.
13. ధారాళంగా రాయగలగడం

## 3-3 శ్రవణం – భాషణం

భాషా సామర్థ్యాలలో వినడం – మాట్లాడడం చాలా కీలకమైనవి. పిల్లల్లో స్పష్టమైన ఉచ్చారణ, భావప్రకటన పెంపొందించడానికి వినడం – మాట్లాడడం ఎంతగానో తోడ్పడుతుంది. ఆలోచించి మాట్లాడవలసిన అవసరాన్ని కల్పించడం ద్వారా పిల్లలు విషయాన్ని వినడం పట్ల ఏకాగ్రత చూపుతారు. ఇతరులు చెప్పే విషయాన్ని శ్రద్ధగా వినడం అలవాటు అయినట్లయితే సున్నితంగా స్పందించడం అలవాటు అవుతుంది. అందుకే సుమతీ శతకకారుడు ఇలా అన్నాడు.

వినదగునెవ్వరు చెప్పిన
విన్నంతనే వేగపడక వివరింపదగున్
కనికల్ల నిజము తెలిసిన
మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ!

**శ్రవణం**

భాషా సామర్థ్యాలలో మొదటిది శ్రవణం. శ్రవణేంద్రియాల ద్వారా (చెవులు) జరుపు భాషా ప్రక్రియ శ్రవణం. శ్రవణమనగా వినడం. భాష నేర్చుకునే పిల్లలు పరిసర వాతావరణంలో వివిధ ప్రాణులు, వ్యక్తులు చేసే ధ్వనులను శ్రద్ధగా వింటారు. అప్పుడే ఆ ధ్వనులను చక్కగా అనుకరించడానికి వీలు అవుతుంది. పిల్లవానికి ముఖ్యంగా ఉండవలసింది నిశిత శ్రవణమే ! ఇది కుటుంబంతోనే ఆరంభమవుతుంది. భాషా సామర్థ్యాలలో శ్రవణం మొదటి స్థానంలో పెట్టిన కారణం ఇదే!

అధునాతన సాధనాలైన టెలివిజన్, కేసెట్లు (సి.డిలు) మున్నగు వాటి ద్వారా విద్యార్థులు వివిధ సంభాషణలను, చర్చలను విని శ్రవణ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటారు. ఉపాధ్యాయుడు పిల్లవాడు వినే విధంగా చక్కని భాషను స్పష్టమైన ఉచ్చారణతో ఉచ్చరిస్తే విద్యార్థులు ఆ ఉచ్చారణను శ్రద్ధగా విని శ్రవణ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటారు. తద్వారా మంచి భాషను అలవర్చుకుంటారు. అయితే ఉపాధ్యాయుని సంభాషణ ఆకర్షణీయంగా ఉంటేనే విద్యార్థిలో వినాలనే కుతూహలం కలుగుతుంది. తొలిదశలో భాషా నైపుణ్యాలను పెంపొందించడానికి బోధనోపకరణాలు ఎంతగానో సహాయపడతాయనడం యథార్థం. ప్రాథమిక దశలో శ్రవణ నైపుణ్యాన్ని పెంపొందించడంలో ఈ క్రింది ఉపకరణాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

1) టి.వి. కార్యక్రమాలకు పిల్లలు ఆకర్షితులవుతున్నారు. వాటిలోని మంచి కార్యక్రమాలను ప్రదర్శించి శ్రవణాసక్తిని పెంపొందించవచ్చు.
2) విన్న విషయాన్ని తిరిగి వారిచేత చెప్పించడం ద్వారా శ్రవణ నైపుణ్యాన్ని మదింపు చేయవచ్చు.
3) శిశువుల సంభాషణను 'టేప్' చేసి తిరిగి వారికి వినిపించడం ద్వారా కూడా భాషా ధ్వనులను శ్రద్ధగా విని ఉచ్చరించడంలో శిశువుకు ఉత్సాహం కలిగించవచ్చు.
4) చక్కటి కథలను చెప్పడం ద్వారా శ్రవణాసక్తిని పెంపొందించవచ్చు.

అయితే ప్రాథమిక స్థాయిలో సామర్థ్యాల అభివృద్ధికి ఉపాధ్యాయుడు చేపట్టే కార్యక్రమాలు విద్యార్థుల వయో, మానసిక స్థాయిలకు అనుగుణంగా ఉండాలి. కార్యక్రమాలు పిల్లలకు ఉల్లాసాన్ని కలిగించేలా వుండాలి.

1) మనం ఇళ్లలో పాడుకునే జోలపాటలు, లాలిపాటలు, శిశుగేయాలు, అభినయగీతాలు నేర్పించాలి.
2) హాస్య, వీర, కరుణ, అద్భుత రసాలకు సంబంధించిన కథలు చెప్పాలి.
3) పిల్లలను ఒకచోట కూర్చోబెట్టి "చెవిలో మాట" వంటి ఆటలు, పదక్రీడలు" చేయిస్తే వినే కౌశలం పెంపొందుతుంది.

**శ్రవణం – లక్షణాలు**

శ్రవణంతో విద్యార్థి కొంత పరిజ్ఞానాన్ని సాధిస్తాడు. శ్రద్ధతో విన్న విషయం మాత్రమే బాగా జ్ఞాపకం ఉంటుంది. అంతేకాక అభ్యాసంపై ఏకాగ్రత అలవడుతుంది.

**ఉత్తమ శ్రవణం**

1) చక్కని భాషణ, పఠన, లేఖనాలకు దోహదపడుతుంది.
2) చక్కగా విన్న విషయం క్రమపద్ధతిలో పునరావృతం చేయగలుగుతారు
3) మంచి ఉచ్చారణ మంచి శ్రవణంతోనే సాధ్యపడుతుంది.
4) దోషరహితంగా – భావయుక్తంగా మాట్లాడడానికి చక్కని శ్రవణం దోహద పడుతుంది.
5) శ్రవణ నైపుణ్యంతో పెద్ద పెద్ద ధ్వనుల మధ్య కూడా అవసరమైన విషయాలను గ్రహింపగలుగుతారు.
6) సందర్భోచితంగా మాట్లాడడానికి సహాయపడుతుంది.
7) సామాజిక సంబంధాలను మెరుగుపర్చడానికి ఉపయోగపడుతుంది.
8) తన అభిప్రాయాలను సక్రమంగా తెలియజేయడానికి ఉపయోగపడుతుంది.

**శ్రవణ శక్తి – లోపాలు**

1) కొంత మందికి పుట్టుకతోనే చెవి నిర్మాణంలో లోపం ఉంటుంది.
2) కొంత మందికి వ్యాధుల వల్ల శ్రవణ లోపం ఏర్పడవచ్చు.

ఈ లోపాల వల్ల ఉపాధ్యాయుని ఉచ్చారణను సక్రమంగా అనుకరించలేరు. తద్వారా ఉపాధ్యాయుడు చెప్పే అంశాలపై శ్రద్ధ చూపించలేరు. సరిగ్గా వినబడక అయోమయంతో అసంబద్ధమైన సమాధానం  చెప్పి తరగతి గదిలో నవ్వుల పాలవుతారు.

**నివారణ చర్యలు**

ముందుగా శ్రవణ సామర్థ్యం కొరవడిన విద్యార్థులను గుర్తించాలి. అనంతరం

1) వినికిడి సమస్య ఉన్న విద్యార్థి చెవిని శబ్దయంత్రాన్ని అమర్చుకోమని సలహా ఇవ్వాలి.
2) ఆ వ్యాధి ఉన్న పిల్లల తల్లిదండ్రులకు తగు సలహాలనివ్వాలి.
3) చెవిలో కాగితాలు, పెన్సిళ్ళు పెట్టి తిప్పే అలవాటును మాన్పించి, వైద్యుని సలహాను తీసికోమని చెప్పాలి.
4) శిశుగీతాలను దగ్గరగా వెళ్లి వినిపించాలి.
5) శ్రవణ శక్తిలోపం ఉన్న విద్యార్థులను – తోటి విద్యార్థులు ఎగతాళి చేయకుండా తగు చర్య తీసుకోవాలి.
6) విద్యార్థుల స్థాయికి తగిన సంభాషణలు వినిపిస్తూ, శ్రవణ అభ్యాసాలు చేయించాలి.

### 3.3.1 పిల్లలు ఎప్పుడు వింటారు?

1) విషయాన్ని తమదిగా భావించినప్పుడు
2) స్వేచ్ఛాయుత వాతావరణం ఉన్నప్పుడు

3) పరిచయమైన సన్నివేశాలను గురించి మాట్లాడించినపుడు

4) ఉత్సాహంగాను, బోధిస్తున్న అంశం మీద అభిరుచి ఉన్నప్పుడు

5) పిల్లలకు ఆసక్తిని కలిగించే అద్భుత రసంతో కూడిన కథలు (ఉదా : బేతాళ కథలు, పంచతంత్ర కథలు) చెప్పినప్పుడు

6) పిల్లలకు ఇష్టమైన ఆట వస్తువులు, బొమ్మలు మొదలైన ఉపకరణాలు జోడించి పాఠాలు చెప్పినప్పుడు

7) ఏకాగ్రత లేకుంటే వినరు కాబట్టి – చెబుతున్న విషయంపై దృష్టి పెట్టడానికి మధ్యమధ్యలో ప్రశ్నలు అడుగుతూ ఉండాలి.

8) ఉపాధ్యాయుని కంఠ స్వరం తక్కువ స్థాయిలో ఉంటే వినబడదు. కావున ఉపాధ్యాయుడు సముచిత స్వరంతో చెప్పాలి.

9) ఉపాధ్యాయుడు విద్యార్థిని లాలనగా పలుకరించినప్పుడు, ఆంగిక కదలికలను చేస్తూ సంభాషిస్తున్నప్పుడు మాత్రమే విద్యార్థి వినడానికి ఇష్టపడతారు.

10) ప్రాథమిక స్థాయిలో ఆకలి తీరి, తగు నిద్రను పొందిన పిమ్మటనే వినడానికి సిద్ధపడతారు.

11) పాటలు, గేయాలు, జంతువుల కథలను చాలా ఇష్టంగా వింటారు.

**ఉపాధ్యాయుడు చేయవలసినది**

1) ఉపాధ్యాయుడు ఎప్పటికప్పుడు పిల్లలకు ఆసక్తికరంగా ఉండే విధంగా తన బోధనను పరిపుష్టం చేసుకోవాలి.

2) తరగతి గది వాతావరణాన్ని ఆహ్లాదకరంగా ఉండేటట్లు చూడాలి.

3) ఉపాధ్యాయుడు ముందుగా పిల్లలు చెప్పే అంశాలను శ్రద్ధగా వినాలి.

4) గేయాలను, పద్యాలను రాగయుక్తంగా చదవాలి.

5) కథలను, హావభావములకు అనుగుణంగా వినిపించాలి.

6) వినిపించే అంశంపై ఆలోచన రేకెత్తించే ప్రశ్నలు మధ్యమధ్యలో అడుగుతూ ఉండాలి.

7) క్రీడా పద్ధతిలో బోధించాలి.

8) పిల్లలను మన స్నేహితుల్లా లాలనతో చూడాలి.

9) ఉపాధ్యాయుడు పిల్లల శ్రేయోభిలాషిగా విసుగు లేకుండా నిరంతర ప్రగతిశీలి కావాలి.

10) తాను చేస్తున్న బోధనలు విద్యార్థి ఎంత వరకు వింటున్నారో ఎప్పటికప్పుడు బేరీజు వేసుకోవాలి.

11) సుస్పష్టమైన కంఠ ధ్వనితో స్వరభేదాలను పాటిస్తూ బోధించాలి.

**భాషణం**

మన అభిప్రాయాన్ని స్పష్టంగా ఇతరులకు మాటల రూపంలో తెలియజేయడాన్ని 'భాషణం' అంటారు. నిర్దుష్టమైన ఉచ్చారణ భాషణానికి ప్రాణం వంటిది. సరియైన ఉచ్చారణతో భాషింపలేని పిల్లలు తమ అభిప్రాయాలను స్పష్టంగా ప్రకటించలేరు. కనుక అటువంటి వారికి భాషణలో చిన్నప్పటి నుండి శిక్షణ ఇవ్వాలి. భాషణ శక్తి బాగా ఉన్న మాటకారి అన్ని రంగాలలో రాణించడం మనం చూస్తూనే ఉన్నాం. "నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది" – "వాగ్భూషణమే

భూషణం" అనే నానుడులను బట్టి భాషణం గొప్పదనం స్పష్టమవుతోంది. డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు తమ 'ప్రగతిగీత' లో

ఆ.వె. వాక్కుకున్న పదును వాడి కత్తికి లేదు
మార్చగలదు మాట మనిషి మనసు
జారవలదు నోరు జాగ్రత్త జాగ్రత్త
శబ్దములకు గలదు గొప్ప శక్తి – అని భాషణం ప్రాధాన్యతను విస్పష్టం చేశారు.

స్పష్టమైన భాషణం చక్కని పఠనానికి కారణమవుతుంది. ఒక వ్యక్తి సంస్కారం భాషణాన్ని బట్టి చెప్పవచ్చు. భాషణ శక్తిని అభివృద్ధి చేయడానికి పాఠశాలలో జరిగే కృషిని 'వాచిక చర్య' అంటారు. శ్రద్ధగా వినడం వల్ల అవగాహన కలుగుతుంది. ఆ అవగాహనతో చక్కగా భాషింపగలడు. భాషణం సక్రమంగా లేకపోతే వ్యక్తుల మధ్య అవగాహన ఉండదు. అప్పుడు సమాజం ముందుకు నడవదు. రాయడం, చదవడం తెలియకపోయినా, చదువుకోని వారు కూడా చక్కగా జీవనం సాగిస్తున్నారంటే – దానికి చక్కని భాషణమే ముఖ్య కారణం.

**విద్యార్థులలో వాచిక చర్య అభివృద్ధికి చర్యలు**

1) తరగతి గదిలో స్వేచ్ఛగా మాట్లాడుకునే వాతావరణాన్ని కల్పించడం ద్వారా పెంపొందింపజేయవచ్చు.

2) బెరుకుగా ఉన్న విద్యార్థి చక్కగా భాషింపలేడు కాబట్టి పిల్లవానికి ఏ అంశాల పట్ల ఆసక్తి ఉందో–ఆ అంశాలపై చిన్న చిన్న ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టడం ద్వారా మెరుగు పరచవచ్చు.

3) వారు చెప్పే సమాధానాలను ఉపాధ్యాయుడు శ్రద్ధగా వింటూంటేనే – పిల్లవాడు ధారాళంగా తన భావాలను వ్యక్తం చేస్తాడు. అప్పుడే మనం ఆతని భాషణలోని లోపాలను గుర్తించి సరిచేయడానికి వీలు అవుతుంది.

4) బోధనలో తెలుసుకున్న కొత్త పదాలను నిత్య సంభాషణలో ఉపయోగించడం ద్వారా వారిలో పదజాలాభివృద్ధి జరిగి చక్కని వాచిక చర్యకు దోహదపడుతుంది.

**ప్రయోజనాలు**

1) భాషణం ద్వారా విద్యార్థుల ఉచ్చారణ దోషాలను సరిచేసి, మంచి వక్తగా తీర్చిదిద్దవచ్చు.

2) భావ ప్రకటనలో నైపుణ్యాన్ని పెంపొందించవచ్చు.

3) నూతన పదాలను పరిచయం చేయవచ్చు.

4) పాఠశాల, ఉపాధ్యాయుల పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి – వాటిపట్ల ప్రేమాభిమానాలను పెంచవచ్చు.

**కృత్యాలు**

1) పటాల ద్వారా కథలను చెప్పించడం.

2) కథను చెప్పి అందులోని నీతిని పిల్లల నుండి రాబట్టడం

3) కథ ప్రారంభంలోనూ – ముగింపులోను పిల్లలకు ఉత్సాహం కలిగించే వాక్యాలను ఉపయోగించడం.

ప్రఖ్యాత భాషావేత్త పి.గుర్రే భాషణాన్ని ఈ క్రింది అంశాలు నియంత్రిస్తాయని పేర్కొన్నారు.

1) ధ్వనులను వినియోగించే విధానం

2) భావ వినిమయానికి ఉపయోగించే భాషా రూపం.

3) వక్తకున్న వ్యక్తిత్వం.

స్పష్టమైన ఉచ్చారణ, ధ్వనులపై సరియైన ఊనిక, అర్థవంతమైన ధ్వనులు, హావభావాలు, శారీరక భంగిమలు (Body Language), అనువంశిక లక్షణాలు, పరిసరాలు భాషణాన్ని తప్పక ప్రభావితం చేస్తాయి. అందువల్ల పాఠశాలలో చేరిన విద్యార్థులలో శిష్టమైన, సభ్యసమాజం హర్షించే భాషణ శక్తిని పెంపొందించాలి.

**ప్రాథమిక దశలో భాషణాభివృద్ధి**

ప్రాథమిక దశలో విద్యార్థులలో భయం, సిగ్గు ఎక్కువగా ఉండి మాట్లాడడానికి జంకుతారు. వాటిని తొలగించడానికి

1) సంభాషణలు　　2) శిశుగేయాలు　　3) అభినయ గేయాలు

4) కథాకథనం　　5) భాషాక్రీడలు – ఎంతగానో తోడ్పడతాయి.

**భాషణంలో దోషాలు (ప్రాథమిక స్థాయి విద్యార్థులలో)**

పాఠశాలకు విద్యార్థులు వేరు వేరు పరిసరాల నుండి వస్తారు కాబట్టి, వారి ఉచ్చారణలో (భాషణంలో) భేదం – దానివల్ల దోషాలు దొర్లుతాయి. అవి సరిచేయకపోతే – ఆ దోషాలు లేఖనంలో కూడా ఏర్పడవచ్చు. అందువల్ల ప్రాథమిక దశలోనే ఆ దోషాలను నివారించవలసి ఉంటుంది.

**1) భాషాదోషం:** సాధారణంగా విద్యార్థి ఉపయోగించే వాక్యాలు కష్టమైన అన్వయం కలిగి ఉండడం, క్లిష్టమైన పదాలతో కూడి ఉండడం, వాక్యాలు పెద్దవిగా ఉండడం కారణంగా భాషాదోషాలు ఏర్పడే అవకాశం కలుగుతుంది. అప్పుడు ఉపాధ్యాయుడు చిన్న చిన్న వాక్యాలు ప్రయోగించేటట్లు చూడాలి. దానివల్ల భాషాదోషాలు తొలగిపోతాయి.

ఉదా : నేను రేపు పాఠశాలకు వెళ్ళాను. (వెళ్తాను)

**2) భావదోషం:** ఒక్కొక్కసారి సభాకంపంతో విద్యార్థి తనకు తెలిసిన విషయాన్ని సైతం తప్పుగా భాషింపవచ్చు. అందువల్ల విద్యార్థికి ముందుగా సభాకంపం లేకుండా ప్రోత్సహించాలి.

ఉదా : శ్రీకృష్ణుడు కురుక్షేత్ర యుద్ధంలో కౌరవుల పక్షాన ఉన్నాడు (పాండవుల)

**3) వర్ణ క్రమదోషం**

1) వేగంగా ఉచ్ఛరించడం వల్ల

2) తగినంత స్వరంతో మాట్లాడకపోవడం వల్ల

3) తడబాటు వల్ల

4) వాక్యాన్ని సమాన వేగంతో పలుకక పోవడం వల్ల

5) ధ్వనులను తారుమారు చేయడం వల్ల

6) మహాప్రాణాక్షరాలను పలుకవలసిన చోట అల్పప్రాణాక్షరాలను పలకడం

7) సంయుక్తాక్షరంతో కూడిన పదాలను ద్విత్వాక్షరాలుగా పలకవడం వల్ల

ఉదా : సత్యహరిశ్చంద్రుడు / సత్యహరిచ్చంద్రుడు

ఈ లోపాలు కలగడానికి స్థానకరణ ప్రయత్నం కూడా ఒక కారణం. అందుకే ఉపాధ్యాయుడు తన స్పష్టోచ్చారణతో విద్యార్థిలోని ఈ లోపాలను సరిచేయవచ్చు.

**నివారణోపాయాలు:**

1) విద్యార్థుల్లో నెలకొన్న భయాన్ని తొలగించాలి.
2) కఠినమైన పదాలను విద్యార్థులతో మరలా మరలా పలికించాలి.
3) పిల్లలకు ఉచ్చారణలో శిక్షణ ఇవ్వాలి.
4) భాషలోని చిన్న చిన్న వ్యాకరణాంశాలను వివరించాలి.

**3.3.2 పిల్లలు ఎప్పుడు మాట్లాడతారు?**

కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థికి పాఠశాల వాతావరణం, తోటి విద్యార్థులు ఉపాధ్యాయులు చేయించే కృత్యాలు మొదలగునవన్నీ కొత్తగా ఉంటాయి. అందువల్ల ఆ విద్యార్థి భయం, సంకోచం, జంకు, సిగ్గు మొదలగు లక్షణాలు కలిగి పెదవి విప్పి మాట్లాడడు. అటువంటి విద్యార్థి భాషణ నైపుణ్యం పెంపొందించాలంటే ఈ క్రింది కొన్ని చర్యలు అవసరం.

1) పాఠశాలలో చేరిన విద్యార్థిని ఉపాధ్యాయులు ప్రేమతో పలకరించాలి.
2) తల్లిదండ్రుల్లా బుజ్జగిస్తూ ఉండాలి.
3) వారిలోని సిగ్గును, భయాన్ని, సంకోచాన్ని పోగొట్టాలి.
4) చిన్న చిన్న ప్రశ్నల ద్వారా – గృహ వాతావరణం కల్పించాలి.
5) శిశుగీతాలు, అభినయగీతాలు, కథాకథనం, ఉపాధ్యాయుడు చేస్తూ, పిల్లలచేత చేయించాలి.

**ప్రాథమిక దశ – సంభాషణ**

1) ఉపాధ్యాయుడు చేసే సంభాషణ పిల్లల్లో ఆసక్తిని, కుతూహలాన్ని కలిగించేలా ఉండాలి.
2) వారి కుటుంబాన్ని గురించి – వారి ఇంటిలోని జంతువులు, పక్షులు మొక్కలను గూర్చి మాట్లాడించాలి.
3) వారి సంభాషణలోని దోషాలను ఎత్తిచూపకుండా, పరోక్షంగా సరిచేయాలి.
4) విద్యార్థికి అర్థమయ్యే భాషలో సంభాషణ కొనసాగించాలి.
5) విద్యార్థి ఇంట్లో చేసుకున్న పండుగ లేదా వారి గ్రామాల్లో జరిగే ఉత్సవాలు – వీటిని గురించి మాట్లాడించాలి.
6) పిల్లవాడు తాను చేసుకున్న పుట్టిన రోజును గురించి మాట్లాడమనాలి.
7) విద్యార్థి టి.వీ.ల్లోగాని, థియేటర్‌లలోగాని ఇటీవల తాను చూసిన సినిమాలోని సన్నివేశాలను గురించి మాట్లాడమనాలి.

ఈ విధమైన చర్యలవల్ల పిల్లవాడు స్వేచ్ఛగా మాట్లాడతాడు.

**శిశుగీతాలు**

ఆంగ్లభాషలో వీటిని రైమ్స్ అంటారు. తెలుగులో 'బాలగేయాలు' అని పిలుస్తారు. పిల్లలకు పాటలంటే ఇష్టం కాబట్టి వారి స్థాయికి తగిన గేయాలు పాటించాలి. శిశుగీతాలు నేర్పేటప్పుడు ఈ క్రింది అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి.

1) తాను ముందుగా లయబద్ధంగా పాడి విద్యార్థులందరిచేత పాడింపజేయాలి.

2) లయ ప్రాధాన్యతను బట్టి – ఆ గేయం అర్థాన్ని కూడా బోధించాలి.

3) ముందు జట్టుగా పాడించాలి – అప్పుడే అందరూ పాల్గొంటారు.

4) కొంత శిక్షణ అనంతరం ప్రతి విద్యార్థిచేత పాడించాలి.

5) చివరిలో తరగతిగదిలోని విద్యార్థులందరిచేత పాడించాలి.

**శిశుగీతాలు – ప్రయోజనాలు**

1) ఈ గీతాల వల్ల విద్యార్థిలో మానసిక ఆనందం కలుగుతుంది.

2) నిర్దుష్టమైన ఉచ్చారణ అలవడుతుంది.

3) జట్టు కృత్యం వల్ల సంఘీభావం వృద్ధి పొందుతుంది.

4) ఉత్సాహంతో పాఠశాలకు వస్తారు.

5) నూతన పదాలు పరిచయమై పదజాలాభివృద్ధి చెందుతుంది.

**అభినయగేయాలు**

అభినయాన్ని జోడిస్తూ లయబద్ధంగా పాడే గేయాలను అభినయగేయాలు అని అంటారు. ఇవి విద్యార్థులకు పాఠ్యాంశాలపై ఆసక్తిని కలిగిస్తాయి. పాఠశాలకు రావడానికి ప్రేరణ కలిగిస్తాయి. పఠన నైపుణ్యం, భాషా నైపుణ్యాలు పెంపొందేటట్లు సహకరిస్తాయి. శిశుగీతాలు కేవలం లయతో కూడి ఉండడం వల్ల కొన్ని పదాలకు అర్థం ఉండకపోవచ్చు కాని అభినయగేయాల్లో అలాకాక ప్రతి పదం అర్థవంతంగా ఉండి ఆ అర్థానికి అనుగుణంగా అభినయించడానికి వీలు కలుగుతుంది. చేతులు, కాళ్ళు, ముఖం – వీటి కదలికల వల్ల విద్యార్థిలో ఆనందం, ఆసక్తితో బాటు ఆరోగ్యం కూడా పెంపొందుతుంది. ఈ అభినయ గేయాలు పిల్లల్లో ఉత్సాహాన్ని నింపుతాయి. ఆత్మ విశ్వాసాన్ని అధికం చేస్తాయి.

అభినయగీతాలకు ఒక ఉదాహరణ: లోగడ 5వ తరగతి తెలుగు వాచకంలో కుందా భాస్కరావు రాసిన 'ఎవరు గొప్ప?' (కొండ – ఉడత) గేయ సంభాషణ. ఒకరు కొండగా, మరొకరు ఉడతగా విద్యార్థులు జంటలుగా పాడుతూ అభినయించవచ్చు.

'ఉడతా! ఉడతా! చిన్నారి బుడతా!
వింటావా నాగొప్ప వివరించి చెబుతా!
అబ్బబ్బ! నా యెత్తు ఆకాశమంత!
అహ్హాహ! నా గొప్ప చెప్పలేనంత
నా ముందు నీవెంత?
ఓ చిన్న రాయంత!'

ఇలాంటి గేయాలను ఉపాధ్యాయుడు సేకరించి విద్యార్థులకు వినిపించాలి. వారితో అభినయింప జేయాలి. అభినయగీతాలు నేర్పేటప్పుడు ఉపాధ్యాయుడు ఈ క్రింది అంశాలను పాటించాలి.

1) పిల్లలను "U" ఆకారంలో కూర్చోబెట్టాలి.

2) గేయాన్ని చార్టుపై గాని / నల్లబల్లపైన గాని రాసి ఉంచాలి.

3) ఉపాధ్యాయుడు గేయాన్ని ముందుగా రెండు మూడుసార్లు పాడి వినిపించాలి.

4) అభినయం 2 రకాలు. 1. వాచికాభినయం 2. ఆంగికాభినయం. ఉపాధ్యాయుడు తాను అభినయం చేసి ముందుగా చూపాలి.

5) ఆ తరువాతనే విద్యార్థులచేత అభినయింపచేయాలి.

6) దోషాలను భూతద్దంలో చూపి, విద్యార్థులను నిందించకూడదు.

7) ముందుగా జట్లు జట్లుగా పాడించాలి.

8) ఆ తరువాత ప్రతి విద్యార్థిచేత వ్యక్తిగతంగా అభినయింపజేయాలి.

9) గేయంలోని వాక్యాలను, కీలక పదాలను గుర్తింపజేయాలి.

10) కీలక పదాలను పిల్లల నోటుపుస్తకాల్లో రాయించాలి.

11) వాటిని చదివించాలి / రాయించాలి.

ఇలా చేయడం వల్ల విద్యార్థిలో ఈ క్రింది మార్పులు కలుగుతాయి.

1) వాచిక, ఆంగిక అభినయాల సమన్వయం జరుగుతుంది.

2) విద్యార్థిలో సభాకంపం తొలగుతుంది.

3) అలసట లేకుండా హాయిగా ఆడుతూ, పాడుతూ కొత్త విషయాలు నేర్చుకుంటాడు.

4) ఐకమత్యం పెంపొందుతుంది.

5) గేయాన్ని ఆనందిస్తారు.

6) పరవళ్లు తొక్కే ఉత్సాహంతో అభినయ గేయాలపట్ల అభిరుచిని పెంపొందించుకుంటారు.

7) అభినయగీతాల అభినయం కళాత్మక రూపాలకు దారితీస్తుంది.

**కథా – కథనం**

కథలంటే చిన్న పిల్లలు చెవి కోసుకుంటారు. విద్యార్థులలో సహజంగా ఉన్న ఈ ఆసక్తిని ఆధారం చేసుకొని ఉపాధ్యాయుడు వారిలో భాషణ చాతుర్యాన్ని పెంచడానికి ప్రయత్నం చేయాలి. కథలలో చాలా రకాలున్నా విద్యార్థుల వయస్సును బట్టి, మానసిక స్థాయిని బట్టి "అల్లా ఉద్దీన్ అద్భుత దీపం" వంటి అద్భుత కథలు, 'పరమానందయ్య శిష్యులు' వంటి హాస్య కథలు, బలిచక్రవర్తి – వామనుడులాంటి పురాణ కథలు, మంచి సమరేయుడు (గుడ్‌సమారిటన్) లాంటి బైబిల్ కథలు చెప్పాలి. మనం చెప్పే ఆ కథలు విద్యార్థులకు ఉత్సాహాన్ని, విజ్ఞానాన్ని పెంపొందించే విధంగా ఉండాలి. విద్యార్థులు ఆయా కథల్లోని పాత్రలతో మమేకం చెందుతారు. ప్రత్యక్షంగా మనం చెప్పకుండానే ఆ కథల్లో అంతర్లీనంగా ఉండే నీతిని గ్రహిస్తారు. ఇంతకూ కథకు, కథనానికి ఉన్న భేదం ఏమిటి? కథ అంటే అందులోని విషయం, కథనం అంటే ఆ కథను చక్కని హావభావాలతో అందంగా చెప్పడం.

**కథా కథనంలో తీసుకోవలసిన జాగ్రత్తలు**

1) కథా ప్రారంభం, దాని ముగింపులో ఉత్సుకతను కలిగించేదిలా ఉండాలి.
2) చిన్న చిన్న వాక్యాలతో కూడి ఉండాలి గాని సంక్లిష్ట వాక్యాలు సాధ్యమైనంత వరకు ఉండకూడదు.
3) కథకు చక్కని అభినయం జోడించాలి.
4) చెప్పే కథను విద్యార్థులు శ్రద్ధగా వింటున్నారా? లేదా? గమనించాలి.
5) కథను చెప్పి చిన్న, చిన్న ప్రశ్నల ద్వారా కథా సారాంశాన్ని రాబట్టాలి.
6) కథ యొక్క నీతిని పిల్లల నుండే రాబట్టాలి.

**కథా కథనం – ప్రయోజనాలు**

1) అభ్యసనం రసరమ్యంగా మారుతుంది.
2) విద్యార్థుల్లో వినాలనే ఆసక్తి పెంపొందుతుంది.
3) ఉచ్చారణ నిర్దుష్టంగా ఉంటుంది.
4) నూతన పదాల పరిచయమేర్పడుతుంది.
5) ధైర్యంగా – కంపం లేకుండా మాట్లాడే శక్తి కల్గుతుంది.
6) అభినయం పట్ల అభిరుచి పెంపొందుతుంది.
7) ముఖ్యంగా కథనశక్తి – కల్పన, సృజనాత్మకత శక్తులు పెంపొందుతాయి.

**శ్రవణ భాషణాలను తరగతి గదిలో నిర్వహించే విధానం**

1) విద్యార్థులను వృత్తాకారంలో కూర్చోబెట్టి ఉపాధ్యాయుడు పిల్లలకు మధ్యలో కూర్చోవాలి.
2) విద్యార్థులు తమ అనుభవాలను, అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పేలా ప్రోత్సహించాలి.
3) విద్యార్థులు చెప్పిన విషయాన్ని ఖండించకూడదు.
4) విద్యార్థుల భాగస్వామ్యం అధికంగా ఉండాలి. ఉపాధ్యాయుడు కేవలం మార్గదర్శిగా మాత్రమే వ్యవహరించాలి.
5) తరగతిలోని అందరూ మాట్లాడడానికి అవకాశం ఇవ్వాలి.
6) శ్రవణ భాషణాలను నిర్వహించడానికి ప్రత్యేకంగా ఒక పీరియడ్‌ను కేటాయించుకుని అప్పుడే ఈ కృత్యాన్ని నిర్వహించాలి.

### 3.3.3 భాషణ రూపాలు

పిల్లవాడు బడిలో ప్రవేశించేనాటికే అప్రయత్నంగానే అనేక విషయాలు మాట్లాడడం నేర్చుకుంటాడు. అది పరిమితంగా ఉన్నా తరువాత పాఠశాలలో నేర్చుకొనే భాషణానికి ఎంతో సహాయ పడుతుంది. కుటుంబ సభ్యుల సహకారంతో సంవత్సరం నిండే సరికి చిన్న చిన్న పదాలను ఉచ్చరిస్తారు. రెండవ సంవత్సరానికి ఆ మాటల్లో స్పష్టత ఏర్పడి మూడవ సంవత్సరం వచ్చేసరికి కొన్ని కఠిన పదాలను అనగా ద్విత్వాక్షరాలు, సంయుక్తాక్షరాలు ఉన్న పదాలను పలుకగలుగుతారు. ఇలా ఒక క్రమ పద్ధతిలో భాషణ ప్రక్రియ కొనసాగుతుంది. అంతేగాని ఈ భాషణ శక్తి ఒకేసారి అలవడేది కాదు. అందుకే

పాఠశాలలో ప్రవేశించిన పిల్లవానిని ఉపాధ్యాయుడు స్నేహితునిగా పలకరిస్తే పిల్లవాడు స్వేచ్ఛగా మాట్లాడుతూ తన పదజాలాన్ని అభివృద్ధి చేసుకొంటాడు. ప్రాథమిక స్థాయి నుండి తరగతిలో పిల్లలు ఈ క్రింది విధంగా భాషణాన్ని పెంపొందించు కొనవచ్చు.

**అ) సొంత అభిప్రాయాలను వెల్లడించడం:** ప్రతి పిల్లవాడు తనకంటూ కొన్ని అభిప్రాయాలను కలిగి ఉంటాడు. తరగతి గది వాతావరణం అనుకూలంగా లేనప్పుడు తాను తన అభిప్రాయాన్ని వెల్లడిచేస్తే తోటి పిల్లలు, ఉపాధ్యాయుడు హేళన చేస్తారేమో అన్న జంకు ఎక్కువగా ఉంటుంది. అప్పుడు తన భాషణాన్ని నియంత్రించుకుంటాడు. ఇలా కట్టడి చేసుకోవడం భాషణ నైపుణ్య సాధనకు అడ్డుకట్టగా మారవచ్చు.

అందుకే పిల్లలు సొంత అభిప్రాయాలను చెబుతున్నప్పుడు ఉపాధ్యాయుడు, తోటి విద్యార్థులు గేలి చేయకుండా చూడడం – అలాగే తాను కూడా దోషాలను ఎత్తి చూపకుండా ప్రోత్సహించడం చేస్తే పిల్లవాడు స్వేచ్ఛగా తన అభిప్రాయాలను వెల్లడి చేస్తాడు.

**ఆ) ప్రశ్నించడం:** అప్పుడే పాఠశాలలో అడుగు పెట్టిన పిల్లవానికి ప్రతి అంశం కొత్తగాను, ఆశ్చర్యంగాను ఉంటుంది. వెంటనే తోటి విద్యార్థులను, ఉపాధ్యాయులను కూడా ప్రశ్నించి, తెలుసుకొనే ప్రయత్నం చేస్తాడు. తన పరిసరాలలోని వివిధ సన్నివేశాలు, సంఘటనలను గురించి ప్రశ్నించి తెలిసికొంటే అది విషయ జ్ఞానాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుంది. అందుకే ఉపాధ్యాయుడు పిల్లలలోని ప్రశ్నించే స్వభావాన్ని ప్రోత్సహించి ఆతని ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు చెప్పాలి. అప్పుడే విద్యార్థి సహేతుకంగా ప్రశ్నించి సమాధానం రాబట్టుకొని, విస్తృత జ్ఞానాన్ని పొందుతాడు.

**ఇ) వాదించడం:** వాదించడం అంటే పోట్లాడడం కాదు – తనకు తెలిసిన విషయమే సరియైనదనే దృఢమైన అభిప్రాయం కలిగి ఉండడం. అందుకే పిల్లవాడు ఏ విధమైన అనుమానం లేకుండా తన భావాన్ని వెల్లడి చేస్తే రెండు లాభాలను పొందగలుగుతారు. మొదటిది తన భావాలను, అభిరుచులను, ఆలోచనలను వ్యక్తం చేయడం ద్వారా భాషణశక్తిని పరిపుష్టం చేసుకుంటాడు. రెండవది ఆతని అవగాహనలోని దోషాలను ఉపాధ్యాయుడు సరిదిద్దే అవకాశం ఉంటుంది. ఇది ప్రాథమిక దశలో చాలా పరిమితంగా మాత్రమే ఉంటుంది.

**ఈ) చర్చించడం:** ఈ చర్చించడం ప్రాథమిక దశలో పిల్లవానికి అంత సమర్థత లేకపోయినా చిన్న చిన్న అంశాలపై చర్చించి ఒక మంచి ముగింపుకు దారి తీస్తే, పిల్లవానిలో తార్కికశక్తి అభివృద్ధి చెందుతుంది. పిల్లలు పరస్పరం చర్చించుకొంటే భావ వ్యక్తీకరణ సామర్థ్యం పెంపొంది అదనపు పరిజ్ఞానాన్ని పొందుటకు సహాయపడుతుంది.

**ఉ) వర్ణించడం:** వర్ణించడం కేవలం పెద్ద పిల్లలకే పరిమితం కాకూడదు. ప్రాథమిక స్థాయి విద్యార్థులు కూడా ఆ సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. తమ పరిసరాలలో ఉన్న చెట్లను, పక్షులను, జంతువులను తాను విన్న కథలను, తాను చూసిన సన్నివేశాలను తనదైన మాటలతో వర్ణిస్తే ఆతనిలో భాషణ శక్తి, సృజనాత్మక శక్తి పెంపొందుతాయి.

**ఊ) కథలు చెప్పడం:** చిన్న పిల్లలకు ఇంటి దగ్గర ఉండే పెద్దలు చిన్న చిన్న కథలు చెబుతారు. ఉపాధ్యాయుడు తాము విన్న కథలను చెప్పే అవకాశం తరగతి గదిలో కల్పిస్తే మొదట ముందు వెనుకలు తారు మారయినా క్రమక్రమంగా కథను ఉన్నది ఉన్నట్లు చెప్పగలుగుతారు. అలా చేయడం వల్ల ఆతనిలో భాషణ శక్తి పెంపొందడమే కాకుండా జ్ఞాపకశక్తి కూడా వృద్ధి పొందుతుంది. ఈ విధంగా పిల్లవాడు ఒక క్రమ పద్ధతిలో భాషణశక్తిని అభివృద్ధిపరచుకోవాలి.

### 3.3.4 సంభాషణ ప్రాముఖ్యత – సమవయస్కులతో పరస్పర సంభాషణ

సరియైన ఉచ్చారణ, సంభాషణకు ప్రాణం వంటిది. భాషణ శక్తి చక్కగా ఉన్న పిల్లవాడు తన భావాన్ని స్పష్టంగా చెప్పగలుగుతాడు. ఇతరులను ఆకట్టుకుంటాడు. అటువంటి భాషను బాల్యంలో సమవయస్కులతో సహజ వాతావరణంలో సంభాషించడం ద్వారా కూడా సొంతం చేసుకుంటాడు. అంతేగాక సమవయస్కులతో ఆడుకోవడానికి, ఎక్కువ సమయాన్ని గడపడానికి ఎక్కువగా ఇష్టపడతాడు. కుటుంబం నుంచే గాక సమవయస్కుల నుండి కూడా నేర్చుకున్న భాషను అవసరమైనప్పుడు కొంత భాగాన్ని మాత్రమే వినియోగించగలుగుతారు. భాషలో సంక్లిష్టమైన పదాలని మనం భావిస్తున్న పదాలను కూడా సమవయస్కులనుండి అలవోకగా నేర్చుకుంటాడు. అలా భాషను స్వీకరించడంతోబాటు వ్యక్తీకరణనుగూడా అర్థవంతంగాను, సమర్థవంతంగాను చేసుకుంటాడు. ఆ సమయంలో తన మాతృభాషతోబాటు సమవయస్కుల ఇతర భాషలను ఒకటి రెండు నేర్చుకోగలుగుతాడు.

## 3.4 పఠనం – లేఖనం

**పఠనం**

జ్ఞానం అనంతమైనది. ఆ జ్ఞానాన్ని సంపాదించడానికి కేవలం శ్రవణ, భాషణ నైపుణ్యాలు సరిపడవు. అందుకు పఠనం చాలా ముఖ్యం. ఒక విషయాన్ని చదివి తద్వారా దాని భావాన్ని గ్రహించడమే పఠనం అనబడుతుంది. ముద్రితమైయున్న, రాయబడియున్న పదాలను లేక వాక్యాలను వాగింద్రియాల సహాయంతో పలకడాన్నే పఠనం అంటారు. విస్తారమైన గ్రంథ పఠనం వల్ల విజ్ఞానాభివృద్ధి కలుగుతుంది. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్, బి.ఆర్. అంబేద్కర్, గుర్రం జాషువా, శ్రీశ్రీ, గురజాడ, వంటి మహనీయులు అనేక మంది పుస్తక పఠనం ద్వారానే గొప్ప మేధావులైనారు. మంచిగ్రంథాలు విజ్ఞానసుగంధాలు. విద్యార్థులు అన్ని రకాల పుస్తకాలు చదవాలి. అసలు ప్రపంచమే తెరిచిన పుస్తకంలాంటిది. దాన్ని చదవడం వల్ల మన జ్ఞాన నేత్రాలు తెరుచుకుంటాయి.

### 3.4.1 అక్షరాస్యత పఠనం

చదవడం – రాయడం వచ్చిన వారిని అక్షరాస్యులు అని – అలా కాని వారిని నిరక్షరాస్యులని వ్యవహరిస్తున్నాం. నిజానికి –

- □ చదవడమంటే కేవలం అక్షరాలు చదవడం కాదు – అర్థం చేసుకుంటూ, అవగాహనతో చదవడం
- □ చదవడమంటే కేవలం పాఠ్య పుస్తకాలు చదవడమే కాదు – పాఠ్యేతర పుస్తకాలనుసైతం అర్థవంతంగాను, ఆసక్తిగాను చదవడం. ఇలా ప్రతి కొత్త పుస్తకాన్ని సొంతంగా చదవడాన్ని 'చదవడం' అనాలి.
- □ రాయడమంటే ఏదో కొన్ని వాక్యాలను తప్పులు లేకుండా రాయడమే కాదు. సొంతగా తనకంటూ ఒక శైలిని ఏర్పరచుకొని రాయడం. ఇలా రాయడాన్నే 'లేఖనం' అనాలి. ఇవి సృజనాత్మకతకు దారితీయాలి.

చదవడం – రాయడం ఈ రెండు అవినాభావ సంబంధం గలవి. ఎంత ఎక్కువ చదువుతారో, అంత చక్కగా రాయగలుగుతారు. చదవడం అంటే కేవలం అక్షరాలు చదవడం కాదని అనుకున్నాము. ఎందుకంటే భాషకు లిపిలేని కాలంలో అనగా పుస్తకాలు లేని రోజుల్లో కూడా గురువుల దగ్గర శిష్యులు పఠనం చేసేవారు. అదువలననే ఇప్పుడు పుస్తకాలను పరోక్ష గురువులనవచ్చును.

- చదవడమంటే తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడమన్న మాట. అందువల్ల ఉపాధ్యాయుడు పిల్లలకు పుస్తకాలు చదివి అర్థం చేసుకొనే శక్తి యివ్వాలి. అప్పుడు వారు ఆ శక్తి ద్వారా పుస్తక ప్రపంచంలోనికి ప్రవేశించి విజ్ఞానాన్ని సంపాదిస్తారు.

ఏ దేశంలో అక్షరాస్యులు ఎక్కువ మంది ఉంటారో ఆ దేశం అన్ని రంగాలలో ముందంజలో ఉంటుందన్నది యధార్థం. అందుకే మన దేశంలో కూడా 1990–91 సం॥లో సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమం ప్రారంభింపబడింది.

1968లో భారత ప్రభుత్వం ప్రకటించిన "జాతీయ విద్యా విధానం" లో శిశు విద్య, సార్వత్రిక ఎలిమెంటరీ విద్యను గురించి చాలా స్పష్టమైన సూచనలు చేసింది. అక్షరాస్యత పెంపొందించడం కోసం ప్రాథమిక పాఠశాలల్లో నిత్యావసర సదుపాయాలు అంటే కూర్చోవడానికి బల్లలు, మంచినీటి సదుపాయం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, రక్షణ కొరకు పాఠశాలకు ప్రహరీగోడలు – విద్యుత్ సదుపాయం మొదలైనవి తప్పనిసరి అని పేర్కొంది. దానికి అనుగుణంగానే ఇప్పుడు ప్రాథమిక పాఠశాలలు చాలా వరకు అందమైన రూపాన్ని సంతరించుకుంటున్నాయి.

మూర్తిమత్వ వికాసానికి గ్రంథ పఠనం మొదటి సోపానం. భాషా నైపుణ్యాలలో మూడవదైన ఈ పఠన నైపుణ్యం స్వతస్సిద్ధంకాక – ప్రయత్న పూర్వకంగా మాత్రమే అలవడుతుంది. పఠనం ద్వారా కలిగిన జ్ఞానం వ్యవహార దక్షతను సాధించి పెడుతుంది. అంతేకాదు, సాంస్కృతిక వారసత్వ విలువల పరిరక్షణకు కూడా దోహదపడుతుంది. కూలంకష జ్ఞానాన్ని, నిర్దుష్టతను సాధించి పెట్టగల ఈ పఠన నైపుణ్యం విద్యార్థులకు ప్రాథమికస్థాయి నుండే అలవడాలి. దోషరహితంగా భాషణం గావించడం నిర్దుష్ట పఠనానికి, అట్టి నిర్దుష్ట పఠనం నిర్దుష్ట లేఖనానికి తోడ్పడతాయి. పఠనం అనేది అక్షరాభ్యాసం నుండి జీవిత పర్యంతం నిర్వహింపవలసిన ఒకానొక కృత్యం. కఠోర శ్రమకోర్చి, ఎంతో కృషిచేసిన మహర్షులు; మహాకవులు ద్రష్టలై జ్ఞాన సంపదను ఆర్జించి దానిని గ్రంథస్థం చేసి, తరువాతి తరాల వారి మనుగడకు, సంస్కృతికి, మేలైన జీవనానికి దారి చూపించారు. ఆజ్ఞానాన్ని కేవలం పఠనం ద్వారా మాత్రమే పొందగలం. పఠనం భాషణ లేఖనాలకు వారధిగా నిలుస్తుంది. పఠనం విరామ సమయాన్ని సద్వినియోగపరచేదిగా కూడా ఉపకరిస్తుంది.

### 3.4.2 పఠనం మార్గాలు / పద్ధతులు

పఠనంలో మనం అనుసరించే విధానాన్ని బట్టి –

(అ) మౌన (ఆ) బాహ్య (ఇ) విస్తార (ఈ) క్షుణ్ణ పఠనాలని నాల్గు విధాలుగా పేర్కొనవచ్చు. ప్రాథమిక స్థాయిలో బాహ్యపఠనం విద్యార్థి వికాసానికి ఎంతో దోహదపడుతుంది. నిర్దుష్ట వాచిక చర్యను సాధించడానికి ప్రాథమిక స్థాయిలో పఠనం ఎంతైనా అవసరం.

**మౌన పఠనం – ఆవశ్యకత**

విషయాన్ని గ్రహించడంలో వాగింద్రియాలకు ఏ మాత్రం శ్రమ లేకుండా, కేవలం కంటి చూపుతోనే చదవడాన్ని మౌన పఠనం అని అంటారు. మౌన పఠనం చేసేవారికి ఎలాంటి శ్రమ ఉండదు. ఎదుటివారికి ఇబ్బంది ఏర్పడదు. తక్కువ సమయంలో ఎక్కువ విషయ గ్రహణానికి వీలు కల్గుతుంది.

**ప్రయోజనాలు**

1) వాగింద్రియాలకు ఏ మాత్రం అలసట కలగదు.
2) విస్తార పఠనానికి దోహద పడుతుంది.
3) తక్కువ సమయంలో ఎక్కువ జ్ఞానాన్ని సాధించవచ్చు.
4) తోటివారికి ఏ విధమైన ఇబ్బంది కలుగదు.
5) పఠనం చురుకుగా, వేగంగా నడుస్తుంది.
6) గ్రంథాలయాలలో ఈ పఠనమే అనుసరణీయం
7) ఏకకాలంలో విద్యార్థులందరి పఠన జ్ఞానాన్ని ఉపాధ్యాయుడు పరీక్షించగలడు.
8) మానసిక శాంతిని కలిగిస్తుంది.
9) బాహ్య పఠనానికి ప్రాతిపదికగా నిలుస్తుంది.
10) ఏకాగ్రతను, అవధానతను పెంచుతుంది
11) రసానుభూతిని కలిగిస్తుంది.
12) చదివిన విషయాన్ని బాగా గ్రహించగలడు.

**బాహ్య పఠనం / ప్రకాశ పఠనం**

విద్యార్థుల వాగ్దోషాలను తెలిసికొని, నివారించుటకు బాహ్యపఠనం ఎంతగానో ఉపయోగిస్తుంది. ప్రాథమిక దశలో విద్యార్థి చక్కని ఉచ్చారణకు, తేలికగా భావ వ్యక్తీకరణకు ఉపయోగపడడమే కాక, మనోవికాసానికి దోహద పడుతుంది. నిర్దుష్ట వాచిక చర్యను సాధించుటకు ఇది అత్యంత ఆవశ్యకం.

ప్రాథమిక స్థాయిలో ఈ క్రింది కృత్యాల ద్వారా బాహ్య పఠనాన్ని వృద్ధి చేయవచ్చు.

**1) అక్షర పద్ధతి**: దీనిని “వర్ణసమామ్నాయ పద్ధతి” అని కూడా అంటారు. ఈ పద్ధతికి ఫ్లాష్ కార్డులు అత్యంత సహాయకారిగా ఉంటాయి.

**2) నవీనాక్షర పద్ధతి**: అక్షరాలలో ఒకే పోలిక కలిగిన అక్షరాలను కొన్ని వర్గాలుగా విభజించి, ఒక్కొక్క వర్గాన్ని ఒక యూనిట్‌గా నేర్పడం.

**3) పద పద్ధతి**: కొన్ని పదాలను ప్రాతిపదికగా గ్రహించి, విద్యార్థులు అవి చూసి చదివేటట్లు చేయడమే పదపద్ధతి. ఈ పద్ధతిలో ఫ్లాష్ కార్డులను బాగా ఉపయోగించాలి. ఆ కార్డులపై విద్యార్థులకు బాగా పరిచయమున్న వస్తువుల బొమ్మలను వేసి – బొమ్మలను చూసి పేర్లు చెప్పించాలి. దీనిని “గుర్తింపు కార్డు” అని కూడా అంటారు.

**4) వాక్య పద్ధతి**: పదపద్ధతిలో పదాలను ప్రాతిపదికగా గ్రహించినట్లే, వాక్య పద్ధతిలో వాక్యాన్ని ప్రాతిపదికగా తీసికోవాలి. ఒక వాక్యాన్ని వ్రాసి ఆ భావాన్ని తెలిపే బొమ్మను ఆ వాక్యాలపైన చిత్రీకరించాలి. అది పిల్లలచేత చెప్పించాలి.

**5) కథా పద్ధతి**: బొమ్మలు చూసి కథలు చెప్పడం / చెప్పించడం.

**ప్రయోజనాలు**

1) ఈ బాహ్యపఠనం ద్వారా పిల్లలు ఉచ్చారణ దోషాలు గమనించి, వెంటనే సవరించవచ్చు.
2) స్పష్టమైన భాషణకు ఈ పద్ధతి బాగా ఉపయోగిస్తుంది.
3) చక్కని గేయాలను అభినయంతో పెద్దగా చదవడం వల్ల ఆనందానుభూతిని పొందుతారు.
4) విద్యార్థులందరిచేత సాముదాయిక పఠనం చేయించవచ్చు.
5) ఒక్కొక్క విద్యార్థిచే వైయక్తిక పఠనం చేయించవచ్చు.
6) విద్యార్థి మంచి వక్తగా రాణించవచ్చు.
7) విద్యార్థులు భావయుక్తంగా చదవడానికి అలవాటు పడతారు.
8) వైయక్తిక పఠనం చేయించడానికి ముందు ఉపాధ్యాయులు విద్యార్థికి తేటతెల్లమయ్యే విధంగా ఆదర్శ పఠనం చేయాలి. అది విద్యార్థుల బాహ్య పఠనాన్ని ప్రభావితం చేస్తుంది. కాబట్టి ముందుగా ఉపాధ్యాయుడు తగు విధంగా ఆదర్శ పఠనం చేసిన పిమ్మట మాత్రమే విద్యార్థిని బాహ్యపఠనానికి ప్రోత్సహించాలి. విద్యార్థులు పాఠంలోని సన్నివేశాన్నిబట్టి అర్థవంతంగా చదవడం ఎంతో ముఖ్యమైన విషయం.
9) వాగింద్రియాలకు మంచి అభ్యాసం కలుగుతుంది.
10) సభాకంపం తొలగుతుంది.
11) సభల్లో వక్తగా మాట్లాడగల శక్తి పెరుగుతుంది.

**పఠన లేఖనాలను తరగతి గదిలో ఎలా నిర్వహించాలి?**

1) ఈ కృత్యాన్ని తరగతి గదిలో వ్యక్తిగతంగా గాని లేదా జట్టు కృత్యంగా గాని నిర్వహించవచ్చు.
2) తరగతిలోని ప్రతి విద్యార్థి చేత వ్యక్తిగతంగా అభ్యాసాన్ని చదివించి అనంతరం ఏమి చేయాలో వారి నుండే రాబట్టాలి.
3) పిల్లలు చెప్పిన సమాధానాలను నల్లబల్లపై రాయాలి. అనంతరం వారి నోటు పుస్తకాలలో రాసుకోమనాలి.
4) మొదట ఈ కృత్య నిర్వహణ జరిపి, తరువాత తరగతిలోని అందరి పిల్లల చేత వ్యక్తిగతంగా రాయించాలి.

### 3.4.3 పూర్వ పఠనం

భాషా నైపుణ్యాలలో మూడవదైన పఠనం ఒక ఊహాత్మక ప్రక్రియ. సాధారణంగా ఒకటి రెండు సంవత్సరాల పిల్లలు తమకు లభించిన పుస్తకాల్లోని పేజీలను తిరగేస్తూ మాట్లాడుకుంటూ ఉండడం మనం గమనిస్తుంటాం. ఆ పుస్తకాల్లోని రంగు రంగుల బొమ్మలను చూస్తూ ఆనందిస్తూ ఉంటారు. అలా చూసిన బొమ్మల ఆధారంగా కొత్త పదాలు, వాక్యాలు నిర్మించగల్గుతారు.

బడికి రాకముందు పిల్లలకు పఠన సామర్థ్యం ఉండదని, పాఠశాలలో చేరిన పిమ్మటనే ఉపాధ్యాయుడు శిక్షణ ఇస్తాడని చాలా మంది అభిప్రాయ పడుతుంటారు. ఇది యధార్థం గాదు. బడికి రాకముందు కూడా పిల్లలో పఠన సామర్థ్యం స్వల్పంగా ఉంటుంది. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అత్యంత శ్రద్ధ వహించడం వల్ల కొందరి విద్యార్థులలో కొంత మేరకు హెచ్చుగా ఉంటోంది. పఠనం అంటే కేవలం పదాలు, వాక్యాలు చదవడం మాత్రమే కాదు ఈ క్రింది పద్ధతుల ద్వారా కూడా పఠన క్రియ జరుగుతోంది.

**1) చిత్రాలను చూచి పఠనం:** చదువుకొన్న తల్లిదండ్రులు మార్కెట్లో లభిస్తున్న వివిధ చిత్ర పటాలను – బొమ్మల కథల పుస్తకాలను కొని తెచ్చి పిల్లలతో ఆ చిత్రంలోని బొమ్మలను – వాటి వర్ణన – వాటి చేష్టలు మొదలగు వాటిని పలికేటట్లు చేస్తుంటారు. ఆ బొమ్మలు రంగు రంగులతో ఆకర్షణీయంగా ఉండడం వల్ల పిల్లలు కూడా పెద్ద వారిని ఆ వివరాలను ఇష్టంతో అడిగి తెలిసికొంటారు.

1, 2 తరగతులలోని పిల్లలకు ఉపాధ్యాయుడు కూడా అలాంటి బొమ్మలను, బొమ్మల పుస్తకాలను చూపించి వారిలోని పఠనాసక్తిని పెంపొందింపవచ్చు. బొమ్మలు గీయడం, సన్నివేశ చిత్రాలను చదివించడం, చిత్ర కథల ద్వారా పఠన నైపుణ్యాన్ని పెంపొందించవచ్చును.

**2) నమూనాలను చూపించుట:** అట్టలతో, కొయ్యతో, లోహాలతో, మట్టితో చేసిన ఏనుగు, గుఱ్ఱం, ఆవు లాంటి నమూనాలు చూపించి పిల్లలతో పఠింప జేయాలి.

**3) బాల సాహిత్యం:** ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనూ ఆపరేషన్ బ్లాక్‌బోర్డ్ పథకం పుణ్యాన బాలసాహిత్యానికి చెందిన పుస్తకాలు కుప్పలు తెప్పలుగా ఉంటున్నాయి. ఉపాధ్యాయుడు ఆ పుస్తకాలను సందర్భానుసారంగా ఉపయోగించి, పిల్లలను పఠనానికి ప్రోత్సహించాలి. "లైబ్రరీ రీడింగ్" అలవర్చాలి.

**4) నాటకీకరణ:** వాచకాల్లోని పాఠ్యాంశాలను చిన్న చిన్న సంభాషణలతో సులభశైలిలో నాటికగా మార్పుచేసి విద్యార్థులచే పఠించునట్లు చేయాలి. ఇవి కాక నల్లబల్లపై సూక్తులు, కొన్ని వస్తువుల పేర్లు రాసి విద్యార్థులచే పఠింపజేయాలి. ఇలాంటి పూర్వ పఠన సామాగ్రిని వినియోగించినచో పిల్లలు ఉత్తమ పఠితలుగా తీర్చిదిద్దబడతారు.

4, 5 తరగతుల విద్యార్థులకు

1) రకరకాల మ్యాగజైనులు, వారపత్రికలు, మాసపత్రికలు, చందమామ, బాలమిత్ర, ముళ్ళపూడి వెంకటరమణ, చిత్రకారుడు బాపు కలిసి తయారుచేసిన కథల పుస్తకాలు మొదలైనవి.

2) వార్తా పత్రికలు – వారికి చూపించి ప్రోత్సహిస్తే స్వల్పంగానైనా విద్యార్థులు చదవడానికి ప్రయత్నం చేస్తారు. రకరకాల వార్తలు సేకరించడం, స్కూల్ అసెంబ్లీలో చదివించడం, ఏ రోజు ముఖ్యమైన వార్తలు ఆరోజు నోటు పుస్తకంలో రాయించడం.

**పఠనానంతర కృత్యాలు**

పూర్వ పఠన కృత్యాల ద్వారా పిల్లలలో పఠనాసక్తిని పెంపొందించి, ఆ ఆసక్తిని మరింత పెంచుకొనుటకు ఉపాధ్యాయుడు కొన్ని పఠనాలతో కృత్యాలు నిర్వహించాలి.

1) ఉపాధ్యాయుడు తన బోధనలో ఆసక్తికర అంశాలను ప్రస్తావించి తరువాత జరిగిన ఘట్టాన్ని చదివి తెలిసికోమని చెప్పాలి. అప్పుడు పిల్లలు సొంతంగా చదవడానికి పూనుకుంటారు.

2) విరామ సమయంలో పిల్లలచే బాహ్యపఠనం చేయించి – బాగా చదివిన పిల్లలను ప్రశంసించాలి.

3) 1,2 తరగతుల విద్యార్థులకు వారి సమీపంలోని అంశాలకు చెందిన చిత్రాలను చూపించాలి.

4) 3వ తరగతి నుండి క్రమంగా దృశ్యాలను తొలగించి, కేవలం పదాలను చూపుతూ పఠింపజేయాలి.

5) పాఠశాల అసెంబ్లీలో వార్తలు బాగా చదివిన విద్యార్థులను అభినందించాలి.

### 3.4.4 పాఠ్యేతర పుస్తకాలు

పిల్లలలో భాషాభివృద్ధి జరగాలంటే కేవలం వాచకాలను (పాఠ్య పుస్తకాలను) మాత్రమే చదివితే సరిపోదు. వారి స్థాయికి తగిన ఇతర పుస్తకాలను అంటే "పాఠ్యేతర పుస్తకాల"ను కూడా చదివించాలి. ఇలా చదవాలంటే పిల్లలకు పఠనం (చదవడం) పట్ల ఆసక్తిని కలిగించాలి. అందుకు వారికి ఇష్టమైన కథలు, గేయాలు, చిత్ర కథల వంటి పుస్తకాలను వారికి అందించి – వారిలో పఠనాసక్తిని పెంపొందించాలి. 'ఆపరేషన్ బ్లాక్ బోర్డు' పథకం ద్వారా ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ఎన్నెన్నో పుస్తకాలను సరఫరా చేశారు. వాటిని సద్వినియోగం చేయండి.

పాఠ్యేతర పుస్తకాలు చదవడానికి ఈ క్రింది అవకాశాలు కల్పించాలి.

1) కాలనిర్ణయ పట్టికలో గ్రంథాలయ పుస్తకాల పఠనం కోసం కొన్ని పీరియడ్లను కేటాయించాలి.

2) ఉపాధ్యాయుడే భారం వహించనవసరం లేదు. గ్రంథాలయ కమిటీలను ఏర్పాటు చేస్తే పిల్లలు పఠన సామాగ్రిని చక్కగా వినియోగించుకుంటారు.

3) గ్రంథాలయంలోని పుస్తకాలు తమకోసమే ఉన్నాయన్న భావాన్ని విద్యార్థులలో కలిగించాలి.

4) పుస్తకాలను వారికి అందుబాటులో ఉంచి, ఎప్పుడు కోరుకుంటే అప్పుడు వారు ఆ పుస్తకాలను స్వేచ్ఛగా ఉపయోగించుకొనే ఏర్పాటు చేయాలి.

5) తరగతి గదిలో తీగను ఏర్పాటు చేసి పుస్తకాలను వ్రేలాడదీసి ప్రదర్శిస్తే పిల్లలు ఆ పుస్తకాలను తీసి చదువుకుంటారు.

6) విద్యార్థుల్లో పటనాభిరుచి పెంపొందుతుంది. అది వ్యక్తిత్వ వికాసానికి దారితీస్తుంది.

### 3.4.5 పిల్లలు మంచి పాఠకులు కావడానికి సహకారం

అక్షరాభ్యాసం నుండి జీవితం ముగిసేవరకు మనిషి నిర్వహించే నిత్యకృత్యం పఠనం. భాషణ లేఖనాలకు వారధిగా నిలిచేది పఠనం. వర్తమాన స్థితిగతులు, అలాగే మహర్షులు మనకు అందించిన జ్ఞానసంపద కేవలం పఠనం ద్వారానే పొందగలం. అలాంటి పఠనాన్ని పిల్లలు అభివృద్ధి చేసుకొని మంచి సాధకులు కావడానికి కొన్ని చర్యలు అవసరం.

**1) గ్రంథాలయాలు**: పిల్లల్లో పఠన నైపుణ్యం పెంపొందించడానికి గ్రంథాలయాల పాత్ర ఇంత అని చెప్పడానికి వీలులేదు. గ్రంథాలయాలు విజ్ఞాన సర్వస్వాలు. గ్రంథలయాల్లో విద్యార్థి స్థాయిని బట్టి అనేక గ్రంథాలు ఉంటున్నాయి. ప్రాథమిక స్థాయిలో 4,5 తరగతుల విద్యార్థుల్లో గ్రంథాలయంలోని గ్రంథాలు చదివే అలవాటును పెంపొందించాలి. బాలబాలికలు పుస్తకాల ద్వారా గ్రహించిన విషయాలపై మాట్లాడించి ప్రోత్సాహక బహుమతులు అందించాలి. కథలు చదువుటలో గల

మెళకువలను తెలియపరచాలి. మంచి కథలు చదవడం వల్ల సామాజిక వికాసం కలుగుతుంది. సాంఘిక కథలు మన జీవితానికి అద్దంపడతాయి. సమాజంలోని మంచినీ, చెడునూ మనకు తెలియజేస్తాయి.

**2) చిత్రాలు**: ప్రాథమిక స్థాయికి తగిన చిత్రాలను తరగతి గదిలో ప్రదర్శింపజేసి, విరామ సమయంలో విద్యార్థులు వాటిని చదవడానికి ప్రోత్సహించాలి. బొమ్మల పట్ల వారికి ఉన్న సహజమైన అనురక్తి వారిని చదవడానికి ప్రోత్సహిస్తుంది. ఈ చిత్రాలు దృశ్య ఉపకరణాలుగా పిల్లల మనస్సుల్లో స్థిర రూపాలను ఏర్పరుస్తాయి. విషయావగాహనను పెంపొందిస్తాయి.

**3) బాలల బొమ్మల కథాపుస్తకాలు**: సరళ శైలిలో రాయబడిన బొమ్మల కథల పుస్తకాలు పిల్లల్లో పఠనాభిలాషను పెంపొందిస్తాయి. సంభాషణా చాతుర్యాన్ని వృద్ధి చేస్తాయి. ప్రాథమిక దశలో 5వ తరగతి పూర్తి అయ్యే సరికి రకరకాల బాలల కథల పుస్తకాలు విద్యార్థులు చదివే శక్తిని ఉపాధ్యాయుడు కలిగించాలి. తద్వారా వారిలో పరిపక్వత కలిగి గొప్ప గొప్ప రచయితల కథల పుస్తకాలను చదవడానికి వారిలో మంచి ప్రేరణ కలుగుతుంది.

**4) వార్తా పత్రికలు:** ప్రాథమిక స్థాయిలో వార్తాపత్రికల పాత్ర చాలా స్వల్పంగా ఉంటుంది. అందువల్ల ప్రతిరోజు ప్రార్థనా సమయంలో ఆనాటి పత్రికలలో ముఖ్యాంశాలను ఉపాధ్యాయుడు పెద్ద పిల్లల చేత చదివించాలి. దీనివల్ల ఆకర్షితులైన విద్యార్థులు ఆ పత్రికలను చదవడానికి ప్రయత్నం చేస్తారు. అంతేకాదు వార్తాపత్రికల్లోని బొమ్మల ద్వారా తెలియజేసే వివిధ రంగాలకు చెందిన విషయాలను విద్యార్థులు అర్థం చేసుకొంటారు.

**5) పొడుపు కథలు:** పొడుపు కథలు పిల్లలకు శ్రవణానందాన్ని కలిగిస్తాయి. భాషకు అందాన్ని సంతరిస్తాయి. తార్కికమైన ఆలోచనా శక్తిని పెంపొందిస్తాయి. తరగతి గదిలో ఒక విద్యార్థి పొడుపు కథను తెలియజేస్తే మిగిలిన విద్యార్థులలో దాని సమాధానం కోసం ఆలోచించే అలవాటు పెంపొందుతుంది. అయితే ఈ పొడుపు కథలు విద్యార్థుల స్థాయిని బట్టి ఉండాలి. ఈ విధమైన చర్యల వల్ల పిల్లలు మంచి పాఠకులు కాగలరు.

### 3.4.6 పఠన లేఖనాల మధ్య సంబంధం

వాగ్రూపంలో ఉన్న భాషకు లిపిని కల్పించడాన్నే లేఖనం అంటారు. భాషణానికి ధ్వని మూలం కాగా – లేఖనానికి వర్ణాలు మూలమైనవి. పదిసార్లు చదివిన దానికంటే ఒక్కసారి రాస్తే ఆ విషయం బాగా గుర్తుంటుందని పెద్దలు అంటారు. చక్కని దస్తూరి కలిగిఉండడం ఒక గొప్ప సామర్థ్యంగా చెప్పవచ్చు. ఈ సామర్థ్యాన్ని పిల్లల్లో సరియైన రీతిలో పెంపొందించడం ఉపాధ్యాయుని బాధ్యత. పఠన లేఖనాల్లో ఏది ముందు విద్యార్థికి నేర్పించాలి అనే అంశంపై మనో విజ్ఞాన శాస్త్రవేత్తలు అనేక చర్చోపచర్చలు జరిపి, ముందు పఠనం ఆ తర్వాతే లేఖనం అని తేల్చి చెప్పారు. దానికి కారణం పఠనానికి భాషణంతో దగ్గర సంబంధం ఉంది. భాషణంలోనూ పఠనంలోనూ వాగింద్రియాలైన పెదవి, నాలుక కదలిక ఉంటుంది. కాని లేఖనంలో వాటికి పనిలేదు. కేవలం చేతివేళ్ళకే పని.

Known to unknown; Easy to difficulty - అనగా తెలిసిన విషయము నుండి తెలియని విషయాలకు; తేలిక విషయాల నుండి కఠిన విషయాలకు అభ్యసనం జరగాలి. ఈ దృష్టితో చూచినా పఠనం ముందు నేర్పి తర్వాత లేఖనం నేర్పాలి. మంచి దస్తూరి విద్యార్థులకు వరం లాంటిది. చూడగానే చేతి రాత మనల్ని ఆకర్షించేలా ఉండాలి. ప్రాథమిక తరగతులలో ఒక శాస్త్రీయ విధానంలోచేతిరాత నేర్పితే పిల్లలకు చక్కని దస్తూరి అలవడుతుంది. చక్కని దస్తూరికి విద్యార్థులచే దృష్టలేఖనం (చూచిరాత) రాయించాలి. అది కూడా పేజీలో క్రింది నుండి పైకి రాయిస్తే దోషాలు లేకుండా ఉంటాయి. ఆ దృష్టలేఖనం / మేలు పంక్తిని పిల్లలకు ఆనందాన్ని కల్గించే ప్రాస వాక్యాలు రాయడం మంచిది. దృష్టలేఖనం చక్కగా రాసిన పిల్లల పుస్తకాలను మిగిలిన వారికి చూపి, రాసిన విద్యార్థిని ప్రోత్సహిస్తే మిగిలిన వారికి ప్రేరణ కలుగుతుంది.

మార్కులంటే పిల్లలు ఇష్టపడతారు కాబట్టి మార్కులు వేయడం మంచిది.

**దృష్టలేఖనం – ప్రయోజనాలు**

1) అక్షరాలు గుండ్రంగా, పొందికగా రాయగలుగుతారు

2) అక్షరాలకు – పదాలకు – వాక్యాల మధ్య తగినంత సమానమైన ఖాళీతో రాయగలుగుతారు

3) విరామ చిహ్నాలను పాటించడం అలవాటు అవుతుంది.

4) అక్షరాలు సమాన పరిమాణంలో ఉండేటట్లు రాస్తారు.

**ఉక్తలేఖనం**

ఉక్తలేఖనం కూడా విద్యార్థి మంచి దస్తూరికి కారణం. ఉక్తమనగా చెప్పబడిన – లేఖనమనగా రాయబడిన అని అర్థం. ఉపాధ్యాయుడు పదాలను పలుకుతూ, విద్యార్థిని ఆ పదాన్ని విని పలకపై రాయమనడాన్ని ఉక్తలేఖనం అంటారు. పదాలను వర్ణక్రమ దోషాలు లేకుండా స్పష్టంగా, నిర్దుష్టంగా రాయడాన్ని నేర్పించడమే ఉక్తలేఖన ప్రధాన లక్ష్యం. ఈ లేఖనం వల్ల వినడం, ఉచ్చరించడం, చదవడం, రాయడం అనే నాలుగు నైపుణ్యాలు ఒకేసారి అలవడుతాయి.

**ఉక్తలేఖనం – ప్రయోజనాలు**

1) దీని వలన చక్కని శ్రవణ శక్తి పెంపొందుతుంది.

2) శ్రవణ, పఠన, లేఖనాలకు సమన్వయం సమకూరుతుంది.

3) విద్యార్థి చేతివ్రాతలోని అందాన్ని – సమతను తెలిసికోవచ్చు.

4) చదివినదానికంటే రాసిన దానివల్ల జ్ఞాపకశక్తి వృద్ధి పొందుతుంది.

5) విద్యార్థి రాసిన దానిలో అక్షర దోషాలు గమనించవచ్చు.

6) నిర్దుష్టమైన లేఖనం అలవడుతుంది.

7) తగిన వేగంతో రాయగల నైపుణ్యం అలవడుతుంది.

8) శ్రద్ధగా వినడమనే అలవాటు అలవడుతుంది.

**ప్రాథమిక దశలో మంచి లేఖన లక్షణాలు :**

1) స్పష్టంగాను, అందంగాను ఉండాలి.

2) పదముల మధ్య, పంక్తుల మధ్య తగినంత సమానమైన ఖాళీని వదలాలి.

3) విరామ చిహ్నాలు పాటించాలి.

4) తగిన వేగంతో, దోష రహితంగా రాయాలి.

5) అక్షరాలు పెద్ద చిన్న తేడా లేకుండా ఒకే పరిమాణంలో ఉండాలి.

6) విషయ దోషాలు లేకుండా రాయాలి.

7) భాషా దోషాలు లేకుండా రాయాలి.

ప్రాథమిక స్థాయిలో పిల్లలకు లేఖనానికి ఈ క్రింది నూతన విషయాలను పాటించాలి.

1) వారికి తోచిన విధంగా గీతలు గీయించడం, సున్నాలు చుట్టించడం,

2) చుక్కలు పెట్టించడం.

ఆ తరువాతనే వారిని అక్షరాలవైపు మళ్ళించాలి. చిన్న పిల్లల చేతివేళ్ళు చాలా లేతగా, సున్నితంగా ఉంటాయి. పెన్సిల్, బలపం పట్టి రాయడానికి చేతివేళ్ళ కండరాల సమన్వయం చాలా అవసరం. అందుకే బడిలో చేరిన వెంటనే అక్షరాలు దిద్దించకుండా – వారికి ముందుగా బలపం పట్టుకునే విధానం నేర్పాలి. పూర్వ లేఖన కృత్యాలు చేయించాలి. బొమ్మలు గీయించాలి. అవి ఎలా ఉన్నా మెచ్చుకుంటే పిల్లవాడు సంతోషపడతాడు. సున్నాలు, గీతలు, బొమ్మల ద్వారా లేఖనాన్ని కూడా ఒక క్రీడగా భావింపజేయాలి. ద్విత్వ, సంయుక్తాక్షరాలు విద్యార్థికి కష్టతరమని మనం భావిస్తున్నాం కాని – భాషా శాస్త్రవేత్తలు దానిని అంగీకరించడంలేదు.

**పఠన లేఖనాల మధ్య సంబంధం :**


భాషా నైపుణ్యాలుగా పరిగణిస్తున్న శ్రవణం, భాషణం, పఠనం, లేఖనాలలో ఏ ఒక్కదానిలో పరిపూర్ణత లేకపోయినా మిగిలిన నైపుణ్యాలపై ఆ ప్రభావం పడుతుంది.

1) శ్రవణ నైపుణ్యం సరిగా లేకపోతే చక్కని భాషణ శక్తి ఏర్పడదు.

2) భాషణంలో నైపుణ్యం లేని యెడల పఠన నైపుణ్యం అలవడదు.

3) పఠనంలో పట్టు లేకపోతే సక్రమమైన లేఖనం అలవడదు.

ఇలా ఒకదానిపై ఒకటి ప్రభావాన్ని చూపుతాయి కాబట్టి, ఈ భాషా నైపుణ్యాలను ఒక చక్కని క్రమంలో విద్యార్థులకు నేర్పాలి. భాషా నైపుణ్యాల మధ్య గల అంతర్గత సంబంధాన్ని ఈ విధంగా భావించవచ్చు.




భాషా నైపుణ్యాలలోనే కాక స్పష్టీకరణాలలో కూడా అంతర్గత సంబంధం ఉంది.

1) స్పష్టత

2) నిర్దుష్టత

3) సమత

4) అందం

5) వేగం – అనే ఈ అయిదు లక్షణాలు భాషా నైపుణ్యాలకు సామాన్య స్పష్టీకరణలు. భాషా నైపుణ్యాలకు ఈ అయిదు లక్షణాలు పంచ ప్రాణాలవంటివి. ఈ అయిదు లక్షణాలను డా॥ రావి రంగారావు గారు తన 'తెలుగు బోధనా ప్రదీపిక' గ్రంథంలో ఈ క్రింది విధంగా తెలియజేశారు.

## ప్రాథమిక భాషానైపుణ్యాల సామాన్య లక్షణాలు - పరస్పర సంబంధం

| లక్షణాలు | భాషణం | పఠనం | లేఖనం |
|---|---|---|---|
| 1. స్పష్టత | ఎ. స్పష్టంగా, అవసరానుగుణంగా ఊనికతో, స్వరభేదంతో మాట్లాడాలి.<br>బి. శ్రోతలకు వినిపించేలా మాట్లాడాలి | ఎ. స్పష్టంగా అవసరానుగుణంగా ఊనికతో, స్వరభేదంతో చదవాలి<br>బి. శ్రోతలకు వినిపించేలా చదవాలి. | ఎ. స్పష్టంగా, అవసరానుగుణంగా విరామ చిహ్నాలు ఉపయోగిస్తూ రాయాలి.<br>బి. పాఠకులకు కనిపించేలా రాయాలి |
| 2. నిర్దుష్టత | సి. భాషాదోషాలు ఉండరాదు.<br>డి. విషయదోషాలు ఉండరాదు. | సి. భాషాదోషాలు ఉండరాదు.<br>డి. విషయదోషాలు ఉండరాదు. | సి. భాషాదోషాలు లేకుండా రాయాలి.<br>డి. విషయదోషాలు లేకుండా రాయాలి. |
| 3. సమత | ఇ. ధ్వనికి ధ్వనికి మధ్య, పదానికి పదానికి మధ్య, వాక్యానికి వాక్యానికి మధ్య మాట్లాడేటపుడు వ్యవధానం సమానంగా ఉండాలి.<br>ఎఫ్. ధ్వనులన్నింటినీ సమాన స్వరంతో మాట్లాడాలి. | ఇ. ధ్వనికి ధ్వనికి మధ్య, పదానికి పదానికి మధ్య, వాక్యానికి వాక్యానికి మధ్య చదివేటప్పుడు వ్యవధానం సమంగా వుండాలి.<br>ఎఫ్. ధ్వనులన్నిటినీ సమాన స్వరంతో చదవాలి. | ఇ. అక్షరానికి అక్షరానికి మధ్య, పదానికి పదానికి మధ్య, వాక్యానికి వాక్యానికి మధ్య రాసేటపుడు ఎడం సమంగా ఉండాలి. విరామ చిహ్నాలు ఉపయోగించాలి.<br>ఎఫ్. అక్షరాలన్నిటినీ సమాన పరిమాణంలో రాయాలి. |
| 4. అందం | జి. వాచికాభినయం ఉండాలి.<br>హెచ్. ఆకర్షణీయమైన స్వీయశైలితో మాట్లాడాలి. | జి. వాచికాభినయం ఉండాలి.<br>హెచ్. ఆకర్షణీయమైన స్వీయశైలితో చదవాలి. | జి. దస్తూరి గుండ్రంగా ఉండాలి.<br>హెచ్. ఆకర్షణీయమైన స్వీయశైలిలో రాయాలి. |
| 5. వేగం ఐ. | తొందరపడికాని, నాన్చికాని మాట్లాడకూడదు. సముచిత వేగంతో మాట్లాడాలి. | ఐ. తొందరపడికాని, నాన్చికాని చదవకూడదు. సముచిత వేగంతో చదవాలి. | ఐ. తొందరపడి గొలుసుకట్టు వ్రాతగా కాని మరీ నిదానంగా గాని రాయకూడదు. సముచిత వేగంతో రాయాలి. |

### 3.4.7 లేఖన నైపుణ్యాభివృద్ధి – లేఖన నైపుణ్యం పెంపొందించుటకు తీసుకోవలసిన చర్యలు :

1. పఠనం నేర్పేటప్పుడు వర్ణమాలలోని అక్షరాలను వర్ణోత్పత్తి స్థానాలను బట్టి కాక ఆకారంలో ఉండే సామ్యాన్ని బట్టి నేర్పడం ప్రస్తుత బోధనా విధానం.

ఉదా: 1. అఆటతలఱ

2. ఉఊడధ

3. ఒఓఔ

4. చఛజబభఖ

5. ఈఠయరఝ

6. ఎఏఐఘపఫమవషహ

7. థదధ

8. నసగ

ఈ పదాలతోనే లేఖనాన్ని కూడా నేర్పాలి. బొమ్మ క్రింద రెండు అక్షరాల మాటలలో ఒక అక్షరం మాత్రం రాసి మిగిలిన అక్షరం ఖాళీ పెడితే విద్యార్థి ఆలోచించి ఆ అక్షరాన్ని పూరిస్తాడు. ఇలా రెండు, మూడు అక్షరాల పదాలతో లేఖనం నేర్పాలి.

2. పదాలలోని అక్షరాలాను తారుమారుగా వ్రాసి ఆ అక్షరాలను ఉపయోగిస్తూ ఒక చక్కని పదాన్ని ఏర్పాటు చేయించడం.

   ఉదా :– పకల – పలక

3. తారుమారు చేసిన పదాలను సరిచేసి ఒక చక్కని వాక్యం ఏర్పాటుచేయడం.

   ఉదా : పండగ సంక్రాంతి ఈ రోజు – ఈరోజు సంక్రాంతి పండగ

   పండగ పుట్టిన క్రీస్తు కిస్మస్ ఈరోజు – క్రీస్తు పుట్టిన ఈరోజు క్రిస్మస్ పండగ.

ఈవిధంగా పద వాక్య పద్ధతులలో మార్పులతో లేఖనం నేర్పించడం వల్ల – విద్యార్థి శ్రమ అనుకోకుండా సంతోషంతో లేఖన క్రియలో పాల్గొంటాడు. అంతేకాక పఠనం ద్వారా నేర్చుకున్న జ్ఞానానికి లేఖనం ద్వారా పునర్బలనం చేకూరుతుంది.

## 3.5 సృజనాత్మకత : ఊహ / కల్పన

సృజన అంటే ఒక నూతన విషయాన్ని ఏర్పరచడం. విషయాన్ని అందరూ చూసే కోణంలో కాకుండా మరో కొత్త కోణంలో చూడడం, కవితలు, కథలు, నాటికలు మొదలైన సాహిత్య ప్రక్రియల్ని తనదైన సొంత ఆలోచనలతో, నవీన పద్ధతుల్లో సృజించడాన్ని సృజనాత్మకత అంటారు. పిల్లలు ఊహాలోకంలో విహరిస్తూ ఉంటారు. ఎన్నెన్నో ఊహలు, కొత్త కొత్త భావాలు వారికి పుడుతూ ఉంటాయి. వాటికి ఉపాధ్యాయుడు ఒక రూపకల్పన చేస్తే ఆ పిల్లవాడి అంతర్గత శక్తులు వెలికి వస్తాయి. భాష పరిణామశీలి, అదొక సజీవస్రవంతి లాంటిది. కాలానుగుణంగా మార్పుచెందడం దాని సహజ స్వభావం. పిల్లల్లో వెల్లివిరసే సరికొత్త ఆలోచనలను ప్రోత్సహిస్తే వారిలో సృజనాత్మకత పరవళ్లు తొక్కుతుంది. నూతన

విషయాలను ఆవిష్కరిస్తుంది. సొంతంగా రాసే సామర్థ్యం సృజనాత్మక శక్తికి మరింత దోహదపడుతుంది. సృజనాత్మక వ్యక్తీకరణ భౌతిక రూపంలోను, రాత రూపంలోను, ప్రదర్శన రూపంలోను ఉంటుంది. భాషా నైపుణ్యాల సాధనతోపాటు పిల్లల సృజనాత్మకత, కల్పనాశక్తులను వెలికితీయడం ఉపాధ్యాయుడి ముఖ్యమైన విధి. ప్రతి ఉపాధ్యాయుడు ఈ విషయానికి ఎంతో ప్రాధాన్యతనివ్వాలి. సృజనాత్మకతగల వ్యక్తులపైనే మానవజాతి భవిష్యత్తు ఆధారపడి ఉంది. అధ్యాపకుడు ఈ నైపుణ్యాన్ని విద్యార్థుల్లో పెంపొందించడానికి వివిధ ప్రక్రియలలో చక్కని శిక్షణ ఇవ్వాలి.

ఈ సృజనాత్మక నైపుణ్యం నాలుగు రకాలుగా చెప్పవచ్చు.

1) కొత్త విషయాన్ని మరో కొత్త ప్రక్రియలోనికి మార్చడం.
2) కొత్త విషయాన్ని మరో పాత ప్రక్రియలోనికి మార్చడం
3) పాత విషయాన్ని కొత్త ప్రక్రియలోనికి మార్చడం
4) పాత విషయాన్ని మరో పాత ప్రక్రియలోనికి మార్చడం.

మరో రకంగా చెప్పాలంటే పాతరూపానికి కొత్తరూపం ఇవ్వడం, అందరూ మెచ్చే విధంగా కొత్త రూపానికి పాతరూపం ఇవ్వడం కూడా సృజనాత్మకతే!

### 3.5.1 సృజనాత్మక అభ్యాసాలను తరగతి గదిలో నిర్వహించడంలో – ఉపాధ్యాయుని పాత్ర

1) ఈ కృత్యాన్ని పూర్తి తరగతి కృత్యంగా నిర్వహిస్తూ విద్యార్థులకు తగు సూచనలు ఇవ్వాలి.
2) విద్యార్థులు బాగా ఆలోచించి స్వేచ్ఛగా జవాబు చెప్పే వాతావరణం కల్పించాలి.
3) అవసరమైతే కొన్ని ఆధారాలను అందించాలి.
4) అనంతరం పిల్లలను జట్లుగా విభజించి రాయమనాలి, ప్రదర్శింపజేయాలి.
5) పిల్లలు రాసిన చిన్న చిన్న కథలను సేకరించి 'నేనూ కథ రాస్తా' అనే పేరుతో ఒక లిఖిత పత్రిక తయారుచేయవచ్చు. అలాగే చిన్న కవితలను సేకరించి 'నేనూ కవినే' అనే శీర్షికతో మరో లిఖిత పత్రిక తయారుచేయవచ్చు. 'నేనూ బొమ్మలు గీస్తా' అనే పేరుతో కూడా బొమ్మల పుస్తకం తయారుచేయవచ్చు. వీటిని తరగతి గదిలోనూ, పాఠశాల గ్రంథాలయంలోనూ ప్రదర్శించాలి.

కొత్త విషయం అంటే విద్యార్థి యొక్క సొంత భావన / ఊహ / కల్పన అని గ్రహించాలి. విద్య అంటే కేవలం గది నాలుగు గోడల మధ్య కూర్చోబెట్టి చెప్పే జ్ఞానానికి మాత్రమే పరిమితం కాదు. అది –

1) పిల్లల సర్వతోముఖాభివృద్ధికి,
2) సంపూర్ణ మానసిక వికాసానికి,
3) ఉన్నతమైన వ్యక్తిత్వానికి దోహదపడేలా ఉండాలి. ఆ కృత్యాలు విద్యార్థిలోని సృజనాత్మక శక్తులను వికసింపజేసి, వారి ప్రజ్ఞా పాటవాల ప్రదర్శనకు అవకాశం కల్పించాలి.

**సృజనాత్మక అభ్యాసాలు – ఉదాహరణ:**

విద్యార్థిలో సృజనాత్మకతను పెంపొందించడానికి ఉపాధ్యాయుడు ఈ క్రింది అభ్యాసాలను నిర్వహించాలి.

1) పాఠం ఆధారంగా ఒక చిత్రం గీయండి, రంగులు వేయండి, చిత్రం గురించి రాయండి.

2) మీ మిత్రుని పుట్టినరోజు సందర్భంగా గ్రీటింగ్‌కార్డు తయారుచేసి వారికి అందించి వాళ్లు ఏమన్నారో తెలపండి.

3) మీ పాఠశాల తోటలోగల రకరకాల మొక్కల పేర్లు రాయండి. ఆ మొక్కల్లో ఏ మొక్కను నువ్వు బాగా ఇష్టపడతావు? ఎందుకు?

4) మంచి మార్కులు సాధించాలంటే శ్రద్ధ అవసరం. ఈ విషయం మీద మీ మిత్రునికి లేఖ రాయండి.

ఆధునిక బోధనా పద్ధతుల్లో అన్నీ కాకపోయినా చాలావరకు బ్లూమ్ సిద్ధాంతాన్ని అనుసరించి శిశు కేంద్రీకృతం మరియు శిశు మనస్తత్త్వానికి అనుగుణంగా రూపొందింపబడినవే. కృత్యాలను ఆధారంగా చేసుకొని బోధనాభ్యసనాలను నిర్వహిస్తుండడాన్ని కృత్యాధార పద్ధతి అంటారు. కృత్యం లేనిదే పాఠం లేదు. మొన్న మొన్నటివరకు వీటిని అదనపు పాఠ్య ప్రణాళికా కార్యక్రమాలు (Extra Curricular Activities) అనేవారు. ఈ కృత్యాల ప్రాధాన్యత గ్రహించి ఇటీవల వీటిని అదనపు పాఠ్య ప్రణాళికా కార్యక్రమాలు అని చిన్నచూపు చూడకుండా ఆ పేరును రద్దుచేసి వీటిని పాఠ్య ప్రణాళికలు (Curriculum) అని పేర్కొంటున్నారు. విద్యా బోధనలోగుణాత్మకతను పెంపొందించడానికి గతంలో "ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక విద్యా పథకం" ప్రవేశపెట్టడం జరిగింది. విద్యార్థుల స్థాయిననుసరించి వారి శారీరక, మానసిక శక్తులను సమన్వయపరిచి సముచితమైన, అర్థవంతమైన కృత్యాల ఆధారంగా పాఠ్యాంశాలను అందిస్తే విద్యార్థులు చురుకుగా, ఆనందంగా బోధన ప్రక్రియలో పాల్గొని సమర్థవంతమైన అభ్యసనను పొందుతారు.

ప్రాథమిక స్థాయిలో విద్యార్థులచే బొమ్మలు గీయించడం, పుస్తకాలకు అట్టలు వేయించడం, అక్షర పూరణ, పదపూరణ, ధ్వన్యనుకరణ పదాలు – ఇలాంటి కృత్యాలను చేయించడం ద్వారా వారిలో ఆలోచనా శక్తి పెంపొంది వారిలో అణగి ఉన్న అంతర్గత శక్తులు (టాలెంట్స్) వెలికి వస్తాయి. ఇవి విద్యార్థుల ఆలోచనలకు పదును పెడతాయి. పాఠశాలపై విద్యార్థులకు అనురక్తి, ఉత్సుకత కలుగుతాయి. స్థాయిని బట్టి, అవకాశాలను బట్టి వారికి చిన్న చిన్న ప్రాజెక్టులను కేటాయిస్తే ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు. వారిలో సృజనాత్మకత పరాకాష్ఠకు చేరుతుంది. అందుకే తన 'సువర్ణం' కావ్యంలో కథా రచయిత కుందా భాస్కరరావు ఇలా అన్నారు.

చిన్నపిల్లల నగ సిరిమల్లె పొట్లాలు
విప్పిచూడ ప్రతిభ గుప్పుమనును!
విద్యయనగనేమి? విప్పిచెప్పుట కదా!
భాస్కరార్యుమాట! ప్రగతిబాట!!

**ప్రాజెక్టు అంటే**

పిల్లలు సహజ వాతావరణంలో, తమంతట తాముగా అన్వేషించి, పరిశోధించి, అవసరమగు సమాచారం సేకరించి ఒక విషయం పట్ల గాని, అంశం పట్ల గాని అవగాహన ఏర్పరచుకొని నిర్ధారణకు రావడానికి దోహదపడే కృత్యాలనే ప్రాజెక్టు పనులుగా పిలుస్తారు.

ఉదా: 1. ఏదైనా ఒక దేశభక్తి గేయాన్ని / పాటను సేకరించండి. దానిని చార్టుపై రాసి ప్రదర్శించండి.

2. స్వాతంత్ర్యం కోసం పాటుబడిన మహనీయుల చిత్రాలను సేకరించండి. వారిని గురించి 4, 5 వాక్యాలు రాసి చదవి వినిపించండి.

3. మీ గ్రంథాలయంలో నీకు నచ్చిన మంచి కథల పుస్తకాన్ని సేకరించి చదివి మీ సొంత మాటల్లో ఆ పుస్తకం ఎలా ఉందో రాయండి.

**ఉపయోగాలు**

1) బోధనాభ్యసన ప్రక్రియల్లో యాంత్రికత దూరమై, నూతనత్వం సంతరించుకుంటుంది.

2) పిల్లలు స్వయంగా అభ్యసనం చేస్తారు.

3) ఆనందంగా అభ్యసిస్తారు.

4) తోటివారితో పాలుపంచుకొనడం వల్ల మైత్రీ భావన పెరుగుతుంది.

5) వారికి ఇవ్వబడిన స్వేచ్ఛ సృజనాత్మకతకు దారితీస్తుంది.

6) అంతర్గత శక్తులు వినియోగానికి వస్తాయి.

7) పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య వాతావరణం ఏర్పడుతుంది.

ఈ సందర్భంలో ఉపాధ్యాయుడు కృత్యానికి, ప్రాజెక్టు పనికి గల వ్యత్యాసాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలి.

| | కృత్యాలు | ప్రాజెక్టు పనులు |
|---|---|---|
| 1) | లక్ష్యం స్వల్పంగా ఉంటుంది. | బహుళ లక్ష్యాల సమాహారంగా ఉంటుంది. |
| 2) | తక్కువ సమయంలో ముగింపబడతాయి | సమయం ఎక్కువ తీసుకుంటుంది |
| 3) | ఉపాధ్యాయుడు పర్యవేక్షణ చేస్తాడు. | ఉపాధ్యాయుడు కేవలం సూచనలను మాత్రమే ఇస్తాడు. |

### 3.5.2 పిల్లల కల్పన అభివృద్ధి చేయడానికి కృత్యాలు

సృజనాత్మకత రూపాలైన శిశుగేయాలు, అభినయ గేయాలను గురించి తెలుసుకున్నాం. ఇవి గాక ఈ క్రింది అంశాలుకూడా సృజనాత్మకతను పెంపొందించడానికి ఉపాధ్యాయుడు నిర్వహించాలి.

**1) కవితారచన:** ప్రాథమిక దశలో కవితా రచనకు శిక్షణ ఇవ్వడం జరగని పని. ఈ దశలో ప్రాథమిక భాషా నైపుణ్యాలు నేర్పడమే ముఖ్య ఉద్దేశ్యం. అయినప్పటికి సృజనాత్మక నైపుణ్యం మీద అభిరుచిని కలిగించే చిన్న చిన్న కవితలు రాయించవచ్చు.

**2) కథారచన**: 4,5 తరగతులలో పిల్లవాని చేత వారు నేర్చుకున్న కథలను తిరిగి వ్రాయించడం ద్వారా, కొత్త పేర్లు పెట్టించడం ద్వారా, మరో రకమైన ముగింపు ఇవ్వడం ద్వారా వారి సృజనాత్మకతను పెంపొందించవచ్చు.

**3) వర్ణనాత్మక రచన**: నాల్గవ తరగతి నుండి ఆకర్షణీయమైన చిత్రాలను విద్యార్థులకు చూపించి, వాటిని వర్ణనాత్మకంగా రాయించాలి. అలాగే ప్రకృతిలోని దృశ్యాలను చూపించి, దానికి వారిలో కలిగిన స్పందనను / మధుర భావాలను వర్ణనాత్మకంగా రాయించవచ్చు.

**4) పాఠశాల పత్రిక:** ఇది విద్యార్థులలో సృజనాత్మక శక్తిని తప్పక పెంపొందిస్తుంది. ఊహాశక్తిని, వర్ణనా శక్తిని, కథన శక్తిని పెంపొందించే కథలు, కవితలు, చిత్రాలు, జోకులు ఇందులో ఉంటాయి.

**ఈ కృత్యాల వలన**

1) విద్యార్థులు వీటి ద్వారా తమ సృజనాత్మక శక్తిని పెంపొందించుకుంటారు.
2) తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరిస్తారు.
3) అక్షర రూపంలో వారి ఊహలకు రెక్కలు వస్తాయి.
4) ఆనందానుభూతిని పొందుతారు.
5) మంచి వైఖరులు, ఆసక్తులు పెంపొందించుకుంటారు.
6) తమకంటూ ఒక శైలిని ఏర్పాటు చేసుకుంటారు.

**సృజనాత్మకత శక్తిని పెంపొందించడంలో ఈ అంశాలను గమనించాలి**

1) విద్యార్థి స్వీయరచన చేసేటప్పుడు అక్షర దోషాలనీ, భావ దోషాలనీ భయపెట్టకూడదు. వారికి నచ్చిన పద్ధతిలో రాయడం మొదలు పెడితే క్రమేపి ఉపాధ్యాయుడు దోష సవరణ చేయవచ్చు.
2) వారి రచనలను తరగతి గదిలో అందరి ముందు చదివించి ప్రోత్సహించాలి. అప్పుడు ఇంకా బాగా రాసి మంచి గుర్తింపు పొందాలనే కోరిక ఎక్కువ అవుతుంది.
3) స్వీయ రచనలకు నియమాలు విధించకూడదు. అలాగే తప్పులను తప్పులుగా ఎత్తి చూపకుండా “ఇలా మార్పు చేస్తే బాగుంటుందేమో ఆలోచించు !” అంటూ మార్పులను సూచించాలి.
4) కొన్ని ప్రక్రియలను ఉపాధ్యాయుడు చదివి, వివరించి – అప్పుడు పిల్లలను రాయమనాలి.

**ఆధార గ్రంథాలు**


1) తెలుగు బోధనా ప్రదీపిక, డా॥ రావి రంగావు
2) ఉపాధ్యాయుల కరదీపిక తెలుగు, 4,5 తరగతులు రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్
3) ఉపాధ్యాయ కరదీపిక తెలుగు, 1,2 తరగతుల నూతన పాఠ్యపుస్తకాలపై శిక్షణ, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్
4) పిల్లల అభ్యసనాభివృద్ధి కార్యక్రమం, ప్రాథమిక స్థాయి, 3,4,5 తరగతులు, సర్వ శిక్షా అభియాన్, పశ్చిమ గోదావరి జిల్లా
5) డి.ఎడ్. అధ్యాపనశాస్త్రం తెలుగు బోధనా పద్ధతులు. తెలుగు అకాడమీ.
6) డిప్లమో ఇన్ ఎడ్యుకేషన్ (దూర విద్యా విధానం), భాషా విద్య – తెలుగు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్.
7) తొలకరి చినుకులు 1 నుండి 5 తెలుగు వాచకములు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాద్.
8) పిల్లల భాషాభివృద్ధి కార్యక్రమం – బోధనా వ్యూహాలు. సర్వశిక్షా అభియాన్, పశ్చిమ గోదావరి జిల్లా.
9) “రాతలో రామణీయకతా” – కుందా భాస్కరరావు, “చదువు విజ్ఞానం” మాసపత్రిక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ.

# మూల్యాంకనం

I. ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానాలు రాయండి.

1. ప్రాథమిక స్థాయిలో భాషా సామర్థ్యాల అభివృద్ధి లక్ష్యాలను వివరించండి.
2. శ్రవణ లక్షణాలను తెలిపి, శ్రవణ శక్తి లోపాలు – నివారణ చర్యలు వివరించండి.
3. భాషణమంటే ఏమిటో తెలిపి, పిల్లల్లో వాచక చర్యను పెంపొందించడంలో ఉపాధ్యాయుని పాత్రను విశదీకరించండి.
4. ప్రాథమిక దశలో భాషణాభివృద్ధికి దోహదపడే అంశాలను తెల్పండి.
5. పఠన, లేఖనాల మధ్యగల సంబంధాన్ని తెలియజేయండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 10–15 పంక్తులలో సమాధానాలు రాయండి.

1. కథాకథనం ప్రయోజనాలు – తీసుకోవలసిన జాగ్రత్తలు సూచించండి.
2. మౌనపఠనం వల్ల కలిగే ప్రయోజనాలను తెల్పండి.
3. పిల్లలు మంచి పాఠకులు కావడానికి సహాయపడే అంశాలు ఏవి?
4. పిల్లల్లో లేఖన నైపుణ్యం పెంపొందించడానికి తీసుకోవలసిన చర్యలను తెల్పండి.
5. పిల్లల భాషాభివృద్ధిలో పాఠ్యేతర పుస్తకాల పాత్రను వివరించండి.
6. మంచి లేఖనానికి ఉండవలసిన లక్షణాలు ఏవి?

III. ఈ క్రింది ప్రశ్నలకు 4–5 వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. ప్రాజెక్టు అంటే ఏమిటి? ఒక ఉదాహరణ తెలపండి.
2. సృజనాత్మకత అంటే ఏమిటో రాయండి.
3. సృజనాత్మకత అభ్యాసాలను తరగతి గదిలో ఎలా నిర్వహించాలి?
4. అభినయగేయాలను గురించి తెల్పండి.
5. పిల్లలు ఎప్పుడు వింటారు?
6. దృష్టలేఖన ప్రయోజనాలు వివరించండి.

IV. ఈ క్రింది వానికి తగిన సమాధానాలను తెల్పండి.

1. భాషాశాస్త్ర నిపుణులు చెప్పిన ప్రాతిపదిక నైపుణ్యాలు ఎన్ని? (    )

(అ) 2 (ఆ) 4 (ఇ) 3 (ఈ) 5

2. పొడుపుకథలు, ఈ శక్తిని పెంపొందిస్తాయి. ( )

(అ) రచనాశక్తి (ఆ) వర్ణనాశక్తి (ఇ) అభ్యసనశక్తి (ఈ) ఆలోచనాశక్తి

3. ఉక్తలేఖనం అంటే ( )

(అ) చూచిరాయడం (ఆ) చెప్పింది రాయడం

(ఇ) అందంగా రాయడం (ఈ) ఊహించి రాయడం

4. పఠనం ఎన్ని రకాలు. ( )

(అ) 4 (ఆ) 2 (ఇ) 6 (ఈ) 3

5. ఈ క్రింది వానిని జతపరచండి.

| | | |
|---|---|---|
| 1. దేశభక్తి గేయాలను సేకరించుట | ( ) | అ) ప్రగతి గీత |
| 2. శ్రవణ; భాషణ; పఠన; లేఖనాలు | ( ) | ఆ) సృజనాత్మకత |
| 3. నండూరి రామకృష్ణమాచార్యుల రచన | ( ) | ఇ) పఠనం |
| 4. కవితా రచన | ( ) | ఈ) ప్రాజెక్టు పని |
| 5. భాషణ లేఖనాలకు వారధి | ( ) | ఉ) భాషానైపుణ్యాలు |

# 4 పాఠ్యపుస్తకాలు, బోధనాశాస్త్రంపై అవగాహన

## విషయక్రమం

4.1 పూర్వ ప్రాథమిక, ప్రాథమిక తరగతుల భాషా పాఠ్యపుస్తకాల రూపకల్పనలో అనుసరించాల్సిన తాత్త్వికత మరియు మార్గదర్శక సూత్రాలు

4.2 భాషా బోధనలో విషయం (Content), విధానాలు (approaches), మరియు పద్ధతులు (Methods) – పరస్పర భాగస్వామ్య పద్ధతులు, సౌలభ్యకర్తగా ఉపాధ్యాయుడు (Teacher as a facilitator).

4.3 ఇతివృత్తాలు (Themes), పాఠ్యాంశ నిర్మాణం, అభ్యాసాల స్వభావం, వాటి తరగతి గది అన్వయం (నిర్వహణ)

4.4. 1,2 తరగతుల మరియు 3,4,5 తరగతుల విద్యాప్రమాణాలు, అభ్యసన సూచికలు

4.5 భాషా విద్యాప్రణాళిక (Language Curriculum), సమర్థవంతమైన నిర్వహణకు (ప్రసారానికి) అభ్యసన వనరులు.

## లక్ష్యాలు

1. పాఠ్యపుస్తకాల రూపకల్పనలో తాత్త్విక నేపథ్యం అవగాహన
2. భాషాబోధనలో విధానాలు, పద్ధతుల అవగాహన
3. పాఠ్యాంశ నిర్మాణం, అభ్యాసాల స్వభావం, తరగతి గది నిర్వహణను తెలుసుకోవడం.
4. ప్రాథమిక స్థాయిలో భాష, విద్యాప్రమాణాలు, అభ్యసన సూచికల అవగాహన
5. భాషాప్రణాళిక సమర్థవంతమైన నిర్వహణకు కావలసిన అభ్యసన వనరులపై అవగాహన

## పరిచయం

పిల్లలు పాఠశాలకు వచ్చేనాటికే భాషా పరిజ్ఞానం కలిగి ఉంటారు. వారి ఆలోచనలకు తగిన విధంగా భాషను ఉపయోగిస్తూ ఉంటారు. వారి అవసరాలను తీర్చుకుంటారు. ఇది మరింత సమర్థవంతంగా సమగ్రంగా జరగాలంటే భాషాభ్యసనం అవసరం. ఇందుకు పాఠశాల, పాఠ్యపుస్తకాలు, ఉపాధ్యాయుడు పరిసరాల నేపథ్యం ప్రధాన అంశాలుగా

చెప్పుకోవచ్చు. వీటిలో అతి ప్రధానమైనది పాఠ్యపుస్తకం, ఈ పాఠ్యపుస్తకం రూపకల్పన ఎలా జరగాలి ? అందులో విషయం, విషయాంశాలు ఏవి ఉండాలి ? విద్యార్థుల స్థాయికి అనుగుణమైన విద్యాప్రమాణాలు ఏవి ? పాఠ్యాంశాల నిర్మాణం, అభ్యాసాలు ఎలా ఉండాలి ? ఎలా ఉంటే విద్యార్థిలో ఆనందకరమైన భాషాభ్యసనం జరుగుతుంది? ఇలాంటి విషయాల మీద క్షుణ్ణ పరిశీలన అవసరం. అంతేకాక ఉపాధ్యాయుని పాత్ర మరియు బోధనా విధానాలపై కూడా స్పష్టత అవసరం.

### 4.1.1 పూర్వ ప్రాథమిక, ప్రాథమిక తరగతుల భాషా పాఠ్యపుస్తకాల రూపకల్పన – తాత్విక దృక్పథం

భాష భావ వ్యక్తీకరణ సాధనం. భాషావేత్తలు పదాల, వాక్యనిర్మాణ నియమాల సమూహంగా భాషను భావిస్తారు. భాష వివిధ స్థాయిలలోని ధ్వనులు, వర్ణాలు, పదాలు, వాక్యాలు, వ్యవస్థీకృతమైన పలు నియమాలకు లోబడి ఉంటుందని వీరి భావన.

ఇది మనకు భాష యొక్క పూర్తి స్వరూపాన్ని చూపించదు. అందువల్ల భాషను విస్తృతమైన రూపంలో చూడాలి. అప్పుడే అది ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయ శిక్షణ ఇచ్చే అధ్యాపకులకు పాఠ్యపుస్తక రచయితలకు, విద్యా ప్రణాళికా రూపకర్తలకు, విద్యాప్రణాళికా రచయితలకు

ఉపయోగపడుతుంది. దీనిని బహుముఖంగా పరిశీలించాలి. అంటే నిర్మాణ పరంగా, సామాజిక దృష్టితో, మనో వైజ్ఞానిక దృక్పథంతో, శాస్త్రీయ వైఖరితో సాధారణాత్మక నేపథ్యంతో భాషను పరిశీలించాలి.

### భాషను నేర్చుకొనే విధానం

పిల్లలందరూ బడికి రాక ముందే భాషను నేర్చుకుంటారు. ఇందుకు ఎటువంటి ప్రత్యేక శిక్షణ ఉండదు. వారే స్వయంగా సంక్లిష్టమైన భాషా నియమాలను, ధ్వనులు, పదాలు, వాక్యాలు

వాటి అర్థాలను అర్థం చేసుకొంటారు. సందర్భానికి తగిన భాషారూపాన్ని ఎంపిక చేసుకొని మాట్లాడతారు. ఇందుకు ప్రధానకారణాలు రెండు.

1. పిల్లలందరూ పుట్టుకతోనే భాషను నేర్చుకొనే సామర్థ్యాన్ని కలిగి ఉండడం.
2. తమ పరిసరాలలో అర్థవంతమైన సన్నివేశాలలో పాల్గొనడం.

అంటే పిల్లలు సహజంగా, సందర్భోచితంగా భాషను గ్రహిస్తున్నారని అర్థం. వీరు భాషను నేర్చుకొనేటప్పుడు అక్షరాలు, గుణింతాలు, ఒత్తులు, పదాలు, వాక్యాలు అనే క్రమంలో నేర్చుకోవడం లేదు. భాషను నేర్చుకొనే సందర్భాలలో కష్టం, సులభం అని కూడా భావించడం లేదు. అర్థవంతమైన సన్నివేశాలలో పాల్గొనడం ద్వారా భాషను సందర్భోచితంగా గ్రహిస్తారు. అది సమగ్రంగా ఉంటుంది. చాలా సహజంగానూ ఉంటుంది. (యాంత్రికమైన అర్థరహితమైన పునశ్చరణ పిల్లలు కంఠతాపెట్టి వృథాగా శ్రమపడటానికి మాత్రమే ఉపకరిస్తుంది. కాని నిజమైన భాష అలవడదు.)

పై అంశాలను పరిగణలోకి తీసుకొని సహజంగా అర్థవంతమైన సన్నివేశాల్లో పాల్గొనడం ద్వారా తరగతి గదిలో ఉపాధ్యాయుడు ; సహజ అభ్యసన సన్నివేశాలను కల్పించడం ద్వారా చదవడం, రాయడం, వ్యక్తీకరించడం చేయగలిగేలా పూర్వ ప్రాథమిక, ప్రాథమిక తరగతుల భాషా పాఠ్యపుస్తకాలను రూపొందించారు. వీటి రూపకల్పనలో ప్రధానసూత్రం గెస్టాల్ట్ సైకాలజీ (Wholistic approach)

**భాషా వినియోగం**

భాషాబోధనలో భాషా నైపుణ్యాల సాధనకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి. ఇందుకు తరగతి గదిలో భాషా వినియోగం సమర్థవంతంగా జరగాలి. బోధనాభ్యసన ప్రక్రియలు అందుకు దోహదపడాలి. పాఠ్యపుస్తకాల రూపకల్పనలో వీటిని కూడా దృష్టిలో వుంచుకొని సందర్భోచితంగా తమ అవసరాలు తీర్చుకోవడానికి వీలుగా వివిధ వ్యవహార రూపాలలో భాషను వినియోగించుకునేలా పాఠ్యపుస్తకాలు రూపొందించారు. కనుక సందర్భోచిత సన్నివేశ కల్పన బోధనాపరంగా ఉపాధ్యాయులకు ముఖ్యమైనది (Contextualisation is more important in our teaching).

**జాతీయ విద్యాప్రణాళిక చట్టం (NCF - 2005)**

జాతీయ విద్యాప్రణాళిక చట్టం – 2005 ప్రకారం పిల్లలు, బట్టీ విధానాలకు బదులు అర్థవంతంగా నేర్చుకోవడం, నేర్చుకొన్న జ్ఞానాన్ని నిత్య జీవితానికి అన్వయించడం, పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా వారి స్థాయికి తగిన ఇతర పుస్తకాలను కూడా చదవడం, అదనపు వనరులు, సామాగ్రిని సేకరించుకోవడం, ఒత్తిడి లేని స్వేచ్ఛాపూరిత ప్రజాస్వామిక వాతావరణంలో పిల్లల మూల్యాంకనం జరగడం వంటి తాత్విక దృక్పథాల ఆధారంగా నూతన పాఠ్యపుస్తకాలు రూపుదిద్దుకున్నాయి.

**నిర్బంధ ఉచిత విద్యా హక్కు చట్టం (RTE- 2009)**

నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టం 2009 లోని 5వ అధ్యాయం పాఠ్యప్రణాళిక, పాఠ్యపుస్తకాలు, బోధనాభ్యసన ప్రక్రియలు, మూల్యాంకన విధానాలను స్పష్టంగా తెలియజేసింది. దీని ప్రకారం పాఠ్యపుస్తకాలు ఎలా వుండాలి?

1. పాఠ్యపుస్తకాలు రాజ్యాంగ విలువలు పెంపొందింపజేసేలా, పిల్లల సర్వతో ముఖవికాసానికి దోహద పడేలా ఉండాలి.
2. బోధనాభ్యసన ప్రక్రియలు, కృత్యాలు, అన్వేషణల వెలుగులో జ్ఞాన నిర్మాణం జరిగేలా చూడాలి.
3. పిల్లలు తాము పొందిన జ్ఞానాన్ని, నిత్యజీవితంలో వినియోగించే సామర్థ్యాలను అంచనా వేయగలిగేలా మూల్యాంకన విధానాలు ఉండాలి.
4. పిల్లలలో భాషా సామర్థ్యాల సాధన, మంచి వైఖరులు, భాషా పాఠ్యపుస్తకాల ద్వారా పెంపొందించాలి.
5. భాషను వివిధ సందర్భాలలో సమర్థవంతంగా వివిధ వ్యవహార రూపాలలో వినియోగించే సామర్థ్యాన్ని పెంపొందించే విధంగా, సృజనాత్మకత వంటి అంశాల కనుగుణంగా నూతన పాఠ్యపుస్తకాలను రూపొందించారు.

**రాష్ట్ర విద్యాప్రణాళికా చట్టం – 2011**

NCF - 2005, RTE - 2009 ల ఆధారంగా భాషా ఆధారపత్రం రూపొందించారు. ప్రమాణాలు, బోధనాభ్యసన వ్యూహాలు, మూల్యాంకన విధానాలు మొదలగు వాటిని గురించి పాఠ్యపుస్తకాల్లో పొందుపరచారు. వీటి ఆధారంగా చక్కని పాఠ్యపుస్తకాల రూపకల్పన జరిగింది.

### 4.1.2 భాషా పాఠ్యపుస్తకాలు–మార్గదర్శక సూత్రాలు

NCF - 2005, APSCF- 2011 మరియు RTE - 2009 , లు సూచించిన విధానాల కనుగుణంగా భాషా పాఠ్యపుస్తకాలు రూపుదిద్దుకోవలసిన అవసరం ఏర్పడింది. భాష స్వభావాన్ని అవగాహన చేసుకొని, పిల్లల స్వభావానికి అనుగుణంగా బోధన జరగాలని విద్యావేత్తలు సూచించారు. మారుతున్న బోధనా విధానాలు, మూల్యాంకన పద్ధతులు, బోధనా తీరును నిర్దేశించే విధంగాను, పిల్లలకు సహజ భాషాభ్యసన సన్నివేశాలు కల్పించే విధంగానూ, ఆనందకరమైన బోధనను ఆవిష్కరించేలా నూతన పాఠ్యపుస్తకాలను రూపొందించాలని సూచించడం జరిగింది.

**పాఠ్యపుస్తకాల రూపకల్పనలోని మౌళిక సూత్రాలు:**

- ఏ విషయాలనైనా విడివిడిగా కాకుండా మొత్తంగా చూడడం (Wholistic approach)
- ఎంపిక చేసిన పాఠ్యాంశాలు పిల్లల జ్ఞానాత్మక, సామాజిక, సాంస్క ృతిక, భావావేశ, మానసిక చలనాత్మతక రంగాల నేపథ్యాలకనుగుణంగా ఉండాలి.
- పాఠ్యపుస్తకం తరగతి వారీగా ఆశిస్తున్న విద్యావిషయక ప్రమాణాలను, అభ్యసన ఫలితాలను, భాషా సామర్థ్యాలను సాధించడానికి అనువుగా ఉండాలి.
- ప్రాథమిక తరగతుల పాఠ్యపుస్తకాల్లో ఆనందింపజేసి ఆలోచనలు రేకెత్తించే పిల్లల పరిసరాలను ప్రతిబింబించే చిత్రాలుండాలి. నాణ్యమైన కాగితం, అందమైన ముద్రణతో ముద్దులు మూటకట్టే బొమ్మలు కూడా ఉండాలి. ఎందుకంటే పిల్లలకు బొమ్మలంటే ప్రాణం.
- వాచకాల్లోని భాష సులభంగా ఉండాలి. సృజనాత్మకతకు వీలుగా ఉండాలి. పిల్లలు తమ స్వభాషలను ఉపయోగించుటకు అనువుగా ఉండాలి.

HE56VE

- నేడు మనం అనుసరిస్తున్నది కృత్యాధార బోధనా విధానం కనుక తరగతి వారిగా నిర్దేశించిన పలు కృత్యాల్లో పాల్గొనడానికి వీలుగా వాచకాల్లో వివిధ కృత్యాలతో కూడిన అభ్యాసాలుండాలి.
- వాచకాల్లోని పాఠాలు, పాటలు, పద్యాలు, కథలు, స్వీయచరిత్రలు, వ్యాసాలు, లేఖలు, సంభాషణలు వంటి రూపంలో ఉండాలి. ఈ అంశాలన్నీ పిల్లల్లో ఆసక్తిని, ఉత్సుకతను, ఆలోచనలను పెంపొందించి భాషాభివృద్ధికి తోడ్పడుతాయి.
- ఎలిమెంటరీ స్థాయిలోని పాఠాలు ప్రాచీన, ఆధునిక సాహిత్యాల నుండి ఎంపిక చేయాలి. ఈ పాఠాలు విద్యార్థుల వయోపరిమితులకు, వారి స్థాయికి అనువుగా ఉండాలి. ఈ పాఠాలు రాజ్యాంగంలో పొందుపరచిన పది మౌళిక సూత్రాలకు భిన్నంకారాదు. అవి మన లౌకిక భావనలను, శాస్త్రీయ దృక్పథాలను, రాజ్యాంగ విలువలను గౌరవించే విధంగా ఉండాలి.
- ఎంపిక చేసిన పాఠాలు అన్ని ప్రాంతాలు, కులాలు, అన్ని భాషా ప్రక్రియలకు చెందినవై ఉండాలి.
- స్వీయ అభ్యసనాన్ని ప్రోత్సహించే అభ్యాసాలకు ప్రాధాన్యత కల్పించాలి. స్వయం అభ్యసనం మన విద్యావ్యవస్థలో ఈనాడు పతాకస్థాయికి చేరింది.
- భాషాభ్యాసాలు కృత్యాల రూపంలో ఉండాలి. అన్వేషణకు, పరిశోధనకు, పరిశీలనకు తోడ్పడాలి. వాటిలో క్విజ్‌లు, ప్రణాళికలు, భాషా క్రీడలు, భాషాపరమైన సెమినార్‌లు ఉండాలి.

- స్వీయ మూల్యాంకనం సాయంతో పిల్లలు తమ ప్రగతిని తామే మదింపు చేసుకోడానికి పాఠ్యపుస్తకాల్లో చోటు కల్పించాలి.
- పిల్లలకు విసుగు కల్పించకుండా, మూసపద్ధతిలో లేని, వైవిధ్యభరితమైన ఆలోచనలు రేకెత్తించే ప్రశ్నలతో కూడిన పాఠాలుండాలి.
- పాఠ్య సన్నివేశాల కనుగుణమైన చిత్రాలుండాలి .ఈ చిత్రాలు పిల్లల సృజనాత్మకతకు, కల్పనాశక్తులకు, కళాత్మకతకు బాటలు వేస్తాయి.
- వాచకాల్లోని అభ్యాసాలు పిల్లల వైయక్తిక కృత్యాలకు, జట్టు కృత్యాలకు, మొత్తం తరగతిగది కృత్యాలకు వీలుగా ఉండాలి.
- అభ్యాసాలు ఆలోచనలు రేకెత్తించేవిగా, అన్వేషణకు ప్రాధాన్యత ఇచ్చేవిగా, ఉండాలి. యాంత్రికమైన సమాధానాలను ఆశించే కృత్యాలను అభ్యాసాలుగా ఇవ్వరాదు.
- పిల్లలు అదనపు పఠన సామాగ్రిని ఉపయోగించడానికి వాచకాల్లోని అభ్యాసాలు ప్రోత్సహించాలి. తద్వారా పిల్లలు వ్యక్తిగతంగా ఉత్తమ పాఠకులుగా ఎదగగలుగుతారు.
- పాఠ్య సందర్భానికి అనుగుణంగా పిల్లలు పదాల అర్థాలను గ్రహించాలి. ఈ అంశంపై ఆధారపడిన పదజాల అభ్యాసాలు వాచకాల్లో చేర్చాలి.
- వాచకాల చివర అకారాది క్రమంలో పదపట్టికలు ఇవ్వాలి. వీటికి అర్థాలు కూడా ఇవ్వాలి. తద్వారా నిఘంటువును సంప్రదించే నైపుణ్యంతో బాటు అధ్యయన నైపుణ్యాలు కూడా పిల్లలకు అలవడతాయి.
- సందర్భానుగుణమైన వ్యాకరణాంశా లపై అభ్యాసాలుండాలి. అవి ప్రాయోగిక వాడుక భాషా వ్యాకరణానికి చెంది ఉండాలి. పిల్లలు స్వయంగా వ్యాకరణ నియమాలను తయారు చేసుకోవడానికి తోడ్పడాలి. ఈ సందర్భంలో పిల్లల స్వీయ భాషలను ఉపాధ్యాయుడు విరివిగా ఉపయోగించుకోవాలి.

## 4.2 భాషాబోధనలో విషయం, విధానాలు, పద్ధతులు

పిల్లలు పాఠశాలకు రాకముందే భాషపై సంపూర్ణ సాధికారిత కలిగి ఉంటారు. అయితే భాషా సంబంధిత నియమాలు, ధ్వనులకు సంబంధించి సమగ్రంగా కాకపోయినా కొంత స్పష్టమైన జ్ఞానాన్ని కలిగి ఉంటారు. అలాగే శిశువు ఆలోచనాత్మకంగా తగిన విధంగా, భాషను ఎలా వినియోగించాలో తెలుసుకొని ఉంటాడు. అయితే పాఠశాలలో చేరిన తర్వాత వారి భాషాభ్యసన తగిన స్థాయిలో జరగడం లేదు. ఫలితంగా పిల్లల్లో పఠన, లేఖన సామర్థ్యాలు కొరవడుతున్నాయి. దీని వల్ల ఇతర భాషలు నేర్చుకోవడంలో, ఇతర సబ్జెక్టుల అభ్యసనలో వెనకబడుతున్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయుల పరిస్థితి కూడా ఇలాగే వుంది.

మనం పిల్లలకు చేసే భాషాబోధనలో ఎక్కడో లోపముందని తెలుస్తున్నది. పాఠశాలకు రాకముందు పిల్లలు సహజ పరిసరాలలో, సన్నివేశాలలో భాషను నేర్చుకొంటారు. అలాగే పాఠశాలలో కూడా ఆహ్లాదకర పరిసరాలు, సందర్భాలు, సన్నివేశాలు అర్థవంతంగా ఉండాలి. తరగతి గదిలో ఉపయోగించే బోధన ప్రక్రియలు కూడా పరిసరాలకు వీలైనంత దగ్గరగా ఉండాలి. ఉపాధ్యాయుడిలో భాషాపరమైన వికాసం మరింత ఎక్కువగా ఉండాలి. కనీసం కొన్ని పద్యాలు, గేయాలు, కథలతో అతనికి పరిచయం వుండాలి. అప్పుడే అతని బోధన రక్తికడుతుంది. Every subject

teacher is basically a language teacher అన్న విషయం మనం మరువరాదు. ఉపాధ్యాయుడు భాషాపరంగా వీరితో enrich కావాలి.

సాధారణంగా మనం ఉపన్యాస పద్ధతి, చర్చాపద్ధతి, నియోజన పద్ధతి, బహుళ తరగతి బోధన, లోపనివారణ బోధన, కిండర్ గార్డెన్ పద్ధతి, మాంటిస్సోరి పద్ధతి మొదలైన బోధనా పద్ధతులను ఉపయోగిస్తున్నాము. అంతేకాక భాషా ప్రక్రియలను బట్టి పద్యబోధనలో ప్రతిపదార్థ పద్ధతి, తాత్పర్యపద్ధతి, సారాంశ పద్ధతి, సంభాషణ పద్ధతి, ప్రవచన పద్ధతి, ఉపన్యాస పద్ధతి, చర్చా పద్ధతి, వివరణ పద్ధతి, ప్రశంసాపద్ధతులు ఉపయోగిస్తున్నాము. గద్య బోధనలో కథాకథన పద్ధతి, సంభాషణ పద్ధతి ప్రవచన పద్ధతి, ఉపన్యాసపద్ధతి, చర్చాపద్ధతి, వివరణపద్ధతి, ప్రశంస పద్ధతులను ఉపయోగిస్తున్నాము. వ్యాకరణ బోధనలో సూత్రపద్ధతి, అనుమానోపపత్తి పద్ధతి, ప్రామాణిక పద్ధతి మొదలగు వాటిని ఉపయోగిస్తున్నాము. లేఖారచన పద్ధతిలో ప్రశ్నోత్తర పద్ధతి, అనుకరణ పద్ధతి, చర్చా పద్ధతిని ఉపయోగిస్తున్నాము.

భాషాబోధనలో ఇలాంటి పద్ధతులకు మనం అలవాటుపడ్డాం. ఇందులో ఎన్నో గుణ దోషాలు మనకు కనిపిస్తాయి. పిల్లలకు ఆసక్తిని, సృజనాత్మకతను పెంపొందించే సందర్భాలతో కూడిన పాఠ్యాంశాలు, పద్ధతులు కాక విసుగును, అనాసక్తిని కలిగించేవిగా, పిల్లల్లో బట్టీని ప్రోత్సహించేవిగా ఉన్నాయి . అభ్యాసాలు కూడా ఒకే మూసతో నిండి ఉన్నాయి. స్థానిక పఠనావగాహన సన్నివేశాలు, పదజాలానికి అర్థాలు, వ్యాకరణాభ్యాసాలు, కొంత రాత పని మాత్రమే ఈ అభ్యసాల్లో చోటు చేసుకున్నాయి. ఈ విధమైన భాషా అభ్యసన వాతావరణం పిల్లలకు తగిన ప్రయోజనం కల్గించడం లేదు.

కొత్త సన్నివేశాలు కల్పించడం, ఆ సన్నివేశాలల్లో తమ భాషా సామర్థ్యాలను ప్రయోగించడం పిల్లలు కోరుకుంటారు. వీటినే సహజ అభ్యసన సన్నివేశాలు అంటారు. కొత్త వారితో పిల్లలు కొత్త విషయాలు మాట్లాడతారు. కొత్త వాక్యాలు నిర్మిస్తారు. ఆటపాటల్లో నిమగ్నమవుతారు. తమదైన భాషా శైలిని ఉపయోగిస్తారు. తల్లిదండ్రులు మాతృభాష కాని ఇతర రాష్ట్రాల్లో ఉన్నపుడు పిల్లలు మాతృభాషతో పాటు ఆ ఇతర భాషల్లో కూడా (ఉదా ॥ హిందీ, మరాఠీ, తమిళం మొ॥) మాట్లాడతారు.

పై విషయాల కనుగుణంగా తగిన పద్ధతులు, సామాగ్రిని రూపొందించడానికి ఈ కింది అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి. అవి:

1. భాషా స్వభావం; అందుకు సంబంధించిన మనోవైజ్ఞానిక సూత్రాలు
2. శిశువు భాషా సామర్థ్యం
3. తరగతి గదుల్లోని బహుముఖ భాషా సన్నివేశాలు
4. విద్యా ప్రమాణాలు
5. మార్గదర్శకాలు మరియు భాషా ఆధారపత్రాలు.
6. భాషలో వస్తున్న ఆధునిక పోకడలు

### 4.2.1 పరస్పర భాగస్వామ్య పద్ధతులు

పిల్లలు తమ చుట్టూవున్న పరిసరాలతో, ప్రకృతితో, వస్తువులతో, ప్రజలతో, భాష ద్వారా, కార్యక్రమాల ద్వారా జరిపే ప్రతి చర్యల ద్వారా అభ్యసనం జరుగుతుంది. వివిధ భౌతిక చర్యలు, స్వంతంగా మరియు సహచరులతో కలిసి చెయ్యడం, సాధించడం, వ్యక్తీకరించడం. ప్రశ్నించడం, చర్చించడం లాంటి అనేక సందర్భాలలో అభ్యసన జరుగుతుంది. ఇందులో ఉపాధ్యాయుడు ఒక ప్రధాన వనరు మాత్రమే. పిల్లలు, ఉపాధ్యాయునితో, తోటి సహచరులతో, పెద్దలతో, సమవయస్కులతో పరస్పర చర్యలు జరపడం ద్వారా నేర్చుకొంటారు. కాబట్టి మనం పాఠశాలలో పరస్పర భాగస్వామ్యంగా అభ్యసన జరిపే ఈ పద్ధతిని అమలు పరుస్తున్నాము. ఇందులో అనేక బోధనా వ్యూహాలను నిర్వహిస్తాము. వాటిలో ప్రధానవైనవి..

**పదపద్ధతి – వాక్య నిర్మాణం**

1,2 తరగతుల పాఠ్యపుస్తకాలను పదపద్ధతి ఆధారంగా బోధిస్తున్నాం. పిల్లల నిత్యజీవితంలో వినియోగించే పదాలు, చిత్రాలు, సన్నివేశాలతో కూడిన పాఠాలను రూపొందించుకున్నాము. పదపద్ధతిలో చిత్రం ద్వారా గాని, గేయం ద్వారా గాని, కథ ద్వారా గాని పదాల ఆధారంగా పిల్లలలో భాషా సామర్థ్యాలను అభివృద్ధి పరుస్తాము. అర్థవంతమైన, పరిచితమైన సన్నివేశాలలో పదాల ఆధారంగా భాషను నేర్పుపద్ధతిని "పదపద్ధతి" అంటారు. అక్షరాలకు అర్థం రూపాదించడం సాధ్యంకాదు. పదాలు, అంతకంటే వాక్యాలు – అర్థవంతంగా ఉంటాయి. కాబట్టి వీటి ద్వారా అక్షరాలను గుర్తించడం తేలిక అవుతుంది.

HTN1WQ

**పదపద్ధతి – సోపానాలు**

1. ఒక కథను గాని, పాఠాన్నిగాని, సన్నివేశ చిత్రాన్ని గాని ఎంచుకోవడం.
2. దానిని పిల్లలకు తెలియచేసి, పిల్లలతో మాట్లాడించడం.
3. దానిని చార్టులో లేదా బొమ్మ మీద రాసి పిల్లలను పలకరించడం.
4. అందులోని ఒక వాక్యాన్ని ఎన్నుకొని బోర్డుమీద రాయడం.
5. ఆ వాక్యాన్ని చదివి వినిపించడం, పిల్లలతో చదివించడం.
6. కీలక పదాన్ని గుర్తింపచేసి, అందులోని అక్షరాలను వర్ణమాల చార్టులో గుర్తింపచేయడం.
7. నేర్చుకొన్న అక్షరాలలో కొత్త పదాలు తయారు చేయించడం, చెప్పించడం.
8. పిల్లలు తయారు చేసిన పదాలను బోర్డుమీద రాసి, వాటితో వాక్యాలు తయారు చేయించడం, చెప్పించడం.

భాషా బోధనలో పదపద్ధతి ద్వారా విద్యార్థులు తమంతట తాముగా నేర్చుకొన్న కొద్ది అక్షరాలతోనే స్వంతంగా పదాలు తయారుచేయడం, వాటి ద్వారా వాక్యాలు తయారు చేయడం జరుగుతుంది. ఫలితంగా అక్షరాలు, పదాలు, వాక్యాలు స్వంతంగా, సులభంగా నేర్చుకోగలమన్న ఆత్మవిశ్వాసం పిల్లల్లో కలుగుతుంది. ఇదే జ్ఞాన నిర్మాణ ప్రక్రియ.

**కృత్యాధార పద్ధతి :**

అనుభవాల ద్వారా నేర్చుకొనేదే నిజమైన అభ్యసనం. స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యార్థి ప్రత్యక్షంగా పాల్గొని చేయడం ద్వారా శాశ్వతమైన అభ్యసనం జరుగుతుంది. ఇది స్వయం అభ్యసనానికి

దారి తీస్తుంది. తరగతిలో, తరగతి బయట అనగా ఆటస్థలంలోను, ప్రయోగశాలలోను, క్షేత్రపర్యటనలలోను, ఇంటివద్ద విద్యార్థి స్వయంగా పాల్గొనేటట్లుగా బోధనాభ్యసన అనుభవాలను కల్పించాలి. ఉపాధ్యాయుడు సహాయకారిగా ఉంటూ విద్యార్థులను ప్రోత్సహించాలి. దీనికి అత్యంత అనుకూల పద్ధతి 'కృత్యాధారపద్ధతి' దీనినే కార్యకలాపాల పద్ధతి, కృత్యపద్ధతి, పని చేయడం (learning by doing) ద్వారా అభ్యసనం అని కూడా అంటారు. మన దేశంలో మొదటగా ఈశ్వరీ భాయిపటేల్ కమిటీ ఈ పద్ధతిని ప్రస్తావించినది. గాంధీజీ బేసిక్ విద్యా విధానం కూడా ఈ పద్ధతి ద్వారానే జరిగింది. 1986 జాతీయ విద్యావిధానం కూడా ప్రాథమిక స్థాయిలో ఈ విధానం ద్వారానే బోధన జరగాలని చాలా ప్రగాఢంగా తెలియజేసింది. NCF-2005,RTE-2009,SCF-2011 లు కూడా ఈ పద్ధతిలోనే విద్యాబోధన జరగాలని గట్టిగా సూచించాయి. అందుకు అనుగుణంగానే వైవిధ్యభరితమైన నూతన పాఠ్యపుస్తకాల రూపకల్పన జరిగింది.

**స్వేచ్ఛాయుత వాతావరణంలో, విద్యార్థి ప్రత్యక్షంగా పాల్గొని పరిశీలించి, కృత్యాలు చేయడం ద్వారా పొందే శాశ్వత అభ్యసన విధానాన్ని "కృత్యాధార పద్ధతి" అంటారు.**


కృత్యాధార పద్ధతిలో 'కృత్యాలు', వాటి నిర్వహణ అత్యంత ప్రధానమైనవి. కృత్యం లేకుండా పాఠం లేదు అంటాడు ఓ విద్యామనోవిజ్ఞానవేత్త. కృత్యం ప్రభావాన్నిబట్టి కృత్యాలు 3 రకాలుగా ఉంటాయి.

1. వ్యక్తిగత కృత్యాలు
2. జట్టు కృత్యాలు
3. సమూహ కృత్యాలు

**1. వ్యక్తిగత కృత్యాలు:** విద్యార్థులకు వ్యక్తిగతంగా ఒక్కొక్కరిచే చేయించే కృత్యాలను 'వ్యక్తిగత కృత్యాలు' అంటారు. వీటి ద్వారా పిల్లల స్థాయిని, సామర్థ్యాల వాస్తవ స్థితిని అంచనా వేయవచ్చు. పూర్తి తరగతి కృత్యాలు,జట్టు కృత్యాలలో పొందిన అనుభవం ఆధారంగా వ్యక్తిగత కృత్యాలు నిర్వహించాలి. వీటి నిర్వహణలో కింది సూచనలు తప్పక పాటించాలి.

1. పిల్లలు వ్యక్తిగతంగా ప్రతిస్పందించేలా చూడాలి.
2. పిల్లలు స్వయంగా ఆలోచించి చేసేలా చూడాలి.
3. పిల్లల ప్రతిస్పందనలను వారి దగ్గరకెళ్ళి వ్యక్తిగతంగా పరిశీలించాలి.
4. సూచనలు అర్థం కాని పిల్లలకు తగిన సూచనలివ్వాలి.
5. పిల్లల అభిప్రాయాలలో జోక్యం చేసుకోవడం, కించపరచడం చేయరాదు.
6. ప్రతిఒక్కరు కృత్యంలో పాల్గొన్న తీరును విశ్లేషించుకోవాలి.
7. వెనుక బడిన పిల్లలకు తగిన సహాయ సహకారాలను అందించాలి.
8. బాగా చేసిన పిల్లల పనిని ప్రదర్శించాలి. వారిని అభినందించాలి.

**1. భావనా చిత్రం (Mind / Concept Mapping):** ఒక అంశంపై పిల్లలు అవగాహనను, అనుభవాలను ఒక క్రమ పద్ధతిలో తెలుసుకోవడం ' భావనాచిత్రం'. ఒక అంశానికి సంబంధించిన కీలక పదాన్ని నల్లబల్లపై రాసి, ఆపదం యొక్క భావనను విద్యార్థులతో చర్చించడం జరుగుతుంది.




పిల్లలు వ్యక్తపరిచే అభిప్రాయాలకు ఇందులో స్థానం ఉంటుంది. ఒకే అంశం గురించి పిల్లలను వివిధ కోణాలలో ఆలోచింపచేయడం, ఆలోచనల సారాంశాన్ని క్రమానుగుణంగా రాయడం ద్వారా వారిలో స్వీయరచనను ప్రోత్సహించవచ్చు. ఉదా॥

పైన తెల్పిన విధంగా నల్లబల్లపై రాసిన భావనల చిత్రం ఆధారంగా వాక్యాలను తయారు చేయడం. వాటిని కొన్ని గ్రూపులుగా చేయడం. అర్థవంతమైన రూపాన్ని ఇవ్వడం. ఇలా చేయడం వల్ల వ్యాసరచన, వ్యాసరూప ప్రశ్నలకు జవాబులు రాయడం వంటి సామర్థ్యాలు పిల్లలలో వృద్ధి చెందుతాయి.

**2. నృత్యాభినయం (Choregraphy):** విద్యార్థులు తాము విన్న, చదివిన, తెలుసుకొన్న అంశాలను స్వయంగా అభినయంలా నృత్యరూపకంగా ప్రదర్శించడమే కొరియోగ్రఫీ. ఇందుకు ముందుగా పాఠాన్ని చదివించి నిర్ణయించాలి. వివిధ పాత్రలకు, సన్నివేశాలకు పిల్లల్ని ఎంపిక చేయాలి. వారితో సాధన చేయించి ప్రదర్శింప చేయాలి. ఈ ప్రక్రియలో పిల్లలు చదవడం, చర్చించడం, భావాన్ని గ్రహించడం తమ అవగాహనకు ఒక రూపాన్ని ఇవ్వడం, దాన్ని ప్రదర్శించడం, వంటి సామర్థ్యాలు అభివృద్ధి చెందుతాయి.

**3. ఏకపాత్రాభినయం (Debates):** పాఠంలోని ఒక పాత్ర మాట్లాడిన విషయాన్ని తీసుకొని, విద్యార్థిచే పాత్రోచితంగా అభినయం చేయించడమే 'ఏకపాత్రాభినయం'. దీని వల్ల పాత్ర స్వభావం, లక్షణాల గురించి క్షుణ్ణ అవగాహన ఏర్పడుతుంది. ఉదా: లోగడ 5వ తరగతి తెలుగు భారతిలోని కొండ–ఉడత (ఎవరు గొప్ప) సంభాషణాత్మక గేయంలోని ఉడతపాత్ర.

"బండరాళ్ళను మోయు కొండన్నా
బడాయి మాటలు వద్దన్నా
ఉడతనే బుడతనే కదా నేను
నీ ఎత్తు నీ గొప్ప ఒప్పుకుంటాను
ఉడతనైనా నేను పరిగెత్తుతాను

చెట్టు కొమ్మలపైన గంతులేస్తాను
నాలాగ అటు ఇటూ నడవగలనా
నువ్వు కాయలను కమ్మగా కొరికి తినగలవా?
నాకన్న నువ్వెంతో పెద్ద వాడివే. కాని
నీ కన్న నేనెంత చిన్న దాన్నో చూడు!

**4. చర్చలు (Mono action):** ఒక అంశం గురించి వ్యక్తిగత అభిప్రాయలు తెలుసుకోవడం. వాటిని చర్చించడం, ఒక స్థిరమైన అవగాహనకు రావడం.

ఉదా॥ వర్షాలు కురవక పోతే ఏమవుతుంది ?

**5. ప్రాజెక్టు పనులు (Project Work):** వివిధ కృత్యాల సమూహమే ప్రాజెక్టుపని. స్వభావాన్ని బట్టి ప్రాజెక్టుపని వ్యక్తిగతంగాగాని, జట్టుపనిగాగాని ఇవ్వాలి. తగిన సూచనలతో ప్రాజెక్టు పని చేయించి, నివేదికను ప్రదర్శింపచేయాలి. దానిని చర్చించి అందరికీ అవగాహన కలిగించాలి.

## 6. KWL వ్యూహం (What I know ? What I want to know ? what I learnt ?) :

(నాకేం తెలుసు ? నాకేం తెలియాలి ? నేనేం తెలుసుకున్నాను ?

ఒక అంశం పట్ల పిల్లలకు ఏం తెలుసో ? ఏమి తెలుసుకోవాలను కొంటున్నారో చర్చించాలి. తర్వాత కృత్యనిర్వహణ, పుస్తక పఠనం, జట్టు పనులు, రెఫరెన్సు పుస్తకాలు చదవడం, వాటిపై చర్చ జరపాలి. వాళ్ళు ఏమి అర్థం చేసుకొన్నారో, ఏమి నేర్చుకొన్నారో తెలుసుకోవడం. ఈ వ్యూహంలో అంశాలను పిల్లలకు పరిచయం చేసేటప్పుడు వాళ్ళకు ఆ అంశం పట్ల ఉన్న పూర్వ జ్ఞానాన్ని, ఆసక్తిని, వారి అవగాహనను నేర్చుకొంటున్నామనే స్పృహతో తెలుసుకోవడం అనేది జరుగుతుంది. ఇందులో ముందుగా ఊహించడానికి, తాము ఊహించిన దాన్ని వాస్తవాలతో పోల్చుకోవడానికి, ఆసక్తికరమైన అభ్యసనానికి అవకాశం ఉంటుంది.

## 7. సాహిత్య కార్యక్రమాలు (Literature activities) :

విద్యార్థులను జట్లుగా చేసి, ఒక్కో జట్టకు ఒక్కో భాషాపరమైన అభ్యాసాన్ని కేటాయించాలి. ఉదా ॥ ఒక జట్టుకు పదజాలం, సామెతలు వంటివి. మరో జట్టుకు చదివిన అంశంలో వారికి నచ్చిన విషయాలు, ఇంకో జట్టుకు చదివిన అంశంపై ప్రశ్నలు తయారు చేయమనడం. ఇలా ఒకే అంశంపై అన్ని జట్ల వాళ్లు సాహిత్యపరంగా పనిచేస్తారు. వాటిని ప్రదర్శించి, చర్చించాలి.

**జట్టు కృత్యాలు**

విద్యార్థులను జట్లుగా చేసి నిర్వహించే కృత్యాలను 'జట్టుకృత్యాలంటారు'. జట్లలో విద్యార్థులు 4 లేక 5 గురిని మించరాదు. విద్యార్థులను జట్లుగా చేయునపుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

**జట్టు కృత్యాలు నిర్వహణకు ముందు**

1. పిల్లలను 5 మందికి మించకుండా జట్లుగా చేయాలి.
2. కృత్య స్వభావాన్ని బట్టి జట్లలో పిల్లలను తరచూ మారుస్తూ ఉండాలి.
3. జట్లలో అన్ని స్థాయిల్లోని పిల్లలు ఉండేలా చూడాలి.
4. ప్రతిజట్టుకు ఒక నాయకుడు ఉండాలి.
5. అమ్మాయిలను, అబ్బాయిలను కలగలిపి కూర్చోబెట్టాలి

**జట్టు కృత్యాలు నిర్వహణ సమయంలో**

1. జట్టు కృత్యంలో పిల్లలందరు పాల్గొనాలి, పరిశీలించాలి, చర్చించాలి.
2. పిల్లల చర్చలవల్ల కొంత రణగొణ ధ్వని ఉండక తప్పదు. అందుకు ఉపాధ్యాయుడు విసుక్కోకూడదు.
3. అవసరమైతే తప్ప ఉపాధ్యాయుని జోక్యం ఉండరాదు.
4. ఉపాధ్యాయుడు అన్ని జట్లను పలకరిస్తూ, పరిశీలిస్తూ ప్రోత్సహించాలి.
5. జట్లలో స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలి.
6. స్వేచ్ఛ దుర్వినియోగం కాకుండా చూడాలి.

**జట్టు కృత్యాల నిర్వహణ తర్వాత**

1. జట్లలో చేసిన పనిని చర్చించి ప్రదర్శించాలి. ఆరు అభ్యసన సూత్రాల్లోని పిల్లలు చేసిన పనిని ప్రదర్శించడం ద్వారా ఆసక్తికరమైన తరగతిగది రూపొందించడం అంటే ఇదే!
2. బాగా చేసిన జట్టును అభినందించాలి.
3. పిల్లలు చేసిన తప్పులను వారే సవరించుకొనేలా చూడాలి.
4. జట్టులో చేసిన పనిని గోడపత్రికలో ప్రదర్శించాలి. ప్రదర్శనా నైపుణ్యంకూడా కృత్యాధార బోధనలోని ఓ భాగమే!

**సమూహకృత్యాలు**

తరగతిలోని మొత్తం పిల్లలందరికీ నిర్వహించే కృత్యాలను 'సమూహ కృత్యాలు' అంటారు. వీటినే పూర్తి తరగతి కృత్యం అనికూడా అంటారు. ఉదా॥ చిత్రాల గురించి మాట్లాడించడం, ఏదైనా గేయాన్ని పిల్లలందరిచేత కోరస్‌గా పాడించడం.

**సూచనలు**

1. పిల్లలకు స్పష్టమైన సూచనలివ్వాలి.
2. పిల్లలను ప్రోత్సహిస్తూ, ఆలోచింపచేసే ప్రశ్నలు అడగాలి.
3. పిల్లలతో మాట్లాడించేటప్పుడు ఒకరి తర్వాత ఒకరిని మాట్లాడించాలి.

4. పిల్లలంతా అందులో నిమగ్నమయ్యేలా కృత్యాన్ని నిర్వహించాలి.

5. పిల్లల నుండి ఎక్కువ సాధనలు వచ్చేలా చూడాలి. అందరికీ అవకాశం ఇవ్వాలి.

**కృత్యాధార బోధన క్రమం**

కృత్యాధార బోధనలో కృత్యాల తయారీ, వాటి నిర్వహణ ప్రధాన అంశాలు, ఇందులో ఉపాధ్యాయుని పాత్ర పరోక్షమైనప్పటికీ, అతి ప్రధానమైంది. ఉపాధ్యాయులు ఎన్నెన్నో మెళకువలతో పాటు కింది విషయాల పట్ల అవగాహనతో ఉండాలి. కృత్యాధార బోధనా విధానం విజయవంతం కావడం ఉపాధ్యాయుడి చురుకుదనం, ఉత్సాహం మీద ఆధారపడి ఉంది.

1. పాఠాన్ని క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలి.
2. ముఖ్యాంశాలను గుర్తించి కృత్యాలను రూపొందించాలి.
3. బోధనాభ్యసన సామాగ్రిని సూచించాలి లేదా సమకూర్చాలి.
4. కృత్యాలను నిర్వహించాలి, పరిశీలించాలి, సకాలంలో అందించాలి.
5. ఫలితాలను సమీక్షించాలి. మార్పులను సూచించాలి, అభినందించాలి.
6. తరగతిగదిలో స్వేచ్ఛాయుత వాతావరణాన్ని సృష్టిస్తూనే, సంయమనాన్ని పాటించాలి.

కృత్యాధార పద్ధతి మనోవిజ్ఞానశాస్త్ర నియమాలకు అనుగుణంగా ఉంటుంది. అభ్యసనం విద్యార్థి కేంద్రంగా జరగడం వల్ల విద్యార్థిలో ఇష్టం, ఏకాగ్రత, అవధానం అధికం. అభ్యసనం పట్ల ఆసక్తిని, అభిరుచిని కలిగించవచ్చు. ప్రాథమిక స్థాయిలో భాషాబోధనకు ఇది అత్యంత ఉపయోగకరము. ఈ పద్ధతి సందర్భాన్నిబట్టి ఎన్నో బోధనా వ్యూహాలను అనుసరిస్తాము.

**భాషా పాఠ్య బోధనా సోపానాలు**

ప్రస్తుత పాఠ్యపుస్తకాన్ని బోధించడానికి ఉపాధ్యాయుడు, ముందుగా పాఠ్యాంశ వ్యవహార రూపాలను అవగాహన చేసుకోవాలి. ఇతివృత్తాన్ని, కీలక భావనలు దృష్టిలో వుంచుకొని అనుబంధ కృత్యాలు తయారుచేసుకొని అమలుపరచాలి. తద్వారా పిల్లల్లో వ్యక్తిత్వ విలువలు, భాషా నైపుణ్యాలు పెంపొందుతాయి. సిలబస్ పూర్తి చేయడం అనే పాత ఆలోచన ధోరణి మారాలి. పాఠ్యపుస్తకానికే పరిమితం కాకుండా విద్యార్థుల దైనందిన జీవితానుభవాలు, ఉపాధ్యాయుని ప్రాపంచిక అనుభవాలను సహసంబంధపరుస్తూ బోధనా వ్యూహాలు రూపొందించుకోవాలి. అపుడే మనం నిర్దేశించుకొన్న విద్యాప్రమాణాల నన్నింటిని సాధించడానికి వీలవుతుంది. ఇందుకు నూతన పాఠ్యపుస్తక బోధనలో కింది బోధనా సోపానాలు అమలు పరచాలి.

**1,2 తరగతులు**

పిల్లల్ని U ఆకారంలో కూర్చోబెట్టడం

↓

పాఠ్యపుస్తక ప్రదర్శన

↓

పాఠంలోని చిత్రాన్ని పరిశీలింపజేసి మాట్లాడించడం, అనుబంధ ప్రశ్నలు అడగడం

↓

పాఠాన్ని (గేయాన్ని) నల్లబల్లపై లేదా చార్టులపై రాయడం

↓

ఉపాధ్యాయుడు పాడడం / చదవడం, పిల్లలచే చదివించడం / పాడించడం

↓

ఉపాధ్యాయుడు పిల్లలు కలిసి పాడడం

↓

ఉపాధ్యాయుడు అభినయం చేస్తూ, విద్యార్థులచే అభినయం చేయించడం

↓

ఉపాధ్యాయుడు, పిల్లలు కలిసి అభినయం చేయడం

↓

పిల్లలచేత వ్యక్తిగతంగా అభినయం చేయిస్తూ పాడించడం

↓

పాఠం / గేయాల వాక్యాలను గుర్తింపచేయడం

↓

పాఠం / గేయాల పదాలు గుర్తింపచేయడం

↓

కీలక పదాల్లోని అక్షరాలను గుర్తింపచేయడం

↓

నూతన పదాల నిర్మాణం చేయడం

↓

చదవడం, రాయడం, పదజాలం, జట్టుకృత్యాల నిర్వహణ

↓

పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలను వ్యక్తిగతంగా చేయించడం.

### 3, 4, 5 తరగతులు

ఉన్ముఖీకరణ చిత్రాలను పరిశీలింప చేయడం

↓

చిత్రాల ఆధారంగా మాట్లాడించడం

↓

పాఠంలోని చిత్రాన్ని పరిశీలింప చేయడం, చర్చించడం

↓

విద్యార్థులచే పాఠాన్ని మౌనంగా చదివించడం, అర్థం కాని పదాల కింద గీతలు గీయించడం

↓

పదపట్టికలు/నిఘంటువు/ఉపాధ్యాయుల ద్వారా అర్థాలు తెలుసుకొని జట్లలో చర్చించి సొంతమాటల్లో వ్యక్తపరచడం

↓

ఉపాధ్యాయుని ఆదర్శపఠనం

↓

పాఠ్యాంశ వివరణ - చర్చ - అవగాహన - పరిశీలన

↓

అభ్యాసాల నిర్వహణ - చర్చ

ఇలా నిర్దేశించిన క్రమంలో బోధించడం అంటే ప్రణాళికాబద్ధమైన బోధన చేయడం అని అర్థం. అది విద్యార్థికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. భాషాభ్యసనం వేగవంతం చేస్తుంది. విద్యా ప్రమాణాల సమగ్రసాధనకు తోడ్పడుతుంది.

**సౌలభ్యకర్తగా ఉపాధ్యాయుడు**

పిల్లల సంపూర్ణాభివృద్ధికి ఉపాధ్యాయుల పాత్ర ప్రముఖమైనది. పిల్లలు వారి వయసుకు తగిన భాషా పరిజ్ఞానంతో పాఠశాలలో ప్రవేశిస్తారు. ఉపాధ్యాయులు అర్థం చేసుకొని వారి భాషాభివృద్ధికి తగిన అవకాశాలు కల్పించాలి. పాఠశాలకు రాక ముందు పిల్లలు ఎంత సహజసిద్ధంగా భాషను నేర్చుకున్నారో అలాంటి వాతావరణాన్ని కల్పించాలి. అభ్యసనలో పిల్లలకు ఎదురయ్యే ఆటంకాలను సమర్థవంతంగా పరిష్కరించుకోవడానికి తగిన సహాయ సహకారాలు అందించాలి. ఇందుకు ఉపాధ్యాయులలో ఉత్సాహం; చురుకుదనం ముఖ్యం.

### సౌలభ్యకర్తగా ఉపాధ్యాయుడు చేయవలసిన పనులు

1. సహజమైన భాషాభ్యసన సన్నివేశాలను కల్పించాలి.
2. పిల్లలకు ఎన్ని భాషలనైనా అభ్యసించే సామర్థ్యం ఉందని గ్రహించాలి.
3. పిల్లలు వారి మాతృభాషను తరగతుల్లో ఉపయోగించడానికి అనుమతించాలి .
4. వివిధ సందర్భాలలో పిల్లల భాషా వినియోగాన్ని ప్రోత్సహించాలి. దానివల్ల వారు ఆలోచనాత్మకంగా భాషను ఉపయోగిస్తారు.

5. విడిగా పదాలు, వాక్యాలను బోధనలో తగ్గించి, సంభాషణలు, చర్చలు, పాఠ్యపఠనం లాంటి కీలకాంశాలతో సమగ్రంగా Holistic గా బోధన జరపాలి.
6. పాఠ్య సందర్భాలకు అన్వయిస్తూ వ్యాకరణ బోధన జరగాలి. ప్రాథమిక స్థాయిలో ప్రాయోగిక వ్యాకరణం (వాడుక భాషా వ్యాకరణం) ప్రాధాన్యత సంతరించుకోవాలి.
7. భాషా పరిశీలనలు, విశ్లేషణలు తరగతి బోధనలో చోటు చేసుకోవాలి.
8. కృత్యాలు, ప్రాజెక్టులలో భాగంగా అనువాద కృత్యాలు, చర్చలు, సమస్యల సాధన, ప్రశ్నల నిర్మాణం వంటివి ఉండాలి.
9. కృత్యాలు పిల్లలందరు చేసేటట్లుండాలి మరియు వైవిధ్యభరితంగా ఉండాలి.
10. తరగతిలో సమవయస్కుల జట్టు కృత్యాలను కల్పించాలి.
11. మేధోమధనం, సమూహపఠనం, చర్చలు, నివేదికలు, ప్రతిస్పందనలు, ప్రత్యుత్తరాలు, గోడపత్రికలను రాయించడం, కొరియోగ్రఫీ, నాటకీకరణ ,ప్రాజెక్టు పనులు విరివిగా కల్పించాలి.
12. ప్రకటనలు, వార్తా ప్రకటనలు, ప్రకటన బోర్డులు, లేబుళ్ళ తయారీ వంటి వైవిధ్య పూరిత పాఠ్యాంశాలను తరగతి గదుల్లో కల్పించాలి.

### 4.3.1 ఇతివృత్తాలు (Themes)

పాఠ్యపుస్తకం లోని పాఠాలను ఎంపిక చేయడం ప్రధానమైనది. పాఠాలను ఎంపిక చేసేటప్పుడు ఎన్నో విషయాలను పరిగణలోనికి తీసుకోవాలి. వాటిలో ఇతివృత్తాలు ఒకటి. పిల్లలలో భాషా నైపుణ్యంతోపాటు సామాజిక అవగాహన, సామాజిక చైతన్యం సాంస్కృతిక చైతన్యం; సమకాలీన సమస్యలపై సరైన అవగాహన పెంపొందింపచేయడానికి కింద తెల్పిన వివిధ ఇతివృత్తాలను దృష్టిలో ఉంచుకొని పాఠాలను ఎంపిక చేసారు.

1. దేశభక్తి, విలువలు
2. మానవ సంబంధాలు
3. పిల్లల స్వభావం, వారి శక్తి సామర్థ్యాలు, ఆసక్తులు
4. పర్యావరణం, ప్రకృతి
5. సమాజం
6. సంస్కృతి, సాంప్రదాయాలు
7. భాషాభిరుచి
8. హాస్యం
9. కాల్పనికత, సృజనాత్మకత
10. మూఢనమ్మకాలకు లోనుకాకుండా చక్కని శాస్త్రీయవైఖరి.

### 4.3.2 పాఠం (యూనిట్) నిర్మాణం

- పిల్లల స్థాయి, పనిదినాలు, వీటి ఆధారంగా పాఠ్యపుస్తకంలో పాఠాల సంఖ్యను నిర్ణయించారు. భాషా పాఠ్యపుస్తకాలలో ఒక పాఠాన్ని ఒక యూనిట్‌గా పరిగణిస్తాము.పాఠం అమరికలో 1, 2 తరగతుల, 3, 4, 5 తరగతుల మధ్య కొంత వ్యత్యాసమున్నప్పటికీ, ఆయా తరగతులలోని అన్ని పాఠాలు ఒకే రకమైన అమరికలో పొందుపరచారు. ప్రతి పాఠం కింద తెల్పిన విధంగా అమరి ఉంది, ప్రతి పాఠానికీ ముందు సూచనలతో గూడిన ఉన్ముఖీకరణ చిత్రం ఉంటుంది. ఈ చిత్రంలో కింద ప్రశ్నలు ఉన్నాయి.
- ఈ చిత్రం కింద " పిల్లలూ ఇలా చేయండి" అనే శీర్షికతో పిల్లలతో పాఠం చదివించడానికి వాళ్లంతట వాళ్లే అర్థాలను గ్రహించడానికి సూచనలు ఉన్నాయి.
- పిల్లలు నిఘంటువు ద్వారా స్వీయ అధ్యయనం చేస్తూ తెలియని పదాల అర్థాలను తెలుసుకోడానికి దీని ద్వారా అవకాశం కలిగింది.
- ప్రతిపాఠం సంబంధిత చిత్రంతో ఆసక్తిదాయకంగా, ఆకర్షణీయంగా ఉంది. పాఠం ప్రారంభించడానికి ముందు పాఠాన్ని ఆసక్తిగా చదివించడానికి ముందుగా కొన్ని ప్రేరణ వాక్యాలు కూడా ఉన్నాయి. తరువాత పాఠం ఉంటుంది.
- పాఠం పూర్తయ్యాక "ఇవిచేయండి" శీర్షికతో ఆ పాఠం ఆధారంగా సాధించాల్సిన భాషా సామర్థ్యాలు అభ్యాసాల రూపంలో ఉన్నాయి.
- ప్రతిపాఠంలో భాషాభిరుచి పెంపొందించడానికి ప్రత్యేకంగా ప్రాజెక్టుపనులను ఇచ్చారు.
- పిల్లలే స్వయంగా తమ ప్రగతిని అంచనావేసుకోవడానికి "నేనివి చేయగలనా" ? అనే శీర్షికతో మూల్యాంకన కృత్యం ఇవ్వడమైంది.
- ప్రతి పాఠం చివర విలువను ప్రతిబింబించేలా ఒక మహనీయుని 'సూక్తి' ఉంది.

### 4.3.3. అభ్యాసాల స్వభావం, వాటి తరగతి గది అన్వయం (నిర్వహణ)

J3YPZ2

పిల్లలు అభ్యసన సన్నివేశాలలో పాల్గొనేలా తగు అభ్యసన అనుభవాలను, తగిన అవకాశాలను కల్పించాలి. ఇందుకోసం ఉపాధ్యాయుడు వివిధ సామర్థ్యాల సాధనకు విభిన్న వ్యూహాలను సిద్ధం చేసుకొని తరగతి బోధన జరపాలి. పాఠం ఇతర సామర్థ్యాల ఆధారంగా అభ్యాసాలు, సూచనలు ఉండాలి. అభ్యాసాలు పిల్లలు సొంతంగా చేయడంవల్ల, ఏ మేరకు చేయగల్గుతున్నారో, ఎలా నేర్చుకుంటారో అంచనా వేయడానికి తోడ్పడతాయి. అందుకే RTE - 2009 ప్రతి విద్యార్థికీ సామర్థ్యాల సాధనను కొలమానంగా నిర్ణయించింది. నిరంతర సమగ్రమూల్యాంకనానికి ఈ సామర్థ్యాధారిత అభ్యాసాలు తోడ్పడేలా రూపొందించాలి.

పాఠం అంటే కేవలం విషయాన్ని అందించడానికి పరిమితం కాకూడదు. భాషలో విషయం కంటే ఆ విషయాన్ని పొందుపరిచిన భాషా సౌందర్యం ముఖ్యం. భాషాపరమైన సాధనకు ప్రాముఖ్యత ఎక్కువ. పాఠంలోని విషయావగాహనతోపాటు భాషా సామర్థ్యాల సాధనకోసం చేర్చిన అభ్యాసాలను కూడా సాధన చేయాల్సి ఉంటుంది. అభ్యాసాల సాధనకు తద్వారా భాషాసామర్థ్యాలను పొందడానికి పాఠ్యాంశం ఒక సాధనంగా తోడ్పడుతుంది.

**భాషాభ్యసన సామర్థ్యాలు**

1) వినడం - మాట్లాడడం
2) చదవడం - అర్థం చేసుకొని చెప్పడం
3) రాయడం (స్వీయరచన)
4) పదజాలంపైన పట్టు
5) సృజనాత్మకత
6) ప్రశంస
7) భాషను గురించి తెలుసుకోవడం
8) ప్రాజెక్టు పని
9) సాహిత్యాన్ని గురించి తెలుసుకోవడం

**అభ్యాసాల స్వభావం**

- ప్రతిపాఠం చివర, నిర్ధేశిత సామర్థ్యాల సాధనకు అభ్యాసాలు ఇవ్వాలి. అభ్యాసాల సాధారణ స్వభావాన్ని పరిశీలిస్తే కింది విధంగా ఉన్నట్లు తెలుస్తుంది.
- ఆలోచింపజేసేవిగా ఉండాలి.
- బహుళ సమాధానాలు ఇచ్చేవిగా ఉండాలి. స్వీయ అనుభవాలను పంచుకొనేవిగా ఉండాలి.
- సృజనాత్మకత, కల్పనాశక్తికి అవకాశం ఇచ్చేవిగా ఉండాలి.
- పిల్లలకు ఆసక్తిని కల్గించేవిగా ఉండాలి.
- సవాలుచేసేవిగా ఉండాలి.
- స్వయం అధ్యయనానికి అవకాశం కల్గించేవిగా ఉండాలి.
- దైనందిన జీవితానికి అన్వయించేవిగా ఉండాలి.
- సొంతంగా చేసేవిగా ఉండాలి.
- భాషాసామర్థ్యాలను పెంపొందించడానికి అనుకూలంగా ఉండాలి.
- జట్టులో పనిచేయడానికి వీలుగా ఉండాలి.
- తోటి వారి ద్వారా నేర్చుకోవడానికి వీలుగా ఉండాలి.
- స్వేచ్ఛగా వ్యక్తీకరించడానికి అనుకూలంగా ఉండాలి.

ఇప్పుడు ఒక్కో సామర్థ్యం, దాని స్వభావం, దానిని తరగతి గదిలో ఎలా నిర్వహించాలో చూద్దాం.

**1. వినడం - ఆలోచించి చెప్పడం:** భాషా సామర్థ్యాలలో వినడం, మాట్లాడటం చాలా ముఖ్యమైనవి. వీటిని ప్రాథమిక నైపుణ్యాలుగా భావిస్తున్నాం. కాని బడికి రాక ముందే పిల్లలు వినడం - ఆలోచించి మాట్లాడే సామర్థ్యాన్ని కలిగి ఉంటారు. బడిలో చేరిన తర్వాత స్వేచ్ఛగా మాట్లాడడం, ఆత్మవిశ్వాసంతో మాట్లాడడం, సూటిగా మాట్లాడడం, సందర్భోచితంగా మాట్లాడడం, సరైన పదజాలంతో అర్థవంతంగా వినసొంపుగా మాట్లాడడం గురించి అభ్యసించాలి.

అలాగే విన్నదాన్ని అర్థం చేసుకొని తమ అనుభవాలను జోడించి, ఆలోచించి తగురీతిలో మాట్లాడేట్లు చూడాలి. ఆలోచించి మాట్లాడవలసిన అవసరాన్ని కల్పించడం ద్వారా పిల్లలు విషయాన్ని వినడం పట్ల ఏకాగ్రత చూపుతారు.

**స్వభావం**

- ☐ ఆలోచనాత్మకమైన సమాధానాలిచ్చేవిగా ఉండాలి.
- ☐ చర్చల్లో పాల్గొనేలా, ప్రతిస్పందించేలా ఉండాలి.
- ☐ అనేక రకాల సమాధానాలు చెప్పగలిగే విధంగా ఉండాలి.
- ☐ పిల్లలు ఊహించడానికి అవకాశం కల్పించేవిగా ఉండాలి.
- ☐ చిత్రాలను నిశితంగా పరిశీలించేవిగా ఉండాలి.
- ☐ స్వీయ అనుభవాలను సొంతమాటల్లో చెప్పేవిగా ఉండాలి.
- ☐ పాఠాలపై స్వీయ అభిప్రాయం వ్యక్తం చేసేవిగా ఉండాలి.

**తరగతి గది నిర్వహణ**

- ☐ వినడం – ఆలోచించి చెప్పడం గురించిన ఏ కృత్యం అయినా పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి.
- ☐ అభ్యాసంలోని ప్రశ్నలలో ఒక్కో ప్రశ్న అడగాలి. ఒక ప్రశ్న గురించి పిల్లలందరితో మాట్లాడించాలి.
- ☐ పిల్లలు చెప్పిన విషయాన్ని ఆమోదించాలి. ఖండించరాదు.
- ☐ పిల్లలు తమ అనుభవాలను, అభిప్రాయాలను జోడించి చెప్పేలా ప్రోత్సహించాలి.
- ☐ పిల్లలు అనేక రకాలైన సమాధానాలు చెప్పే విధంగా ప్రశ్నలు అడగాలి.
- ☐ పిల్లలు సమాధానాలను క్రోడీకరించి ముగింపు / సమాధానం చెప్పించాలి / చెప్పాలి.
- ☐ బోధించేటప్పుడు గేయాలు/పద్యాలను వాటి నడకనుబట్టి లయబద్ధంగానూ, రాగయుక్తంగానూ పాడించాలి.
- ☐ తరగతిలో పిల్లల భాగస్వామ్యం అధికంగా ఉండేలా ఉపాధ్యాయుడు మార్గదర్శిగా ఉండాలి.
- ☐ అందరూ మాట్లాడేలా, చర్చల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి. అవకాశాలు ఇవ్వాలి.
- ☐ ముందుగా ఉపాధ్యాయుడు పాఠానికి సహసంబంధంగా వుండే పద్యాలు, గేయాలు లయబద్ధంగా పాడి వినిపించాలి.
- ☐ వినడం – మాట్లాడడం, అభ్యాసాన్ని కూడా నిర్వహించడానికి ఒక పీరియడ్‌ను ప్రత్యేకంగా కేటాయించిన ఆ పీరియడ్‌లో నిర్వహించాలి.

**2. ధారాళంగా చదవడం, అర్థం చేసుకొని చెప్పడం, రాయడం:** పిల్లలు ధారాళంగా స్పష్టమైన ఉచ్చారణతో చదవగలగాలి. చదివిన అంశం గురించి అర్థం చేసుకొని చెప్పగలగాలి. రాయగలగాలి. భాషాభ్యసనం యొక్క ముఖ్యలక్ష్యం పిల్లలను భాషాభిమానులుగా, స్వతంత్ర పాఠకులుగా తయారు చేయడం. కాబట్టి పిల్లల్లో చదివే అలవాటును పెంపొందించడం కోసం పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలు తోడ్పడాలి.

పాఠశాల పిల్లల పఠనాభిరుచిని పఠనావగాహన్ని ఉన్నత శ్రేణికి తీసుకొని వెళ్లాలి. అందుకుగాను ముఖ్యంగా ఉపాధ్యాయుడు పఠనాభిరుచిని పెంపొందించుకోవాలి / పిల్లలకు తాను రోల్‌మోడల్‌గా మారాలి. విభిన్న ప్రక్రియలతో కూడిన పాఠాలను పిల్లలకు పరిచయం చేయడం, వైవిధ్య భరితమైన అభ్యాసాల వల్ల వారు పాఠ్యపుస్తకాలకతీతమైన ప్రగతిని సాధిస్తారు. ఇలా చదవడంపై పట్టు కల్గిన పిల్లలే తప్పులేకుండా రాయగల్గుతారు. చక్కటి పదాలను సందర్భోచితంగా మాట్లాడడంలో లేదా రాయడంలో వినియోగిస్తారు.

**స్వభావం**

- □ పిల్లలతో పాఠాన్ని మళ్లీ మళ్లీ చదివించేలా ఉండాలి.
- □ చదివిన పాఠం ఎంతమాత్రం అర్థమైందో తెలుసుకొనేలా ఉండాలి.
- □ పాఠంలోని పాత్రల మధ్య సంభాషణలను గుర్తుచేసుకొనేలా ఉండాలి.
- □ పాఠం ఆధారంగా తప్పు ఒప్పులను నిర్ణయించేలా ఉండాలి.

**తరగతి గదిలో నిర్వహణ**

- □ చదవడం కోసం ఇచ్చిన కృత్యాలు పూర్తి తరగతి గది కృత్యంగా లేదా వ్యక్తిగతంగా లేదా జట్టు కృత్యంగా అభ్యాసాల కాఠిన్యత స్థాయిని బట్టి నిర్వహించాలి.
- □ ప్రతి అభ్యాసాన్ని పిల్లలతో మొదట వ్యక్తిగతంగా చదివించాలి. ఏం చేయాలో పిల్లలతోనే చెప్పించాలి.
- □ పాఠంలో గుర్తించేవిగా, పిల్లలతో వ్యక్తిగతంగా చేయించేవిగా ఎలా చేయాలో సూచనలు ఇచ్చి అవగాహన చేయించేవిగా ఉండాలి.
- □ తప్పొప్పులను గుర్తించడం, జతపరచడం, ఎవరు ఎవరితో అన్నారు వంటి అభ్యాసాలను పూర్తి తరగతిలో అడగడం, పిల్లలు చెప్పినది బోర్డుపై రాయడం. పుస్తకాలలో రాసుకోమనడం, చర్చించిన తర్వాత జట్లులోగాని వ్యక్తిగతంగా గాని రాయించడం.

**3. ఆలోచించి సొంత మాటల్లో రాయడం (స్వీయరచన):** పిల్లలు విన్న లేదా చదివిన లేదా తెల్సిన విషయానికి తన అభిప్రాయం జోడించి సొంతంగా రాస్తేనే దాన్ని రాయడంగా భావించాలి. రాయడంలో పిల్లలు అంశాన్ని ఒక క్రమంలో, సంపూర్ణ వాక్యాలతో అర్థవంతంగా రాయాలి. అంశానికి తగిన పదజాలాన్ని ఉపయోగించి రాయగలగాలి. భావం, వాక్యనిర్మాణం, సరైన పదజాల వినియోగం ఉపయోగించి రాసినపుడే రాయడం ఫలవంతమైనదిగా భావించాలి. పిల్లల్లో గల ఆసక్తిని పాఠశాలల్లో ప్రేరేపించి వారు స్వేచ్ఛగా రాయడాన్ని ప్రోత్సహించాలి.

తెల్సినవాటిని గురించి, చూసిన వాటిని గురించి విన్న వాటిని, చదివిన వాటిని గురించి సొంతంగా రాయమనాలి. రాసిన వాటిని సరిగా ఎలా రాయవచ్చో తరగతిలో ప్రతిరోజూ చర్చిస్తే కొంతకాలానికి రాయడంలో దొర్లే తప్పులు పిల్లలే తమంతట తాముగా సరిదిద్దుకొంటారు.

**స్వభావం**

- □ గేయ / పద్యభావాలను / సారాంశాలను సొంతంగా రాయగలిగేలా ఉండడం
- □ పిల్లలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి వీలుగా ఉండడం.

- ఎందుకు ? ఎలా ? అనే ప్రశ్నలకు సమాధానాలు రాయగలిగేవిగా ఉండడం.
- కారణాలను ఆలోచింపజేసేవిగా ఉండడం
- తార్కిక ఆలోచలతో కూడిన సమాధానాలు రాయగలిగేవిగా ఉండడం.
- ఊహించి రాయడం.
- ఇష్టమైన అంశాలను గురించి సొంత మాటల్లో రాయడం.
- విశ్లేషణతో కూడిన సమాధానాలు రాయడానకి అనుకూలంగా ఉండడం.
- పాత్రల సమస్యలకు తగిన పరిష్కారాలు సూచించేవిగా ఉండడం మొదలైనవి.

**తరగతి గది నిర్వహణ**

- తరగతి గదిలో స్వీయరచన ప్రశ్నలకు జవాబులు రాసేముందు పూర్తితరగతి కృత్యంగా ప్రశ్నలపై చర్చ నిర్వహించాలి.
- ముందుగా ప్రశ్నల్ని నల్లబల్లపై రాయాలి. పిల్లలు ప్రశ్నలను చదవమనాలి.
- ఒక్కో ప్రశ్నను తీసుకొని పిల్లలతో మాట్లాడించాలి. అనుబంధ ప్రశ్నలు వేస్తూ సమాధానాన్ని రాబట్టాలి.
- ఇలా మేధోమథనం ద్వారా ప్రశ్నలను గురించి చర్చించాలి. జవాబుకు సంబంధించిన కీలకపదాలను నల్లబల్లపై రాయాలి.
- పిల్లలను జట్లుగా చేసినప్పుడు ప్రశ్నలసమాధానాలు తోటి పిల్లలతో చర్చించుకొంటూ రాయమనాలి.
- జట్లలో పనిచేస్తున్న సమయంలో ఉపాధ్యాయుడు అందరూ పాల్గొనేలా చూడాలి. అవసరమైన చోట సహకరించాలి.
- పిల్లలు చేసిన జట్టు పనిని ప్రదర్శింపజేయాలి. (Displaying)
- పిల్లలు రాసిన సమాధానాలను సరిచేయాలి. (ఎడిటింగ్) ఇందుకోసం పిల్లల్లో ఎవరైనా రాసిన సమాధానాన్ని లేదా ఏదైనా జట్టు రాసిన సమాధానాన్ని నల్లబల్లపై లేదా చార్టుపై ఉన్నదున్నట్లుగా అంటే వారు చేసిన దోషాలతో కూడా రాయాలి. ఇలా రాసినదాన్ని పూర్తి తరగతిలో చదివించాలి. దోషాలపై కింద ప్రశ్నల ద్వారా చర్చ నిర్వహించాలి.
- భావం సరిగా రాశారా ?
- సరైన క్రమంలో రాశారా ?
- సరైన వాక్యాలు రాశారా ? వాక్యాలు పూర్తిగా రాసారా ? సరిగా ఉన్నాయా ?
- వాక్యాలలో పదాలు సరిగా వున్నాయా ? ఉన్న పదాల స్థానంలో ఇంకా మంచి పదాలను రాయవచ్చా?
- అక్షర దోషాలు ఏవైనా ఉన్నాయా ? ఏఏ అక్షరాలు సరిగా రాయాలి ? ఇలా చర్చిస్తూ పిల్లలే సవరించేలా పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి. ఆ తర్వాత జవాబును రాయమనాలి, జట్లలో వ్యక్తిగతంగా రాయించడం, సరిదిద్దడం జరగాలి.

**4. పదజాలం:** Literature is the arrangement of best words in best order. భాష అంటే పదజాల సమూహం. పదాలను అర్థవంతమైన వరుసక్రమంలో వినియోగిస్తే భాషగా మారుతుంది. విద్యార్థులకు పదజాలాన్ని సందర్భానుసారంగా వినియోగించడంపై అభ్యాసం కల్పించాలి. వివిధ సందర్భాలలో ఒకే పదం వేరు వేరుగా అర్థాలిస్తుంది. వీటిని గుర్తించి అర్థం చేసుకొనేలా ప్రోత్సహించాలి. పదజాల వినియోగంపై విద్యార్థి పట్టు సాధించినపుడే ఏ విషయాన్నైనా వినసొంపుగా, రసవత్తరంగా, వ్యక్తీకరించగలడు, సృజనాత్మకంగా, రసాత్మకంగా రాయగలరు.

**స్వభావం**

- నూతన పదాల అర్థాలను గ్రహించేలా ఉండాలి.
- ఏఏ సంధర్భాలలో ఏఏ పదాన్ని ఉపయోగించాలో తెలుసుకోవాలి.
- నేర్చుకున్న పదజాలంతో సొంతంగా వాక్యాలు రాసేలా ఉండాలి.
- సంబంధించిన పదాలు రాసేలా ఉండాలి.
- భాషా క్రీడలకు సంబంధించినవిగా ఉండడం మొదలగునవి.

**తరగతి గది నిర్వహణ**

- పదజాలానికి సంబంధించిన అభ్యాసాలను పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించి అభ్యాసాలపై అవగాహన కల్పించాలి.
- అభ్యాసాల కాఠిన్యత స్థాయిని బట్టి జట్టు పనిగా కూడా నిర్వహించవచ్చు, చర్చించి సమాధానాలు రాయమనాలి.
- పిల్లలు జట్లలో రాసిన వాటిని ప్రదర్శింపజేయాలి
- పిల్లలు చెప్పిన దాన్ని నల్లబల్లపై రాయాలి.
- అన్ని జట్లలోని వాళ్లు చెప్పినవి కూడా నల్లబల్లపై రాయాలి.
- సమాధానాలను క్రోడీకరించాలి.
- పిల్లలు చెప్పలేకపోయిన సందర్భాలలో ఉపాధ్యాయుడు సందర్భోచిత వాక్యప్రయోగాల ద్వారా ఆ పదజాలాన్ని అర్థం చేయించాలి.

**5. సృజనాత్మకత:** పిల్లల్లో ఊహాశక్తి, కల్పనాశక్తి అనంతంగా ఉంటాయి. పిల్లల్లోని ఈ శక్తి వెలికితీయడానికి తగిన భాషావాతావరణాన్ని తరగతి గదుల్లో కల్పించాలి. సొంతంగా రాసే సామర్థ్యం సృజనాత్మకతకు మరింత దోహదపడుతుంది. ఈ సృజనాత్మక వ్యక్తీకరణ మౌఖిక రూపంలో, లిఖిత రూపంలో మరియు ప్రదర్శన రూపంలో ఉంటుంది. స్వాభావికంగా, అంతర్లీనంగా పిల్లల్లో ఉండే సృజనాత్మకతను వెలికితీసేలా పాఠశాల తోడ్పడాలి. భాషా బోధనా లక్ష్యాలలో భాషానైపుణ్యాల సాధనతోపాటు సృజనాత్మకత, కల్పనాశక్తులు వెలికితీయడం అతి ముఖ్యమైనదిగా గుర్తించాలి. భాషాభ్యసనంలో అంతిమలక్ష్యం విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసుకురావడమే!

**స్వభావం**

- మౌఖిక, లిఖిత, ప్రదర్శనా రూపాల్లో ఉండడం.
- సృజనాత్మకంగా ఆలోచించేలా ఉండడం.
- తమ ఆలోచనలను, అనుభవాలను జోడించి చెప్పేలా ఉండడం.
- నాటకీకరణ చేయడానికి అనుకూలంగా ఉండడం.
- ఊహించి చెప్పగలిగేలా ఉండడం.
- వివిధ భాషా వ్యవహార రూపాలు / ప్రక్రియల్లో ఉండడం.
- జట్లలో చేసేవిగా ఉండడం, వ్యక్తిగతంగా చేసేవిగా ఉండడం.
- తోటి వారి ద్వారా, సమాజ సభ్యులద్వారా నేర్చుకునే అవకాశం ఉండడం.
- మౌఖిక, లేఖన సామర్థ్యాల వృద్ధికి తోడ్పడేలా ఉండడం.
- పాల్గొనేలా, ఆనందించేలా, స్వయం అభ్యసనానికి తోడ్పడేలా ఉండడం.
- ఒక వ్యవహార రూపంలోని అంశాల్ని మరొక వ్యవహార రూపంలోకి మార్చడం మొదలగునవి.

**తరగతి గది నిర్వహణ**

- ఈ సామర్థ్యాన్ని మొదట పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి. తగిన సూచనలు ఇవ్వాలి.
- ఇచ్చిన అంశంపై ఆలోచింపజేసి స్వేచ్ఛగా ప్రతి ఒక్కరూ చెప్పేలా ప్రోత్సహించాలి.
- అవసరమైన చోట ఆధారాలను ఇచ్చి ఆలోచింపజేయాలి. అవగాహన కల్పించాలి. తర్వాత పిల్లలను విభజించాలి. జట్లలో చర్చించమనాలి. రాయమనాలి.
- జట్లలో చేసిన పనులను ప్రదర్శింపజేయాలి.
- వీటిని ప్రదర్శిస్తున్నపుడు ఉపాధ్యాయుడు పూర్తి తరగతిలో చర్చ నిర్వహించడం ద్వారా సలహాలు, సూచనలు అందజేయాలి.
- రాసిన సృజనాత్మక అంశాన్ని సరిచేయాలి. "స్వీయరచన" ప్రశ్నలను సరిదిద్దిన విధంగా పూర్తి తరగతిలో నిర్వహించాలి.
- తర్వాత వ్యక్తిగతంగా రాయమనాలి. పిల్లలు రాసిన వాటిని సంకలనం చేసి 'మేమూ కవిత్వం / కథలు రాస్తాం' అని ఒక పుస్తకంలా తయారుచేయాలి.
- ప్రతీ పాఠానికి పిల్లలు రాసిన సృజనాత్మక అంశాలతో ఒక పుస్తక సంకలనం తయారుచేయాలి. దీన్ని తరగతి గదిలో ప్రదర్శించాలి.
- జట్లలో రాయించడం, సరిదిద్దడం జరగాలి.
- తర్వాత పిల్లలతో వ్యక్తిగతంగా రాయించాలి.

**6. ప్రశంస :** విద్యార్థులలో సానుకూల దృక్పథాన్ని అలవర్చడానికి తగువిధంగా స్పందించడానికి ఈ సామర్థ్యం ఎంతగానో దోహదపడుతుంది. జంతువులు, మొక్కలపట్ల పిల్లల సానుభూతిని కలిగి ఉండడంతోపాటు, ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలు, ముసలివాళ్ళకు తగిన సహాయం, సహకారం చేయగలిగేలా తయారవ్వాలి. అదే మాదిరిగా ఇతర భాషలు, సంస్కృతులు, పండుగలు, సాంప్రదాయాలను గౌరవించేలా, గొప్పదనాన్ని గుర్తించి అభినందించే వైఖరి పిల్లల్లో పెంపొందేలా చూడాలి. పిల్లలు ఎదుటివారిలోని గొప్పదనాన్ని గుర్తించి ప్రశంసించాలి. దీనివల్ల విలువలతో కూడిన వ్యక్తిత్వ నిర్మాణం రూపుదిద్దుకొంటుంది. బాలుడు చక్కని వ్యక్తిత్వ వికాసంతో కులమతాల సరిహద్దులను దాటి విశ్వనరుడుగా అవతరిస్తాడు. గీతలమధ్య

"కులమతాలు గీచుకున్న గీతల మధ్య పంజరమున చిక్కువడను నేను!
నిఖిలలోకమెటు నిర్ణయించిననేమని తిరుగులేని విశ్వనరుడ నేను!" – గుర్రం జాషువా

**స్వభావం**

- □ దయ / సానుభూతి చూపడాన్ని పెంపొందించేలా ఉండడం.
- □ ఇతరుల గొప్పదనాన్ని ప్రశంసించేలా అభినందించేలా ఉండడం.
- □ ఇతరులకు సహాయం చేయడాన్ని ప్రేరేపించేలా ఉండడం.
- □ ఇతరుల సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించేలా ఉండడం.
- □ అందరూ సమానమనే భావనను కల్గించేలా ఉండడం .
- □ ప్రకృతిని ప్రేమించడం – పరిరక్షించడం వంటి లక్షణాలను అభివృద్ధి చేయడం.
- □ విలువలు పెంపొందించేలా ఉండడం.

**తరగతి గది నిర్వహణ**

- □ దీన్ని ముందు ఇంటిపనిగా ఇవ్వాలి.
- □ దీన్ని పూర్తిచేసిన తర్వాత పునశ్చరణలో భాగంగా పిల్లల్ని ప్రశంసిస్తూ మాట్లాడించాలి.
- □ ప్రతి విద్యార్థిని ప్రశ్నించాలి.
- □ పిల్లల సమాధానాలను క్రోడీకరించి ముగింపు ఇవ్వాలి.
- □ వ్యక్తిగతంగా రాయమన్న వాటిని రాయించాలి.
- □ పిల్లలు రాసిన ప్రశంసకు సంబంధించిన అంశాలతో పుస్తక సంకలనం తయారుచేయాలి.
- □ ఇలా రూపొందించిన పుస్తక సంకలనాన్ని తరగతిలో ప్రదర్శించాలి. ప్రతి పాఠానికి ఒక సంకలనం తరగతిలో అందుబాటులో ఉండాలి.

**7. భాషను గురించి తెలుసుకుందాం :** పాఠశాలలో భాష నేర్పడంలో ఉద్దేశ్యం పిల్లవాడు కొత్తగా ఆలోచించగలగాలి. వాటిని క్రమబద్ధంగా వ్యక్తీకరించగలగాలి. సృజనాత్మకంగా చెప్పగలగాలి. రాయగలగాలి. ఈ సామర్థ్యం ద్వారా విద్యార్థులలో భాషా భాగాలు, కాలాలు, విరామ చిహ్నాలను ఉపయోగించగలిగేలా, కాలాలకు అనుగుణంగా క్రియలను గుర్తించి ఉపయోగించగలిగేలా చేయాలి. అందుకు పిల్లల మెదడు వాటిని స్వయంగానే సూత్రీకరించుకొంటుంది. దీన్ని తరగతిగదిలో పునర్బలనం చెందడానికి అభ్యాసం చేయించాలి.

**స్వభావం**

- వ్యాకరణ నియమాలను సొంతంగా గ్రహించేలా ఉండడం.
- ఉదాహరణలు సొంతంగా చెప్పేలా ఉండడం.
- సులభంగా అర్థంచేసుకొనేలా ఉండడం.

**తరగతి గది నిర్వహణ**

- "భాషను గురించి తెలుసుకుందాం" అభ్యాసాలను పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి.
- అభ్యాసంలోని అంశాలన్నీ పిల్లలతో చర్చిస్తూ అవగాహన చేయించాలి.
- ఉదాహరణలను పిల్లలతో చెప్పించాలి. ఉదాహరణల ద్వారా సూత్రాన్ని గ్రహించేలా-అర్థం చేసుకొనేలా చేయాలి.
- నూతన పదాల అర్థాలను గ్రహించేలా ఉండాలి అర్థం చేసుకొనేలా చేయాలి.
- పిల్లలను జట్లలో కూర్చోమని నేర్చుకున్న భాషాంశాలపై ఉదాహరణలు రాయించాలి.
- పిల్లలతో ప్రదర్శింపజేయాలి.
- పిల్లలు చెప్పిన ఉదాహరణలను నల్లబల్లపై రాయాలి. వ్యక్తిగత నోటుపుస్తకాల్లో రాయించాలి.

**8. ప్రాజెక్టు పని:** పిల్లల్లో ఆలోచింపజేసే శక్తిని వికసింపజేసి, వారి ఆలోచనలను వ్యక్తపరచడానికి భాషాబోధన తోడ్పడాలి. ఇందుకోసం ఇంతకు ముందు చర్చించిన సామర్థ్యాలకు చెందిన అభ్యాసాలు తోడ్పడినప్పటికీ వీటిని సందర్భోచితంగా, అవసరం మేరకు సమ్మిళిత పరిచి వినియోగించే సామర్థ్యం పిల్లల్లో పెంపొందించాలి. ఇందుకు భాషా ప్రాజెక్టులు చక్కగా ఉపయోగపడతాయి.

**స్వభావం:**

- ప్రాజెక్టు పనులు వివిధ కృత్యాల సమాహారం
- ప్రాజెక్టు పనులు, వివిధ సామర్థ్యాల నిర్వహణ సామర్థ్యం కూడా
- పరిశీలించడం, సేకరించడం, అన్వేషించడం, నమోదు చేయడం, విశ్లేషించడం, నిర్ధారించడం వంటి కృత్యాలతో కూడిన ప్రాజెక్టు పనులున్నాయి.
- వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం, వంటి భాషానైపుణ్యాలతో కూడిన ప్రాజెక్టు పనులుంటాయి.
- పాఠ్యపుస్తకాల పరిధిని దాటి పరిసరాల ద్వారా, అదనపు పఠన సామగ్రి అనగా బాలసాహిత్యం, వార్తాపత్రికలు మొదలగు వాటిని చదవడానికి ప్రోత్సహించేలా ప్రాజెక్టు పనులున్నాయి.
- స్వతంత్ర పాఠకులుగా ఎదగడానికి, భాషాభిరుచిని, పఠనాభిలాషను పెంపొందించడానికి తోడ్పడతాయి.
- తెలుసుకొన్న వాటిని, చదివిన వాటిని క్రమపద్ధతిలో సొంతంగా రాయడానికి తోడ్పడతాయి.
- పిల్లలు నివేదకలు తయారుచేయడం, పట్టికల రూపంలో సమాచారాన్ని ప్రదర్శించడం వంటి సామర్థ్యాలు అభివృద్ధి చెందుతాయి.

- తోటి వారితో కలిసి పనిచేసేలా, ఒకరికొకరు సహకరించుకునేలా తోటి వారి నుండి నేర్చుకునేలా దోహదపడతాయి
- ఇతర సబ్జెక్టులకు సంబంధించిన అవగాహనను పెంపొందించడానికి తోడ్పడతాయి. ప్రాజెక్టుపనులను నిర్వహించడం

**ప్రాజెక్టు పనులను నిర్వహించడం**

- పాజెక్టు పనులను ఇంటి పనిగా ఇవ్వాలి.
- పాఠం పూర్తయిన రోజు అనగా ఐదవ రోజు ఇంటి పనిగా ఇవ్వాలి.
- ఇంటి పనిగా ఇచ్చే ముందు పిల్లలకు ఏం చేయాలి ? ఎలా చేయాలో సూచనలిచ్చి అర్థం చేయించాలి.
- ప్రాజెక్టు పని కాఠిన్యతా స్థాయిని బట్టి వ్యక్తిగతంగా లేదా జట్టు పనిగా ఇవ్వాలి.
- జట్టు పనులుగా ఇచ్చినప్పుడు ఆ ప్రాజెక్టు పనిని పూర్తి చేయడానికి జట్టులోని సభ్యులు ఎవరెవరు ఏమేం చేయాలో స్పష్టంగా చెప్పాలి.
- ప్రాజెక్టుపనిని పూర్తిచేసిన తర్వాత 8వ రోజు పునశ్చరణ సమయంలో పిల్లలతో ప్రదర్శింపజేయాలి.
- అయితే దీని ప్రదర్శనకంటే ముందు మధ్య మధ్యలో పిల్లలను అడిగి తెల్సుకోవాలి.
- పిల్లలు ప్రాజెక్టు పనులను ప్రదర్శించేటప్పుడు దోషాలుంటే తొలగించాలి. అవసరమైన సలహాలు, సూచనలు అందించాలి.
- పిల్లలతో ప్రదర్శన చేయించిన రోజే తదుపరి 45 నిమిషాల సమయంలో ప్రాజెక్టుపని గురించి నివేదిక రాయించాలి.
- ఈ నివేదికలో తాము ఏమేమి చేసారో అనగా ఏమి చదివారు? ఎవరిని కలిశారు? ఏమి అడిగారు? ఈ ప్రాజెక్టు పని ద్వారా వారు ఏమి తెలుసుకొన్నారు వంటి వివరాలతో నివేదిక రాయించాలి.
- ఇలా రాసిన నివేదికను పిల్లల ఫోర్టు ఫోలియోల రూపంలో భద్రపరచాలి. లేదా పుస్తక సంకలనంలాగా తయారుచేసి తరగతి గదిలో ప్రదర్శించాలి.

## 4.4 విద్యాప్రమాణాలు - అభ్యసన సూచికలు

శ్రవణ, భాషణ, పఠన, లేఖన సామర్థ్యాలను సాధించడమే భాషాభ్యసనమని భావించడం జరుగుతుంది. ఐతే కేవలం ఈ సామర్థ్యాల సాధనకు మాత్రమే భాషాభ్యసనం పరిమితం కారాదు. ఈ నైపుణ్యాల మధ్యగల అంతరసంబంధాలను గుర్తించి, సమగ్రంగా సందర్భోచితంగా వివిధ సన్నివేశాలలో భాషను వినియోగించడమే నిజమైన అభ్యసన ఫలితమని చెప్పవచ్చును. పిల్లలు నిత్యజీవిత సందర్భాలలో భాషను సమగ్రంగా వినియోగించే సామర్థ్యం పొందాలి. వివిధ వ్యవహార రూపాల ఆధారంగానే పిల్లలు భాషా వినియోగాన్ని మనం మదింపుచేయాలి. ఈ ప్రక్రియలోని నాలుగు భాషా నైపుణ్యాలు భాగమవుతాయి. వివిధ అంశాలు విన్న తర్వాత అర్థం చేసుకొని, ఆత్మవిశ్వాసంతో వ్యక్తీకరించగలగాలి. అవగాహనతో కూడిన పఠన, లేఖనాలకు ప్రాధాన్యత కల్పించాలి. అందువల్ల మాతృభాషలో ప్రావీణ్యాలను పెంచడం అనేది భాషాబోధనలో ప్రధానాంశం కావాలి.

భాషాభ్యసనం, భాషా సంపాదన క్రమంలో పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు ప్రాథమిక స్థాయిలో క్రింది విధంగా ఉన్నాయి. అవి

## 1, 2 తరగతులు - విద్యా ప్రమాణాలు

### 1. విని అర్థం చేసుకోవడం, స్వేచ్ఛగా మాట్లాడడం

- పరిచితమైన కథలు, పాటలు, సంభాషణలను విని అర్థం చేసుకోవడం.
- విన్న అంశం గురించి ఎవరు ? ఏమిటి ? ఎక్కడ వంటి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగలగాలి.
- సూచనలు విని అర్థం చేసుకొని ఆ ప్రకారం చేయగలగాలి.
- వింటున్నప్పుడు అక్షరాల మధ్య ధ్వని భేధాలను గుర్తించగలగాలి.
- తెలిసిన చూసిన వాటి గురించి స్వేచ్ఛగా మాట్లాడగలగాలి.
- చిత్రాల ఆధారంగా మాట్లాడగలగాలి. చిత్రంలో ఎవరున్నారు? ఏం జరిగింది? ఏం చేస్తున్నారు? వంటి అంశాలు చెప్పగలగాలి.
- గేయాలను, పాటలను రాగంతో భావంతో పాడగలగాలి.
- తెలిసిన కథలను సొంత మాటల్లో చెప్పగలగాలి.
- వర్ణమాల, గుణింతాల పదాలను స్పష్టోచ్ఛరణతో పలకగలగాలి.

### 2. ధారాళంగా చదవడం, అర్థం చేసుకొని చెప్పడం

- గేయాలు, పాటలు వంటి వాటిలో వాక్యాలను గుర్తించగలగాలి
- ఇచ్చిన అంశాలలో కీలక పదాలను, వాటిలోని అక్షరాలను గుర్తించగలగాలి.
- పదాలలోని అక్షరాలను వర్ణమాల, గుణింతాల చార్టులు గుర్తించగలగాలి.
- సరళపదాలు, గుణింతపదాలు, సరళమైన వాక్యాలనుధారాళంగా తప్పులులేకుండా చదవగలగాలి.
- చదువుతున్న పదాలలో లోపించిన అక్షరాలను గుర్తించాలి, రాయగలగాలి. చిత్రాలతో పదాలను జత చేయగలగాలి.

### 3. రాయడం

- నేర్చుకున్న అక్షరాలనుపయోగించి సొంతంగా పదాలు రాయగలగాలి.
- వర్ణమాల ఆధారంగా సరళపదాలు రాయగలగాలి.
- గుణింత పదాలను రాయగలగాలి.
- చిత్రం ఆధారంగా సరళ, గుణింత పదాలను, వాక్యాలను రాయగలగాలి.
- తప్పులు లేకుండా అందంగా రాయగలగాలి.
- ఉక్తలేఖనం రాయగలగాలి.

**4. సృజనాత్మకత**

- గేయాలను అభినయంతో పాడాలి.
- చిత్రాలు గీసి రంగులు వేసి, పదాలను రాయగలగాలి.
- అభినయగేయాలను పాడిగించగలగాలి.
- మట్టితో బొమ్మలు చేసి, వాటి గురించి మాట్లాడగలగాలి.
- చిత్రం ఆధారంగా కథను ఊహించి చెప్పగలగాలి.

## 3, 4, 5 తరగతులు - విద్యాప్రమాణాలు - అభ్యసన సూచికలు

**1. వినడం - ఆలోచించి మాట్లాడడం**

- ఇతరులు చెప్పేది విని అర్థం చేసుకొని సొంతమాటల్లో చెప్తారు.
- పత్రికలు, రేడియో, టి.వి., వంటి ప్రసార మాధ్యమాలలో వార్తలు, కార్యక్రమాలు చూసి విని అర్థం చేసుకోగలగడం, తిరిగి చెప్తారు.
- చిన్న చిన్న ప్రసంగాలు, ఉపన్యాసాలు విని అర్థం చేసుకుంటారు. అపరిచిత కథలు, సంభాషణలు, గేయాలు, పద్యాలు విని అర్థంచేసుకోవడం సొంతమాటల్లో చెప్తారు.
- వివిధ సన్నివేశాలు, సంఘటనకు చెందిన సూచనలు విని అర్థం చేసుకొని అనుసరిస్తారు.
- వాళ్లు టి.విలో చూసినవారికి నచ్చిన సినిమాలు; పాత్రలను గురించి మాట్లాడతారు.
- ఇచ్చిన అంశాలపై ఆలోచించి మాట్లాడతారు.
- తమ భావాలను, అనుభవాలను, అభిప్రాయాలను సొంత మాటల్లో స్పష్టంగా, క్రమపద్ధతిలో చెప్తారు.
- తమకు తెలియని అంశాలగురించి, సందేహాలగురించి ఉపాధ్యాయులతోపాటు ఇతరులను నిర్భయంగా ప్రశ్నిస్తారు.
- చర్చలో పాల్గొనడం, తమ అభిప్రాయాలను చెప్తారు.
- తెలిసిన, చూసిన, విన్న అంశాలు ఎదుటివారికి అర్థమయ్యేలా క్రమపద్ధతిలో చెప్తారు. తరగతి గదిలో, బడి బయట వివిధ సన్నివేశాలలో సందర్భోచితంగా సరైన భాషను ఉపయోగించి మాట్లాడతారు.
- మాట్లాడేటప్పుడు ఉద్వేగానికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో తమ భావాలను చెప్తారు.

**2. ధారాళంగా చదవడం, అర్థం చేసుకొని చెప్పడం, రాయడం.**

- పిల్లలకు పుస్తకాలపట్ల ఆసక్తి పెంచడం చదవడం ఒక అలవాటుగా మార్చుకుంటారు.
- పాఠ్యపుస్తకంలోని వివిధ రూపాల్లోని పాఠ్యాంశాలను (పద్యాలు, పాటలు, గేయాలు, కథానికలు, వ్యాసాలు, సంభాషణలు, గేయకథలు) చదివి అర్థం చేసుకోవడం. వీటిలోని ముఖ్యమైన భావాన్ని, సారాంశం, ఆలోచనలు అన్వేషించడానికి పాఠ్యాంశాలను లోతుగా పరిశీలిస్తారు.

- □ చదువుతున్న అంశంలోని కొత్తపదాల అర్థాలను సందర్భాన్ని బట్టి గ్రహిస్తారు. చదవడం ద్వారా ఇతరులు అభిప్రాయాలను అర్థంచేసుకోవాలి. జ్ఞాన నిర్మాణం జరగడం వల్ల ఆనందాన్ని, సంతృప్తిని పొందుతారు.
- □ పోస్టర్లు, ప్రకటనలు చదివి అర్థంచేసుకుంటారు.
- □ వివిధ రూపాలలోని బాలసాహిత్యం అనగా కథలు, నాటికలు, వార్తాపత్రికలు, లేఖలు, 'చేతిరాత పత్రికలు' మొదలగు వాటిని ధారాళంగా చదివి, అర్థం చేసుకుంటారు. పాఠ్యపుస్తకం చివరగల నిఘంటువు రూపంలోని పద పట్టికలను ఉపయోగించి అర్థాలను గ్రహించడం.
- □ చిత్రాలను, పాఠ్యాంశంతో పోల్చుతారు.
- □ చదువుతున్న అంశంలోని పాత్రను అర్థంచేసుకుంటారు.
- □ వేమన శతకం, సుమతి శతకం, తెలుగుబాల వంటి సులభమైన పద్యాలను రాగయయుక్తంగా చదవడం ద్వారా భావాన్ని గ్రహిస్తారు.
- □ ఇచ్చిన అంశాల ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడం, తప్పొప్పులను చదవడం ద్వారా భావాన్ని గ్రహిస్తారు.

**3.. స్వీయ రచన (సొంతమాటల్లో రాయడం)**

- □ చదివిన, విన్న, చూసిన విషయలను, కథలు, తన అనుభవాలు, ఇష్టాయిష్టాలు మొదలైనవాటి గురించి సొంతమాటల్లో రాస్తారు.
- □ రాసేటప్పుడు విరామచిహ్నాల్ని పాటించగలగడం. విషయాన్ని సంఘటనా క్రమంలో రాయగలగడం. అందంగా, దోషరహింతంగా, స్పష్టంగా రాస్తారు.
- □ రాసేటప్పుడు సంపూర్ణ వాక్యాలను అర్థవంతంగా సరైన పదాలను ఉపయోగించి రాస్తారు. తనకు నచ్చిన విషయాన్ని సేకరించి దాని గురించి రాస్తారు.
- □ చదివిన అంశములోని సారాంశాన్ని / భావాన్ని రాస్తారు.
- □ ఊహించి లేదా తానే ఆ స్థానంలో ఉంటే ఏం చేస్తారో చెబుతారు. ఆయా సందర్భాలలో తమ అనుభవాల గురించి, చూసిన సంఘటనలు, పండుగలు, జాతరలు మొదలగు వాటి గురించి రాస్తారు.
- □ ఇష్టమైన వాటి గురించి, ఇష్టముకాని వాటి గురించి తన భావాలను సొంతమాటల్లో రాస్తారు.
- □ తెలిసిన కథలను, సంఘటనలను సొంతమాటల్లో రాస్తారు.
- □ పాఠ్యాంశాలలోని పాత్రల గురించి, స్థలాల గురించి, సంఘటనలు, సారాంశాలు మొదలైన వాటిని సొంతమాటల్లో రాస్తారు.
- □ ఇచ్చిన అంశాన్ని వివరిస్తూ, సమర్థిస్తూ లేదా విభేదిస్తూ, తమ అభిప్రాయాలను తెలుపుతూ ఒకటి / రెండు పేరాలు రాస్తారు.

**4. పదజాలం**

- ☐ పదజాలాన్ని సందర్భోచితంగా ఉపయోగిస్తారు. సొంత వాక్యాలలో రాస్తారు. చదువుతున్న అంశంలోని పదాలకు సమానార్థక పదాలను, వ్యతిరేక పదాలను, అర్థాలను గ్రహించడం వాటిని సందర్భాన్ని బట్టి గ్రహించడం, సందర్భోచితంగా వినియోగిస్తారు.
- ☐ సందర్భాన్ని బట్టి అర్థాలను, నానార్థాలను, పర్యాయపదాలను గ్రహిస్తారు.
- ☐ కవితలు, గేయాలు, పాటలు, కథలలోని కీలక పదాలను గుర్తిస్తారు. శబ్దసౌందర్యానికి చెందిని ప్రాస పదాలు, ధ్వనిఅనుకరణ పదాలు, జంట పదాలు మొదలగు వాటిని సందర్భోచితంగా వినియోగిస్తారు.
- ☐ ఇతర విషయాలకు చెందిన సాంకేతిక (పారిభాషిక) పదజాలాన్ని అర్థం చేసుకొంటారు. అభ్యసనను మెరుగుపరచుకుంటారు.
- ☐ పదపట్టికలు, గళ్ళ నుడికట్టు వంటి భాషా క్రీడల ద్వారా సందర్భోచితంగా పదాలను రాస్తారు.

**5. సృజనాత్మక వ్యక్తీకరణ**

- ☐ గేయాలను పొడిగించగలగడం, గేయాలను రాగయుక్తంగా పాడగలగడం, అభినయించగలగడం చేస్తారు.
- ☐ కథలను పొడిగించగలగడం, వివిధ రకాల ముగింపులను ఇవ్వగలగడం, సరికొత్త శీర్షికలను సూచించగలగడం చేస్తారు.
- ☐ కథలలో పాత్రలను మార్చి తిరిగి కథను రాస్తారు.
- ☐ పాత్రల స్వభావాన్ని వివరించగలగడం. పాత్రల లక్షణాలను సకారణంగా వివరిస్తారు.
  ఉదా : ఎవరు మంచివారు? ఎందుకు? తప్పు ఎవరిది? ఎందుకు? చెడ్డవారు ఎవరు? ఎందుకు?
- ☐ సంభాషణలు, కథలు రాయడం, వర్ణించి రాయడం, ఊహించి రాయడం, ఆత్మకథ రాయడం వంటివి చేస్తారు.
- ☐ బయోడేటా రాస్తారు.
- ☐ దినచర్యతోపాటు ఇష్టాయిష్టాల గురించి, తన అనుభూతుల గురించి డైరీ రాస్తారు.
- ☐ ఉపాధ్యాయులకు, మిత్రులకు, బంధువులకు లేఖలు రాస్తారు.
- ☐ పాఠశాలలోని సమస్యల గురించి లేఖారూపంలో ప్రధానోపాధ్యాయులకు తెలియజేస్తారు. ఇష్టమైన మిత్రుడు, బంధువు, పండుగ, ఆట, ప్రాంతం, జంతువు, పాట, కథ మొదలగు వాటిని గురించి సకారణంగా రాస్తారు.
- ☐ సూచనలు, ఆధారాలకనుగుణంగా కథ రాయడం, చిత్రాలు గీయడం వంటి వాటిని గురించి వర్ణిస్తారు.
- ☐ గేయకథలు, కథలలోని పాత్రలను గుర్తించి సంభాషణ రూపంలో రాస్తారు. కథలను నాటకీకరణ చేస్తారు.
- ☐ కళాచిత్రాలు గీయడం, నమూనాలు తయారు చేసి ప్రదర్శిస్తారు, వివరిస్తారు. పోస్టరు, అభినందన పత్రాలు, ఆహ్వాన పత్రాలు, గ్రీటింగ్ కార్డులు, మాస్కుల తయారీ, నమూనాల తయారుచేస్తారు.

**6.ప్రశంస :**

- ☐ స్థానికంగా వాడే వివిధ భాషా ప్రక్రియలను ప్రశంసిస్తారు.

  ఉదా : ఒగ్గు కథలు, బుర్రకథలు, హరికథలు మొదలైనవి.

- ☐ తోటి పిల్లలు రాసిన అంశాలను, గీసిన చిత్రాలను పరిశీలించి, అర్థంచేసుకొని అభినందిస్తారు.
- ☐ ఇతర భాషలకు చెందిన పిల్లలు మాట్లాడే పదాలు, వాక్యాలు అర్థం చేసుకోవడం. వారు తెలుగును వినియోగించడంలో సహకరిస్తారు.
- ☐ తరగతిలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అభ్యసనంలో సహకరిస్తారు.
- ☐ వివిధ మతాల, భాషలకు చెందిన పిల్లలు పాడే పాటలను వారితో కలిసి పాడుతారు. తోటివారు, మహిళలు, ఇతర వర్గాలు, ఇతర సంస్కృతులు, సేవలు చేసిన వారిని, భాషాశైలిని ప్రశంసిస్తారు.

**7. భాషను గురించి తెలుసుకుందాం :**

☐పదాలలోని హ్రస్వ, దీర్ఘాక్షరాలను, అల్పప్రాణ, మహాప్రాణ అక్షరాలను స్పష్టంగా పలకడంలో తేడాను గుర్తిస్తారు.

☐వాక్య నిర్మాణ క్రమాన్ని అర్థంచేసుకుంటారు.

☐భాషాభాగాలను అర్థంచేసుకొని వాక్యంలో గుర్తిస్తారు.

☐వాక్యాలలోని నామవాచక, క్రియావిశేషణాలను గుర్తించడం, ఉపయోగించడం, ఉదాహరణలు చెప్తారు.

☐వాక్యంలోని పదాల మధ్య సంబంధాన్ని గుర్తిస్తారు.

☐పదాల స్వభావాన్ని గుర్తించి వర్గీకరిస్తారు.

☐ఏకవచనం, బహువచనం రూపాలను అర్థం చేసుకుంటారు.

☐భూత, వర్తమాన, భవిష్యత్ క్రియా రూపాలను గుర్తిస్తారు.

భాషాపరంగా నిర్ధారించిన సామర్థ్యాలను పెంపొందించడమే బోధన యొక్క ప్రధాన లక్ష్యం –

ఉపాధ్యాయులు ఎప్పుడూ ఆ ప్రధాన సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకొని విద్యాబోధన చేయాల్సి ఉంటుంది. అలాగే విద్యార్థుల్లో నిర్దేశిత సామర్థ్యాలు సాధించడం ద్వారా భాషాభివృద్ధిని పెంపొందించాలి. అందుకోసం పిల్లలు అభ్యసన సన్నివేశాల్లో పాల్గొనేలా తగు అభ్యసన అనుభవాలను, తగిన అవకాశాలను కల్పించాలి.

**4.5 భాషా విద్యా ప్రణాళిక (Language curriculum)సమర్థవంతమైన నిర్వహణకు అభ్యసన వనరులు**

భాషా విద్యా ప్రణాళిక (Language curriculum) ను సమర్థవంతంగా నిర్వహించడానికి పాఠ్యపుస్తకాలు ప్రధాన వనరు. అయినప్పటికీ ఇతర అభ్యసన వనరుల ఆవశ్యకత వుంది.

పిల్లలతో భాషాసామర్థ్యాల అభివృద్ధి సంపూర్ణంగా జరగడానికి, భాష పట్ల అభిరుచి పెంపొందించుకోడానికి ఇవి ఉపయోగపడతాయి. ముఖ్యమైన అభ్యసన వనరులను దిగువ తెలియజేయడమైనది.

**1. అభ్యాస పుస్తకాలు (Work Books)**

- ☐ విద్యార్థులు స్వయంగా అభ్యసనం చేయడానికి, స్వీయ మూల్యాంకనానికి, స్వీయ వ్యక్తీకరణకు అభ్యాస పుస్తకాలు తోడ్పడాతాయి.
- ☐ అభ్యాస పుస్తకాలు అదనపు సామగ్రి ఆసక్తికరంగానూ, నూతనంగానూ, సవాళ్లు విసిరేవిగానూ ఉండాలి. కేవలం పునరుక్తి అభ్యాసాల రూపంలో గాని, పాఠ్యపుస్తకాల్లోని అభ్యాసాల రూపంలో గాని ఉండరాదు.

**2. పరామర్శ గ్రంథాలు (Reference books)**

- ☐ ప్రాథమిక దశలో విద్యార్థి కల్పతరువు, పూర్వగాథా లహరి, పెద్దబాలశిక్షతోపాటు సచిత్ర విజ్ఞాన సర్వస్వాలు 'చదువు విజ్ఞానం' లాంటి ప్రభుత్వ పత్రికలు, చందమామ పత్రికలు పిల్లలకు అందుబాటులో ఉండాలి. తద్వారా వారిలో సాహిత్యాభిరుచి పెంపొందుతుంది.

**3. బాల సాహిత్యం (Children literature)**

- ☐ పిల్లలందరికీ బాలసాహిత్యం అందుబాటులో ఉండాలి. దీనిలో కథాపుస్తకాలు, జీవితచరిత్రలు, ఆత్మకథలు, బాలగేయాలు మున్నగునవి ఉండవచ్చు.

**4. నిఘంటువులు (Dictionaries)**

- ☐ భాషాభివృద్ధికి నిఘంటువులు ఉత్తమ సాధనాలు అందువల్ల ఇవి పిల్లలకు అందుబాటులో ఉండాలి.
- ☐ ప్రాథమిక దశలో పిల్లలకు సచిత్ర నిఘంటువులు, లఘు నిఘంటువులతో పరిచయం కలిగించాలి.

**5. బహుళ వాచకాలు (పాఠ్యపుస్తకాలు) (Text Books)**

- ☐ పిల్లలు ఉపయోగం కోసం బహుళ పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తేవాలనిNCF 2005 పేర్కొంది. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు పాఠ్యపుస్తకాలను స్వయంగా ఎంపిక చేసుకోవడానికి అనుమతించాలి.

**6. గోడ పత్రికలు (Wall Magazines)**

- ☐ పిల్లల సృజనాత్మక శక్తులను ప్రదర్శించడానికి గోడ పత్రికలు తోడ్పడతాయి. పిల్లలు వేసిన కార్టూన్లు, ప్రాసగేయాలు, పద్యాలు, చిన్న చిన్న కథలు, పొడుపుకథలు, చిత్రాలు, సేకరించిన అంశాలు, సమాచారం ఈ గోడ పత్రికలపై ప్రదర్శించవచ్చు. అలా ప్రదర్శించడం ద్వారా వారికి గుర్తింపు వస్తుంది. గుర్తింపు పిల్లలు కోరుకునే గొప్ప అవసరం! అది వారి సృజనాత్మకతకు దారితీస్తుంది.

**7. అదనపు సామగ్రి (Additional Material)**

- పిల్లల్లో భాషా పాటవాన్ని పెంపొందించడానికి పలు ప్రత్యామ్నాయ సామగ్రిని అర్థవంతంగా, సందర్భోచితంగా ఉపయోగించుకోవాలి. వాటిలో చార్టులు, ప్లే కార్డులు, చిత్రాలు, పోస్టర్లు, ఫోటోగ్రాపులు, Leaf plates, ఆల్బమ్‌లు, రేడియో, టేపు రికార్డులు, టెలివిజన్, వీడియో, ఫిల్ములు, తోలు బొమ్మలు మున్నగునవి గ్రంథాలయంలో అందుబాటులో ఉండాలి.

**పరామర్శ గ్రంథాలు (Reference books) :**


1. జాతీయ విద్యాప్రణాళికా చట్టం – 2005
2. ఉపాధ్యాయుల కరదీపిక – తెలుగు 1,2 తరగతులు
3. ఉపాధ్యాయుల కరదీపిక – తెలుగు 3వ తరగతి
4. ఉపాధ్యాయుల కరదీపిక – తెలుగు 4,5 తరగతులు
5. భాష మరియు భాషాబోధన ఆధారపత్రం – APSCF- 2011
6. ఉపాధ్యాయుల శిక్షణా కరదీపిక – ప్రాథమిక స్థాయి – తెలుగు
7. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం – 2009
8. తొలకరిచినుకులు (తెలుగు వాచకము) – 1 నుండి 5 తరగతులు
9. నూతన ఉపాధ్యాయుల శిక్షణా కరదీపిక – ప్రాథమిక స్థాయి – తెలుగు –2016, APSCERT, Hyd.
10. D.Ed - ఉపాధ్యాయుల కరదీపిక
11. D.Ed - తెలుగు బోధనా పద్ధతులు – తెలుగు అకాడమీ
12. D.Ed - దూరవిద్యా విధానం కొరకు రూపొందించిన పాఠ్యపుస్తకాలు
13. Right to Education Act - 2009.


**WEBSITES**


1. www. apscert. gov. in
2. www.ncert.in

## మూల్యాంకనం

**వ్యాసరూప ప్రశ్నలు** **8 మార్కులు**

1. పూర్వ ప్రాథమిక, ప్రాథమిక తరగతుల భాషాపాఠ్యపుస్తకాల రూపకల్పనలో అనుసరించవలసిన తాత్విక, మార్గదర్శక సూత్రాలను వివరించండి?
2. భాషాబోధనలో విషయం, విధానాలు మరియు పద్ధతులు పరస్పర భాగస్వామ్య పద్ధతులను వివరించండి.
3. అభ్యాసాల స్వభావం, వాటి తరగతి గది నిర్వహణ గురించి వివరించుము?
4. భాషా విద్యాప్రణాళిక సమర్థవంతమైన నిర్వహణకు అభ్యసన వనరులను వివరించండి?

**సంక్షిప్త సమాధాన ప్రశ్నలు** **4 మార్కులు**

1. భాషాభ్యసనంలో సౌలభ్యకర్తగా ఉపాధ్యాయుని పాత్ర?
2. భాషా పాఠ్యబోధన సోపానాలను తెలియజేయండి?
3. పదపద్ధతి అంటే ఏమిటి? సోపానాలను వివరించండి?
4. భావనాచిత్రం గురించి సంక్షిప్తంగా వివరించండి?
5. కృత్యాధార పద్ధతి అనగానేమి? వివరించండి?
6. భాషాబోధన లక్ష్యాలు - స్పష్టీకరణలను తెలపండి?

**లఘు సమాధాన ప్రశ్నలు** **2 మార్కులు**

1. జాతీయ విద్యా ప్రణాళిక చట్టం ఎన్.సి.ఎఫ్.-2005
2. నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టం ఆర్.టి.ఇ. - 2009
3. వ్యక్తిగత కృత్యం అంటే ఏమి? కృత్యాలను తెలపండి?
4. ప్రాజెక్టుపని అనగానేమి? వాటి ప్రాముఖ్యతను తెలపండి?
5. ఏకపాత్రాభినయం అంటే ఏమిటి?
6. సజనాత్మకత
7. పాఠశాలలో నిర్వహించదగిన వినూత్న కార్యక్రమాలేవి?

**బహుళైచ్ఛిక ప్రశ్నలు** **½ మార్కు**

1. ఎన్.సి.ఎఫ్. - 2005 విద్యాప్రణాళిక చట్టం దేనికి స్వస్తిచెప్పింది ( అ )
   అ) బట్టీవిధానం ఆ) నిరంతర పఠనం ఇ) సామూహిక పఠనం ఈ) వ్యక్తి పఠనం
2. నేటి ప్రాథమిక విద్యావిధానంలో అనుసరిస్తున్న బోధనా పద్ధతి ( ఇ )
   అ) పఠనపద్ధతి ఆ) లేఖనపద్ధతి ఇ) కృత్యాదారపద్ధతి ఈ) బట్టీపద్ధతి
3. 'పనిచేయడం ద్వారా అభ్యసనం' అనే విధానాన్ని మనదేశంతో మొదటిసారిగా ప్రస్తావించిన కమిటీ ( ఆ )
   అ) రాధాకృష్ణ కమిటీ ఆ) ఈశ్వరీభాటి పటేల్ కమిటి
   ఇ) కొఠారీ కమీషన్ ఈ) జనార్ధన్‌రెడ్డి కమిటీ

4. జట్టు కృత్యంలో విద్యార్థుల సంఖ్య ( ఇ )

అ) 10 ఆ) 8 ఇ) 9 ఈ) 5

5. పూర్తి తరగతి జట్టు, వ్యక్తిగత కృత్యాలను పాఠ్యపుస్తకాలలో పొందుపరిచిన సంస్థ ( అ )

అ) ఎన్.సి.ఎఫ్.-2005 ఆ) ఆర్.టి.ఇ.-2009

ఇ) ఎస్.సి.ఎఫ్-2011 ఈ) ఎస్.ఎస్.ఎ.

**ఖాళీలను పూరింపుము** **½ మార్కు**

1. 'కరికులమ్' అనే పదం ............... అనే లాటిన్ పదం నుంచి ఉద్భవించింది. (Currira)
2. విభిన్నమైన అలోచనాసరళిని ........... అంటారు.
3. అర్థవంతమైన, పరిచితమైన సన్నివేశాలలో పదాల ఆధారంగా భాషను నేర్చుకొనే పద్ధతిని ... (పదపద్ధతి)
4. పాఠ్యాంశ సందర్భాలకు అన్వయిస్తూ ......... బోధన జరగాలి. (వ్యాకరణ)
5. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం .......... సంవత్సరం నుండి అమలులోకి వచ్చింది. (2009)

**జతపరచండి.** **½ మార్కు**

| | | | |
|---|---|---|---|
| 1. | గోడపత్రికలు | ( 3 ) | అ) కథాపుస్తకాలు |
| 2. | సృజనాత్మకత | ( 4 ) | ఆ) నమూనాలు |
| 3. | బాలసాహిత్యం | ( 1 ) | ఇ) భాషాభివృద్ధి, వినూత్న కార్యక్రమం |
| 4. | బోధనోపకరణాలు | ( 2 ) | ఈ) చిత్రాలు గీయడం, రంగులు వేయడం |
| 5. | పరామర్శ గ్రంథం | ( 5 ) | ఉ) నిఘంటువు |

# 5 ఆంధ్రప్రదేశ్‌లో భాషాభివృద్ధి కార్యక్రమాలు

**విషయక్రమం**

5.1 పిల్లల భాషాభివృద్ధి కార్యక్రమం (CLIP)
5.2 స్నేహబాల (1-2 తరగతుల స్వయం అభ్యసన సామగ్రి)
5.3 బాలసాహిత్యం (Children Literature)
5.4 చదువు ఆనందించు - అభివృద్ధి చెందు (Read - Enjoy - Development)
5.5 పాఠశాలల్లో వినూత్న ప్రయోగాలు (Innovations in Schools)

**పరిచయం**

6 నుండి 14 సంవత్సరాల లోపు బాలబాలికలందరికీ నిర్బంధ ఉచిత విద్యనందించమని రాజ్యాంగం నిర్దేశించింది. అందుకుగాను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిల్లలకు అవసరమైన పాఠశాలలు, ప్రత్యామ్నాయ పాఠశాలలు నెలకొల్పారు. దాదాపు 100 శాతం నమోదు చేయడంలో సఫలమయ్యారు. పిల్లలందరు పాఠశాలలో కొనసాగేటట్లు చూడగలిగారు. కాని గుణాత్మకవిద్యను అందించడంలో ఆశించిన ప్రగతి సాధించలేకపోయాము. ప్రాథమిక దశలో పాఠశాలనుండి తల్లిదండ్రులు ఆశించేది తమ పిల్లలు స్పష్టంగా, నిర్దుష్టంగా, భావానుగుణంగా చదవగలగడం మరియు రాయగలగడం. కానీ దురదృష్టవశాత్తు పిల్లల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. దాదాపు 60 శాతం మంది పిల్లలు చదవలేకపోతున్నారు, రాయలేకపోతున్నారు. కావున గుణాత్మక విద్యనందించడం ప్రభుత్వ బాధ్యత. గుణాత్మక విద్య నందించడం కోసం APPEP, DPEP , SSA వంటి ప్రాజెక్టులు ఎన్నో కార్యక్రమాలు అమలుచేశాయి. ప్రస్తుతం సర్వశిక్షా అభియాన్ గుణాత్మక విద్యనందించడంలో భాగంగా భాషాభివృద్ధికోసం 2005-2006 సంవత్సరంలో పిల్లల భాషాభివృద్ధి కార్యక్రమాన్ని (CLIP) అమలు చేసింది. దానితోపాటు 1, 2, 3 తరగతుల పిల్లలకోసం స్నేహబాల స్వీయ అభ్యసన సామగ్రిని రూపొందించి తరగతి గదులలో సామర్థ్యాధార, కృత్యాధార బోధనతో అమలుచేసింది. అలాగే బాల సాహిత్యాన్ని పిల్లలతో ఉపాధ్యాయులతో స్వంతంగా రూపొందించి, వాటిని కథావాచకాలు, కథా గేయాలు పేరుతో పాఠశాలలకు అందించి పిల్లల్లో పఠన సామర్థ్యాన్ని పెంపొందించింది. దీనితోపాటు పాఠశాలలోనూ

KDAE2D

NCERT వానచినుకులు పేరుతో పఠన ప్రారంభ సామగ్రిని పాఠశాలలకు పంపించింది. అలాగే పిల్లల్లో పఠన సామర్థ్యాన్ని పెంపొందించడంకోసం, పఠనాభివృద్ధి కార్యక్రమాన్ని చదువు – ఆనందించు అభివృద్ధిచెందు (Read- Enjoy-Develop) పేరుతో 2006–2007 సంవత్సరంతో ప్రారంభించింది. పిల్లల్లో దాగియున్న శక్తులను బయటకు తీసుకురావడం కోసం 'వినూత్న కార్యక్రమాల' పేరుతో పాఠశాలల్లో పిల్లల డైరీ, గోడపత్రిక, తరగతి గ్రంథాలయం, పాఠశాల తపాలపెట్టె (School Post Box) వంటి అంశాలను నిర్వహించింది. వీటన్నింటి గురించి ఈ అధ్యాయంలో విపులంగా తెలుసుకుందాం.

**లక్ష్యాలు**

ఈ అధ్యాయం చదవడం ద్వారా..

1. పిల్లల భాషాభివృద్ధి కార్యక్రమం అమలు, తద్వారా సాధించిన ప్రగతిని అవగాహన చేసుకుంటారు.
2. స్నేహబాల – స్వయం అభ్యసన కార్డుల వినియోగం, ఆవశ్యకతను అవగాహన చేసుకుంటారు.
3. బాలసాహిత్యాన్ని పాఠశాలల్లో ఎలా వినియోగించాలో అవగాహనచేసుకుంటారు.
4. 'చదువు – ఆనందించు, అభివృద్ధి చెందు' కార్యక్రమ ఆవశ్యకతను అవగాహన చేసుకుంటారు.
5. పాఠశాలల్లో అమలవుతున్న వినూత్న కార్యక్రమాలకు అవగాహన చేసుకుంటారు.

## 5.1 పిల్లల భాషాభివృద్ధి కార్యక్రమం (CLIP)

**పరిచయం**

అందరికీ నాణ్యమైన విద్యను అందించడం మన ప్రధాన లక్ష్యం. "అందరూ చదవాలి – అందరూ ఎదగాలి" మన నినాదం. ఈ లక్ష్యసాధనకై గత కొద్ది శతాబ్దాలుగా ఎన్నో పథకాలు, కార్యక్రమాలు ప్రభుత్వం అమలుపరుస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక విద్యాపథకం, జిల్లా ప్రాథమిక విద్యాపథకాల ద్వారా బడి ఈడు కలిగిన పిల్లలందరినీ బడిలో చేర్పించడం, బడిలో కొనసాగించడం, గుణాత్మక విద్యను అందించడం లక్ష్యాలుగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పథకాల ద్వారా పిల్లలకు అవసరమైన పాఠశాలలు ఏర్పాటు చేశారు. 5 నుండి 14 సంవత్సరాలు కలిగిన పిల్లలందరినీ బడులలో చేర్పించారు. వారిని బడిలో కొనసాగేటట్లు చేయడంలో సఫలీకృతులమైనాము.

### 5.1.1 భాషాభివృద్ధి కార్యక్రమం అంటే ఏమిటి?

పిల్లల్లో సరైన భాషాభివృద్ధి జరగడానికి చదవడం, రాయడం వంటి కనీస నైపుణ్యాలు సాధించాలి. వీటి ఆధారంగా భాషాభివృద్ధి సాధించవచ్చు. ఇందుకోసం పిల్లలంతా చదవడం, రాయడం వంటి సామర్థ్యాల సాధనకు రూపొందించుకున్న కార్యక్రమమే భాషాభివృద్ధి కార్యక్రమం.

### 5.1.2 ఆవశ్యకత – ప్రయోజనాలు

**ఆవశ్యకత**

అన్ని రకాల వికాసానికి సాధనం భాష. పిల్లలు భాషకు సంబంధించిన శ్రవణ సామర్థ్యాన్ని (వినడం), భాషణ సామర్థ్యాన్ని (మాట్లాడడం) కలిగివుండి పాఠశాలలో ప్రవేశిస్తారు. పాఠశాలలో చదవడం, రాయడానికి చెందిన సామర్థ్యాలను అందించి అభివృద్ధిపరుస్తాం. వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం కనీసం సాధించవలసిన

సామర్థ్యాలైతే మరింత విస్తృత స్థాయిలో ఈ సామర్థ్యాల పరిధి పెంచడం, కల్పనాశక్తి, సృజనాత్మకత సాధించవలసి ఉంటుంది.

- సహనంతో వినడం, వినినదాన్ని అర్థంచేసుకొని చెప్పగలగడం, ఆత్మవిశ్వాసంతో ధారాళంగా మాట్లాడగలగడం, తన భావాలను సృజనాత్మకంగా వివిధ వ్యవహార రచనా రూపాలలో వ్యక్తీకరించడం, చదవడం, రాయడం అలవాటుగా మారడం వంటి లక్షణాల ద్వారా ప్రవర్తనా మార్పు కలిగి వ్యక్తిత్వ వికాసం జరిగితే నిజమైన భాషాభివృద్ధి సాధించవచ్చును.

**ప్రయోజనాలు**

- పిల్లలంతా అవగాహనతో చదవగలుగుతారు.
- సొంతంగా తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తూ స్వీయరచనలు చేయగలుగుతారు.
- చదవడం, రాయడం నిరంతరం సాగే ప్రక్రియగా అలవాటుగా మారుతుంది.
- భాషా సామర్థ్యాల ఆధారంగా ఇతర విషయాలలో రాణించవచ్చు.
- పిల్లల భాషాభివృద్ధి వలన తల్లిదండ్రులకు బడిపై నమ్మకం కలుగుతుంది.
- ఉపాధ్యాయుల శక్తిసామర్థ్యాలు బహిర్గతమౌతాయి.
- పిల్లల్లో తాము ఎంతో చదువుకోగలం అనే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

**పిల్లల భాషాభివృద్ధి కార్యక్రమ లక్షణాలు**

- ఇది అవసరం ఆధారంగా రూపొందించబడిన కార్యక్రమం.
- ప్రత్యేక లక్ష్య సాధనకై రూపొందించబడింది.
- స్థానిక అవసరాలకు, పరిస్థితులకు అనుగుణంగా తయారుచేయబడిన కార్యక్రమం.
- వికేంద్రీకరణ ప్రాధాన్యత.
- వ్యక్తిగతంగా ఒక్కొక్కరిపై దృష్టి సారించే కార్యక్రమం.
- పాఠశాలను ఒక యూనిట్‌గా తీసుకొనే కార్యక్రమం.
- సాధారణ పరిస్థితుల్లో నిరంతరం కొనసాగే ప్రక్రియగా రూపకల్పన చేయబడిన కార్యక్రమం.

### 5.1.3 పిల్లల భాషాభివృద్ధి – ప్రత్యేక కార్యక్రమాలు

పిల్లల భాషాభివృద్ధికై పాఠశాలలో కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించవలసి ఉంటుంది.

**1. గోడపత్రిక:** ప్రతి తరగతిలో గోడపత్రిక నిర్వహించవలసి ఉంటుంది. దీని ముఖ్య ఉద్దేశ్యం పిల్లలు నేర్చుకున్న, సేకరించిన విషయాలు ప్రదర్శించడం పిల్లల అభిరుచులు, ఆసక్తులు ప్రదర్శించడానికి అవకాశం. దీనిని సాంస్కృతిక ప్రచార కమిటీ నిర్వహిస్తుంది.

**సూచన:** ఏరోజు ప్రదర్శనాంశాలు ఆరోజు తొలగించాలి. ప్రదర్శనాంశంపై పిల్లల పేరు, తరగతి, తేదీ రాయించాలి. ఇవి భద్రపరచాలి. పత్రికలో ఉపయోగించడానికి పత్రిక కమిటీకి పంపాలి.

**2. బాలల సంఘాలు:** పాఠశాలలు నిర్వహించే అన్ని కార్యక్రమాలలో పిల్లలను భాగస్వాములను చేయడం వారికి అప్పగించిన కార్యక్రమం నిర్వహించే నైపుణ్యాన్ని పెంపొందించడం. దీని కొరకు కనీసం 4 బాలల సంఘాలు ఏర్పాటు

చేసుకోవాలి. 1) ఆరోగ్య పరిశుభ్రత కమిటీ, 2) సమాచార సాంస్కృతిక కమిటీ, 3) గ్రంథాలయ కమిటీ, 4) పునఃపరిశీలన కమిటీ.

**3. టీచరు డైరీ:** ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా చేసిన వాటిని నమోదు చేసుకోవడానికి, విద్యార్థుల సామర్థ్యాల ప్రగతి నమోదుకు టీచరు దినచర్య రాయాలి. సామర్థ్యాల అభివృద్ధికి కృత్య నిర్వహణలో ఎక్కడ లోపం జరిగింది, వాటిని పిల్లలు ఎందువల్ల చేయలేకపోయారు లాంటివి రాసుకోవాలి. ఉపాధ్యాయులు డైరీ రాయడం వలన తరగతిగది నిర్వహణ ఫలప్రదం అవడానికి దోహదకారి అవుతుంది.

**4. భాషోత్సవం:** తరగతి వారీగా వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, బొమ్మలు గీయడం, కథలు చెప్పడం వంటివి పిల్లలతో నిర్వహింపజేయాలి. పాఠశాలలో వారం రోజులపాటు నిర్వహించి తరువాత పాఠశాల సముదాయ స్థాయిలో, మండల స్థాయిలో ఒక రోజు నిర్వహించాలి. పిల్లల్లో పోటీతత్వం, ఆత్మస్థైర్యం, భాషాభివృద్ధి కలుగుతుంది.

**5. చిన్నారుల సభ:** చిన్నారుల సభను ప్రతీ పాఠశాలలో సంవత్సరానికి రెండుసార్లు నిర్వహించాలి. పిల్లలు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడానికి ఈ సభ దోహదపడుతుంది. ఉపాధ్యాయులు ఎలా ఉండాలని కోరుకుంటున్నారు. పాఠశాల ఎలా ఉండాలనుకుంటున్నారు, ఏమి ఆశిస్తున్నారు వంటి వాటి గురించి మాట్లాడించవచ్చు. పాఠశాల అసెంబ్లీని ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమక్షంలో నిర్వహించడం వలన పాఠశాల పట్ల సమావేశంలో మంచి గుర్తింపు వస్తుంది. వైవిధ్యభరితంగా అసెంబ్లీ జరపడం పాఠశాలకు చక్కని ప్రారంభం. అసెంబ్లీలో వార్తలు సేకరించి చదివించడం వల్ల పిల్లల్లో చక్కని పఠనాభ్యసనం జరుగుతుంది. ఇది భాషా వికాసానికి దారితీస్తుంది.

**6. పఠనోత్సవం:** ఈ కార్యక్రమమును పాఠశాల స్థాయిలో, పాఠశాల సముదాయ స్థాయిలో, మండల స్థాయిలో నిర్వహిస్తారు. పాఠశాలలోని పిల్లలతో వారి స్థాయికనుగుణంగా గ్రంథాలయం పుస్తకాలు చదివించాలి. చదివిన పుస్తకంలోని విషయాన్ని గుర్తించి మాట్లాడించాలి. తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలచేత చదివించాలి. వార్తాపత్రికలు, కథల పుస్తకాలు చదివించాలి. పోటీలు నిర్వహించాలి. మేమూ మాబడి, బొమ్మలు చేద్దాం – రాద్దాం. కథోత్సవం వంటి కార్యక్రమాలు కూడా భాషాభివృద్ధి ప్రత్యేక కార్యక్రమాలుగా అమలుచేస్తారు.

## 5.1.4 పిల్లల భాషాభివృద్ధి కార్యక్రమంలో అమలులో ముఖ్య అంశాలు

- నవంబరు నెల వరకు తప్పనిసరిగా పిల్లలు చదవడం, రాయడం చేయగలగాలి.
- మార్చి నెలాఖరు నాటికి తరగతివారీ సామర్థ్యాలు సాధించాలి.
- ఉపాధ్యాయులు తరగతివారీ బాధ్యతలు తీసుకోవాలి. తప్పనిసరిగా 1, 2 తరగతులు బాధ్యతలు రెగ్యులర్ ఉపాధ్యాయులే స్వీకరించాలి.
- ప్రతిరోజు ఉదయం 1, 2 పీరియడ్లు, మధ్యాహ్నం ఒక పీరియడ్ భాషకు కేటాయించాలి.
- మోనిటరింగ్ అన్ని స్థాయిలలో షెడ్యూలు ప్రకారం జరగాలి. సిలబస్ ప్రకారం బోధన అందరికీ చెయ్యాలి.
- వెనుకబడిన వారికి ఆయా తరగతులలో ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా నేర్పాలి.
- పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలను, ఇతర బాలల పుస్తకాలను సమకూర్చి విధిగా పిల్లలతో మధ్యాహ్నంపూట కేటాయించిన పీరియడ్‌లో చదివించాలి.

KST93P

- పాఠశాల స్థాయి, మండలస్థాయి, జిల్లాస్థాయిలో సమీక్షా సమావేశాలు నిర్వహించాలి, తగు చర్యలు చేపట్టాలి.
- పాఠశాలలో బోధనా సమయం పూర్తిగా వినియోగించబడాలి.
- 1, 2 తరగతుల్లో తప్పనిసరిగా చదివించడం ద్వారా గుర్తింపజేసిన తర్వాతనే రాయించడం జరగాలి.
- పిల్లల హాజరు బాధ్యత పాఠశాలదే!
- అందరూ సక్రమంగా హాజరుకాని పిల్లల ఇండ్లకు వెళ్ళి తల్లిదండ్రులతో మాట్లాడాలి. సమాజ సహకారం తీసుకోవాలి.
- తరగతి గ్రేడింగు మరియు పాఠశాల గ్రేడింగ్‌ను ప్రదర్శించాలి.

### 5.1.5 ఈ కార్యక్రమం అమలు ద్వారా

పిల్లల భాషాభివృద్ధి కార్యక్రమం 2005–2006 విద్యాసంవత్సరంలూ 64,191 పాఠశాలల్లో నిర్వహించారు. చదవడం, రాయడం చేయగలిగితే పిల్లలను 'A' గ్రేడు పిల్లలనీ, చేయలేని పిల్లలను 'B' గ్రేడు పిల్లలని నిర్ధారించారు. వీటి ఆధారంగా పాఠశాల గ్రేడు నిర్ధారించారు.

- పిల్లల్లో పుస్తక పఠనం ఒక అలవాటుగా మారింది. వార్తాపత్రికలు, కథల పుస్తకాలు చదవుతున్నారు.
- పిల్లల హాజరు శాతం పెరిగింది.
- ఉపాధ్యాయుల హాజరు శాతం పెరిగింది.
- పాఠశాలల్లోని పిల్లల్లో ప్రగతి ప్రదర్శించడానికి నిర్వహించిన పఠనోత్సవాలు, భాషోత్సవాలు, వార్షికోత్సవాలు రెగ్యులర్ కార్యక్రమంగా రూపుదిద్దుకున్నాయి.
- ఉపాధ్యాయులలో పని సంస్కృతి పెరిగింది.
- పాఠశాల సమాజ సంబంధాలు పెరిగాయి. అనేక గ్రామాల్లో వార్షికోత్సవాలకు, పాఠశాల అభివృద్ధికి ప్రజలు విరాళం అందించారు.

ఈ కార్యక్రమం ద్వారా 22 శాతం ప్రగతి సాధించినా ఇంకను చదవడంలో 31 శాతం, రాయడంలో 42 శాతం వెనుకబడియున్నారు. వారికోసం 2006–2007 సంవత్సరంలో పిల్లల అభ్యసనాభివృద్ధి కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. దీనిని గూర్చి 2వ సంవత్సరం డి.ఎల్.ఎడ్.లో తెలుసుకుందాం.

## 5.2 స్నేహబాల (1, 2 తరగతుల స్వయం అభ్యసన సామగ్రి)

### పరిచయం

సర్వశిక్షా అభియాన్ లక్ష్యాలలో ముఖ్యమైనది నాణ్యమైన విద్యను అందించడం. అందుకు బోధనాభ్యసన ప్రక్రియలు మెరుగుపరచుకోవలసిన అవసరం ఉంది. ప్రస్తుతం ఎక్కువ పాఠశాలల్లో బహుళ తరగతి బోధన జరుగుతుంది. బహుళ స్థాయి బోధనా సమస్యలను ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య అధిగమించడానికి రాష్ట్రంలో అమలుచేస్తున్న అభ్యసన అభివృద్ధి కార్యక్రమ సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకొని "స్నేహబాల స్వయం అభ్యసన కార్డులను" రూపొందించారు.

'స్నేహబాల' అనగా స్నేహ పూరిత వాతావరణంలో పరస్పర చర్చల ద్వారా అభ్యసనం జరగాలి. పిల్లలు స్వంతంగా ఆలోచిస్తూ స్వయం అభ్యసనంతో జ్ఞాన నిర్మాణం జరగడానికి వీలుగా రూపొందించిన కార్డుల ద్వారా

అభ్యసించే కార్యక్రమమే 'స్నేహబాల'. స్నేహబాల స్వయం అభ్యసన కార్డులు 1, 2, 3 తరగతులు తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులకు రూపొందించబడ్డాయి. ఇందులో తెలుగుకు సంబంధించిన స్నేహబాల కార్డుల గురించి ఇవ్వబడినది.

M34X61

### 5.2.1. స్నేహబాల కార్డుల రూపకల్పన నేపథ్యం

గదిలో ఆహ్లాకరంగా, అర్థవంతంగా జరగడానికి గుణాత్మకం సాధించడానికి APPEP, DPEP పథకం ద్వారా రకరకాల కిట్లు, బోధనాభ్యసన సామాగ్రిని రూపొందించి వినియోగిస్తున్నారు. ఇంకను మెరుగైన ఫలితాలు సాధించడానికి బహుళ తరగతి, బహుళ స్థాయి బోధనకు అవసరమైన ఈ స్నేహబాల కార్డులను రూపొందించడం జరిగింది.

- వీటి రూపకల్పనకు ప్రధానంగా చిత్తూరు జిల్లాలోని 'రిషి వ్యాలీ' లోని 'రివర్' (Rishy Valley Educational Resource Centre) సంస్థ ద్వారా అందిస్తున్న బోధనా విధానం ఆధారం.
- రివర్ (రిషి వ్యాలీ విద్యా వనరుల కేంద్రం) పెట్టెలోని బడి (School in box) కిట్ ద్వారా జరిగే విద్యా విధానాన్ని పరిశీలించిన తరువాత కర్ణాటక రాష్ట్రంలో 'నలికలి' పేరుతో అమలుచేశారు.
- రిషి వ్యాలీ పెట్టెలోని కార్డుల ఆధారంగా చెన్నై కార్పొరేషన్ వారు యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ (ABL) పేరుతో 40 పాఠశాలల్లో కిట్ వాడకాన్ని ప్రారంభించారు.
- మన రాష్ట్రంలో తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లా, కృష్ణా జిల్లాలోని వెనుకబడిన మండాలలో మొదట ఈ 'పెట్టెలోని బడి' కిట్‌లను 1,2 తరగతుల పాఠశాలలో అమలు చేసే ప్రయత్నంలో (Try-out) సంతృప్తిచెందిన తరువాత తూర్పు గోదావరి జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, ఏజెన్సీ ప్రాంతంలోని 10 మండలాల్లో పశ్చిమ గోదావరి ఏజెన్సీ మరియు విద్యాపరంగా వెనుకబడిన 6 మండలాల్లో, కృష్ణా జిల్లాలోని వెనుకబడిన ఏజెన్సీ 12 మండలాల్లో కృష్ణవేణి పేరుతో జనశాల ప్రాజెక్టు కింది కిట్‌లు తయారుచేసి పాఠశాలల్లో అమలుచేశారు. తరువాత చిత్తూరు జిల్లాలో UNICEF) సహకారంతో ఈ కిట్‌ను తయారుచేసి స్నేహబాల పేరుతో కార్డులను రూపొందించి 1,2 తరగతులకు అమలుచేశాయి. కర్ణాటక, తమిళనాడులోని యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ (ABL) అమలు తీరును పరిశీలించిన మన రాష్ట్ర ఉపాధ్యాయ సంఘనాయకుల బృందం కూడా మన రాష్ట్రంలో కూడా అమలు చేయుటకు ఏకగ్రీవంగా నిర్ణయించారు. అప్పటికే మన రాష్ట్రంలో అమలవుతున్న, అభ్యసనాభివృద్ధి కార్యక్రమం (CEP) మరియు ఎన్.సి.ఎఫ్.-2005ల అంశాల ఆధారంగా ఈ స్నేహబాల కార్డులను రూపొందించడం జరిగింది.

### 5.2.5 లోగోల వివరణ

స్నేహబాల అభ్యసన సామగ్రి కార్డుల రూపంలో ఉంటుంది. ప్రతికార్డుకు ఒక లోగో ఉంటుంది. ప్రతి లోగో నిర్వహించవలసిన కృత్యము అనగా పాఠం చెప్పడం. ఆయా సామర్థ్యాల అభివృద్ధికి సంబంధించి సూచించబడుతుంది.

## 5.3 బాల సాహిత్యం (Children Literature)

> మనిషి జీవించడానికి శ్వాస ఎంత ముఖ్యమో, లోకాన్ని చూపడానికి కళ్లు ఎంత ముఖ్యమో జ్ఞానం పొందడానికి పఠనం అంత ముఖ్యం

ప్రాథమిక స్థాయిలో తెలుగు భాషను ఎంత అర్థవంతంగా బోధన అభ్యసనం ద్వారా పాఠశాలల్లో అందించగలిగితే ఇతర విషయాల్లోని పాఠ్యాంశాలను పిల్లలంత అర్థవంతంగా అవగాహన చేసుకొని పైతరగతుల్లో అద్భుత ఫలితాలు

సాధిస్తారు. ఏ పాఠ్యాంశాన్ని బోధించే ఉపాధ్యాయుడైనా ప్రాథమికంగా భాషోపాధ్యాయుడుగానే తనను తాను భావించుకోవాలి. పఠనానికి ఇంతటి ప్రాధాన్యత ఉంది కాబట్టే పిల్లల ఉద్వేగ, మానసిక వికాసాలు పునర్బలనం చెందాలనే ఉద్దేశ్యంతో పాఠశాలలకు బాలసాహిత్యాన్ని అందించడం జరిగింది. బాలసాహిత్యం పిల్లలను స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దడానికి, చక్కని పఠనాభిరుచిని పెంపొందించడానికి, గ్రంథపఠనం ఒక అలవాటుగా మార్చడానికి తోడ్పడుతుంది. పిల్లలు పాఠ్యపుస్తకాలనే కాకుండా పాఠ్యేతర పుస్తకాలను కూడా చాలా ఇష్టంగా చదివేలా ప్రేరణ కలిగించడమే ఉపాధ్యాయుని కర్తవ్యం.

> పిల్లలు కథల పుస్తకాలు చదవడం ద్వారా ఉద్వేగ వికాసం పొందుతారు. అనుకూల ఉద్వేగాలు అభివృద్ధి చెందడం ద్వారా ఉన్నత వ్యక్తిత్వం అలవడుతుంది. దీనికి పుస్తక పఠనమే అసలైన మార్గం. పది కథల పుస్తకాలు చదివిన తరువాత పదకొండో పుస్తకంగా పాఠ్యపుస్తకం ఉండాలి.
>
> **– ప్రొ. కృష్ణకుమార్**

సర్వశిక్షా అభియాన్ ద్వారా రాష్ట్రంలోని పాఠశాలలన్నింటికి గ్రంథాలయ పుస్తకాలను అందించారు. ధాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాఠశాలలు గ్రంథాలయాలను సమకూర్చుకున్నాయి. ఉపాధ్యాయులు కూడా వార్తాపత్రికలలో పిల్లలకు కేటాయించిన పేజీల నుండి పఠన సామాగ్రిని సమకూర్చుకుని పాఠశాల గ్రంథాలయాలను బలోపేతం చేసుకున్నారు.

**బాల సాహిత్యం – వినియోగం – మార్గదర్శకాలు – ప్రణాళిక**

పఠన ప్రారంభ కార్యక్రమం అర్థవంతంగా అమలుచేయడం కోసం బాలసాహిత్యాన్ని ప్రతి పాఠశాలకు అందించారు. బాలసాహిత్యం పిల్లలచేత చదివించడంలో ఆసక్తిని పెంపొందించడంకోసం సరైన కార్యాచరణ ప్రణాళిక అవసరం. పాఠ్యపుస్తకాలతో పోల్చినప్పుడు బాలసాహిత్య పుస్తకాలు ఆకర్షణీయంగా ఉంటాయి. అందువల్లే పిల్లలు వాటిని స్వయంగా చదవడానికి ఇష్టపడతారు. చక్కటి పఠనాభిలాష ఉపాధ్యాయుడిలో ఉన్నప్పుడే పిల్లలకు పఠనంపట్ల ప్రేరణ కలిగించగలుగుతాడు.

- పాఠశాలలకు అందించిన వానచినుకులు కథా పుస్తకాలను పఠన ప్రారంభ సామగ్రిగా ఉపయోగించుకోవాలి.
- మొదటి పది పుస్తకాలను పాఠశాల ప్రారంభం నుండి జూలై 15 వరకు వినియోగించాలి. మిగిలిన ముప్పై పుస్తకాలను విద్యాసంవత్సరం పొడవునా వినియోగించాలి.
- వంద కథాకార్డులు, యాభై కథా పుస్తకాలను 3, 4, 5 తరగతుల పిల్లలకు వినియోగించాలి.
- విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి ప్రతి విద్యార్థి కనీసం ముప్పై పుస్తకాలను చదివి ఉండాలి.
- పఠన సామగ్రిగా సరఫరా చేసిన పుస్తకాలను చదవించడం ద్వారా భాషాసామర్థ్యాల సాధనకు కృషిచేయాలి.
- పుస్తకం చదివిన తరువాత పఠనానంతర కృత్యాలను నిర్వహించాలి. వీటిని వినూత్న కార్యక్రమాలకు అనువుగా మార్చుకోవాలి.
- కథా వాచకాలను చదివిన తరువాత అందులోని సమాచారాన్ని పిల్లల డైరీలో రాయించాలి.
- పిల్లలు రాసిన కథలు, గేయాలు, నాటికలు, సంభాషణలు మొదలైనవన్నీ గోడ పత్రికలో ప్రదర్శింపజేయాలి, పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాల్లో వీటిని ప్రదర్శించాలి.

**1, 2 తరగతుల్లో పఠన సామగ్రి వినియోగించే విధానం**

- పిల్లలను వలయాకారంలో కూర్చోబెట్టాలి.
- ఉపాధ్యాయుడు కూడా పిల్లలతోపాటు వలయంలో కూర్చోవాలి.
- పఠన సామగ్రి పుస్తకాన్ని (వానచినుకులు కథావాచకం) ప్రదర్శించాలి.
- అందులోగల చిత్రాలను గురించి మాట్లాడించాలి.
- పుస్తకంలోని కథను చక్కని హావభావాలతో చెప్పాలి.
- పుస్తకంలోని వాక్యాలను చూపిస్తూ చదివి వినిపించాలి.
- బొమ్మల ఆధారంగా వాక్యాలను పిల్లలతో చదివించాలి.
- ఏదైనా ఒక వాక్యాన్ని తీసుకొని నల్లబల్లపై రాసి చదివించాలి, వాక్యంలోని పదాలను గుర్తింపజేయాలి.
- కథను సొంతమాటల్లో చెప్పించాలి.

**సూచన:** మొదటి పది వానచినుకులు కథా పుస్తకాలను మాత్రమే పై విధంగా సోపానాలను పాటిస్తూ 1, 2 తరగతుల పిల్లలతో చదివించాలి. మిగిలిన కథా వాచకాలను పిల్లలను జట్లుగా చేసి వాళ్ళంతట వాళ్ళే చదువుకునేలా ప్రోత్సహించాలి.

**3వ తరగతి పఠన సామగ్రి వినియోగ విధానం**

- పిల్లలను వలయాకారంలో కూర్చోబెట్టాలి.
- ఉపాధ్యాయుడు కూడా పిల్లలతోపాటు వలయంలో కూర్చోవాలి.
- పఠన సామగ్రి పుస్తకాన్ని (కథాకార్డును) ప్రదర్శించాలి.
- అందులోగల చిత్రం గురించి మాట్లాడించాలి. కథను ఊహింపజేయాలి.
- కథాకార్డులోని కథలోని కీలకాంశాన్ని, సమస్యను పిల్లలను ఉత్తేజపరచేలా చెప్పి కథ చదివేందుకు ప్రోత్సహించాలి.
- జట్లలో కథను చదివించాలి. సారాంశాన్ని పిల్లలతో చెప్పించాలి.

**సూచన:** సంసిద్ధతా కార్యక్రమం అమలు జరుగుతున్న రోజుల్లో పఠన సామగ్రిని పైన సూచించిన విధంగా ఉపయోగించాలి. మిగిలిన విద్యాసంవత్సరం పొడవునా పిల్లలు తమకై తామే పుస్తకాలను ఎంపికచేసుకొని వ్యక్తిగతంగా లేదా జట్లలో చదివేలా చూడాలి.

**4, 5 తరగతులకు పఠన సామగ్రి వినియోగం**

- బాలసాహిత్య పుస్తకాలను పిల్లలకు అందుబాటులో ఉంచాలి. పిల్లలు తమకు నచ్చిన పుస్తకాన్ని ఎంపిక చేసుకొని చదివే స్వేచ్ఛనివ్వాలి.
- పుస్తకాన్ని వ్యక్తిగతంగా లేదా జట్లలో చదివించాలి.
- పఠనానంతర కృత్యాలను నిర్వహించాలి.
- కథను సొంతమాటల్లో చెప్పించాలి, పిల్లల దినచర్యలో సొంత మాటల్లో రాయించాలి.
- కథకు గీసిన బొమ్మలను, రాసిన సంభాషణలను గోడపత్రికలో ప్రదర్శింపజేయాలి.

### 3, 4, 5 తరగతులలో బి.సి. గ్రూపు పిల్లలకు పఠన సామగ్రి వినియోగం

సాధారణంగా బి, సి గ్రూపు పిల్లలు అక్షరాలను గుణించుకుంటూ చదువుతారు. మొత్తం వాక్యాలను చదవలేరు. విషయాన్ని అర్థంచేసుకోలేరు. తిరిగి చెప్పలేరు. దీనికి కారణం పదాలను విడివిడి అక్షరాలుగా, వాక్యాలను విడి విడి పదాలుగా భావించి చదవడమే. ఈ పిల్లలలో పఠన సామగ్రిని ఉపయోగించి పఠన నైపుణ్యాలను పెంపొందించడానికి కింది ప్రణాళికను అమలుచేయాలి.

- ప్రతి జట్టులో ఇద్దరు 'ఎ' గ్రూపు, ఇద్దరు 'బి' గ్రూపు పిల్లలు ఉండేలా చూడాలి.
- 'ఎ' గ్రూపులోని పిల్లవాడు కథాకార్డులోని కథను చదివి వినిపించాలి.
- తరువాత 'బి' గ్రూపు పిల్లలు చదవాలి. ఈ సమయంలో 'ఎ' గ్రూపు విద్యార్థి అతనికి సహకరించాలి.
- పీరియడ్ చివరిలో కథను సొంతమాటల్లో చెప్పించాలి.
- చదివిన కథకు బొమ్మ గీయడం, నచ్చిన పాత్ర గురించి మాట్లాడడం, కథకు మరోపేరు సూచించడం, మరొక ముగింపునివ్వడం మొదలైన సృజనాత్మకతకు దారితీసే పఠనానంతర కృత్యాలను నిర్వహించాలి.

**'C' గ్రూపు**

- 3, 4, 5 తరగతులలోని 'C' గ్రూపు పిల్లలను వలయాకారంలో కూర్చుండబెట్టాలి.
- ఎన్.సి.ఇ.ఆర్.టి. పఠన సామగ్రిలోని చిత్రకథలతో ప్రారంభించాలి.
- చిత్రాన్ని చూపించి పిల్లలతో మాట్లాడింపజేయాలి.
- కథాచిత్రాలను చూపించిన తర్వాత ఒక్కొక్కరితో ఒక్కో వాక్యం వరుసగా చెప్పించాలి.
- కథ మొత్తాన్ని కూడా ఒక్కొక్కరితో చెప్పించాలి.
- చిత్రకథలోని వాక్యాన్ని బోర్డుమీద రాయాలి. ఉపాధ్యాయుడు చదివి వినిపించి ఒక్కొక్కరిచే చదివించాలి.
- పాఠ్యంలోని పదాలను గుర్తింపజేయాలి.
- ఆ పదాలకు ఉపయోగించి సొంత వాక్యాలు చెప్పించాలి.
- కథను బొమ్మలను గీయించాలి.
- 1, 2 తరగతులకు సంబంధి,చిన పఠన సామగ్రినంతా వినియోగించిన తర్వాత కథాకార్డులను చదివించాలి.
- చదవగలిగిన వారిని ఎప్పటికప్పుడు తర్వాత గ్రూపులలోకి మార్చి పఠన సామగ్రిని అందించాలి.

**పఠనానంతర కృత్యాలు**

- బోధనానంతర మాటల్లో చెప్పడం.
- కథనం వర్ణనలు జోడించి చెప్పడం.
- కథా సన్నివేశానికి బొమ్మలు గీయడం.
- కథకు కొత్త ముగింపునివ్వడం.
- కథలో నచ్చిన పాత్రలను విశ్లేషించడం.

- కథను వివిధ భాషా వ్యవహారంలోకి మార్చడం.
- కథకు సంభాషణలు రాసుకొని పప్పెట్ షో నిర్వహించడం.

> కథల్లోని మంచి పాత్రలతో పిల్లలు తమకు తాము మమేకం చెందుతారు. అవి వారి వ్యక్తిత్వ వికాసానికి దారితీస్తుంది.

**చదవడం, రాయడం రాని పిల్లలకు నేర్పించడం ఎలా?**

- గతంలో చదవడం రాని పిల్లలకు మొదట సరళపదాలు, తర్వాత గుణింత పదాలు, ఆ తర్వాత ద్విత్వాక్షర పదాలు సంయుక్తాక్షర పదాలు నేర్పడంపై దృష్టిపెట్టాలి.
- కాని దీనికంటే కూడా మరింత ప్రయోజనకరమైన విధానం పిల్లలకు పుస్తకాలను అందుబాటులో ఉంచి వారిని స్వయం అభ్యసనం వైపు మళ్లించడం. ఇది ఎక్కువ మంది భాషాశాస్త్రవేత్తల సూచన.

NCFL8C

- కాబట్టి చదవడం, రాయడం రాని పిల్లలకు ఎస్.సి.ఇ.ఆర్.టి. వారు 40సాధారణ పుస్తకాలు, 100 కథా వాచకాలను రూపొందించి పాఠశాలల్లో వినియోగించి చదవడం, రాయడం నేర్పాలి.
- ఇందుకోసం పిల్లల్ని ఎ.బి.సి. గ్రూపులుగా విభజించాలి. బి గ్రూపు పిల్లలకు ఎ గ్రూపు పిల్లల సహాయంతో జట్లలో చదివించడం చదివిన దాని ఆధారంగా పదాలు, వాక్యాలు రాయడంపై అభ్యాసం కల్గించాలి.
- చదవడం, రాయడం రాని 'సి' గ్రూపు పిల్లలకు ఉపాధ్యాయుడే స్వయంగా దగ్గరుండి ఎన్.సి.ఇ.ఆర్.టి. 40 పుస్తకాలు, 100 కథావాచకాలను వినియోగించి చదవడం, రాయడం నేర్పాలి.
- ఇందుకోసం పిల్లల్ని ఎ, బి, సి గ్రూపులుగా విభజించాలి. 'బి' గ్రూపు పిల్లలకు 'ఎ' గ్రూపు పిల్లల సహాయంతో జట్లలో చదివించడం, చదివిన దాని ఆధారంగా పదాలు,, వాక్యాలు రాయడంపై అభ్యాసం కల్పించాలి.
- చదవడం, రాయడం రాని 'సి' గ్రూపు పిల్లలకు ఉపాధ్యాయుడే స్వయంగా దగ్గరుండి ఎన్.సి.ఇ.ఆర్.టి. పుస్తకాలు లేదా కథా వాచకాలను ఉపయోగించి నేర్పాలి.
- ఇందుకోసం, ఉపాధ్యాయుడు పుస్తకం / వాచకంలోని చిత్రాల గురించి మాట్లాడించడం, చిత్రాల కింది వాక్యాలను టీచర్ చదవడం పిల్లలతో అనిపించడం, ఆ వాక్యాలను గుర్తింపజేయడం, నల్లబల్లపై వాక్యాలు రాని పదాలను గుర్తింపజేయడం ఆ పదాలలోని అక్షరాలు గుర్తించి వీటితో నూతన పదాలు వాక్యాలు నిర్మించడం వంటి కృత్యాలను నిర్వహించాలి.
- ఇలా పుస్తకాల ఆధారంగా, చదివించడం, రాయించడం నేర్పించాలి.

## 5.4 చదువు ఆనందించు–అభివృద్ధి చెందు (Read-Enjoy-Develop)

చిన్నపిల్లలు విస్తారమైన పుస్తక సంపదను చదువుటకు అవకాశాలు కల్పించుటవలన అత్యధికంగా లబ్ధిపొందుతారు.

> విద్యావేత్తలు, పరిశోధకులు పిల్లలకు వైవిధ్యభరితమైన విద్య సమాచారం నిండిన పుస్తక ప్రపంచాన్ని అందుబాటులోకి తేవడం ద్వారా వారి ఆలోచనలను పదునుపెట్టవచ్చునని నొక్కిచెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం 2006-07 సంవత్సరంలో ప్రప్రథమంగా చదువు - ఆనందించు - అభివద్ధి చెందు అన్న పేరుతో (Read-Enjoy-Develop) ఒక పఠనాభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రాథమిక తరగతులు పూర్తయ్యేసరికి పిల్లలందరికీ చదవడం ఒక అలవాటుగా మారాలని చదవడం అలవాటున్న పిల్లల్లో అవగాహన కౌశలం మెరుగై భాషాభ్యసనంతోపాటు ఇతర విషయాల అభ్యసనం కూడ సమర్థవంతం అవుతుందన్న విశ్వాసంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం విద్యార్థుల విరామకాల సద్వినియోగానికే కాక వారి వ్యక్తిత్వ వికాసానికి సత్ప్రవర్తనలు అలవడడానకి సముచిత మనోవైఖరుల పెరుగుదలకు తోడ్పడుతుందని భావింపబడింది.

ఈ కార్యక్రమం ప్రారంభానికి ముందు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సర్వేలో ప్రాథమిక దశలోని విద్యార్థులలో దాదాపు 38% మంది పిల్లలు చదవడం, రాయడంలో పూర్తిగా వెనుకబడ్డారన్న చేదునిజంతోపాటు అధికులు చదవడంలో ధారాళతను అంతగా కనబరచలేకపోవడాన్ని గుర్తించిన ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టండి.

ఈ నేపథ్యంలో ప్రారంభమై READ కార్యక్రమాల లక్ష్యాలివి.

- పిల్లలందరూ చదవాలి. చదువుతూ ఎదగాలి.
- పఠనంతో ధారాళత రావాలి. అందుకే వారిలో పఠనాశక్తిని పెంపొందించాలి.
- పఠనం ఒక అలవాటుగా ఒక నిత్యకృత్యంగా మారాలి.
- మన దైనందిన జీవనంలో ఒక భాగంగా మారాలి.
- పఠనం ద్వారా ఆనందం పొందాలి. జ్ఞానాన్ని సంపాదించుకోవాలి. పఠించిన విషయాలను సంపూర్ణంగా అర్థంచేసుకోవాలి.
- పఠన సామర్థ్యంతోపాటు లేఖన నైపుణ్యాన్ని, దోషరహిత లేఖనాన్ని పెంపొందించాలి.
- ప్రకాశపఠనం, మౌనపఠనం, విస్తారపఠనం, క్షుణ్ణపఠనం వంటి పఠన వ్యూహాలను విద్యార్థులకు పరిచయం చేయాలి.
- ప్రస్తుతం పాఠ్యపుస్తకాలలోనే 'చదువు - ఆనందించు' శీర్షికలో అనుబంధంగా పాఠాలున్నాయి. ఇవి చదివి ఆనందించడానికి ఉద్దేశించబడినవి. వీటిపై పరీక్షలు ఉండవు.

## 5.5 పాఠశాలల్లో వినూత్న ప్రయోగాలు (Innovations in Schools)

పాఠశాల పిల్లలకు రెండో ఇల్లు. ఇంటి నుండి పాఠశాల వాతావరణంలోకి, ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు తనకున్న ముందు నుండే పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న పిల్లల మధ్యకు వారు ప్రవేశిస్తారు. పూర్తి అపరిచిత పరిసరాల్లో ప్రవేశించిన పిల్లలకు పాఠశాల వాతావరణానికి పరిచయం చేయడం ఉపాధ్యాయుల విధి. వీటికి తోడుగా విద్యార్థుల ఆలోచనలను వారి స్వీయ రచనాశక్తులను మన్నించి వాటిని వెలుగులోనికి తేవడానికి కూడా ఉపాధ్యాయులు తగు ఏర్పాట్లు చేయాలి. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేయాల్సిన వినూత్న ప్రయోగాలు, ఆవిష్కరణలు గురించి తెలుసుకోవాలి.

### 5.5.1 పిల్లల డైరీ (Childrens Dairy)

పిల్లలు తాము ప్రతిరోజు నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకొన్నది మొదలు పాఠశాలకు వచ్చినప్పటి నుండి రాత్రి నిద్రించేవరకు చేసిన పనులు, కలిసిన మిత్రులు, చదివిన పాఠాలు, సాధించిన అభ్యాసాలు, ఆడిన ఆటలు మరియు ఇతర సహపాఠ్య కార్యక్రమాలపై ఒక నిర్ణయం తీసుకోవడానికి ఉపయోగపడేదే దినచర్య పుస్తకం.

ప్రతి విద్యార్థి తన విద్యాభ్యాస కాలంలో దినచర్య రాసుకోవడానికి ఉద్దేశించిన ఈ వినూత్న ప్రయోగం ప్రాథమిక దశలో దాదాపు మూడోతరగతి నుండి పిల్లలు రాత నేర్చిన తదుపరి రోజువారీ నిర్వహించాల్సిన కృత్యంగా దినచర్య భావింపబడుతుంది. దినచర్య రాయడాన్ని ఉపాధ్యాయులు ప్రోత్సహించాల్సిన అవసరముంది. దినచర్య పుస్తకంలో విద్యార్థులు కింది అంశాలను పేర్కొనేటట్లు చూడాలి.

- తమకు పరిచయమైన పెద్దలు.
- గ్రంథాలయంలో తాము అదనంగా చదివిన పుస్తకాలు.
- ఆ పుస్తక రచయిత – ప్రచురణకర్త– ఆ పుస్తకంలోని కీలకభావనలు– పాత్రలు తమకు నచ్చిన అంశాలు.
- తాము పాల్గొన్న కార్యక్రమాలు.
- పాఠశాలలోను, తరగతిగది వెలుపల తమను ఆకట్టుకున్న సన్నివేశాలు – ఆ సన్నివేశాలపై స్వీయ అభిప్రాయాలు.
- తమ అభ్యసనంలో ప్రగతిలో ఉపాధ్యాయుల నుండి తల్లిదండ్రుల నుండి కోరుకుంటున్న సహకారం.

**దినచర్య రచన – ప్రయోజనాలు**

- విద్యార్థులలో సమయపాలనా దృక్పథాన్ని పెంపొందిస్తుంది.
- విద్యార్థులకు సమయ ప్రాధాన్యత తెలిసి, తాము ఏయే రంగాలలో పాల్గొనాల్సి ఉందో విద్యార్థులకు తెలిసివస్తుంది.
- విద్యార్థులు భవిష్యత్తులో మంచి రచయితలుగా మారే అవకాశం ఉంది.

### 5.5.2 గోడ పత్రిక (Wall Magazine)

గోడపత్రిక విద్యార్థుల్లోని సృజనాత్మకతను, ఊహలను, సాధించిన రూపాలను, వారిలో గల రచనాశక్తిని, పఠనాశక్తిని ప్రదర్శించడానికి తోడ్పడుతుంది. దీనినే పాఠశాల పత్రిక అంటారు.

### 5.5.3 పాఠశాల తపాల పెట్టె (School Post Box)

తపాలపెట్టెను విద్యార్థుల ఆలోచనలను, అభిప్రాయాలను వారికి పాఠశాలలో ఎదుగుతున్న కష్టనష్టాలను, ఇబ్బందులను స్వేచ్ఛగా వెల్లడించడానికి పాఠశాలల తపాలాపెట్టె ఉపయోగించుకోవచ్చు.

- **పఠనోత్సవం:** పఠనోత్సవంలో భాగంగా పిల్లలతో వార్తాపత్రికలు, వారపత్రికలు, కథల పుస్తకాలు, గేయాలు, అభినయగేయాలు, పద్యాలు చదివించడం పిల్లల పఠన రీతులను ప్రదర్శించడం చేయాలి. ఇందుకు పాఠశాల వనరుల నుండి పత్రికలు, పుస్తకాలు సమకూర్చుకొనాలి.
- **భాషోత్సవం:** భాషోత్సవంలో పిల్లలకు పఠన పోటీలు కథల పోటీలు, వాచక పోటీలు, లేఖన పోటీలు నిర్వహించవచ్చు. పాఠశాల స్థాయిలో భాషా సంఘాలను ఏర్పాటుచేసి ఆ సంఘాల ఆధ్వర్యంలో చిట్టి రచయితల సమావేశాలు, కవులు రచయితల సమావేశాలు, ప్రత్యేక కవి పండితుల జయంతులు నిర్వహించవచ్చు. ఉదా : గిడుగు రామ్మూర్తిపంతులు జయంతి; గుర్రం జాషువా జయంతి.

- **బాలల మేళా:** దీనిని పాఠశాల మేళా అంటారు. ఈ మేళాను విద్యా సంవత్సరంలో ఒకటి రెండు పర్యాయాలు నిర్వహిస్తారు. విద్యార్థులు తమ అభ్యసనంలో భాగంగా పలు కృత్యాలు నిర్వహిస్తారు. ప్రాజెక్టులు పూర్తిచేస్తారు. సమాజంలోని అన్ని వర్గాల వారి సహకారంతో పిల్లలు తమ అభ్యసనానికి అవసరమైన ఉపకరణాలను సేకరించడం లేదా సిద్ధంచేయడం కూడా ఈ మేళాకోసం జరుగుతుంది. పిల్లలు తయారుచేసిన సామగ్రిని ప్రదర్శనకు పెట్టి తమ పాఠశాల విద్యార్థుల ప్రతిభాపాటవాలను సమాజానికి తెలియజేయడం, తద్వారా తల్లిదండ్రులకు సంతృప్తి కల్గించడం ఉద్దేశంగా ఈ మేళా జరుగుతుంది. ఈ మేళా ద్వారా విద్యార్థులలోని సృజనాత్మక, కల్పనాత్మక అన్వేషణాత్మక నైపుణ్యాలకు పదునుపెట్టవచ్చు.

ఇలాంటి కార్యక్రమాలు పాఠశాలల్లో సక్రమంగా అమలు జరిగితే విద్యార్థుల సర్వతోముఖ వికాసం సాధ్యం.

రాష్ట్రంలో భాషాభివృద్ధిని సాధించడానికి పైన పేర్కొన్న కార్యక్రమాలన్నింటిని అమలుచేసినట్లయితే పిల్లల్లో భాషాపరంగా అభివృద్ధిని సాధించవచ్చు. తల్లిదండ్రుల్లో తమ పిల్లలు చదవగలరు, రాయగలరు అనే నమ్మకాన్ని కలిగించవచ్చు. ఉపాధ్యాయుల కృషిపట్ల సమాజంలో పాఠశాలపట్ల విశ్వాసాన్ని కలిగించవచ్చు. ప్రాథమిక దశలోని పిల్లలందరిలో భాషాసామర్థ్యాలలో ప్రధానమైన చదవడం, రాయడం సామర్థ్యాలను అభివృద్ధిపరచగలగితే వారు అద్భుతాలు సృష్టించగలరని నిరూపించడానికి అవకాశం ఉంటుంది. వినూత్నంగా రూపొందించబడిన ఈ పాఠ్యపుస్తకాలతో పిల్లల అభివృద్ధికి బంగారుబాటలు వేద్దాం!

# మూల్యాంకనం

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. పిల్లల భాషాభివృద్ధి కార్యక్రమం అంటే ఏమిటి? పాఠశాలల్లో అమలుచేసిన విధానం వివరించండి.
2. 'స్నేహబాల' స్వయం అభ్యసన సామగ్రిగా ఎలా ఉపయోగపడుతుందో తెల్పండి.
3. భాషాభివృద్ధిని పెంపొందించడంలో బాలసాహిత్యం పాత్రను వివరించండి.
4. 'చదువు – ఆనందించు – అభివృద్ధి చెందు' కార్యక్రమం ఆవశ్యకత ఉపయోగాలను వివరించండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. పిల్లల భాషాభివృద్ధి కార్యక్రమంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు రాయండి.
2. పఠన ప్రారంభసామగ్రి వానచినుకులను గూర్చి రాయండి.
3. 3, 4, 5 తరగతుల పిల్లల పఠన సామర్థ్యాన్ని పెంపొందించే సామగ్రిని వివరించండి.
4. వినూత్న కార్యక్రమాలను వివరించండి.
5. గోడపత్రిక నిర్వహణ మరియు ప్రయోజనాలు తెల్పండి.

**III. ఈ క్రింది వానికి సమాధానాలు రాయండి.**

1. పిల్లల భాషాభివృద్ధి కార్యక్రమం నిర్వహించిన సంవత్సరం?
2. బాలల సంఘాలలో ముఖ్యమైన రెండు సంఘాలు?

   1) ........................ 2) ........................
3. కథాకార్డులు ఎవరికోసం రూపొందించబడినవి?
4. 'చదువు ఆనందించు, అభివృద్ధి చెందు' కార్యక్రమం ఉద్దేశ్యం ఏమిటి?

**IV. ఈ క్రింది వానిని జతపరచండి.**

| | | | |
|---|---|---|---|
| 1. | లోగో | (    ) | అ) వినూత్న కార్యక్రమాలు |
| 2. | కథోత్సవం | (    ) | ఆ) పఠనానంతర కృత్యం |
| 3. | కథను సొంత మాటల్లో చెప్పడం | (    ) | ఇ) స్నేహబాల కార్డులు |
| 4. | పిల్లల భాషాభివృద్ధి కార్యక్రమం | (    ) | ఈ) 1వ తరగతి |
| 5. | పదజాలాభివృద్ధి కార్డు లేదు | (    ) | ఉ) CLIP |

# 6 తరగతి గది ప్రణాళిక - భాషాభ్యసనం మదింపు

**విషయక్రమం**

6.1 ఉపాధ్యాయ సన్నద్ధత మరియు బోధనాభ్యసన సామగ్రి

6.2 బోధనా సంసిద్ధత - భాషాబోధన ప్రణాళిక

6.3 మదింపు మరియు మూల్యాంకనం నిర్వచనం, ఆవశ్యకత మరియు ప్రాముఖ్యత

6.4 నిరంతర సమగ్ర మూల్యాంకనం

**పరిచయం**

పాఠ్య ప్రణాళిక గురించి పాఠశాల సబ్జక్టుల గురించి మన దృక్పథమే మారాలి. పాఠశాల పద్ధతులలో నాణ్యత పెరగాలి. వర్తమానానికి సంకేతంగా ఉండేలా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకునేలా, పిల్లల మీద పెరుగుతున్న వత్తిడులను తగ్గించేలా అన్ని సబ్జక్టులలో బోధనాభ్యసన రీతులు మెరుగు పడాలి"

**-- జా.వి.ప్ర.చట్రం 2005.**

ఒక వ్యక్తిలో ఎంత ప్రతిభ, సమర్థత ఉన్నప్పటికీ, తాను చేయదలచుకున్న పని సకాలంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా పూర్తి చేయాలంటే ఒక నిర్ధిష్టమైన కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి. లేనిచో 'దారం తెగిన గాలిపటం' లా ఆ పని ఎన్ని రోజులకు పూర్తవుతుందో, ఎక్కడ ముగించాలో తెలియదు. అలాగే ఉపాధ్యాయుడి ప్రతిభ, సమర్థత తాను సాధించదలచుకున్న పని, సక్రమంగా, సకాలంలో నిరంతరాయంగా పూర్తి చేయడంలోనే ఉంది. ఇది ఒక ప్రణాళిక ద్వారా సాధ్యమవుతుంది. పిల్లల అంతర్గత శక్తులను వెలికి తీయడానికి, వారి ఆలోచనలను సరియైన మార్గంలోకి మళ్ళించడానికి, నిర్దేశింపబడిన సామర్థ్యాలు అభివృద్ధి పరచడానికి ప్రణాళిక రచన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఉపాధ్యాయుడి బోధన, విద్యార్థుల అభ్యసనం సఫలీకృతం కావాలంటే, గుణాత్మక విద్యనందించడానికి, కృత్యాధార పద్ధతిలో బోధించడానికి, కృత్యాలను ముందే రూపొందించుకొని కృత్య నిర్వహణలో విద్యార్థులను భాగస్వాములను చేయడానికి, తరగతి వారీగా, విద్యార్థుల సామర్థ్యాల అభివృద్ధికి, కనీస అభ్యసన సామార్థ్యాలు సాధించడానికి, క్రమ పద్ధతిలో బోధనాభ్యసన ప్రక్రియ కొనసాగడానికి, తరగతి గది ప్రణాళిక రూపకల్పన అవసరం.

Q2A5BZ

పిల్లలు భాషను పుట్టుకతోనే నేర్చుకోవడం ప్రారంభిస్తారు. తాను సంతోషంగా ఉన్నప్పుడు నవ్వడం, ఆకలిగా ఉన్నప్పుడు తన అవసరాలు తీరనపుడు ఏడ్వడం ద్వారా తల్లితో సంభాషిస్తాడు. భాషను కుటుంబంలోని వ్యక్తులు, వస్తుజాలాలతో సహజంగా, సందర్భోచితంగా అర్థవంతమైన సన్నివేశాలలో పాల్గొనడం ద్వారా, వాటితో పరస్పర ప్రతిచర్యలు జరపడం ద్వారా పదాలు, పదబంధాలు, వాటి అర్థాలు, వాక్యాలు, సంపాదించగల భాషను పొందే క్రమంలో వివిధ స్థాయిల్లో జ్ఞాన నిర్మాణం జరుగుతుంది. ఆలోచనలకు, భాషకు విడదీయరాని సంబంధం ఉంది. భాష సృజనాత్మకతకు సహాయకారి. వికాసానికి దోహదకారి.

వ్యక్తిత్వ వికాసంలో భాష చాలా ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఇది భాషాభ్యసన ద్వారానే సాధ్యమవుతుంది. కాలానికి అనుగుణంగా బోధనాభ్యసన ప్రక్రియలు కూడా మారుతున్నాయి. మారుతున్న సమాజంలో తగిన విధంగా పిల్లల్లో సృజనాత్మకత, తార్కిక ఆలోచన, అవగాహనతో కూడిన విద్య నందించడం జరుగుతుంది. విద్యార్థుల యొక్క సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా నిర్మాణాత్మక తరగతి గదులకు, బోధనాభ్యసన ప్రక్రియలను కల్పించడంపై దృష్టిపెట్టి జా.వి.ప్ర.చట్రం 2005, ఆర్.టి.ఇ 2009 నేపధ్యంలో మూల్యాంకనం చేయడం ప్రారంభమైనది. అభ్యసన ఫలితాలకు ప్రాధాన్యత నివ్వకుండా అభ్యసన ప్రక్రియలకు ప్రాధాన్యత ఇస్తూ నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని అమలు చేస్తున్నారు. భాషాభ్యసనంలో మూల్యాంకనం అంతర్భాగంగా నిరంతరం జరిగే ప్రక్రియగా నిర్వహించడానికి తగిన ప్రణాళికను తయారు చేసుకోవాలి.

> ఐచ్ఛిక సాధనాల ద్వారా, భవిష్యత్తు దృక్పథంలో గమ్యాన్ని చేరడానికి వరుస క్రమంలో నిర్ణయాల ఆచరణ కోసం సిద్ధం చేసే ప్రక్రియే ప్రణాళిక. – వై. డోర్

**లక్ష్యాలు**

RBKTEB

1. ఈ అధ్యాయం చదవడం ద్వారా ఛాత్రోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఏవిధంగా సన్నద్ధత కావాలో అవగాహన చేసుకుంటారు.
2. ప్రణాళికా ఆవశ్యకతను గుర్తిస్తారు.
3. బోధనా సంసిద్ధతపై అవగాహన కలిగియుంటారు.
4. వార్షిక ప్రణాళిక, యూనిట్ ప్రణాళిక మరియు పీరియడు ప్రణాళికలను తయారు చేసుకోగలుగుతారు.
5. మదింపు మరియు మూల్యాంకనం ప్రాధాన్యతను గుర్తిస్తారు.
6. నిరంతర సమగ్ర మూల్యాంకనం పై అవగాహన కలిగిఉంటారు.
7. మదింపు సాధనాలను అవగాహన చేసుకుంటారు.
8. నిర్మాణాత్మక మూల్యాంకన సాధనాలను అవగాహన చేసుకుంటారు. నిర్వహించగలుగుతారు.
9. సంగ్రహణాత్మక మూల్యాంకనం పశ్నపత్రాన్ని భారత్వ పట్టికలను తయారు చేసుకోగలుగుతారు.
10. పరిపుష్టి మరియు నివేదిక విధానాలను, రికార్డులు మరియు రిజిష్టర్ల నిర్వహణను గ్రహించగలుగుతారు.

## 6.1 ఉపాధ్యాయ సన్నద్ధత మరియు బోధనాభ్యసన సామగ్రి

ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభం కావడానికి ముందే ఉపాధ్యాయుడు తాను బోధించబోయే తరగతులకు సన్నద్ధత కలిగియుండాలి. ఒక తరగతికి వచ్చే విద్యార్థుల స్థాయి ప్రతి సంవత్సరం ఒకే విధంగా ఉంటుందని ఊహించలేం. కావున ప్రతి ఉపాధ్యాయుడు వేసవి సెలవులలోనే పాఠ్య పుస్తకంలోని పాఠాలన్నింటిని పరిశీలనా దృష్టితో చదవాలి. తరగతికి నిర్దేశించి విద్యా ప్రమాణాల వారీగా అభ్యసన సూచికలను అవగాహన చేసుకోవాలి.

పాఠ్యగ్రంథంలోని పాఠాలన్నింటిని బోధించడం ద్వారా సాధించవలసిన సామర్థ్యాలను నిర్ధారించుకోవాలి. పాఠ్య పుస్తకంలోని పాఠాలన్నింటినీ చదివి గద్య పాఠాలకు, పద్య పాఠాలకు, బోధనా వ్యూహాలను తయారు చేసుకోవాలి. తరగతి వారీగా ప్లిలలలో సామర్థ్యం అభివృద్ధికి తగిన బోధనాభ్యసన కృత్యాలు, వాటి నిర్వహణకు కావలసిన బోధనాభ్యసన సామగ్రి తయారు చేసుకోవాలి.

పాఠ్య పుస్తకంలో పాఠాలకు వార్షిక ప్రణాళిక, యూనిట్ ప్రణాళిక, పీరియడు ప్రణాళిక తయారు చేసుకోవాలి. పాఠ్య పుస్తకాలలోని అంశాలకు కొత్త మెరుగులు, పద్ధతులు, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. నెలవారీగా నిర్వహించవలసిన విద్యా సంబంధ కార్యక్రమాలను, అకడమిక్ క్యాలండర్‌ను అనుసరించి సంస్థాగత ప్రణాళికను సిద్ధపరచుకోవాలి. పాఠశాలల్లో నిర్వహించవలసిన ప్రాముఖ్యమైన దినాలు ఎలా నిర్వహించాలో ప్రణాళిక తయారు చేసుకోవాలి. విద్యార్థులకు ఆహ్లాదకరమైన ఆకర్షణీయమైన తరగతి గదిని రూపొందించుకోవాలి.

**బోధనాభ్యసన సామగ్రి:** ఉపాధ్యాయుని బోధనను ప్రభావితం చేస్తూ విద్యార్థుల అభ్యసనానికి సహాయపడే సామగ్రిని బోధనాభ్యసన సామగ్రి లేదా బోధనాభ్యసన ఉపకరణాలు అంటారు. ఇది బోధనాభ్యసన ప్రక్రియలో కీలకపాత్ర పోషిస్తుంది. పిల్లలు బోధనభ్యసన సామగ్రి వల్ల కృత్యాలలో చురుకుగా పాల్గొని స్వయం అభ్యసనం పొందుతారు. ఇది అభ్యసనం వైపు పిల్లలను ఆకర్షిస్తుంది. ప్రస్తుతం ఆధునిక బోధనారంగం స్వయం అభ్యసనం వైపు ప్రయాణిస్తోంది. స్వయం అభ్యసనం వారిలో ఆసక్తిని, అనురక్తిని పెంపొందిస్తుంది, ఆలోచనలను రేకెతిస్తుంది. కావున ఈ బోధనాభ్యసన సామగ్రిని ఇంటరాక్టివ్ లెర్నింగ్ మెటీరియల్ అని కూడా అంటారు. వీటినే సంప్రదాయంగా బోధనోపకరణాలని వ్యవహరిస్తారు.

బోధనాభ్యసన ప్రక్రియ విద్యార్థి కేంద్రంగా నిర్వహింపబడడంలో ఇది దోహదపడుతుంది. మనం ఏ కృత్యం నిర్వహించినా అది పిల్లల అభ్యసనానికి తోడ్పడాలి. భాషా బోధనలో కల్పించే కృత్యాలు పిల్లలు వినడానికి, అర్థం చేసుకోవడానికి, తమ భావాలను, అనుభవాలను, అభిప్రాయాలను, స్వేచ్ఛగా, సొంత మాటల్లో ఆలోచించి మాట్లాడడానికి, అవగాహనతో ధారాళంగా చదవడానికి, అందంగా, దోషరహితంగా, విరామ చిహ్నాలు పాటిస్తూ సొంత మాటల్లో రాయడానికి, పదజాలాభివృద్ధికి బోధనాభ్యసన సామగ్రి సహాయకారిగా ఉంటుంది.

పూర్వకాలంలో విద్యాబోధన చేయాలంటే ఉపాధ్యాయులు నల్లబల్ల, సుద్దముక్క, తుడుపు గుడ్డ (డస్టర్) ఉపకరణాలుగా ఉపయోగిస్తూ బోధన సాగించేవారు. తరువాతి కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక విద్యా కార్యక్రమం, జిల్లా ప్రాథమిక విద్యా కార్యక్రమాలు, సర్వ శిక్షా అభియాన్ గుణాత్మక విద్యకు, ఆహ్లాదకరమైన అభ్యసనానికి ప్రాధాన్యత ఇవ్వడం వలన ఉపాధ్యాయుని దృష్టి బోధనాభ్యసన సామాగ్రిని ఉపయోగిస్తూ బోధించే వైపు మరలింది.

ప్రముఖ విద్యావేత్త, మాజీ కేంద్రమంత్రి హుమాయున్ కబీర్ "ఉపకరణం విషయ చిత్రీకరణకు, విషయ వ్యాఖ్యానానికి తొందరగా, తేలిగ్గా శాశ్వతమైన విషయ అవగాహనకు ఉపయోగపడుతుంది" అని తేల్చి చెప్పాడు.

**ఉపయోగాలు**

- విద్యార్థుల అవధానాన్ని నిలిపి ఉంచగలుగుతారు.
- సంఖ్య ఎక్కువగా ఉన్న తరగతులలో బోధన సులభతరమవుతుంది.
- విద్యార్థుల మధ్య, విద్యార్థులకు ఉపాధ్యాయుని మధ్య పరస్పర ప్రతిచర్యకు, దోహదపడుతుంది.
- విద్యా కేంద్రంగా బోధనాభ్యసన ప్రక్రియ కొనసాగుతుంది.
- ఉపాధ్యాయుడు మార్గదర్శిగా ఉండే అవకాశం కలిగిస్తుంది.

**బోధనాభ్యసన సామగ్రి ఉపయోగించడంలో తీసుకోవలసిన జాగ్రత్తలు**

- ఒక అంశాన్ని వివరించడానికి మితిమీరిన సంఖ్యలో బోధనాభ్యసన సామాగ్రిని ఉపయోగించకూడదు. దీని వలన లక్ష్యం సాధించకపోగా ఒక ప్రదర్శనగా మారుతుంది.
- బోధనాభ్యసన కృత్యాలు నిర్వహించేటప్పుడు సముచిత సమయంలో ఉపయోగించాలి.
- బోధనాభ్యసన సామాగ్రిని విద్యార్థి సైతం తయారు చేసుకో గలిగినంత సరళంగా ఉండాలి.
- సాధ్యమైనంతవరకు ఖర్చు లేకుండా, తక్కువ ఖర్చుతో తయారు చేయడానికి ఉపాధ్యాయుడు శ్రద్ధ తీసుకోవాలి.

**భాషా బోధనలో బోధనాభ్యసన సామగ్రి – రకాలు.**

భాషా బోధనకు సంబంధించి నంతవరకు బోధనాభ్యసన సామాగ్రి 3 రకాలుగా పేర్కొన వచ్చును.

(1) తయారు చేయవలసినవి (2) సేకరించవలసినవి (3) కొనుగోలు చేయవలసినవి/సరఫరా చేయబడినవి.

**(1) తయారు చేయవలసినవి:** అక్షర కార్డులు, పదాల కార్డులు, డామినో కార్డులు, గుణింత చట్రాలు, పద చట్రాలు, గళ్ళ నుడికట్టు, వైకుంఠపాళి, పాచికలు, భాషా క్రీడలు మున్నగునవి. 2015-16 సంవత్సరంలో సర్వశిక్ష అభియాన్, పశ్చిమ గోదావరి జిల్లా ప్రాజెక్టు ఆధ్వర్యంలో "సృజన బోధనాభ్యసన సామాగ్రి కరదీపిక" రూపొందించబడింది. దీనిలో 1 నుండి 5 తరగతులు విద్యార్థులకు అన్ని విషయాలకు సంబంధించిన ముఖ్యమైన పాఠ్యాంశాలకు అనుసంధానిస్తూ 200 బోధనోపకరణాలను ఎలా తయారు చేయాలో ఎలా తరగతి గదిలో ఉపయోగించాలో వివరిస్తూ కరదీపికలను పాఠశాలలకు పంపించడం జరిగింది. వీటిలో భాషకు సంబంధించి 1 నుండి 5 తరగతులకు, 50 బోధనోపకరణాలు పొందుపరచబడ్డాయి. దీనిని www.possawg.com నుండి పొందవచ్చు.

**(2) సేకరించవలసినవి:** కార్టూన్‌లు, పత్రికా ప్రకటనలు, లేఖలు, కథలు లేదా చిత్రాలు, సామెతలు, పొడుపు కథలు, జాతీయాలు, బాల గేయాలు, అభినయ గేయాలు, కథల పుస్తకాలు, పత్రికలు, ఫోటోలు, కరపత్రాలు, వార్తాపత్రికలు – వీటిని ఉపయోగించడం ద్వారా విద్యార్థిలో విద్యా ప్రమాణాలు అభివృద్ధి పరచవచ్చు.

**(3) కొనుగోలు చేయవలసినవి:** వీటిని ప్రధానంగా 4 రకాలుగా పేర్కొనవచ్చును.

1. శ్రవ్య బోధనాభ్యసన ఉపకరణాలు
2. దృశ్య బోధనాభ్యసన ఉపకరణాలు
3. దృశ్య శ్రవణ బోధనాభ్యసన ఉపకరణాలు
4. ప్రత్యేక విద్యార్థులకు అవసరమైన బోధనాభ్యసన ఉపకరణాలు.

**1. శ్రవ్య బోధనాభ్యసన ఉపకరణాలు:** వీటిలో ప్రధానమైనవి. (ఎ) రేడియో (బి) టేప్‌రికార్డు, (సి) సిడి/డివిడి ప్లేయర్ (డి) సంగీత వాయిద్యాలు

**(ఎ) రేడియో:** రేడియో కార్యక్రమాలు నేడు బోధనాభ్యసన కార్యక్రమంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి – ప్రాథమిక పాఠశాలల్లో రాష్ట్ర విద్యా సాంకేతిక సంస్థ "విందాం – నేర్చుకుందాం" కార్యక్రమంలో రేడియో పాఠాలు ప్రసారం చేస్తుంది. ఉదయం 11 గం॥కు, ప్రతి రోజు సోమవారం నుండి వీటిని వినడం ద్వారా విద్యార్థులు స్పష్టమైన

ఉచ్చారణ అలవర్చుకుంటారు. విద్యార్థులలో ప్రత్యేక అభిరుచులను ప్రోత్సహిస్తాయి – విద్యార్థులు పాఠాలలోనివి కాకుండా అదనపు సమాచారాన్ని పొందగలుగుతారు.

**(బి) టేప్ రికార్డరు:** బోధనోపకరణంగా టేప్‌రికార్డును ఉపయోగించడం ద్వారా విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని అభివృద్ధి పరచవచ్చు. తమ పఠనాన్ని టేప్‌లో రికార్డు చేసి వినడం ద్వారా ఉచ్చారణ దోషాలు సరిచేసుకోవచ్చు. శ్రావ్యమైన పద్య పఠనాలను, గేయాలను రికార్డు చేసి వాటిని వినిపించి పాఠ్యబోధన చేయవచ్చు. భాషా ప్రయోగశాలల్లో టేప్‌రికార్డరు ద్వారా అక్షరాలను, పదాలను వినిపించి విద్యార్థుల శ్రవణ సామర్థ్యాన్ని, ఉచ్చారణ నైపుణ్యాన్ని పెంపొందించవచ్చు.

**2. దృశ్య బోధనాభ్యసన ఉపకరణాలు:** చార్టులు, ఫ్లాష్‌కార్డులు, చిత్రాలు, దేశపటాలు, పట్టికలు, నమూనాలు, బొమ్మలు గోడపత్రికలు మొదలగునవి.

**చార్టులు:** చాలా మాటలకు బదులు ఒక్కచార్టు ద్వారా గాని, గ్రాఫ్ ద్వారా గాని వ్యక్తీకరించిన భావన మంచి ఫలితాన్ని ఇస్తుంది. బోధనలో సముచిత సమయంలో వీటిని వాడాలి. చార్టులో ఏదైనా ఒక విషయాన్ని రాసి అది అంతా ఒకేసారి కనిపించకుండా విడి విడి కాగితాలతో మూసి వుంచవచ్చు. బోధనాభ్యసన ప్రక్రియలో దశల వారీగా ముందుకు వెళుతున్నప్పుడు ఆ కాగితాలను తొలగించుకుంటూ పోవచ్చు. ఈరకం చార్టులను "స్ట్రిప్ చార్టులు" అంటారు. గేయాలు, పొడుపు కథలు, వ్యాకరణాంశాలు, సూక్తులు, విశేషాలు వివిధ అభ్యసన కృత్యాలు మొదలైన వాటికి చార్టులు ఉపయోగపడతాయి.

**ఫ్లాష్ కార్డులు :** వీటినే మెరుపు అట్టలు అంటారు. ఇవి ఆకర్షణీయంగా ఉంటాయి. ఒకసారి చూపించి వెంటనే తీసివేస్తారు. కాబట్టి మెరుపు అట్టలు అంటారు. పద పద్ధతి ద్వారా అక్షరాలు బోధించడానికి ఇవి బాగా ఉపయోగపడతాయి. పదాలను చదివి పదంలోని అక్షరాన్ని విద్యార్థులు గుర్తిస్తారు. ఒక పదానికి 4 మెరుపు అట్టలు తయారుచేయాలి. మొదటి అట్టను గుర్తింపు అట్ట అంటారు. విద్యార్థులకు బాగా తెలిసిన మనిషి/జంతువు/వస్తువు బొమ్మ వేయాలి. దాని క్రింద ఆ బొమ్మ పేరు రాయాలి.

చిత్రం



రెండవది స్వయం సవరణ అట్ట : ఒక అట్టను తీసుకొని గుర్తింపు అట్టలో వ్రాసిన బొమ్మను ఒకవైపు, రెండవవైపు బొమ్మకు సంబంధించిన పదం వ్రాయాలి (ఒకవైపు)

చిత్రం



(అట్ట రెండవ వైపు)

మూడు, నాలుగు అట్టలను జత కూర్పు అట్టలంటారు. 3వ అట్టపై బొమ్మ ఉంటుంది. 4వ అట్టపై పదం ఉంటుంది.

చిత్రం



**చిత్రాలు:** ప్రాథమిక స్థాయిలో విద్యార్థికి ఆసక్తి కలిగించడానికి చిత్రాలు బాగా ఉపయోగపడతాయి. అందువల్ల 1 నుండి 5 తరగతులలో పుస్తకాలలో చిత్రాలు ఎక్కువగా వేయడం జరిగింది. కఠినమైన భావనలను చిత్రాల ద్వారా సులభంగా చెప్పవచ్చు. పాఠ్యాంశానికి సంబంధించిన సన్నివేశాలను చార్టులపై చిత్రించి విద్యార్థులతో మాట్లాడించవచ్చు. చదవడం – అర్థం చేసుకొని చెప్పడం, స్వీయ రచన వంటి సామర్థ్యాలు చిత్రాల ద్వారా పిల్లలలో అభివృద్ధి పరచవచ్చు.

**దేశపటాలు–పట్టికలు:** దేశపటాలు, వివరణ పట్టికలను పాఠశాల గోడలపై చిత్రించడం ద్వారా వాటికి సంబంధించిన జ్ఞానం విద్యార్థులలో శాశ్వతంగా గుర్తుండేలా చేయగలుగుతాయి. సర్వశిక్ష అభియాన్ పథకం యొక్క నిధులతో పాఠశాల యాజమాన్య కమిటీల ద్వారా వీటికి సంబంధించినవి కొనుగోలు చేసి సందర్భానుగుణంగా ప్రదర్శించడం జరుగుతుంది.

**నమూనాలు / బొమ్మలు:** వస్తువు పరిమాణం కంటే పెద్దది గాని, చిన్నది గాని నమూనా చేసి ప్రదర్శించడం వలన విద్యార్థులు ప్రత్యక్షంగా చూచిన అనుభూతి కలుగుతుంది. మట్టితో నమూనాలను, బొమ్మలను తయారు చేసి వాటికి రంగులు వేసి చూపించవచ్చు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఇవి ఆకర్షణీయంగా ఉంటాయి.

**గోడపత్రిక:** ఇది ప్రతి పాఠశాలలో/తరగతిలో ఏర్పాటు చేసుకోవాలి. విద్యార్థులు చేసిన సృజనాత్మక కృత్యాలను దీనిపై ప్రదర్శించవచ్చు. వీటిని చూడడం ద్వారా మిగిలిన విద్యార్థులలో స్ఫూర్తిని కలిగించవచ్చు. పిల్లలలో దాగియున్న శక్తులను వెలికి తీయవచ్చు "సర్వశిక్షా అభియాన్" "వినూత్న కార్యక్రమాలు" పేరుతో పాఠశాలలో గోడపత్రిక నిర్వహణ తప్పనిసరి చేసింది.

**3. దృశ్య–శ్రవణ బోధనాభ్యసన ఉపకరణాలు :** చలన చిత్రాలు, టెలివిజన్, కంప్యూటర్లు, ఎల్.సి.డి.ప్రొజెక్టరులు, సెల్‌ఫోన్, పప్పెట్స్, తోలు బొమ్మలాటలు.

**చలన చిత్రాలు:** బోధనాభ్యసన ప్రక్రియలో ఉపయోగపడే చిత్రాలు : వ్యాఖ్యాన చిత్రాలు (డాక్యుమెంటరీలు) ఉపాధ్యాయుడు ఉపయోగించాలి. విద్యా విషయక లఘు చిత్రాలెన్నో మార్కెట్లో అందుబాటులో ఉంటాయి. వీటిని ఉపయోగిస్తే విద్యార్థులకు అభ్యసన ఆకర్షణీయంగా మారుతుంది. వ్యాఖ్యాన చిత్రాలు (డాక్యుమెంటరీ)లోని విషయాంశాలు విద్యార్థులకు స్ఫూర్తిని కలిగించేవిగా, సమాజ పరిస్థితులను చిత్రించేవిగా ఉంటాయి. విద్యావిషయక చలనచిత్రాలేకాక తెలుగులో తీయబడిన కొన్ని కళాత్మక చిత్రాలు భాషాబోధనలో మనకు ఉపయోగపడతాయి. మనకు టి.వీ. చూసే ఓపిక ఉండాలే కాని ప్రతిరోజూ వివిధ ఛానల్స్ ద్వారా ఒకనాటి అపూర్వ చిత్రాలు మళ్లీ మళ్లీ టి.వీ.ల్లో పునరావృతం

అవుతున్నాయి. వాటిని పిల్లలు చూడడం ద్వారా మన ప్రాచీన సంప్రదాయాలను, పురాణాలను, ఇతిహాసాలను విద్యార్థులు తెలుసుకుంటారు. భాష పట్ల మక్కువ పెంచుకుంటారు. అయితే ఇందుకు ఉపాధ్యాయుని ప్రేరణ చాలా అవసరం. ఉదాహరణకు మాయాబజార్, మహాకవి కాళిదాసు, నర్తనశాల, మహామంత్రి తిమ్మరుసు, కన్యాశుల్కం, మల్లీశ్వరి (పాతచిత్రం), అమరశిల్పి జక్కన, తెనాలి రామకృష్ణ, తారే జమీన్ పర్, మూగమనసులు మొదలగునవి.

**టెలివిజన్ (దూరదర్శిని):** నేడు ప్రసార సాధనాలలో అత్యంత ప్రభావితం చేయగలిగిన ఉపకరణం దూరదర్శిని. తరగతి గదిలో ప్రదర్శించలేని అనేక అంశాలను టెలివిజన్ విద్యార్థుల ముందుకు తీసుకొని వస్తోంది. టెలివిజన్‌లోని కొన్ని ఛానల్స్ పిల్లలకోసం ప్రత్యేకంగా కార్టూన్ చిత్రాలను ప్రసారం చేస్తున్నాయి. (కార్టూన్ నెట్‌వర్క్, పోగో – వంటివి) టి.వి.లలో కొన్ని ఛానళ్ళు ప్రత్యేకంగా 1,2 తరగతుల పిల్లల కోసం (రైమ్స్) గేయాలు ప్రసారం చేస్తున్నాయి. వీటిని చూపించడం ద్వారా విద్యార్థులలో ఆనందం, అనురక్తి పెంపొందుతాయి, అభ్యసనం మెరుగుపడుతుంది.

**కంప్యూటర్:** కంప్యూటర్ నేడు ప్రతి పాఠశాలలో అందుబాటులోకి వచ్చింది. పూర్వ విద్యార్థులు, దాతలు, అనేక కార్పొరేట్ సంస్థలు కంప్యూటర్లు పాఠశాలలకు అందించడంలో సహాయ పడుతున్నారు. ప్రభుత్వము పాఠశాలలన్నింటికీ కంప్యూటర్లు అందించడానికి ప్రయత్నం చేస్తోంది. కంప్యూటర్‌లో విద్యా విషయక సంబంధమైన అనేక వెబ్‌సైట్‌లు అందుబాటులోకి వచ్చాయి. గూగుల్, వికిపీడియా వంటి వెబ్‌సైట్లు అధునాతన విధానాలను, పరిశోధనలను అందిస్తున్నాయి. ప్రాథమిక దశలోని పిల్లలు కంప్యూటర్ ద్వారా బాషా క్రీడలను తేలికగా ఆడడం వలన భాషా సామర్థ్యాలను అభివృద్ధి పరచుకుంటున్నారు. ప్రభుత్వం త్వరలో డిజిటల్ తరగతి గదులను ఏర్పాటు చేయుటకు సన్నాహాలు  చేస్తోంది. ఇప్పటికే ప్రతి జిల్లాలో కొన్ని పాఠశాలలో నెలకొల్పారు. జిల్లా విద్యా శిక్షణ సంస్థలలో కూడా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ వైట్‌బోర్డులు (ఇంటరాక్టివ్ వైట్ బోర్డు) కంప్యూటర్‌తో అనుసంధానం చేస్తున్నారు. ఈ బోర్డుపై వ్రాయడానికి ప్రత్యేకమైన లేజర్ పెన్ వాడతారు. ఈ బోర్డుపై వ్రాసినది భద్రపరచుకోవడం (SAVE) తొలగించడం (DELETE) వంటి ఐచ్ఛికాలతో ఈ బోర్డు ఉంటుంది–అంతర్జాలం ద్వారా (ఇంటర్‌నెట్) జిల్లా విద్యా శిక్షణ సంస్థలో చెప్పే అంశాలు తరగతి గదిలోకి నేరుగా ప్రసారం కానున్నాయి. బోధనాభ్యసన ప్రక్రియలో ఇది ఎంతగానో తోడ్పడుతుంది. కంప్యూటర్ ప్రక్రియ మానవుని మేధస్సుకు పరాకాష్ఠ!

**ఎల్.సి.డి. ప్రొజెక్టరు:** సాంకేతిక పరంగా అభివృద్ధి చెందుతున్న నేటి కొన్ని పాఠశాలల్లో లిక్విడ్‌క్రిస్టల్ ప్రొజెక్టర్లు (LCD) తరగతి గదులలలో ఏర్పాటు చేసి వీటిని, కంప్యూటర్, సి.డి/ డి.వి.డి. ప్లేయర్/ ఐప్యాడ్‌లకు అనుసంధానం చేసి విద్యా కార్యక్రమాలను విద్యార్థులకు చేరవేయుచున్నారు. ప్రాథమిక విద్యార్థుల కోసం తెలుగులో బాపు–రమణలు రూపొందించిన పాఠ్యాంశాలు సి.డి.ల రూపంలో లభిస్తున్నాయి. వీటిని ఎల్.సి.డి. ప్రొజెక్టరు ద్వారా చూపించవచ్చు.

**సెల్‌ఫోన్:** నేడు సెల్‌ఫోన్ లేని ఉపాధ్యాయుడు లేడు. విద్యా సంబంధ సమాచారమంతా సెల్‌ఫోన్ ద్వారానే ఉపాధ్యాయులకు చేరవేయబడుతుంది. దీనిని బోధనా పరంగా వాడుకోవచ్చు. ఒక రకంగా చెప్పాలంటే ఇది సెల్‌ఫోన్ యుగం. కంప్యూటర్ ద్వారా పొందే లాభాలన్ని సెల్‌ఫోన్ ద్వారా పొందవచ్చు. సెల్‌ఫోన్‌ను అంతర్జాలానికి అనుసంధానం చేయడం ద్వారా ఉపాధ్యాయులకు అవసరమైన భాషా క్రీడలు, పాఠ్యాంశాలు, విద్యా సంబంధ కార్యక్రమాలు డౌన్‌లోడ్ చేసుకొని టి.వి ద్వారానో, ఎల్.సి.డి. ప్రొజెక్టురు ద్వారానో తరగతి గదిలో ప్రదర్శించవచ్చు. సెల్‌ఫోన్ ద్వారా చిత్రీకరించిన వీడియోలను, రికార్డు చేసుకున్న దృశ్యాలను, కంప్యూటర్‌కు టి.వి.కి అనుసంధానం చేసి తరగతి గదిలో  ప్రదర్శించవచ్చు.

SKWHGM

**పప్పెట్‌లు, తోలుబొమ్మలాటలు:** పప్పెట్‌లు తోలుతోగాని, అట్టతోగాని ప్లాస్టిక్‌తోగాని చేసిన బొమ్మలు. వీటి అవయవాలు, కీళ్లు వదులుగా ఉంటాయి. అందువలన దారాలతోగాని, తీగలతోగాని పుల్లలతోగాని ఎటుపడితే అటు ఆడించవచ్చు. చేతివేళ్ళకు తొడిగి ఆడించే వాటిని గ్లౌవ్ పప్పెట్స్ అంటారు. తగిన అలంకారాలు చేసి వీటిచేత నాటికలు ఆడించవచ్చు. ప్రాధమికస్థాయి పిల్లల మనస్సును ఆకట్టుకొనునట్లు జంతువులు పాత్రలుగా గల నీతికథలు (ఆవు-పులి) బోధించడానికి ఇవి సహాయ పడతాయి. పప్పెట్‌లు, తోలు బొమ్మ లాడించడం ద్వారా విద్యార్థులకు వినోదమే కాకుండా, అందులోని విషయానికి సంబంధించిన విజ్ఞానం కూడా పిల్లలకు అందుతుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో తోలు బొమ్మలాటకు ధ్వన్యనుకరణ సంగీతాన్ని జోడించి (2009-2010) అన్ని పాఠశాలల్లోను ప్రవేశపెట్టారు. ఈ దృశ్య-శ్రవణ బోధనాభ్యసన ఉపకరణాలు, బోధనాభ్యసన ప్రక్రియలో ఎంతగానో దోహదపడడమే కాకుండా పిల్లల భాషా సామర్థ్యాల అభివృద్ధికి తోడ్పడతాయి.

## 6.2 బోధనా సంసిద్ధత - భాషాబోధన ప్రణాళిక

### వార్షిక, యూనిట్ మరియు పిరియడు ప్రణాళికలు

ప్రతి ఉపాధ్యాయుడు ప్రణాళికా బద్ధంగా బోధనాభ్యసన ప్రక్రియలను నిర్వహించినప్పుడే ఆశించిన ఫలితాలు సాధించగలడు. ఇందుకు తగిన విధంగా సంసిద్ధుడు కావాలి. తాను బోధించబోయే తరగతి, విషయములు, పిల్లలస్థాయిని ముందుగానే అంటే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే గుర్తించాలి. బోధనాంశాలు, వాటికి సంబంధించిన బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహణ, విద్యార్థికి కావలసిన ఆహ్లాదకరమైన వాతావరణం, బోధనాభ్యసన సామగ్రి, అదనపు సమాచారాన్ని సేకరించుకోవలసివుంది. వీటిని సమీకరించడానికి, సమకూర్చుకోడానికి తగిన వనరులు అన్వేషించవలసిఉంది. వీటన్నింటి క్రమబద్ధరూపకల్పనే బోధన ప్రణాళిక. భాషా బోధనకు సంబంధించిన తరగతి వాతావరణం ఆకర్షణీయంగా రంగురంగుల బొమ్మలతో ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలి. తరగతి గదిలో భాషా వాతావరణం అనగా కథల పుస్తకాలు; భాషా క్రీడా సామగ్రి, దృశ్య శ్రవణ ఉపకరణాలు, కథావాచకాలు వంటి వాటిని సిద్ధం చేసుకోవాలి. పాఠశాలలు తెరిచే నాటికి వార్షిక ప్రణాళిక, ప్రారంభ నెలకు సంబంధించిన పాఠ్య ప్రణాళిక ఆ పాఠ్య ప్రణాళికకు సంబంధించిన పీరియడు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

**వార్షిక ప్రణాళిక :** ఒక విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయుడు తాను బోధించే తరగతులకు సబ్జెక్టు వారీగా మొత్తం పాఠ్యాంశాలకు బోధించడానికి తయారు చేసుకునే ప్రణాళికను వార్షిక ప్రణాళిక అంటారు. విద్యా సంవత్సరంలో పాఠశాల పనిదినాలు 220. పాఠశాల సెలవు దినాలు, ఉపాధ్యాయుడు ఉపయోగించే సెలవు దినాలు పోను మిగిలినది దినాలు 160 ఉంటాయి. ప్రస్తుత పాఠ్య పుస్తకాలు 160 పనిదినాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించబడ్డాయి. వార్షిక ప్రణాళికలో ఒక తరగతి సంబంధించిన సబ్జెక్టు వారీగా సంవత్సరాంతానికి విద్యార్థుల ఏయే సామర్థ్యాలు సాధించాలి, ఒక్కొక్క పాఠానికి ఎన్ని పీరియడ్లు అవసరమవుతాయి, బోధనాభ్యసన సామగ్రి ఏమేమి అవసరము, నెలవారీగా నిర్వహించే అదనపు లేదా సహ పాఠ్యకార్యక్రమాలు, సామర్థ్యాల అభివృద్ధికి నిర్వహించే కార్యక్రమాలు, సి.సి.ఇ. సంబంధించిన వివరాలు వార్షిక ప్రణాళికలో పొందుపరచాలి.

T1FCHY

## వార్షిక ప్రణాళిక నమూనా

1. తరగతి : ఏ తరగతికి వార్షిక ప్రణాళిక వ్రాస్తున్నామో ఆ తరగతి రాయలి.
2. విషయం : తెలుగు
3. అవసరమైన పిరియడ్లు సంఖ్య :
   అ) మొత్తం పిరియడ్లు : 220
   ఆ) బోధనాభ్యసనకు అవసరమైన పిరియడ్లు : 160
4. పిల్లల్లో సాధించవలసిన సామర్థ్యాలు : తరగతి వారీగా సాధించవలసిన సామర్థ్యాలు పాఠ్యపుస్తకంలో ఇవ్వబడ్డాయి అవి వ్రాయాలి.
5. నెల వారీగా పాఠాల విభజన :

| నెల | బోధించవలసిన పాఠం | అవసరమైన పీరియడ్లు | బోధనా వనరులు/ సామగ్రి | నిర్వహించవలసిన కార్యక్రమాలు & సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| | | | | |

6. ఉపాధ్యాయుని ప్రతిస్పందన
7. ప్రధానోపాధ్యాయుని సలహాలు / సూచనలు.

## మాదిరి వార్షిక ప్రణాళిక

I. తరగతి : 4

II. విషయం : తెలుగు

III. అవసరమయ్యే పిరియడ్ల సంఖ్య :
   అ) మొత్తం పిరియడ్లు : 220
   ఆ) బోధనాభ్యసనకు అవసరమయ్యే పీరియడ్లు : 160

IV విద్యా సంవత్సరం పూర్తయ్యేసరికి సాధించవలసిన సామర్థ్యాలు

(1) వినడం, ఆలోచించి మాట్లాడడం

- గేయాలు, పాటలు, కథలు, సంభాషణలు మొదలైన వాటిని విని అర్థం చేసుకోవాలి. సారాంశాలను క్రమపద్ధతిలో సొంత మాటల్లో చెప్పగలగాలి.
- చర్చల్లో పాల్గొనాలి. తమ అభిప్రాయాలు చెప్పగలగాలి.
- చిన్న చిన్న ప్రసంగాలు చెయ్యాలి. తెలిసిన వాటి గురించి చెప్పగలగాలి.
- కారణాలు వివరించగలగాలి. సమర్థిస్తూ, విభేదిస్తూ మాట్లాడగలగాలి.

(2) ధారళంగా చదవడం, అర్థం చేసుకొని చెప్పడం, రాయడం.

- పద్యాలు, పాటలు, గేయాలు, కథలు, కథానికలు, వ్యాసాలు, సంభాషణలు, గేయకథలు వంటి ప్రక్రియ రూపాలను చదవగలగాలి, అర్థంచేసుకొని చెప్పగలగాలి.
- బాల సాహిత్యం, వార్తా పత్రికలు, సంచికలు (మేగజైన్స్) అపరిచిత అంశాలను చదవగలగాలి, అర్థం చేసుకోగలగాలి.
- ఇచ్చిన అంశం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడం, తప్పొప్పులు గుర్తించడం, అర్థాలు గ్రహించడం, శీర్షికలు నిర్ణయించడం, విషయాన్ని క్రమ పద్ధతిలో అమర్చడం వంటివి చేయగలగాలి.

(3) ఆలోచించి స్వంత మాటల్లో రాయడం (స్వీయరచన)

- పాఠ్యాంశాలలోని, పాత్రల గురించి, స్థలాల గురించి, సంఘటనలు, సారాంశాలు మొదలైన వాటిని సొంత మాటల్లో రాయగలగాలి.
- ఇచ్చిన అంశాన్ని వివరిస్తూ, సమర్థిస్తూ లేదా విభేదిస్తూ తమ అభిప్రాయములను తెలుపుతూ సొంత మాటల్లో 10 వాక్యాలు కాని; ఒకటి రెండు పేరాలు కాని రాయగలగాలి.
- ఊహించి లేదా తానే ఆ స్థానంలో ఉంటే ఏంచేస్తారో రాయగలగాలి. ఆయా సందర్భాలలో తమ అనుభవాల గురించి, చూసిన సంఘటనలు, పండుగలు, జాతరలు మొదలగు వాటి గురించి రాయగలగాలి.

(4) పదజాలం

- ఇచ్చిన పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించగలగాలి.
- సందర్భాన్ని బట్టి అర్థాలను, పర్యాయపదాలను, నానార్థాలను గ్రహించగలగాలి.
- పదపట్టికలు, గళ్ళనుడికట్టు వంటి భాషా క్రీడల ద్వారా సందర్భోచితంగా పదాలు రాయగలగాలి. పద్యాలను తయారుచేయగలగాలి.

(5) సృజనాత్మకత

- కథలు, కవితలు, గేయాలను పాడించగలగాలి, సొంతంగా రాయగలగాలి ఆత్మకథలు సూక్తులు, నినాదాలు, లేఖలు, సంభాషణలు రాయగలగాలి. నాటకీకరణ చేయగలగాలి.
- సూచనలకనుగుణంగా చిత్రాలను గీయగలగాలి, రంగులు వేయగలగాలి వాటిని గురించి రాయగలగాలి.
- మాస్కులు, ఆహ్వాన పత్రాలు, గ్రీటింగ్ కార్డులు తయారు చేయగలగాలి. మట్టితో బొమ్మలు చేసి వాటికి రంగులు వేయగలగాలి. వ్యర్థపదార్థాలతో బొమ్మలు చేసి వాటికి రంగులు వేయగలగాలి.

(6) ప్రశంస : తోటివారు, మహిళలు, ఇతర వర్గాలు, ఇతర సాంస్కృతిక; సాహిత్య సేవలు చేసిన వారిని వారి భాషా శైలిని ప్రశంసించగలగాలి.

(7) భాషను గురించి తెలుసుకుందాం : భాషా భాగాలను, కాలాలను, విరామ చిహ్నాలను ఉపయోగించగలగాలి. వాక్య నిర్మాణాన్ని, వాక్యాల దశలను గుర్తించగలగాలి. కాలానుగుణంగా క్రియలను ఉపయోగించగలగాలి.

| నెల | బోధించవలసిన పాఠం | పిరియడ్ల సంఖ్య | బోధనా వనరులు/ బోధనాభ్యసన సామగ్రి | నిర్వహించవలసిన కార్యక్రమాలు |
|---|---|---|---|---|
| జూన్ | వర్షాలు<br>పడవలు చేద్దాం<br>(చదువు ఆనందించు)<br>ఆణిముత్యాలు పద్యం–1 | 10<br>1<br><br>3 | – వర్ణమాల చార్టు<br>– గళ్ళ నుడికట్టు చార్టు<br>– 'వర్షాలు' పాఠ్యాంశములోని చార్టులు,<br>– కవి : వానమామలైవరదా చార్యుల చిత్రం గలచార్టు | – వర్షానికి సంబంధించిన చిత్రాలు, గేయాలు సేకరించడం.<br>– పిల్లలతో పడవలు చేయించడం. |
| జూలై | సూదికథ<br>బాల తిమ్మరుసు (కథ)<br>ఆణిముత్యాలు పద్యం–1<br>సరోజినినాయుడు (వ్యాసం)<br>(చదువు ఆనందించు) | 10<br>10<br>3<br>1 | ఉన్ముఖీకరణ చిత్రంగల చార్టులు<br>– పాఠంలోని చిత్రాల చార్టులు<br>– గుణింతాల చట్రంగల చార్టు<br>పరమానందయ్య శిష్యుల కథల పుస్తకం. | హాస్యకథలను సేకరించడం.<br>చిత్రాలకు రంగులు వేయడం.<br>– పిల్లలతో చిన్న చిన్న కథలు రాయించడం. గోడపత్రికలో ప్రదర్శించడం.<br>1వ నిర్మాణాత్మక మూల్యాంకనం |
| ఆగస్టు | చిన్నారి కల(కథనం)<br>జాతీయజెండా (గేయం)<br>ఆణిముత్యాలు పద్యం–3<br>రంజాన్ వ్యాసం<br>(చదువు, ఆనందించు) | 10<br>10<br>3<br><br>1 | పాఠ్యాంశాలలోని ఉన్ముఖీకరణ చిత్రాల చార్టులు.<br>జెండా పాటలు,<br>ద్విత్వాక్షరాలు గలచార్టు<br>గళ్లనుడి కట్టు గల చార్టు<br>దేశ భక్తుల చిత్రాలు | దేశభక్తి పాటలపోటీ.<br>గేయాన్ని పొడిగించడంలో పోటీ<br>కాగితం సంచుల తయారీ ప్రదర్శన.<br>కవర్లు తయారీ ప్రదర్శన<br>2వ నిర్మాణాత్మక మూల్యాంకనం. |
| సెప్టెంబరు | వినాయకచవితి (వ్యాసం)<br>ఎలుక విందు (గేయం)<br>ఆణిముత్యాలు పద్యం –4<br>తెలుగు సంవత్సరాలు<br>(చదువు ఆనందించు) | 10<br>8<br>3<br>1 | పాఠ్యాంశలలో గల ఉన్ముఖీకరణ చిత్రాల చార్టులు,<br>పాఠ్యాంశాలలోని చార్టులు,<br>దాశరథి కృష్ణమాచార్యుల చిత్రం<br>వేమన, సుమతి | ఉపాధ్యాయ దినోత్సవం<br>వినాయక మట్టి బొమ్మలు.<br>వినాయకుని గురించి పాటల పోటీ<br>వివిధ పండుగలనిర్వహణపై ప్రాజెక్టు పని<br>సుమతి, వేమన శతక పద్యాలను శతక పుస్తకాలు సేకరించడం<br>1వ సంగ్రహణాత్మక మూల్యాంకనం<br>ప్రశ్నాపత్రం తయారీ |

V ఉపాధ్యాయుడి ప్రతిస్పందన:

నెలవారీగా పూర్తి చేసిన పాఠాలు, నిర్వహించిన కార్యక్రమాల ఆధారంగా ఉపాధ్యాయులు తమ ప్రతిస్పందన రాయాలి.

VI ప్రదానోపాధ్యాయుడి సలహాలు, సూచనలు:

ప్రధానోపాధ్యాయుడు నెలవారీగా నిర్వహించే సమీక్షా సమావేశంలో ఇచ్చిన సలహాలు, సూచనలు నమోదు చేయాలి.

## పాఠ్య ప్రణాళిక

భాషా బోధనలో ఒక్కొక్క పాఠాన్ని ఒక యూనిట్‌గా బోధించవలసి ఉంటుంది. ఒకపాఠం మొత్తం బోధించడానికి ఎన్ని పీరియడ్లు అవసరమవుతాయో దృష్టిలో పెట్టుకొని వ్రాసే ప్రణాళికను పాఠ్య ప్రణాళిక అంటారు. దీనినే యూనిట్ ప్రణాళిక అనికూడా అంటారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు బోధించడానికి ప్రతిరోజు 90 ని॥లు కాలక్రమ పట్టిక (TIME TABLE) లో కేటాయించబడింది. మొదటి 45 ని॥లలో ఉపాధ్యాయుడు బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. రెండవ 45 ని॥లలో ఆరోజు బోధించిన అంశాల ఆధారంగా అభ్యాసం కల్పించాలి. పాఠ్య ప్రణాళిక వ్రాయడానికి ముందు ఉపాధ్యాయుడు ఏ పాఠం బోధించాలి? ఎలా భోధించాలి ? పాఠం ద్వారా పిల్లల్లో సాధించవలసిన సామర్థ్యాలు ఏమిటి? ఈ సామర్థ్యాల సాధనకు ఎటువంటి అభ్యసన కృత్యాలు నిర్వహించాలి ? ఎన్ని పిరియడ్లు బోధించాలి మున్నగునవి ముందుగానే ఆలోచించుకొని ప్రణాళిక తయారు చేసుకోవాలి. ప్రస్తుత పాఠ్య పుస్తకాలు సామర్థ్యాల ఆధారంగా రూపొందించబడ్డాయి కాబట్టి దానికి అనుగుణంగా పాఠ్యప్రణాళిక ఈ క్రింది సోపానాలతో ఇవ్వబడింది.

### పాఠ్య ప్రణాళిక – నమూనా

1. విషయం : తెలుగు
2. తరగతి : 4
3. పాఠం పేరు : వర్షాలు
4. పాఠం బోధించడానికి అవసరమైన పిరియడ్లు : 10
5. పాఠం ద్వారా పిల్లల్లో సాధించవలసిన సామర్థ్యాలు. : ఈ పాఠం ద్వారా పిల్లల్లో సాధించవలసిన సామర్థ్యాలు వ్రాయాలి.
6. పిరియడు వారీగా విభజన ప్రణాళిక : పాఠాన్ని పూర్తిచేయడానికి అవసరమైన పిరియడ్లను దృష్టిలో పెట్టుకొని పీరియడు వారీగా, ఈక్రింది పట్టికలో నమోదుచేయాలి.

| పిరియడు సంఖ్య | మొదటి 45 ని॥లలో బోధించవలసిన అంశం | బోధనా వ్యూహాలు/ /అభ్యసన అనుభవాలు | బోధనాభ్యసన సామగ్రి | రెండవ 45 ని॥లలో పిల్లలకు కల్పించే అభ్యాసం. |
|---|---|---|---|---|
| | | | | |

## మాదిరి పాఠ్య ప్రణాళిక

I విషయం : తెలుగు

II తరగతి : 4

III పాఠం పేరు : వర్షాలు (గేయం)

IV పాఠం బోధించడనికి అవసరమైన పిరియడ్ల సంఖ్య : 10

V పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు :

(1) వినడం–ఆలోచించి మాట్లాడం: గేయాన్ని రాగంతో పాడి అభినయిస్తారు. సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలుగుతారు. కవిగేయం ద్వారా ఏమి చెప్పాడో పిల్లలు గ్రహిస్తారు.

(2) ధారాళంగా చదవడం – అర్థం చేసుకొని చెప్పడం: గేయాన్ని ధారాళంగా చదవగలుగుతారు. గేయంలోని భావాన్ని అర్థం చేసుకొని పదాలను వరుస క్రమంలో పెడతారు. గేయంలోని ప్రాస పదాలు గుర్తిస్తారు. గేయ పంక్తులను సరిచేసి రాస్తారు.

(3) ఆలోచించి సొంత మాటల్లో రాయడం: గేయ సారాంశాన్ని స్వంత మాటల్లో చెబుతారు/రాస్తారు. ప్రశ్నలకు జవాబులు సొంత మాటల్లో రాస్తారు.

(4) పదజాలం: పదాలకు అర్థాలు గ్రహించి సందర్భోచితంగా ఉపయోగిస్తారు.

(5) సృజనాత్మకత: ప్రకృతి అందాన్ని వర్ణిస్తారు. పాఠం ఆధారంగా వర్షాన్ని ఆనందిస్తూ కవిత రాస్తారు.

(6) ప్రశంస: ప్రకృతి అందాన్ని ప్రశంసిస్తారు.

(7) భాషను గురించి తెలుసుకుందాం: వర్ణమాల చార్టులోని తెలియని అచ్చులను, హల్లులను గుర్తిస్తారు.

VI పీరియడువారీగా విభజన ప్రణాళిక.

| పిరియడ్ | బోధనాంశం/ సామర్థ్యం | బోధనా వ్యూహాలు/అభ్యసన అనుభవాలు | బోధనాభ్యసన సామాగ్రి | పిల్లలకు రెండవ 45ని॥లో కల్పించేఅభ్యసనం |
|---|---|---|---|---|
| 1వ పిరియడ్ | | 1. ఉపోద్ఘాతం<br>– పలకరింపు<br>– ఉన్ముఖీకరణం చిత్రం గురించి పిల్లలతో మాట్లాడించాలి<br>– శీర్షికా ప్రకటన<br>– నేపధ్యం<br>– కవి పరిచయం<br>2. పాఠ్యాంశ బోధన చర్చ – అవగాహన<br>– వర్షాలు గేయం పాడడం<br>– గేయాన్ని పిల్లలతో పాడించడం<br>3. అవగాహన, పరిశీలన<br>– కవి పరిచయం, నేపధ్యం గురించి ప్రశ్నించడం | ఉన్ముఖీకరణ చిత్రం చార్టు<br>– గేయంచార్టు | ఉన్ముకరణ చిత్రం ఆధారంగా పదాలు, వాక్యాలు రాయడం చిత్రంలోని పిల్లల గురించి రాయండం. |
| 2వ పిరియడ్ | | – పలకరింపు<br>– పునశ్చరణ<br>– పిల్లలు పాడడం<br>– ఉపాధ్యాయుడు గేయాన్ని రాగయుక్తంగా పాడడం.<br>– పిల్లలతో పాడించడం<br>– పాఠం చిత్రం గురించి మాట్లాడడం<br>– సంభాషణలు చెప్పించడం<br>– పిల్లల బాహ్య పఠనం<br>– ఉపాధ్యాయుడి ఆదర్శపఠనం<br>– తెలియని పదాల క్రింద గీత గీయడం, (పదాల పట్టిక చూడడం అర్థాలు తెలుసుకోవడం)<br>– ఉపాధ్యాయుడి అర్థ వివరణ<br>– పిల్లలతో సొంత వాక్యాలు చెప్పించడం | – నిఘంటువు<br>– పాఠ్యపుస్తకం | – పదాలకు అర్థాలు వ్రాసి సొంత వాక్యాలు రాయడం<br>– పాఠం చిత్రం ఆధారంగా పదాలు, వాక్యాలు రాయడం.<br>– చిత్రంలోని పిల్లలు ఏం చేస్తున్నారో రాయడం. |

| పిరియడ్ | బోధనాంశం/సామర్థ్యం | బోధనా వ్యూహాలు/అభ్యసన అనుభవాలు | బోధనాభ్యసన సామాగ్రి | పిల్లలకు రెండవ 45ని॥లో కల్పించేఅభ్యసనం |
|---|---|---|---|---|
| 3వ పిరియడ్ | పాఠ్యబోధన గేయంలో మొదటి రెండు చరణాలు "వచ్చెను వచ్చెనుండి "కర్రల నోళ్ళకు చనుబాల" వరకు | – ఉపాధ్యాయుడు గేయాన్ని పాడడం<br>– పిల్లలతో పాడించడం<br>– పిల్లల బాహ్యపఠనం<br>– ఉపాధ్యాయడి ఆదర్శ పఠనం<br>– పాఠ్య విషయంపై చర్చ<br>– అవగాహన<br>– ఆలోచింప చేసే ప్రశ్నలు అడగాలి<br>– వసుధారాణికి తలంబ్రాలు అంటే ఏమిటి? | గేయం చార్టు<br>గేయానికి సంబంధించిన చార్టు<br>గేయం చార్టు | చదవడ,అర్థం చేసుకొనే అభ్యాసం<br>– గేయం ఆధారంగా ప్రశ్నలను జవాబులను రాయడం<br>– మొదటి రెండు చరణాల సారాంశాన్ని రాయడం<br>– చదవడం, అర్థం |
| 4వ పిరియడ్ | గేయంలోని 3,4 చరణాలు "కోడె నాగులై" నుండి "నాట్యం సలిపింది" వరకు | – ఉపాధ్యాయుడు పాడడం పిల్లలు పాడడం, అభినయించడం.<br>– పిల్లల బాహ్య పఠనం<br>– పిల్లల మౌన పఠనం<br>– పాఠ్య విషయంపై చర్చ<br>– ఆలోచింప చేసే ప్రశ్నలు అడగాలి.<br>– తోగులు అంటే అర్థం ఏమిటి?<br>– పచ్చిక కోకలు అంటే ఏమిటి? | గేయం భాగం సన్నివేశంనకు సంబంధించిన చిత్రం గల చార్టు<br>గేయం చార్టు | చేసుకొనే అభ్యాసం.<br>– గేయం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడం<br>– 3,4 చరణాల సారాంశం రాయడం.<br>– చదవడం,అర్థం |
| 5వ పిరియడ్ | మిగిలిన రెండు చరణాలు "ఆరవేసిన చీరల" నుండి "పాలికాలుండయ్యో" వరకు ఇంటిపనిగా ప్రాజెక్టు పనిఇవ్వడం వినడం, ఆలోచించి | – ఉపాధ్యాయుడు పాడడం పిల్లలు అభినయించడం<br>– పిల్లలు బాహ్య పఠనం<br>– ఉపాధ్యాయుడి ఆదర్శపఠనం<br>– పిల్లల మౌన పఠనం<br>– పాఠ్య విషయంపై చర్చ అవగాహన.<br>– పడమటి గట్లను మేసిందెవరు? | గేయంలోని మిగిలిన చరణాలకు సంబంధించిన చిత్రం గల చార్టు<br>అడిగినప్రశ్నలకు | చేసుకునే అభ్యాసనం<br>– గేయం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడం<br>– 5,6 చరణాల సారాంశం రాయడం.<br>పుస్తకంలోని వినడం, |
| 6వ పిరియడ్ | చెప్పడం, ధారాళంగా చదవడం, అర్థం చేసుకొనిచెప్పడం రాయడం, అభ్యాసాల సాధన | – వర్షాలు పడకపోతే ఏమవుతుంది?<br>– వర్షం పడినపుడు ఎలా ఉంటుంది?<br>– వర్షం పడినపపుడు మీరేమి చేస్తారు.<br>ఇలా గేయానికి సంబంధించిన ఒక్కొక్క ప్రశ్న పిల్లలను అడగాలి | జవాబులు నల్లబల్లపై రాయడం | ఆలోచించి చెప్పడం, అర్థం చేసుకొని చెప్పడం, రాయడం లోని అభ్యాసాలు చేయించడం.<br>ం |

| పిరియడ్ | బోధనాంశం/సామర్థ్యం | బోధనా వ్యూహాలు/అభ్యసన అనుభవాలు | బోధనాభ్యసన సామాగ్రి | పిల్లలకు రెండవ 45ని॥లో పిల్లలకు రెండవ |
|---|---|---|---|---|
| 7వ పిరియడ్ | ఆలోచించి సొంత మాటల్లో రాయడం (స్వీయరచన) | - పాఠ్య పుస్తకంలోని ప్రశ్నలను పిల్లలతో చర్చించాలి. సమాధానాలను చెప్పించాలి.<br>- రైతును దేశానికి వెన్నుముక అంటారు కదా? ఎందుకు?<br>- వానపడ్డప్పుడు వీధులు ఎలా ఉంటాయో వర్ణించండి. వంటి ప్రశ్నలు పిల్లలదరితో చెప్పించాలి. వ్యక్తిగతంగా జవాబులు రాయాలి.<br>- పిల్లలు రాసిన సమాధానాలు చార్టు/ నల్లబల్లపై రాయాలి.<br>- వాక్య దోషాలు, భావదోషాలు అక్షర దోషాలు–చర్చద్వారా సరిదిద్దాలి. | చార్టు,స్కేలు, స్కెచ్‌పెన్ ప్రశ్నలు నల్లబల్లపై రాయాలి. | - ఆలోచించి సొంతమాటల్లో రాయడం. అభ్యాసంలోని ప్రశ్నలకు జవాబులు రాయడం.<br>1. వాన కురిసేటప్పుడు ఎలా ఉంటుందో పిల్లలతో రాయించడం.<br>2. గేయ సారాంశాన్ని సొంత మాటల్లో రాయించడం |
| 8వ పిరియడ్ | ప్రాజెక్టు పని ప్రదర్శన పదజాలం సామర్థ్యానికి సంబంధించిన కృత్యాలు | - పిల్లలు రాసిన ప్రాజెక్టు పని నివేదికను చదివించడం.<br>- సరిదిద్దడం.<br>- పదజాలంలోని అభ్యాసాలను చేయించడం.<br>- సరిదిద్దడం. | 'పదజాలం' కృత్యాలకు సంబంధించిన కృత్యపత్రాలు | ప్రాజెక్టు పని నివేదిక తయారు చేయడం –పాఠ్యపుస్తకంలో పదజాలం అభ్యాసాలు |
| 9వ పిరియడ్ | సృజనాత్మకత, ప్రశంస కు సంబంధించిన కృత్యాలు | - వివిధ రంగాలలో కష్టపడి పనిచేసే వారిని గురించి చర్చ. | నల్లబల్లపై గేయాన్ని పొడిగించి రాయడం చార్టుపై రాయడం | - సృజనాత్మకత అభ్యాసాలు రాయడం. ప్రశంసలో అభ్యాసాలకు జవాబులు రాయడం. |
| 10వ పిరియడ్ | భాషను గురించి తెలుసుకుందాం. | - అచ్చు అక్షరాల,హల్లు అక్షరాలు గురించి ప్రశ్నించడం, గుర్తింప జేయడం.<br>- చ,జ,అ అక్షరాల పదాలను గుర్తింప జేయడం.<br>- చ,జ,ర అక్షరాలకు గల తేడాలు పరిశీలింప చేయడం.<br>- నేనివి చేయగలనా? వ్యక్తిగతంగా ఎంత మంది చేయగలరో, చేయలేని వారిని గుర్తించడం. | వర్ణమాల చార్టు | - భాషను గురించి తెలుసుకోవడం అభ్యాసాలు రాయడం.<br>- 'నేనివి చేయగలనా' లో వెనుకబడిన పిల్లలకు పునరభ్యాసం కల్గించడం. |

## పీరియడు ప్రణాళిక

ఉపాధ్యాయుడు పాఠం బోధించడానికి ముందే యూనిట్ పథకాన్ని లేదా పాఠ్య ప్రణాళిక తయారు చేసుకొని తగిన బోధనాభ్యసన సామాగ్రిని సిద్ధపరచుకోవాలి. పాఠ్య ప్రణాళికకు అనుగుణంగా పిరియడు ప్రణాళికలను తయారు చేసుకోవలసి వుంటుంది. ఒక పీరియడులో బోధించే పాఠ్యాంశ భాగమునకు రాసుకునే ప్రణాళికను పీరియడు ప్రణాళిక లేదా కాలాంశ ప్రణాళిక అంటారు. దీనినే ఉప అంశ ప్రణాళిక అని కూడా పిలువవచ్చు. ప్రతి పీరియడులో ఏమి బోధించాలి? ఏయే సామర్థ్యాలు సాధించాలి ? ఏయే కృత్యాలు నిర్వహించాలి. కృత్యాల నిర్వహణకు అవసరమైన బోధనా వనరుల లేదా బోధనాభ్యసన సామగ్రి, పిల్లల ప్రతిస్పందన, అవగాహన పరిశీలన వంటి అంశాలలో సవివరంగా కాలాంశ ప్రణాళికలో రాసుకోవాలి.

**పీరియడు ప్రణాళిక – సోపానాల వివరణ**

| | | | |
|---|---|---|---|
| I | విషయం | : | |
| II | తరగతి | : | |
| III | పాఠంపేరు | : | ఏ పాఠాన్ని బోధిస్తున్నారో ఆ పాఠం పేరు రాయాలి. |
| IV | పిరియడు సంఖ్య | : | పాఠ్య ప్రణాళిక ప్రకారం ఆ రోజు ఏ పిరియడు బోధిస్తే ఆ పీరియడు వ్రాయాలి. |
| V | సమయం | : | 45 ని॥లు |
| VI | బోధనాంశం/సామర్థ్యం | : | పాఠ్య ప్రణాళిక ననుసరించి బోధనాంశం, సామర్థ్యం, కృత్యం వ్రాయాలి.<br>ఉదా: ఉన్మీలీకరణ చిత్రం గురించి మాట్లాడించడం. |
| VII | సాధించాల్సిన సామర్థ్యాలు | : | ఈ పీరియడు ద్వారా ఏయే సామర్థ్యాలు సాధించాలో వాటిని రాయాలి. |
| VIII | ఎ) మొదటి 45 ని॥లలో<br>బోధనా వ్యూహాలు/సోపానాలు | :<br>: | ఈ పీరియడు బోధనాంశమునకు సంబంధించిన<br>సోపానాలు, కృత్యాల నిర్వహణ ఈ క్రింది పట్టికలోరాయాలి. |

| సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు/ అనుభవాలు | నల్లబల్లపని | బోధనాభ్యసన సామాగ్రి వనరులు |
|---|---|---|---|
| | | | |

1వ గడిలో సోపానాలు రాయాలి ఉదా: ఉపోద్ఘాతం, 2) చర్చ–అవగాహన లేదా సామర్థ్యాలు 3) ప్లిలల అవగాహన పరిశీలన.

2వ గడిలో 1వ గడిలోని సోపానానికి అనుగుణంగా బోధనాభ్యసన ప్రక్రియలు సవివరంగా రాయాలి.

3వ గడిలో ఆరోజు బోధించే బోధనాంశానికి సంబంధించి కీలక పదాలు, పదజాలం వంటివి నల్లబల్లపై రాయాలి.

4వ గడిలో – ఆ పిరియడులో బోధనాంశమునకు సంబంధించి అభ్యసన కృత్యాల నిర్వహణకు అవసరమైన బోదనాభ్యసన సామగ్రి రాయాలి.

VIII బి) పిల్లల–అవగాహన /పరిశీలన (మూల్యాంకనం) : మొదటి 45 నిమిషాలలో బోధించిన అంశంపై పిల్లలు ఎంత అర్థం చేసుకున్నారో అవగాహనకు సంబంధించిన ప్రశ్నలు అడగాలి.

రెండవ 45 నిమిషములలో కల్పించే అభ్యాసాలు, ఉపాధ్యాయుడి ప్రతిస్పందన (తన అనుభవాలు, పిల్లల భాగస్వామ్య ప్రతిస్పందన, వంటి వివరాలు) రాసుకోవాలి.

**మాదిరి పిరియడు ప్రణాళిక (కాలాంశ ప్రణాళిక)**

| | | | |
|---|---|---|---|
| I | విషయం | : | తెలుగు |
| II | తరగతి | : | 4 |
| III | పాఠంపేరు | : | వర్షాలు |
| IV | పిరియడు సంఖ్య | : | 1 |
| V | సమయం | : | 45 ని॥లు (ప్రతిరోజు భాషకు కేటాయించిన 90 ని॥లలో మొదటి 45 ని॥లు) |
| VI | బోధనాంశం | : | ఉన్ముఖీకరణ చిత్రం గురించి మట్లాడించడం. |

VII సాధించాల్సిన సామర్థ్యాలు :

| | | | |
|---|---|---|---|
| (1) | వినడం–ఆలోచించి మాట్లాడడం | : | ఉన్ముఖీకరణ చిత్రం గురించి స్వేచ్ఛగా మాట్లాడతారు.<br>గేయాన్ని రాగయుక్తంగా పాడతారు, అభినయిస్తారు. |
| (2) | పదజాలం | : | చిత్రం గురించి సొంత పదాలలో చెబుతారు.<br>సొంత వాక్యాల్లో ఉపయోస్తారు. |
| (3) | స్వీయ రచన | : | వాన కురిసేటప్పుడు ఎలా ఉంటుందో రాస్తారు. |

VIII ఎ) బోధనాభ్యసన ప్రక్రియలు : బోధనా సోపానాలు.

| సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు/ అనుభవాలు | నల్లబల్లపని | బోధనాభ్యసన సామాగ్రి/వనరులు |
|---|---|---|---|
| ఉపోద్ఘాతం<br>1) పలకరింపు<br>2) ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడించడం | పిల్లల్లో/శుభోదయం – బాగున్నారా! అంటూ పలకరించాలి.<br>పాఠంలో ఉన్ముఖీకరణ చిత్రం గురించి మట్లాడించడం.<br>పిల్లలూ! (ఉన్ముఖీకరణ చిత్రం చార్టు) చార్టులోని చిత్రాన్ని చూడండి. చిత్రంలో ఎంతమంది ఉన్నారు?<br>ఎవరెవరు ఉన్నారు?<br>పిల్లలు ఏం చేస్తున్నారు ?<br>– మీరెప్పుడైనా ఇలా చేశారా?<br>– వర్షం పడుతుంటే మీరేం చేస్తారు ?<br>– వానా వానా వల్లప్పా గేయం వచ్చా ?<br>– వస్తే పాడండి ?<br>– చిత్రంలోని పిల్లలు ఎలా ఉన్నారు ?<br>ఒక్కొక్కరిని అడిగి వారితో మాట్లాడించడం. | పిల్లలు చెప్పిన సమాధానాలు ఉపాధ్యాయుడు నల్లబల్లపై రాయడం. | ఉన్ముఖీకరణ చిత్రం చార్టు. |
| 3) శీర్షికా ప్రకటన | – వర్షాన్ని గురించి మీ అనుభవం చెప్పండి ?<br>పిల్లలు వర్షంలో వారి అనుభవాలు చెబుతారు.<br>(ఈ ప్రశ్నలే కాకుండా సందర్భోచితంగా ప్రశ్నలు అడగాలి)<br>ఎన్ని ఎక్కువ ప్రశ్నలు అడిగితే అన్ని ప్రశ్నలకు వారు చెప్పగలిగిన జవాబులు చెబుతారు.<br>– వర్షాన్ని గురించి పిల్లలు మాట్లాడిన తరువాత అందుకు సంబంధించిన గేయ శీర్షికను ప్రకటించడం. | పిల్లలు చెప్పిన సమాధానాలు ఉపాధ్యాయుడు నల్లబల్లపై రాస్తాడు. | |
| 4) నేపథ్యం | భూమి, చెట్లు, కొండలు, మంచు, ఎండ, నీరు, ఏరు, నది, వంటి వాటితో ప్రకృతి నిండి ఉంటుంది.<br>ప్రకృతి అందాన్ని అనుభవించాలి. వర్షాలు వచ్చినపుడు ప్రకృతి ఎంత అందంగా ఉంటుందో వర్ణిస్తూ ఈ గేయం ద్వారా నేర్చుకుంటారు. | వర్షాలు | |
| 5) కవి పరిచయం | వర్షాలు అనే గేయాన్ని రచించిన కవి. "శ్రీ వానమామలై వరదాచార్యులుగారని తెలుసుకుంటారు. | వానమామలై వరదాచార్యులు | వానమామలై వరదాచార్యులు చిత్రం |
| II పాఠ్యాంశంపై చర్చ – అవగాహన | పిల్లలూ! 'వర్షాలు' గేయాన్ని మీరెవరైనా పాడతారా?<br>పాడండి చూద్దాం? మీకు వచ్చినట్లు పాడండి.<br>పిల్లలు పాడతారు మిగిలినవారు వింటారు. | | |
| 2) ఉపాధ్యాయుడు పాడడం | పిల్లలూ ! నేనీ గేయాన్ని రాగయుక్తంగా లయ బద్ధంగా పాడి వినిపిస్తాను వినండి. | | |
| 3) పిల్లలతో పాడించడం | (ఉపాధ్యాయుడు పాడతాడు, పిల్లలు వింటారు).<br>పిల్లలూ ! గేయాన్ని పాడగా విన్నారు గదా! ఇప్పుడు మీరు అలాగే పాడండి. (ఉపాధ్యాయుడు పిల్లలతో పాడిస్తాడు) | | |
| 4) చిత్రం ఆధారంగా సంభాషణలు | పిల్లలూ ! చిత్రాన్ని చూచి జవాబులు చెప్పారు కదా ! వర్షంలో ఆడుకుంటున్న పిల్లలు ఏం మట్లాడుకుంటున్నారో ఊహించి ఇద్దరు పిల్లలు వచ్చి చెప్పండి. | పిల్లల సంభాషణలు నల్లబల్లపై రాయాలి | |

VIII బి) పిల్లల అవగాహన – పరిశీలన (మూల్యాంకనం)

పిల్లలూ ! మీరు గేయాన్ని చక్కగా పాడారు. ఇప్పుడీ గేయం గురించి కొన్ని ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

1. గేయాన్ని విన్నప్పుడు మీ కేమనిపించింది?
2. ఇలాంటి గేయాలు ఏయే సందర్భాలలో పాడతారు.
3. గేయాన్ని రాసింది ఎవరు ?
4. వర్షం కురిసినపుడు ఎలా ఉంటుందో తెల్పండి ?
5. మీరు పాడిన వర్షాలు గేయం ఎవరు బాగా పాడారు.

UAR1KA

IX రెండవ 45 ని॥లలో పిల్లలకు ఆయా సామర్థ్యాలపై అభ్యాసం కల్పించాలి. ఆయా సామర్థ్యాలకు సంబంధించిన అభ్యాసాలు నిర్వహించాలి.

X ఉపాధ్యాయుడి ప్రతిస్పందన :

– 90 నిముషములు పూర్తయిన పిదప తన అనుభవాలు, అనుభూతులు పిల్లల ప్రతిస్పందన, భాగస్వామ్యం – ప్రగతి గురించి రాయాలి.

> ఎలా అయితే శరీర రక్షణ ద్వారా శరీరం ధృడపడుతుందో, శిక్షణ ద్వారా బుద్ధి పదునెక్కుతుందో, ఆత్మ వికాసం కూడా దానికి తగ్గ అభ్యాసాన్నివ్వడం ద్వారానే సాధ్యపడుతుంది.

## 6.3 మదింపు మరియు మూల్యాంకనం నిర్వచనం, ఆవశ్యకత మరియు ప్రాముఖ్యత

ఒక పనిని చేసిన తరువాత ఆ పని ఎంతవరకు ఫలవంతమైనదో పరిశీలించుకోవాలి. తరగతి గదిలో ఉపాధ్యాయుడు తాను బోధించిన అంశాన్ని విద్యార్థులు ఎంతవరకు గ్రహించారో తెలుసుకోవాలి. తాను ఆశించిన సామర్థ్యాలు పిల్లల్లో ఎంత వరకు సాధించగలిగాడో పరీక్షించుకోవాలి. ఒకవేళ సాధించలేక పోయినట్లయితే వాటికి కారణాలు కనుగొని బోధనా విధానాన్ని మార్చుకొని తన బోధనను నిర్వహిస్తాడు. దీనినే పరిగణనం లేదా మదింపు అంటారు. మూల్యాంకనం అని కూడా వ్యవహరిస్తారు. ఒక దాని కంటే ఒకటి విశాల పరిధి కలది. ప్రతీది తన పరిధిలో పిల్లల అభ్యసన ఫలితాలు అంచనా వేసేవే!

పాఠశాలల్లో జరిగే బోధనాభ్యసన ప్రక్రియలను ప్రారంభించడానికి ముందే లక్ష్యాలను నిర్ధేశించుకోవాలి. లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని బోధనాభ్యసన కృత్యాలు నిర్వహించాలి. లక్ష్యాలను, బోధనాభ్యసన కృత్యాల ఆధారంగా విద్యార్థులను పరీక్షించాలి. విద్యార్థులు బోధనా అభ్యసన అనుభవాల ద్వారా నేర్చుకుంటారు. అభ్యసన ప్రవర్తన ద్వారా బహిర్గతమవుతుంది. కాబట్టి తొలి ప్రవర్తన + ప్రవర్తనా మార్పు = అంతిమ ప్రవర్తన.

కావున బోధనాభ్యసన ప్రక్రియలు లేదా అనుభవాల ద్వారా వచ్చే ఫలితాలను అంచనా వేయడమే మూల్యాంకనం మదింపు మరియు మూల్యాంకనం దాదాపుగా ఒకటే. ఒకే భావనకు చెందినవి. కాని మదింపు కంటే మూల్యాంకనం సమగ్రమైనది. మరింత విస్తృతమైనది. విశిష్టమైనది. బోధనాభ్యసన ప్రక్రియలో పిల్లలకు తెలియకుండానే వారి సామర్థ్యాలను పరీక్షించడం మదింపు. అదొక నిరంతర ప్రక్రియ. ఒక అంశానికి సంబంధించి బోధనాభ్యసన ప్రక్రియ పూర్తయిన తరువాత దాని ఫలితానికి సంబంధించిన పరీక్ష నిర్వహించడం మూల్యాంకనం –మదింపు నిరంతరం సమగ్ర మూల్యాంకనంలో అంతర్భాగమై అభ్యసన మూల్యాంకనంగా ఉంటుంది. మూల్యాంకనం నిరంతర సమగ్ర మూల్యాంకనంలో పిల్లల ప్రగతి గురించి అంచనా వేసేదిగా ఉంటుంది. నిర్మాణాత్మక మూల్యాంకనముకు మదింపుగా సంగ్రహణాత్మక మూల్యాంకనంను మూల్యాంకనంగా పరిగణించవచ్చు. మదింపు ఒక కోణానికి సంబంధించినది మాత్రమే. కాని మూల్యాంకనం బహుముఖం.


| విద్య వ్యక్తికి అర్థవంతమైన జీవితాన్నిచ్చే కార్యక్రమం – ఎన్.సి.ఎఫ్. 2005 |
|---|

**మూల్యాంకనం ఆవశ్యకత మరియు ప్రాముఖ్యత**

ఇంతకు ముందు అమలులో ఉన్న పరీక్షా విధానం కేవలం జ్ఞానాన్ని మాత్రమే పరీక్షించేదిగా ఉండేది. చదివిన విషయాలు కొన్ని గుర్తుకు తెచ్చుకొని వ్రాయడం మాత్రమే జరిగేది. పోలికలు, ఉదాహరణలు, అనుప్రయుక్తం, రసానుభవం, సృజనాత్మకత మొదలైన వివిధ భాషా సామర్థ్యాలు పరీక్షించడానికి అవకాశం లేకుండా ఉండేది. భాషా వ్యాసంగాలలో కేవలం లిఖిత చర్య మాత్రమే పరీక్షించేదిగా ఉండేది. మిగిలిన భాషా సామర్థ్యాలను పరీక్షించడానికి వీలుగా లేదు. కాబట్టి రాత పరీక్షలోని పలు లోపాలు సవరించడానికి, విద్యార్థి మూర్తిమత్వాన్ని సరిగా అంచనా వేయడానికి, శాస్త్రీయంగా ఫలితాలు విశ్లేషించడానికి ఆధునిక మూల్యాంకన విధానం ప్రవేశపెట్టబడింది. మన రాష్ట్ర ప్రభుత్వం 1971వ సంవత్సరంలో పాఠశాలల్లో పరీక్షల ఫలితాల ఆధారంగా పిల్లలను తప్పించే పద్ధతిని రద్దు చేసింది. దీన్నే నాన్‌డిటెన్షన్ పద్ధతి అంటారు.

మూల్యాంకనం అనగానే పరీక్షలు నిర్వహించడం అనేది అందరి భావన. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమాజం మొత్తం మూల్యాంకనాన్ని పరీక్షల కోణంలోనే చూస్తున్నారు. పరీక్షలంటే పాఠ్యపుస్తకంలో ఇచ్చిన సమాచారాన్ని బట్టీ పట్టించి రాయించడమే అనే భావన ధృడంగా నాటుకుపోయింది. పిల్లల ప్రగతిని మాపనం చేయడానికి ఉపయోగించే మార్కులు, గ్రేడులు, ర్యాంకులు, పిల్లలపై నిరంతరం ఒత్తిడి కల్గిస్తున్నాయి. మార్కుల సాధనయే ధ్యేయంగా తల్లిదండ్రులు ఈ విధానాన్ని ప్రోత్సహిస్తున్నారు.

ఇప్పుడు అమలులో ఉన్న సామర్థ్యాధారిత బోధనలో దీని ప్రాముఖ్యత పెరిగింది. సామర్థ్యధారిత మూల్యాంకనం నిర్వహించాలి. ఉపాద్యాయులు కనీస అభ్యసన స్థాయిలను భాషా సామర్థ్యాలను సమగ్రంగా అవగాహన చేసుకొని తగిన బోధనా వ్యూహాలతో ఆశించిన సామర్థ్యాలు, అభ్యసన ఫలితాలు సాధించి సామర్థ్యాధారిత మూల్యాంకనం చేయాలి. ఉపాధ్యాయులు అభ్యసనానికి మూల్యాంకనానికి ఉన్న సంబంధాన్ని గుర్తించాలి.




ప్రస్తుతం మనం అనుసరిస్తున్నది సామర్థ్యాధార బోధన మరియు అభ్యసనం. ఇప్పటి పాఠ్యపుస్తకాలు భాషా సామర్థ్యాల ప్రాతిపదికన రూపొందించబడ్డాయి. వివిధ సామర్థ్యాల సాధన కోసం ఉపాధ్యాయులు వివిధ బోధనాభ్యసన ప్రక్రియలు కల్పిస్తారు. బోధనాభ్యసన ప్రక్రియలు ఎంత ప్రభావవంతంగా ఉంటే పిల్లల్లో సామర్థ్యాలు అంత బాగా వృద్ధి చెందుతాయి. కాబట్టి నేటి తెలుగు వాచకాల ద్వారా భాషా సామర్థ్యాలు సాధించే కృషిచేయాలి. మూల్యాంకనాన్ని బోధనాభ్యసనంలో భాగంగా తగిన విధంగా బోధన చేసి భాషా సామర్థ్యాలు విద్యార్థులలో పెంపొందించాలి.

పిల్లలు భయంతో చదువుకునేలా ప్రేరేపించడం మూల్యాంకనం లక్ష్యం కాదు – NCF 2005

ప్రస్తుత మూల్యాంకనం ఉపాధ్యాయ కేంద్రీకృతంగా ఉంది. ఇది మారవలసిన ఆవశ్యకత చాలా ఉంది. ప్రగతి పత్రాల పేరిట పిల్లలకు అందించే సమాచారం పాఠ్య విషయాలపై మాత్రమే కాక సహ పాఠ్యాంశాలకు ప్రాధాన్యతనిస్తూ పిల్లల సమగ్ర ప్రగతిని తల్లిదండ్రులకు అందించవలసిన అవసరం ఉంది. ఇందుకోసం ఉపాధ్యాయులు కృషి చేయవలసియున్నది. పాఠశాలల్లో నిర్వహించే అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చలు, సెమినార్‌లు, పోటీలు, జరిపించే జాతీయ పండుగలు, ఆడించే ఆటలు, పాడించే పాటలు, పాఠశాల వార్షికోత్సవాలు – ఇవన్నీ పాఠ్యాంశాలే! కానీ సహపాఠ్యాంశాలు. పాఠ్యాంశేతర కార్యక్రమాలు కావు. పాఠశాలలో జరిగే సమస్త కార్యక్రమాల మొత్తమే కరిక్యులమ్. ఈనాడు మారిన సరికొత్త అభ్యసన విధానాలనుబట్టి సహపాఠ్య కార్యక్రమాలు కూడా మన కరిక్యులమ్‌లో ఒక భాగమే. కనుక సహపాఠ్య కార్యక్రమాలు అనే మాట పాత పాట. అందుకే కొత్తపాట పాడదాం!!

## 6.4 నిరంతర సమగ్ర మూల్యాంకనం

ఆర్.టి.ఇ. 2009 ప్రకారం పిల్లలు సమగ్ర అభివృద్ధిని సాధించడంలో పాఠశాలలో బాధ్యత వహించవలసి వుంటుంది. పిల్లలు శారీరకంగా, మానసికంగా, నైతికంగా, భావోద్వేగ పరంగా అభివృద్ధి చెందాలి. ఇందుకోసం పాఠ్య విషయాలతో పాటు, పిల్లల ఆసక్తులు, విలువలు, వైఖరులు, ఆటలు, పాటలు, మొదలుగు వాటిలో పిల్లలు అభివృద్ధి చెందాలి. ఈ నేపధ్యంలో నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని అన్ని విషయాలల్లో అనగా పాఠ్య, సహ పాఠ్య విషయాల్లో పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఈ చట్టంలోని సెక్షన్ 29 చెబుతుంది.

"నిరంతరం" అంటే పిల్లల ప్రగతిని ఒక సందర్భానికో, సంఘటనకో పరిమితం చేయకుండా ఎల్లప్పుడు పరిశీలించడం. తరగతిలో, తరగతి గది బయట పిల్లల ప్రగతిని తెలుసుకోవడం. మరింత పురోభివృద్ధికి సాధించడం అనేది నిరంతరం జరగాలి. పిల్లల శారీరక,  మానసిక వికాసాలను ఒక క్రమ పద్ధతిలో పరిశీలిస్తున్నామని పిల్లలకు తెలియకుండానే పరిశీలించాలి. దీనినే నిరంతర మూల్యాంకనంగా పేర్కొనవచ్చు.

సమగ్ర మూల్యాంకన మంటే పిల్లల అభివృద్ధిని పాఠ్య విషయాలతోపాటు, సహపాఠ్య విషయాలు అనగా విలువల విద్య, పని అనుభవం, కళా విద్య, కంప్యూటర్ విద్య, వ్యాయామ, ఆరోగ్య విద్య మొదలగు వాటిలో మూల్యాంకనం చేయాలి. ఈ విధంగా పిల్లల సర్వతో ముఖాభివృద్ధితో సంబంధం ఉన్న అన్ని విషయాలను మూల్యాంకనం చేయడాన్ని సమగ్ర మూల్యాంకనం అంటారు. పాఠ్య విషయాలలో ఆయా సబ్జక్టులకు సంబంధించిన సామర్థ్యాలు, అభ్యసనా ఫలితాలను, నైపుణ్యాలను అలాగే సహ పాఠ్య విషయాలకు సంబంధించిన సామర్థ్యాలు/అభ్యసనా ఫలితాలను, నైపుణ్యాలను మూల్యాంకనం చేయాలి. పిల్లల యొక్క, జ్ఞానాత్మక, మానసిక చలనాత్మక, భావావేశ రంగాలకు చెందిన అన్ని అంశాలను కలిపి చేసే మూల్యాంకనం సమగ్ర మూల్యాంకనం అంటారు. మరింత అర్థవంతంగా చెప్పాలంటే ప్రస్తుతం నడుస్తున్నది సామర్థ్యాధార, కృత్యాధార నిరంతర సమగ్ర మూల్యాంకనం.

**అభ్యసనం – మూల్యాంకనం**

భాషాభ్యసనానికి సంబంధించి ఉపాధ్యాయుడు నిర్దేశించుకున్న భాషా లక్ష్యాలను పిల్లల్లో సాధింప చేయడానికి, పిల్లల్లో భాషాభివృద్ధి జరగడానికి ఎన్నో రకాల మదింపు సాధనాలు అవసరమవుతాయి. మదింపు చేయడంలో పిల్లల భాష, అవగాహన, అభిరుచులు, ఆసక్తులు, నైపుణ్యాలతోపాటు విభిన్న అభ్యసన విధానాలను దృష్టిలో పెట్టుకోవాలి. భాషను పొందడం అంటే భాషను నేర్చుకోవడమేకాదు, భాషను సృజనాత్మకంగా, తార్కికంగా, సందర్భోచితంగా వినియోగించగలగడం. కాబట్టి వీటన్నింటినీ మూల్యాంకనం చేస్తున్నామా లేదా అనేది ఆలోచించవలసిన విషయం. అందుకు తగిన మూల్యాంకనా విధానాలను, సాధనాలను రూపొందించుకోవాలి. మూల్యాంకనం అభ్యసనంలో అంతర్భాగంగా నిరంతరం జరిగే ప్రక్రియగా నిర్వహించగలగాలి. అందుకు ఈ క్రింది అంశాలపై అవగాహన పొందాలి.

1. అభ్యసనం కొరకు మదింపు (Assessment for Learning)
2. అభ్యసనం జరిగేటప్పుడు మదింపు (Assessment as Learning)
3. అభ్యసనం యొక్క మదింపు (Assessment of Learning)

VK2PML

**1. అభ్యసనం కొరకు మదింపు :** పిల్లలు అభ్యసన ప్రక్రియలలో / కృత్యములలో పాల్గొని నేర్చుకుంటున్నపుడు వారిని పరిశీలిస్తూ విద్యార్థి నేర్చుకుంటున్నాడా ? నేర్చుకోవడంలో ఇబ్బంది పడుతున్నాడా ? ఏయే కృత్యాలలో నేర్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నాడు? ఏవిధమైన సహకారం అందిస్తే నేర్చుకుంటాడు మొదలైన విషయాలు దృష్టిలో ఉంచుకొని పరిశీలిస్తూ, తన బోధనా విధానాన్ని మార్పు చేసుకోవడానికి తీసుకొనే చర్యలు అభ్యసనం కొరకు మదింపు లేదా అభ్యసనం మెరుగు పరచుకోవడానికి మదింపు అంటాం.

పాఠశాలలో నిర్వహించే నిర్మాణాత్మక మూల్యాంకనంలో పిల్లల భాగస్వామ్యం ప్రతిస్పందన, రాత పనులు, పాల్గొన్న ప్రాజెక్టులు పరిశీలించే సందర్భంలో పిల్లలు ఎక్కడ ఇబ్బంది పడుతున్నారు, ఏమి చేయలేక పోతున్నారు ఉపాధ్యాయుడు గుర్తించి వారికి అవసరమైన అభ్యసన కృత్యాలు నిర్వహించి అభ్యసనాన్ని మెరుగుపరచుకోవడానికి అభ్యసనం కొరకు మదింపు చేసినట్లవుతుంది.

పాఠంలోని అంశంపై విద్యార్థులతో ప్రశ్నించే సందర్భంలో, చర్చించే సందర్భంలో పిల్లలు ఎలా పాల్గొంటున్నారు. ఎలా సమాధానాలు చెబుతున్నారు? స్పష్టంగా, స్వేచ్ఛగా చెబుతున్నారా? అడిగిన దానికి సరియైన జవాబు చెబుతున్నారా? ఇత్యాది విషయాలు పరిశీలించడమే అభ్యసనమును మూల్యాంకనం చేయడంగా భావించాలి. పరిశీలనల ఆధారంగా పిల్లలకు అవసరమైన సహకారం అందించి సొంతంగా చెప్పడానికి, రాయడానికి తోడ్పడం అభ్యసనం మెరుగుపరచుకోవడానికి లేదా అభ్యసనం కొరకు మదింపు అవుతుంది.

**2. అభ్యసనం జరిగేటప్పుడు మదింపు** (Assessment as Learning): పాఠశాలలో కల్పించే అభ్యసన అనుభవాలు లేదా సన్నివేశాలు పిల్లల సమగ్ర వికాసానికి దోహదపడేవిగా ఉండాలి. పిల్లలు అభ్యసన సన్నివేశాలలో పాల్గొని నేర్చుకుంటున్నప్పుడు వారిని మూల్యాంకనం చేయడాన్ని అభ్యసనం జరిగేటప్పుడు చేసే మదింపు అంటాం. అభ్యసనం, మూల్యాంకనం వేరు వేరుగా కాకుండా అభ్యసనం జరుగుతున్నప్పుడే మూల్యాంకనం ఉంటుంది. ఉదాహరణకు పిల్లలు ఒక అంశంపై తరగతి గదిలో జరిగే చర్యలలో పాల్గొన్నపుడు వారు తమ అభిప్రాయములను ఏవిధంగా వ్యక్తం చేస్తున్నారు, విషయాన్ని అర్థం చేసుకోవడానికి ఏ విధంగా ప్రశ్నిస్తున్నారు, వంటి అంశాలను ఉపాధ్యాయుడు పరిశీలించడానికి అవకాశం ఉంది. ఈ పరిశీలన ద్వారా పిల్లలు ఏమి నేర్చుకున్నారో మదింపు చేయడం జరుగుతుంది. కావున ఇది అభ్యసనం జరిగేటప్పుడు మూల్యాంకనం ఈక్రింది సందర్భాలలో అభ్యసనంతో పాటు మదింపు జరపవచ్చు.

- □ పాఠ్యాంశంపై జరిగే చర్చలలో
- □ కృత్యాలు, జట్టు పనుల నిర్వహణ ద్వారా భావనల అవగాహన
- □ ప్రాజెక్టు పనుల ద్వారా నేర్చుకోవడం
- □ నమూనాలు, పటాలు, మాదిరులు, గ్రాఫ్‌లు రూపొందిస్తున్నపుడు
- □ సృజనాత్మక కృత్యాలలో పాల్గొంటున్నపుడు.
- □ మైండ్ మాపింగ్‌పై జరిగే చర్చల్లో పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నప్పుడు

ఇలా అభ్యసనం జరుగుతున్న సందర్భాల్లో పిల్లలు పాల్గొని నేర్చుకుంటున్నప్పుడు, వారి ప్రతిస్పందనలు పరిశీలించి మూల్యాంకనం చేయడం, వంటి వాటికి ఎప్పటికప్పుడు పరిశీలించి ఉపాధ్యాయుడు తన దినచర్యలో నమోదు చేసుకోవాలి.

**3. అభ్యసనం యొక్క మదింపు (Assessment of Learning):** పిల్లలు ఆయా సామర్థ్యాలలో ఎంత అభివృద్ధి చెందారో,ఎంత వరకు నేర్చుకున్నారో తెలిపేదే అభ్యసనం యొక్క మూల్యాంకనం పిల్లలు వివిధ అభ్యసన కృత్యాలలో పాల్గొంటూ వివిధ భావనలు, వ్యవహార రూపాలను, ప్రక్రియ నైపుణ్యాలను పొందుతారు. ఇలా పిల్లలు పొందిన జ్ఞానాన్ని కొంతకాలం తరువాత పరీక్షించడమే "అభ్యసనం యొక్క మూల్యాంకనం" ఇది పిల్లల మార్కులు, గ్రేడులు రూపంలో ప్రదర్శిత మౌతుంది. ఇది ఉపాధ్యాయులు చేత మూల్యాంకనం చేయబడుతుంది. ఇది సంవత్సరానికి 3 సార్లు జరుగుతుంది. ఈ విధానంలో విద్యార్థులు ఒకేసారి ఒకే విధంగా మూల్యాంకనం చేయబడతారు. ఒక టర్మ్ పూర్తయిన తరువాత నిర్వహించే పరీక్షలు "అభ్యసన యొక్క మదింపు –

**అభ్యసనం యొక్క మదింపు లక్షణాలు**

- కేవలం ఉపాధ్యాయులు లేదా బాహ్య నికషల ఆధారం పిల్లల ప్రగతిని అంచనా వేస్తుంది.
- పిల్లల ప్రగతి ఫలితాలు మార్కులు మరియు గ్రేడులు ద్వారా ప్రదర్శించబడతాయి.
- పిల్లలందరినీ ఒకే విధానంలో మూల్యాంకనం చేయబడుతుంది.

**ఈ విధానంలో ఉపాధ్యాయులు గుర్తుంచుకోవలసినవి**

- అన్ని సామర్థ్యాలు పరిశీలించాలి సామర్థ్యాధారిత పరీక్ష పత్రం ఉపాధ్యాయుడు స్వయంగా తయారు చేసుకోవాలి.
- పిల్లల జవాబు పత్రాలు పరిశీలించినపుడు ఎక్కడ వెనుక బడ్డారో గుర్తించి వాటిని సరిచేయడానికి బోధనా వ్యూహాలు రూపొందించుకోవాలి.
- ఉపాధ్యాయులు తమ అభ్యసన ప్రక్రియలను మెరుగు పరచుకోవాలి.

**అభ్యసనాన్ని ఎలా మదింపు చేయాలి**

- పిల్లల ప్రగతిని నమోదు చేయడానికి ప్రత్యేక మాపనులు రూపొందించుకోవాలి.
- పిల్లల నోటు పుస్తకాలు, డైరీలు, పోర్టుఫోలియోలు, సంఘటన రచన (అనక్డోటులు), జట్టు నివేదికలు, ఉపాధ్యాయుని పరిశీలనలు మొదలగు వాటినన్నింటిని మదింపు సాధనంగా ఉపయోగించుకోవాలి.
- ప్రతి రోజు తరగతి గదిలో నిర్వహించే బోధనాభ్యసన ప్రక్రియలలో పిల్లల ప్రగతిని పరిశీలించాలి. ప్రతి అంశంపై మార్కులు గ్రేడింగ్ నమోదు చేయాలి.
- మూల్యాంకనం కోసం రూపొందించే ప్రశ్నలు కేవలం పాఠ్య పుస్తకం విషయానికే పరిమితం కాకుండా ఆలోచింప చేసేవిగా, బహుళ సమాధానాలు వచ్చేవిగా, సవాలుతో కూడినవిగా ఉండాలి.
- కేవలం అభ్యసన ఫలితాలను కాకుండా అధ్యసన అనుభవాలను మూల్యాంకనం చేయాలి.
- పిల్లల జవాబు పత్రాలను వారి సమక్షంలో దిద్దాలి. లేదా పిల్లలతో సరిదిద్దించాలి. స్వీయ మూల్యాంకనాన్ని ప్రోత్సహించాలి. పిల్లలు తమను తాము సరిదిద్దుకోడానికి ప్రయత్నిస్తారు.

**అభ్యసనం యొక్క మూల్యాంకనం ఉపయోగాలు**

- పిల్లలు సాధించిన ప్రగతి నమోదు చేయడానికి, సామర్థ్యాలు ఏ మేరకు సాధించారో తెలుసుకోవడానికి.
- పిల్లల ప్రగతిని వారి తల్లిదండ్రులకు తెలియజేయడానికి
- బోధనాభ్యసన ప్రక్రియలు మెరుగు పరచుకోవడానికి
- పాఠశాల స్థాయిలో మరియు తరగతి స్థాయిలో, గుణాత్మక అభ్యసనాన్ని పోల్చుకోవడానికి ఉపయోగపడుతుంది.

## నిరంతర సమగ్ర మూల్యాంకనము – మూల్యాంకన రకాలు

నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని అమలు చేయడానికి మూల్యాంకనాన్ని రెండు విధాలుగా నిర్వహిస్తారు.

1. నిర్మాణాత్మక మూల్యాంకనం (Formative Evaluation)
2. సంగ్రహణాత్మక మూల్యాంకనం (Summative Evaluation)

విద్యా సంవత్సరం ప్రారంభంలో పిల్లల్లో ఆ తరగతి సామర్థ్యాలు ఎంతవరకు ఉన్నాయో గుర్తించడం కోసం ప్రారంభ పరీక్ష నిర్వహించాలి. ఈ పరీక్ష వలన విద్యార్థి స్థాయి నిర్ధారణ జరుగుతుంది.

**నిర్మాణాత్మక మూల్యాంకనం :** తరగతి గదిలో నిర్వహిస్తున్న అభ్యసన కృత్యాలలో పిల్లలు పాల్గొన్నపుడు పిల్లలు ఎలా నేర్చుకుంటున్నారు? ఏమి నేర్చుకుంటున్నారు ? ఎక్కడ వెనుక బడుతున్నారు? దీన్ని ఎలా సరిదిద్దాలి ? అనే అంశాలను ఎప్పటికప్పుడు అంచనావేస్తూ, అవసరమైన చర్యలు చేపట్టి ప్రగతిని సాధించడానికి, పిల్లల అభ్యసనాన్ని మెరుగు పరచడానికి తోడ్పడే మూల్యాంకనం నిర్మాణాత్మక మూల్యాంకనం. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ, బోధనాభ్యసన కృత్యాల నిర్వహణ సమయంలో, ఆ తరువాత, పిల్లలు తోటి వారితో కలసి పనిచేస్తున్నపుడు, ఇంటిపని, ప్రాజెక్టు పనులు, నోటు పుస్తకములు మొదలైన వాటి ఆధారంగా పిల్లల ప్రగతిని అంచనా వేయవచ్చు. ప్రధానంగా ఇది అభ్యసనం కొరకు మూల్యాంకనం (Evaluation for Learning) పరీక్షించడానికి లేదా అంచనా వేయడానికే పరిమితం కాకుండా తదుపరి అభివృద్ధికి తోడ్పడుతుంది. బోధనాభ్యసన జరుగుతున్న సమయంలో నిరంతరం పరిపుష్టినిస్తూ (feed back) ఉపాధ్యాయునికి, విద్యార్థికి తమకు తాము సరిచేసుకునే వీలు కల్పిస్తుంది.

**సాధనాలు :** నిర్మాణాత్మక మూల్యాంకనం అనేది స్వభావ రీత్యా నిరంతరం జరిగే మూల్యాంకనం కాబట్టి ప్రధానంగా 4 రకాల సాధనాలను ఉపయోగించాలి.

1. పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందన (Participation & Reflection)
2. పిల్లల రాత అంశాలు (నోటుపుస్తకాలు, అసైన్‌మెంట్లు, అభ్యాసాలు మొదలగునవి).
3. ప్రాజెక్టు పనులు (Project Works)
4. లఘుపరీక్ష (Slip Test)

నిర్మాణాత్మక మూల్యాంకన సాధనాలను గురించి వివరంగా తెలుసుకుందాం.

**1. పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందన :** పాఠశాలలో నిర్వహించే బోధనాభ్యసన కృత్యాలలో పిల్లలు పాల్గొనే విధానం, వారు నేర్చుకునే క్రమాన్ని ప్రగతిని తెలియచేస్తుంది. పిల్లలు వినడం, విన్నదానిని అర్థం చేసుకొని స్వేచ్ఛగా మాట్లాడడం, చదివిన దానిని అర్థం చేసుకోవడం తమ ఆలోచనలను వ్యక్తీకరించడం, ప్రశ్నించడం వంటి వాటిని ఉపాధ్యాయుడు పరిశీలించాలి. తమ తోటి పిల్లలతో, ఉపాధ్యాయులతో పరస్పర ప్రతిచర్య జరిపే విధం, చర్చలలో పాల్గొంటున్నపుడు, జట్టు పనులలలో పాల్గొంటున్నప్పుడు, పిల్లల భాగస్వామ్యాన్ని పరిశీలించడం ద్వారా వారి భాషాస్థాయిని అంచనావేయవచ్చు. ప్రధానంగా విన్నదానిని గురించి తెలిసిన దానినిగురించి చదివిన దానిని గురించి ప్రశ్నించినపుడు పిల్లల ప్రతిస్పందన బట్టి వారి అవగాహన స్థాయిని అంచనా వేయవచ్చు. ఇందుకోసం ఉపాధ్యాయులు నిరంతరము పిల్లలను పరిశీలిస్తూ ఉండాలి. పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనను ప్రతియొక్కరిని గురించి పరిశీలించిన అంశాలను తమ డైరీలో నమోదు చేసుకోవాలి. తద్వారా వారిస్థాయిని మూల్యాంకనం చేయవచ్చు. దీనిలో భాగంగా పిల్లలు తాము చదివిన పుస్తకం పై సమీక్ష రాయాలి. దీని ఆధారంగా మార్కులు కేటాయించాలి.

**2. రాత అంశాలు :** భాషా సామర్థ్యాలలో “రాయడం” కష్టతరమైన సామర్థ్యం. పిల్లలు తప్పులు లేకుండా రాయడం, అందంగా, స్పష్టంగా రాయడంతో మొదలై సొంతంగా రాయడం క్రమ పద్ధతిలో రాయడం, భావానుగుణంగా రాయడం, పదాల మధ్య అక్షరాల మధ్య సమదూరాన్ని పాటించి రాయడం, విమర్శానాత్మకంగా రాయడం, సృజనాత్మకంగా రాయడం వంటి సామర్థ్యాల స్థాయికి చేరుతుంది. ఇది నిరంతరం జరగాలి. రాయడం అలవాటు కావాలి. పిల్లల రాత అంశాలకు చెందిన నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలు రాయడం, పిల్లలు రాసే కవితలు, కథలు, అసైన్‌మెంట్లు పరిశీలించాలి. అలాగే సంఘటనా రచనలు (అనెక్డోటల్ రికార్డు) ఫోర్ట్‌ఫోలియో, పిల్లల దినచర్యలు, పరిశీలించాలి. వీటన్నింటి పరిగణనలోనికి తీసుకొని రాయడం సామర్థ్యంలో పిల్లల ప్రగతిని అంచనా వేయవచ్చు. పిల్లలను వ్యక్తిగతంగా పరిశీలించి తన దినచర్యలో నమోదు చేసుకోవలసి ఉంటుంది.

**3. ప్రాజెక్టు పనులు :** తరగతి గదిలో కేవలం వినడం ద్వారా లేదా చదవడం ద్వారా, చేయడం ద్వారా అనుభవం ద్వారా నేర్చుకోవడానికి అవకాశం కల్పించే కార్యక్రమమే ప్రాజెక్టు పని. దీని ద్వారా పిల్లలో పరిశీలన, ప్రయోగ నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. ఉత్సాహంగా బోధనాభ్యసన ప్రక్రియలలో పాల్గొంటారు. భాషా నైపుణ్యాలతోపాటు సృజనాత్మకత, కల్పనాశక్తి, ప్రశంసా పూర్వక వైఖరి నిర్మాణం, మానవ సంబంధాల మెరుగుదల, వంటి సామర్థ్యాలు భాష ద్వారా అభివృద్ధి పరచుకోవలసి ఉంది. ఇవి ప్రాజెక్టు పనులు నిర్వహించుట ద్వారా సాధ్యమవుతుంది. ఎ.పి.ఎస్.సి.ఎఫ్ 2011 లో పేర్కొనట్లు అభ్యసనం పాఠ్య పుస్తక పరిధి దాటాలి. అదనపు పఠన సామాగ్రిని పిల్లలు చదవాలి అని చెబుతుంది. ఇందుకోసం అనేక కృత్యాలు, సామర్థ్యాల సమాహారమైన ప్రాజెక్టు పనులు నిర్వహించాలి. ప్రస్తుత తెలుగు వాచకములో పాఠం వెనుక ప్రాజెక్టు పనిని ఇచ్చారు. వీటిని ప్లిలలతో చేయించాలి. నివేదికలు రాయించాలి. ఈ నివేదిక పోర్ట్‌ఫోలియోలలో భద్రపరచాలి. వీటి ఆధారంగా పిల్లల ప్రగతిని వ్యక్తిగతంగా ఉపాధ్యాయుడు నమోదు చేయాలి.

**4. లఘు పరీక్ష :** (Slip Test) నిర్మాణాత్మక మూల్యాంకనంలో పిల్లల సామర్థ్యాల సాధనను ఒక చిన్న పరీక్ష రూపంలో కూడా పరిశీలించవలసి ఉంటుంది. దీనినే లఘు పరీక్ష అంటారు. ఇది సాధారణంగా నిర్వహించే రాత పరీక్ష కాదు. దీనిని నిర్వహించడానికి ప్రత్యేక సమయంకాని, ముందస్తు ప్రణాళిక గాని, పిల్లలకు ముందే చెప్పవలసిన అవసరంగాని లేదు. అప్పటి కప్పుడు పిల్లల స్థాయిని అంచనా వేసే పరీక్ష. ఒకపాఠం పూర్తయిన తరువాత గాని, సృజనాత్మకత గురించి గాని, వ్యాకరణాంశాల గురించి గాని, చదివింది అర్థం చేసుకోవడం గురించి గాని లఘు పరీక్ష నిర్వహించవచ్చు. ప్రశ్నలు నల్లబల్లపై వ్రాయాలి పిల్లలు సమాధానాలను ఒక నోటు పుస్తకంలో వ్రాయాలి.

**నిర్మాణాత్మక మూల్యాంకనం నిర్వహణ**

నిర్మాణాత్మక మూల్యాంకనం ఒక విద్యా సంవత్సరంలో 4 సార్లు నిర్వహించాలి. అది జూలై, ఆగస్టు, నవంబరు, ఫిబ్రవరి మాసాల్లో నిర్వహించాలి. నిర్మాణాత్మక మూల్యాంకన సాధనాల ప్రకారం మార్కులు గ్రేడింగ్ నమోదు చేయాలి. నిర్మాణాత్మక మూల్యాంకనం 50 మార్కులకు నిర్వహిస్తారు. మార్కుల విభజన క్రింద విధంగా ఉంటుంది.

| క్ర.సం. | అంశం | కేటాయించిన మార్కులు | ఆధారాలు |
|---|---|---|---|
| 1 | పిల్లల భాగస్వామ్యం ప్రతిస్పందన | 10 మార్కులు | పిల్లలు తాము చదివిన పుస్తకం గురించి సమీక్ష. |
| 2. | రాత అంశాలు | 10 మార్కులు | నోటు పుస్తకాలు, అసైన్‌మెంట్‌లు పోర్ట్‌ఫోలియోలు, పిల్లలడైరీ మొ॥నవి |
| 3. | ప్రాజెక్టు పనులు | 10 మార్కులు | పిల్లలు నిర్వహించిన ప్రాజెక్టు పనులు వాటి నివేదికలు |
| 4. | లఘు పరీక్ష | 20 మార్కులు | పిల్లలు జవాబులు రాసిన నోటు బుక్కులు |
| 5. | మొత్తం | 50 మార్కులు | -- |

**సంగ్రహణాత్మక మూల్యాంకనం :** నిర్దిష్ట కాలపరిమితికి నిర్ధారించిన అంశాల ఆధారంగా, ఆశించిన భాషా సామర్థ్యాలను పిల్లలు ఎంతమేరకు సాధించారో తెలుసుకోవడానికి దోహద పడుతుంది. సంగ్రహణ్మాక మూల్యాంకనంను సాధారణంగా రాత పరీక్ష మరియు మౌఖిక పరీక్ష ద్వారా నిర్వహిస్తారు. ఒక విద్యా సంవత్సరంలో దీనిని మూడు సార్లు నిర్వహిస్తారు. మొదటిది సెప్టెంబరు/ అక్టోబరు నెలలో, రెండవది డిసెంబరు/జనవరి నెలలో మూడవది ఏప్రిల్‌లో నిర్వహిస్తారు. సంగ్రహణాత్మక మూల్యాంకనంలో విద్యా ప్రమాణాలు వారీగా ప్రశ్నలు ఉంటాయి. కాబట్టి భాషా సామర్థ్యాలను మూల్యాంకనం చేయడం జరుగుతుంది. ఏయే భాషా సామర్థ్యాలను మూల్యాంకనం చేయాలో తెలుసుకుందాం.

1. వినడం, ఆలోచించి మాట్లాడడం : పిల్లలు గేయాలు, కథలు సంభాషణలు విని అర్థం చేసుకోవాలి. విన్న అంశాన్ని, సారాంశాన్ని క్రమ పద్ధతిలో సొంతమాటల్లో చెప్పగలగాలి. పిల్లలు తాము విన్న వాటిని గురించి అభిప్రాయాలు చెప్పడం, సమర్థిస్తూ, విభేదిస్తూ మాట్లాడాలి. కారణాలు చెప్పగలగాలి.
2. ధారాళంగా చదవడం, అర్థం చేసుకొని చెప్పడం, రాయడం : వివిధ ప్రక్రియలు, అనగా కథలు, గేయాలు, పాటలు, వార్తలు, సంభాషణలు వంటివి చదివి అర్థం చేసుకోవాలి. దీని ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడం, చదివిన అంశాలకు సంబంధించి ప్రశ్నలు రాయడం వంటివి చేయగలగాలి.
3. ఆలోచించి రాయడం / స్వీయరచన : పిల్లలు తమకు తెలిసినవి, విన్నవి, చూచినవి, చదివిన అంశాలు సొంతంగా రాయగలగాలి. అభిప్రాయాలు ఆలోచనలు వ్రాయగలగాలి. సమర్థిస్తూ విభేదిస్తూ రాయగలగాలి.
4. పదజాలం : పాఠంలోని పదాలకు అర్థాలు గ్రహించగలగాలి, వాటితో వాక్యాలు రాయగలగాలి. సందర్భోచితంగా వినియోగించగలగాలి.
5. సృజనాత్మక : కథలు, కవితలు, గేయాలు, పొడిగించడం, సొంతంగా రాయడం, నినాదాలు, కరపత్రాలు, సంభాషణలు, రాయగలగాలి, కథలు, చిత్రాల ఆధారంగా సంభాషణలు రాయగలగాలి. అభినయించగలగాలి.
6. ప్రశంస: భిన్న సంస్కృతులను, సంప్రదాయములను గౌరవించగలగాలి ఇతర మతాలు, వర్గాలు, వికలాంగుల గొప్పతనాన్ని గుర్తించి ప్రశంసించగలగాలి.
7. భాషాంశాలు : కాలాలు, క్రియలు, క్రియల్లో భేదాలు, భాషా భాగాలు, వచనాలు గుర్తించగలగాలి. వాక్య నిర్మాణాన్ని, వాక్య నిర్మాణంలో విభక్తుల పాత్రను గుర్తించాలి.

**సంగ్రహణాత్మక మూల్యాంకనం, ప్రశ్నాపత్రం రూపొందించుటకు సూచనలు :**

- □ పరీక్ష నిర్వహణ కోసం పైన పేర్కొన్న భాషా సామర్థ్యాల ఆధారంగా ప్రశ్నపత్రం రూపొందించుకోవాలి.
- □ ఉపాధ్యాయుడే ప్రశ్నపత్రం రూపొందించుకోవాలి. మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనంనకు సెప్టెంబరు వరకు పూర్తయిన పాఠాల ఆధారంగా, రెండవ సంగహణాత్మక మూల్యాంకనంలో మొదటి టర్మ్ వరకు పూర్తయిన పాఠాలలో 30% పశ్నలు, మిగిలినవి నవంబరు వరకు పూర్తయిన పాఠాలలో ప్రశ్నలు ఉండాలి.
- □ మూడవ సంగ్రహణాత్మక మూల్యాంకనంలో విద్యా సంవత్సరం పూర్తయ్యే నాటికి సాధించవలసిన సామర్థ్యాలు దృష్టిలో పెట్టుకొని ప్రశ్నపత్రం రూపొందించాలి.
- □ ప్రశ్నలు ఆలోచించి రాసే విధంగా ఉండాలి. దైనందిన జీవితంతో అన్వయించి జవాబులు రాసే విధంగా ఉండాలి.
- □ సంగ్రహణాత్మక మూల్యాంకనం 50 మార్కులకు ఉంటుంది.
- □ సామర్థ్యాల వారీగా భారత్వ పట్టిక ప్రకారం రాతపరీక్షకు ప్రశ్నపత్రం రూపొందించుకోవాలి– భారత్వ పట్టికలో మౌఖికమునకు సంబంధించిన మార్కులను నిర్మాణాత్మక మూల్యాంకనములోని స్థాయిని పరిగణలోనికి తీసుకొని కేటాయించాలి.
- □ అన్ని రకాల ప్రశ్నలు అనగా వ్యాసరూప ప్రశ్నలు, లఘు సమాధాన ప్రశ్నలు లక్ష్యాత్మక ప్రశ్నలు ఉండాలి.
- □ ఒక సామర్థ్యానికి చెందిన ప్రశ్నలన్నీ ప్రశ్నపత్రంలో ఒకే దగ్గర ఇవ్వాలి.
- □ ప్రాజెక్టు పనులను ప్రశ్నాపత్రాల్లో ఇవ్వకూడదు.

**సహపాఠ్యాంశాల మూల్యాంకనం :** విద్యా హక్కు చట్టం సెక్షన్ (29) సబ్ సెక్షన్ 2 ప్రకారం పాఠ్య ప్రణాళికను, మూల్యాంకనా విధానాన్ని నిర్ధారించేటప్పుడు పిల్లల సర్వోతోముఖాభివృద్ధి పరిశీలించాలని సూచించింది. ఇందుకోసం కళలు, సాంస్కృతిక విద్య, ఆరోగ్య, వ్యాయామ విద్య, పని కంప్యూటర్ విద్య, విలువల విద్య, జీవన నైపుణ్యాలు, వీటికి సంబంధించిన అభ్యసన కృత్యాలను కూడా మూల్యాంకనం చేయాలి. సహ పాఠ్యాంశాలను సంగ్రహణాత్మకంగా మూల్యాంకనం చేయాలి. అయితే వీటికి నిర్ధారిత రాత పరీక్ష ఉండదు. పిల్లలు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్న తీరు, ప్రదర్శిస్తున్న నైపుణ్యాలు, ఆచరిస్తున్న విధానాలను పరిశీలించి మార్కులు, గ్రేడులు ఇవ్వాలి.

**పిల్లల ప్రగతి నమోదు మరియు గ్రేడింగ్ :** పిల్లల ప్రగతి నమోదు కోసం పాఠశాలలో సి.సి.ఇ. రిజిష్టరును ఏర్పాటు చేసుకోవాలి. దీనిలో నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలలో పిల్లలు పొందిన మార్కులు నమోదు చేయాలి. మార్కుల ఆధారంగా గ్రేడింగు నమోదు చేయాలి.

**గ్రేడింగ్ వివరాలు :**

| | |
|---|---|
| 91 నుండి 100 శాతం | ఎ+ |
| 71 నుండి 90 శాతం | ఎ |
| 51 నుండి 70 శాతం | బి+ |
| 41 నుండి 50 శాతం | బి |
| 0 నుండి 40 శాతం | సి |

## భారత్వ పట్టికలు

## నిర్మాణాత్మక మూల్యాంకనం భారత్వ పట్టిక

| క్ర.సం. | నిర్మాణాత్మక మూల్యాంకన సాధనాలు | 1, 2 తరగతులు | | 3, 4, 5 తరగతులు | |
|---|---|---|---|---|---|
| | | భారత్వం | మార్కులు | భారత్వం | మార్కులు |
| 1 | పిల్లల భాగస్వామ్యం ప్రతిస్పందన | 20 % | 10 | 20 % | 10 |
| 2. | రాత అంశాలు | 20 % | 10 | 20 % | 10 |
| 3. | ప్రాజెక్టు పనులు | 20 % | 10 | 20 % | 10 |
| 4. | లఘు పరీక్ష | 40 % | 20 | 40 % | 10 |
| | మొత్తం | 100 % | 50 | 100 % | 50 |

## సంగ్రహణాత్మక మూల్యాంకనం

## సామర్థ్యాల వారీగా మౌఖిక, రాతపరీక్షల భరత్వం.

| క్ర. సం. | సామర్థ్యాలు | 1, 2 తరగతులు | | | | 3, 4, 5 తరగతులు | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | మౌఖికపరీక్ష | | రాతపరీక్ష | | మౌఖికపరీక్ష | | రాతపరీక్ష | |
| | | శాతం | మార్కులు | శాతం | మార్కులు | శాతం | మార్కులు | శాతం | మార్కులు |
| 1 | వినడం, మాట్లాడడం ప్రశంస | 20% | 10 | - | - | 10% | 5 | - | - |
| 2 | ధారాళంగా చదవడం అవగాహన చేసుకోవడం | 10% | 5 | 20% | 10 | 10% | 5 | 20% | 10 |
| 3 | స్వీయ రచన/రాయడం | - | - | 40% | 20 | - | - | 30% | 15 |
| 4 | సృజనాత్మక | 10% | 5 | - | - | - | - | 10% | 5 |
| 5 | పదజాలం భాషాంశాలు | - | - | - | - | - | - | 20% | 10 |
| | మొత్తం | 40% | 20 | 60% | 30 | 20% | 10 | 80% | 40 |

**సంగ్రహణాత్మక మూల్యాంకనం – సామర్థ్యాల వారీగా ప్రశ్నల భారత్వ పట్టిక**

| క్ర.స. | సామర్థ్యం | ప్రశ్నల స్వభావం/రకం | జవాబులు రాయాల్సిన ప్రశ్నల సంఖ్య | మార్కులు | శాతం |
|---|---|---|---|---|---|
| 1. | చదవడం | పరిచిత గద్యం (లక్ష్మాత్మక ప్రశ్నలు)<br>అపరిచితగద్యం (లక్ష్మాత్మక ప్రశ్నలు) | 5<br>5 | 5<br>5 | 10%<br>10% |
| 2. | రాయడం (స్వీయరచన) | వ్యాసరూప ప్రశ్న (రెండింటిలో ఒకటి వ్రాయాలి)<br>లఘు సమాధాన ప్రశ్నలు | 1<br>5 | 5<br>10 | 10%<br>20% |
| 3. | సృజనాత్మకత | పరిచిత వ్యవహార రూపాలకు సంబంధించిన ప్రశ్నలు (1)గేయం (2) కథ, (3) సంభాషణ, మూడింటిలో ఒకటి రాయాలి. | 1 | 5 | 10% |
| 4. | పదజాలం | పదజాలం (లక్ష్యాత్మక ప్రశ్నలు)<br>భాషాంశాలు లక్ష్యాత్మక ప్రశ్నలు | 5<br>5 | 5<br>5 | 10%<br>10% |
| | మొత్తం | వ్యాసరూప -1<br>వ్యవహార రూపం-1<br>లఘు సమాధాన ప్రవ్నలు:5<br>లక్ష్యాత్మక ప్రశ్నలు:20 | 27ప్రశ్నలు | 40 | 80% |

**ప్రశ్నల కాఠిన్యత స్థాయి – భారత్వ పట్టిక**

| క్ర.సం. | ప్రశ్నల స్థాయి | మార్కులు | శాతం |
|---|---|---|---|
| 1. | సులభం | 10 | 25% |
| 2. | సగటు/సామాన్యం | 20 | 50% |
| 3. | కఠినం | 10 | 25% |
| | మొత్తం | 40 | 100% |

## నిరంతర సమగ్ర మూల్యాంకనం – ప్రగతి నమోదు రిజిష్టరు మరియు క్యుములేటివ్ రికార్డు

**పిల్లల ప్రగతి నమోదు రిజిష్టరు :** నిర్మాణాత్మక మూల్యాంకనములలోని నాలుగు అంశాలలో పిల్లలు సాధించిన మార్కులను గ్రేడులను ఈ రిజిష్టరులో నమోదు చేయాలి. 4 నిర్మాణత్మక మూల్యాంకనాలకు సంబంధించినవి ఈ రిజిష్టరులో ఉంటాయి. సంగ్రహణాత్మక మూల్యాంకనములోని విద్యా ప్రమాణాలు/సామర్థ్యాలలలో పొందిన మార్కులు, గ్రేడులు ఉంటాయి. మూడు సంగ్రహణాత్మక మూల్యాంకముల మార్కులు గ్రేడులు నమోదు చేయాలి. ఈ రెండు కలిపి తరగతి వారీగా సబ్జెక్టు వారీగా ఉంటుంది. ఈ రిజిష్టరు పర్యవేక్షణాధికారితో ధృవీకరింప చేసుకోవాలి. రిజిష్టరు నమూనా క్రింద ఇవ్వబడింది. పరిశీలించండి.

# నిరంతర సమగ్ర మూల్యాంకనం – పిల్లల ప్రగతి నమోదు రిజిష్టరు

తరగతి______________ విషయం : తెలుగు

| క్ర.సం | విద్యార్థి పేరు | మార్కులు/గ్రేడు | బేస్‌లైన్ | నిర్మాణాత్మక మూల్యాంకనం | | | | | | | | | | | | | | | | | | | | సంగ్రహణాత్మక మూల్యాంకనం | | | | | | | | | | | | | | | | | | | | | 4వ FA 3వ SA ల మొత్తం | | వృద్ధి శాతం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | FA 1 | | | | | FA 2 | | | | | FA 3 | | | | | FA 4 | | | | | SA1 | | | | | | | SA2 | | | | | | | SA3 | | | | | | | | | |
| | | | | 1 | 2 | 3 | 4 | మొ మా | 1 | 2 | 3 | 4 | మొ మా | 1 | 2 | 3 | 4 | మొ మా | 1 | 2 | 3 | 4 | మొ మా | 1 | 2 | 3 | 4 | 5 | 6 | మొ మా | 1 | 2 | 3 | 4 | 5 | 6 | మొ మా | 1 | 2 | 3 | 4 | 5 | 6 | మొ మా | M | G | |
| 1 | | M | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| | | G | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| 2 | | M | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| | | G | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| 3 | | M | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| | | G | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| 4 | | M | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| | | G | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |

గమనిక :

1. ప్రగతి నమోదు రిజిష్టరులో తరగతి వారీగా సబ్జెక్టు వారీగా వివరాల నమోదు చేయాలి.
2. FA= నిర్మాణాత్మక మూల్యాంకనం, SA సంగ్రహణాత్మక మూల్యాంకనం.
3. FA= 1)పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందన, 2)రాత అంశాలు, 3)ప్రాజెక్టు పని 4)లఘు పరీక్ష
4. SA =1 నుండి 6 వరకు గల సంఖ్యలు విద్యా ప్రమాణాలు, / సామర్థ్యాలు సూచిస్తాయి.
5. BL= (Base Line) ప్రారంభ పరీక్ష.

**వార్షిక పలితం నమోదు మరియు నివేదిక :**

ఒక విద్యా సంవత్సరంలో నాలుగు సార్లు నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని మూడుసార్లు, సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని నిర్వహించి పిల్లల ప్రగతి పై రిజిష్టరులో నమోదు చేస్తారు. విద్యా సంవత్సరం చివరలో నిర్వహించిన 4వ నిర్మాణాత్మక మూల్యాంకనం ప్రగతిని దీనితోపాటు ఏప్రిల్ నిర్వహించిన 3వ సంగ్రహణాత్మక ప్రగతి ఆధారంగా వార్షిక ఫలితాన్ని నిర్ధారించాలి. ఈ ఫలితాన్ని ఈ క్రింది పట్టికలో నమోదు చేయాలి. దీని కొరకు రిజిష్టరు నిర్వహించాలి.

**వార్షిక ఫలితం.**

| క్ర.స | విద్యార్థిపేరు | 4వ నిర్మాణాత్మక మూల్యాంకనంలోని మార్కులు/గ్రేడు | 3వ సంగ్రహణాత్మక మూల్యాంకనంలోని మార్కులు/గ్రేడు | వార్షిక ఫలితం గ్రేడు |
|---|---|---|---|---|
| 1. | | | | |
| 2. | | | | |

**వార్షిక ప్రగతి నమోదు రిజిష్టరు**

తరగతి : ____________

| క్ర.స | విద్యార్థిపేరు | 4వ నిర్మాణాత్మక మూల్యాంకనంలోని మార్కులు | | | | 3వ సంగ్రహణాత్మక మూల్యాంకనంలోని మార్కులు | | | | | | | | వార్షిక ఫలితం | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | తెలుగు | ఇంగ్లీషు | లెక్కలు | ప.వి. | తెలుగు | ఇంగ్లీషు | లెక్కలు | ప.వి. | ఆరోగ్య/వ్యాయామ విద్య | సాంస్కృతిక, కళల విద్య | ప.కం. విద్య | విలువల విద్య | మొత్తం మార్కులు | గ్రేడు |
| | | | | | | | | | | | | | | | |

**పరిపుష్టి మరియు నివేదిక :** (Feed back and Reporting)

మన రాష్ట్రంలో నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలు జరుగుచున్నందున ఛాత్రోపాధ్యాయులు – విద్యార్జన నికష (Scholastic Achievement Test) బదులుగా C.C.E. (Continuous Comprehensive Evaluation) రికార్డు వ్రాయాలి. బోధనాభ్యసనం కోసం ఛాత్రోపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లినపుడు బోధనాభ్యాసం జరిగే సమయంలో నిర్మాణాత్మక మూల్యాంకనం నిర్వహించి పిల్లల ప్రగతిని నమోదు చేయాలి. బోధనాభ్యసనం పూర్తయిన పిదప బోధించిన

పాఠం ఆధారంగా, సామర్థ్యాల ఆధారంగా ప్రశ్న పత్రం రూపొందించుకొని సంగ్రహణాత్మక మూల్యాంకనం పరీక్ష నిర్వహించాలి. పిల్లల జవాబు పత్రాలు దిద్ది సామర్థ్యాల వారీగా గ్రేడును కేటాయించాలి. ఈవిధంగా నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలు నిర్వహించిన తరువాత ఫలితాలను సి.సి.ఇ. రికార్డులో నమోదు చేయాలి. పిల్లల ప్రగతి నమోదుచేయాలి. వీటి ఆధారంగా చివరి ఫలితం (వార్షిక) గ్రేడును నిర్ధారించాలి. అదే విధంగా సామర్థ్యాల వారీగా విశ్లేషణ పట్టికలు గ్రేడింగ్ పట్టికలు రూపొందించాలి.

**పట్టిక**

| క్ర. సం. | విద్యార్థిపేరు | నిర్మాణాత్మక మూల్యాంకనం మార్కులు ఎ | గ్రేడు | సంగ్రహణాత్మక మూల్యాంకనం మార్కులు బి | గ్రేడు | నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనల మొత్తం మార్కులు ఎ+బి | చివరి ఫలితం/ గ్రేడు |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | |

**సామర్థ్యాల వారీగా విశ్లేషణ పట్టిక**

తరగతి .........................                                   విషయం

...............................

| క్ర.స. | విద్యార్థి పేరు | సామర్థ్యాల వారీగా విశ్లేషణ పట్టిక | | | | | మొత్తం మార్కులు | గ్రేడు |
|---|---|---|---|---|---|---|---|---|
| | | వినడం మాట్లాడడం ప్రశంస | ధారళంగా చదవడం అవగాహన చేసుకోవడం | రాయడం/ స్వీయరచన | సృజనాత్మకత | పదజాలం భాషాంశాలు | | |
| 1. | | | | | | | | |
| 2. | | | | | | | | |

**గ్రేడింగ్ విశ్లేషణ పట్టిక (సబ్జెక్టు వారీగా)**

| తరగతి | మొత్తం విద్యార్థుల సంఖ్య | ఎ+ | ఎ | బి+ | బి | సి | |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | |
| | | | | | | | |

పైన పేర్కొన్న పట్టికల ద్వారా విద్యార్థుల ఫలితాలను విశ్లేషించాలి. పిల్లల స్థాయిని విశ్లేషించడం ద్వారా వారి స్థాయిని గ్రహించవచ్చు. పిల్లల అభ్యసన సమస్యలు తెలుసుకోవచ్చు. పిల్లల సామర్థ్యాలను విశ్లేషించడం ద్వారా ఏ పిల్లలు ఏయే సామర్థ్యాలలో వెనుక బడ్డారో, ఆయా సామర్థ్యాలను తిరిగి సాధించడానికి, కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకోడానికి, ఆ ప్రణాళికను అమలుచేయడానికి దోహదపడుతుంది. కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రత్యామ్నాయ బోధన (Remedial Teaching) ఆయా సామర్థ్యాల్లో వెనుక బడిన పిల్లలకు నిర్వహించి వారి అభ్యసనా స్థాయిని పెంచి సామర్థ్యాలు అభివృద్ధి పరచవచ్చు. ఈ విధంగా పిల్లల స్థాయి, సామర్థ్యాల అభివృద్ధి, పిల్లల ప్రగతి, మొత్తం తరగతి ప్రగతి, బోధనా కృషి ఫలితాలు తెలుస్తాయి. వాటి ఆధారంగా క్రొత్త ప్రణాళికలు, వ్యూహాలు, పరిశోధనలు సాగించి పిల్లల సర్వతోముఖాభివృద్ధి సాధించవచ్చు. ఈ విశ్లేషణ వలన పరిపుష్టి పొంది పునర్బలన కార్యక్రమాలు చేపట్టవచ్చు.

నిరంతర సమగ్ర మూల్యాంకనం నిర్వహణ దాని ఫలితాలు, విశ్లేషణ ఆధారంగా పాఠశాల వారిగా నివేదికను తయారు చేసి అధికారులకు సమర్పించవలసి వుంటుంది.

**క్యుములేటివ్ రికార్డు:** ఒక విద్యార్థి పాఠశాలలో చేరినది మొదలు ఎలిమెంటరీ విద్య పూర్తి చేసేంతవరకు తరగతి వారీగా పాఠ్య, సహపాఠ్య అంశాలన్నింటిలో విద్యార్థి ప్రగతిని పరిశీలించి నమోదు చేసే రికార్డు క్యుములేటివ్ రికార్డు. ఒక వేళ విద్యార్థి ఒక పాఠశాల నుండి వేరొక పాఠశాలకు వెళితే క్యుములేటివ్ రికార్డును చేరిన పాఠశాలలో అందజేయాలి. ఈ రికార్డు నందు పిల్లల బోధనాంశాలు, విలువల విద్య, జీవన నైపుణ్యాలు మొదలైన అంశాలకు సంబంధించిన ప్రగతి నమోదు చేయబడుతుంది. ఈ **క్యుములేటివ్ రికార్డు రెండు విధాలుగా ఉంటుంది.**

1. 1 నుండి 5వ తరగతి వరకు ఒక బుక్‌లెట్ (Booklet)
2. 6 నుండి 9వ తరగతి వరకు ఒక బుక్‌లెట్ (Booklet)

ఈ రికార్డును ప్రతి సంగ్రహణాత్మక మూల్యాంకనంనకు సంబంధించిన ప్రగతి నమోదు చేసి తల్లిదండ్రులకు పంపించాలి. పాఠశాల చివరగా (5వ తరగతి/ 10వ తరగతి) విద్యార్థి వదలి వెళ్ళేటప్పుడు పిల్లలకు ఇచ్చివేయాలి.

## క్యుములేటివ్ రికార్డు (క్రమానుగత ప్రగతి పత్రం) నమూనా

1 పాఠశాల పేరు .................................. మాధ్యమం ............................ గుర్తింపు సంఖ్య ...... విద్యార్థిపేరు ............................ తరగతి ............... అడ్మిషన్ నెం. .................. పుట్టిన తేది .................. తండ్రిపేరు .................., తల్లిపేరు ................ సామాజిక వర్గం ................................ చిరునామా.......................మొబైల్ నంబరు ................ ఆధార్ నెం. ..................... ఇత్యాది వివరముల విద్యార్థి వ్యక్తిగత సమాచారం ఉంటుంది. వీటితోపాటు.

| పాఠశాల లోగో |
|---|
| |

| పాఠశాల సూక్తి |
|---|
| |

| విద్యార్థి తరగతిలో చేరినప్పటి ఫోటో |
|---|
| |

| విద్యార్థి 5వ తరగతిలోనున్నప్పటి ఫోటో |
|---|
| |

(అ) బ్లడ్ గ్రూప్ (రక్తం వర్గం) ...........................

(ఆ) ఎత్తు, బరువు వివరములు

| తరగతి | 1 | 2 | 3 | 4 | 5 |
|---|---|---|---|---|---|
| ఎత్తు | | | | | |
| బరువు | | | | | |

### గ్రేడు వివరములు

| శాతం | గ్రేడు | వివరణ |
|---|---|---|
| 91 - 100 | ఎ+ | అత్యున్నత ప్రతిభ, కొనసాగించండి |
| 71 - 90 | ఎ | చాలా బాగుంది. అత్యున్నత ప్రతిభకు కృషి చేయాలి. |
| 51 - 70 | బి+ | బాగుంది. ఇంకాస్త కృషి చేయండి. |
| 41 - 50 | బి | పరవాలేదు. కృషి చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. |
| 0 - 41 | సి | నామ మాత్రంగా చేయగలుగుతున్నారు. ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. |

## విద్యా విషయ సమాచారం

### నిర్మాణాత్మక మూల్యాంకనం

### ప్రగతి నమోదు

| విషయం | మూల్యాంకనం | పిల్లల భాగస్వామ్యం ప్రతిస్పందన | రాత అంశాలు | ప్రాజెక్టు పనులు | లఘు పరీక్ష | గ్రేడు |
|---|---|---|---|---|---|---|
| తెలుగు | ఎఫ్.ఎ. 1 | | | | | |
| | ఎఫ్.ఎ. 2 | | | | | |
| | ఎఫ్.ఎ. 3 | | | | | |
| | ఎఫ్.ఎ. 4 | | | | | |
| ఇంగ్లీషు | ఎఫ్.ఎ. 1 | | | | | |
| | ఎఫ్.ఎ. 2 | | | | | |
| | ఎఫ్.ఎ. 3 | | | | | |
| | ఎఫ్.ఎ. 4 | | | | | |
| గణితం | ఎఫ్.ఎ. 1 | | | | | |
| | ఎఫ్.ఎ. 2 | | | | | |
| | ఎఫ్.ఎ. 3 | | | | | |
| | ఎఫ్.ఎ. 4 | | | | | |
| పరిసరాల విజ్ఞానం | ఎఫ్.ఎ. 1 | | | | | |
| | ఎఫ్.ఎ. 2 | | | | | |
| | ఎఫ్.ఎ. 3 | | | | | |
| | ఎఫ్.ఎ. 4 | | | | | |

### ఆరోగ్య సమాచారం.

| వైద్య పరీక్ష నిర్వహించిన తేది | ఇచ్చిన సూచనలు, వైద్య వివరాలు | ఎత్తు | బరువు |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |

**సంగ్రహణాత్మక మూల్యాంకనం** (Summative Assessment) **ప్రగతి గ్రేడు.**

తరగతి ..........................

| వ.నెం. | విషయం | విద్యా ప్రమాణాలు | ఎస్.ఎ.1 | ఎస్.ఎ.2 | ఎస్.ఎ.3 |
|---|---|---|---|---|---|
| 1 | తెలుగు | వినడం ఆలోచించి మాట్లాడడం | | | |
| | | ధారాళంగా చదవడం, అర్థం చేసుకోవడం | | | |
| | | రాయడం (స్వీయ రచన) | | | |
| | | సృజనాత్మకత | | | |
| | | పదజాలం/వ్యాకరణాంశాలు | | | |
| | | గ్రేడు | | | |
| 2 | ఇంగ్లీషు | Listening, Speaking | | | |
| | | Reading Comprehension | | | |
| | | Conventions of Writing | | | |
| | | Vocabulary | | | |
| | | Grammer | | | |
| | | Creative Expression | | | |
| | | Grade | | | |
| 3 | గణితం | భావనల అవగాహన, సమస్యాసాధన | | | |
| | | కారణాలు– నిరూపణలు | | | |
| | | వ్యక్తపరచడం | | | |
| | | సంబంధాలు | | | |
| | | ప్రాతినిధ్య పరచడం, దృశ్యీకరణ | | | |
| | | గ్రేడు | | | |
| 4 | పరిసరాల | విషయాగాహన, | | | |
| | విజ్ఞానం | ప్రశ్నించడం, పరికల్పనలు చేయడం. | | | |
| | | ప్రయోగాలు, క్షేత్ర పరిశీలనలు | | | |
| | | సమాచార నైపుణ్యాలు, ప్రాజెక్టు పనులు | | | |
| | | బొమ్మలు, పటాలు గీయడం ద్వారా భావ ప్రసారం | | | |
| | | ప్రశంస, విలువలు, జీవ వైవిధ్యం పట్ల స్పృహ.<br>గ్రేడు | | | |

| వ.నెం. | విషయం | విద్యా ప్రమాణాలు | ఎస్.ఎ.1 | ఎస్.ఎ.2 | ఎస్.ఎ.3 |
|---|---|---|---|---|---|
| 5 | ఆరోగ్య | ఆటలలో పాల్గొనడం, క్రీడా స్ఫూర్తి | | | |
| | వ్యాయామ | యోగ, మెడిటేషన్, స్కౌట్స్, గైడ్స్, ఎన్.సి.సి. | | | |
| | విద్య | వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఆరోగ్య అలవాట్లు | | | |
| | | కుటుంబ సంబంధాలు, భద్రత-ప్రథమ చికిత్స | | | |
| | | ఆరోగ్యం పోషకాహారం, మంచి ఆహార అలవాట్లు | | | |
| | | గ్రేడు/వివరణాత్మక సూచనలు | | | |
| 6 | సాంస్కృతిక | బొమ్మలు గీయడం, నమూనాలు చేయడం | | | |
| | విద్య,కళలు | రంగులు వేయడం, అలంకరణలు చేయడం | | | |
| | | ఒరిగామి, టాన్‌గ్రామి, కుట్లు, అల్లికలు | | | |
| | | నాటికలు, ఏకాంకికలలో అభినయించడం | | | |
| | | కొరియోగ్రఫీ | | | |
| | | పాటలు పాడడం, వాద్య పరికరాల వినియోగం | | | |
| | | నృత్యం, స్థానిక కళారూపాలు ప్రదర్శించడం. | | | |
| | | గ్రేడు, వివరణాత్మక సూచనలు | | | |
| 7 | పని | పనిముట్లు వినియోగం, వస్తువుల తయారీ | | | |
| | కంప్యూటర్ | కార్యక్రమంలో పాల్గొనడం, బాధ్యతలు నిర్వర్తించడం | | | |
| | విద్య | అంతర్ కర్రిక్యులం కార్యక్రమాలు | | | |
| | | కంప్యూటర్ ఆధారంగా నేర్చుకోవడం | | | |
| | | కంప్యూటర్‌ను వినియోగించడం | | | |
| | | సామాజిక కార్యక్రమాలు-శ్రమదానం | | | |
| | | గ్రేడు/వివరణాత్మక సూచనలు | | | |
| 8 | విలువల | మంచి చెడు విచక్షణ జ్ఞానం - సత్ప్రవర్తన | | | |
| | విద్య | సహనం, దయ, తదానుభూతి, వ్యక్తిగత విలువలు | | | |
| | జీవన | జీవన నైపుణ్యాలు- భావప్రసార సామాజిక, | | | |
| | నైపుణ్యాలు | ఉద్వేగ నైపుణ్యాలు, ఆలోచనా నైపుణ్యాలు | | | |
| | | ఉపాధ్యాయులు, సహోపాధ్యాయులు సమాజం,పాఠశాల | | | |
| | | ప్రభుత్వ ఆస్తులపట్ల సరైన వైఖరులు కలిగివుండడం. | | | |
| | | గ్రేడు / విరణాత్మక సూచనలు | | | |

**హాజరు సమాచారం**

| మాసం | జూన్ | జూలై | ఆగస్టు | సెప్టెం | అక్టోబర్ | నవం | డిశం | జనవరి | ఫిబ్రవరి | మార్చి | ఏప్రిల్ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| పని దినాలు | | | | | | | | | | | |
| హాజరైన దినాలు | | | | | | | | | | | |
| శాతం | | | | | | | | | | | |
| తరగతి ఉపాధ్యాయుని సంతకం | | | | | | | | | | | |
| ప్రధానోపాధ్యాయుని సంతకం | | | | | | | | | | | |
| తల్లి/తండ్రి సంతకం | | | | | | | | | | | |

**వార్షిక పలితం**

| క్ర. సం | విషయం | నాల్గవ నిర్మాణాత్మక మూల్యాంకనంలోని గ్రేడు | మూడవ సంగ్రహణాత్మక మూల్యాంకనంలోని గ్రేడు | వార్షిక ఫలితం |
|---|---|---|---|---|
| 1. | తెలుగు | | | |
| 2. | లెక్కలు | | | |
| 3. | ప. విజ్ఞానం | | | |
| 4. | ఇంగ్లీషు | | | |
| 5. | ఆరోగ్య/వ్యాయామవిద్య | | | |
| 6. | సాంస్కృతిక విద్య-కళలు | | | |
| 7. | పని, కంప్యూటర్ విద్య | | | |
| 8. | విలువల విద్య | | | |
| 9. | సంవత్సరాంత గ్రేడు | | | |

**వివరణాత్మక సూచికలు**

| మూల్యాంకనం | వివరణాత్మక సూచికలు |
|---|---|
| సంగ్రహణాత్మక 1 | |
| సంగ్రహాణాత్మక 2 | |
| సంగ్రహాణాత్మక 3 | |

తరగతి వారీగా విద్యా విషయ సమాచారం (నిర్మాణాత్మక మూల్యాంకనం, ప్రగతి నమోదు, ఆరోగ్య సమాచారం, సంగ్రహణాత్మక మూల్యాంకనం, ప్రగతి నమోదు, హాజరు సమాచారం, వార్షిక ఫలితం, వివరణాత్మక సూచికలు) రిజిష్టరులో ఉంటాయి.

**విద్యార్థి చదివిన పాఠశాలల సమాచారం.**

| వ.నెం. | పాఠశాల పేరు | చేరిన తరగతి | చేరిన తేది | విడిచిన తరగతి | విడిచిన తేది | అడ్మిషన్ నెం. | ఇతర వివరములు | ప్రధానోపాధ్యాయుని సంతకం |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | |

## ప్రైమరీ స్కూల్ సర్టిఫికెట్

ప్రాథమిక పాఠశాల

విద్యా ధృవీకరణ పత్రం

శ్రీ/కుమారి ........................................... తల్లి/తండ్రి .......... ............. ........... ......... ...... ....... పాఠశాల ........................... గ్రామం........................... మండలం....... ........... ........... ........ ..... జిల్లాలో ప్రాథమిక విద్య ............ విద్యా సంవత్సరములో పూర్తిచేసినారు. 5వ తరగతి వరకు నిర్ధారించిన విద్యా ప్రమాణములను సాధించినారని ధృవీకరిచడమైనది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని పాఠశాలలో నిరంతర సమగ్ర మూల్యాంకనంనకు సంబంధించి రిజిష్టరు మరియు రికార్డు అమలులో ఉన్నాయి.

**ముగింపు :**

ఉపాధ్యాయుడు పాఠాలను విద్యార్థులకు బోధించడానికి లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. అందుకు తగిన విధంగా తరగతి గది ప్రణాళికను రూపొందించుకోవాలి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు తాను బోధించబోయే తరగతులకు సన్నద్ధత కలిగి ఉండాలి. బోధనా సంసిద్ధతలో భాగంగా వార్షిక ప్రణాళిక, పాఠ్య ప్రణాళిక, కనీసం ఒక నెలకు పిరియడు ప్రణాళిక తయారు చేసుకోవాలి. అభ్యసన సామగ్రిని, అభ్యసనవసరాలను సమకూర్చుకోవాలి. పిల్లల్లో తరగతి వారీగా ఏయే విద్యా ప్రమాణాలలో ప్రగతి సాధించాలో దానికి అనుగుణంగా బోధనాభ్యసన ప్రక్రియలు తరగతి గదిలో నిర్వహించాలి. విద్యార్థులలో సామర్థ్యాలు అభివృద్ధి పరచాలి. విద్యార్థి ప్రగతిని ఎప్పటికప్పుడు నిరంతర సమగ్ర మూల్యాంకనం ద్వారా అంచనా వేయాలి. వెనుకబడిన విద్యార్థులకు పునర్బలనం చేకూర్చి విద్యార్థి ప్రగతికి తోడడ్పాలి. విద్యార్థులలో భాషా సామర్థ్యాలు అభివృద్ధి పరచి సమగ్ర ప్రగతిని సాధించి ప్రతిభావంతులైన వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుటకు తోడ్పడాలి.

## మూల్యాంకనం

I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి?

1. తరగతి ప్రణాళికను రూపొందించుకొనుటలో ఉపాధ్యాయుని సన్నద్ధతను మరియు బోధనాభ్యసన సామగ్రిని వివరించండి?
2. ఉపాధ్యాయుడు భాషాబోధనకు ఎలా సంసిద్ధుడు కావాలి? బోధనా ప్రణాళికలను వివరించండి.
3. ఒక తరగతికి వార్షిక ప్రణాళిక తయారుచేయండి.
4. 3వ తరగతి ఒక పాఠమునకు పాఠ్య ప్రణాళికను తయారు చేసి ఒక పిరియడు ప్రణాళికను తయారుచేయండి.
5. నిర్మాణాత్మక మూల్యాంకన నిర్వహణను వివరించండి.
6. సంగ్రహణాత్మక మూల్యాంకనము నిర్వహణను వివరించండి.
7. కుమ్యులేటివ్ రికార్డు నందు ఉండవలసిన అంశములను పట్టిక రూపంలో వివరించండి.

II ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానాలు వ్రాయండి?

1. ప్రణాళిక ఆవశ్యకతను వివరించండి?
2. బోధనాభ్యసన ప్రక్రియలలో శ్రవ్య-దృశ్య బోధనాభ్యసన సామగ్రి పాత్రను వివరించండి.
3. పిరియడు ప్రణాళిక సోపానాలను వివరించండి.
4. మూల్యాంకనము ఆవశ్యకతను వివరించండి?
5. అభ్యసనం కొరకు మదింపు, అభ్యసనం యొక్క మదింపులను వివరించండి?
6. నిర్మాణాత్మక మూల్యాంకనం సాధనాలను వివరించండి.

III ఈ క్రిందివానికి 4, 5 వాక్యాలలో సమాధానం వ్రాయండి?

1. బోధనాభ్యసన సామాగ్రిని ఉపయోగించడంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వ్రాయండి?
2. మెరుపు అట్టలను వివరించండి.
3. సంగ్రహణాత్మక మూల్యాంకనంలో ప్రశ్నపత్రాన్ని ఎలా తయారు చేస్తారు.?
4. పిల్లల ప్రగతి నమోదుకు సంబంధించిన గ్రేడింగ్ వివరించండి.
5. వార్షిక ఫలితాన్ని ఎలా నమోదు చేస్తారు.

IV ఈ క్రింది లక్ష్యాత్మక ప్రశ్నలకు సమాధానాలు వ్రాయండి.

1. శ్రవ్య బోధనాభ్యసన ఉపకరణాలు 1)........................ 2)..............................
2. పాఠ్య ప్రణాళిక అనగా ........................
3. ఒక విద్యా సంవత్సరంలో పాఠశాల పనిదినాలు ( )

   అ) 180 ఆ)160 ఇ) 220 ఈ) 200
4. సంగ్రహణాత్మక మూల్యాంకనంలో 1,2 తరగతులకు మౌఖిక పరీక్షలు కేటాయించే భారత్వం.

   అ) 40% ఆ) 30% ఇ) 20% ఈ) 10%

5. ఈ క్రింది వానిని జతపరచండి.

| | | |
|---|---|---|
| 1) లఘు పరీక్ష | కుమ్యులేటివ్ రికార్డు | (   ) |
| 2) సామర్థ్యాల వారీగా ప్రశ్నలు | మూల్యాంకనం | (   ) |
| 3) హాజరు సమాచారం | నిర్మాణాత్మక మూల్యాంకనం | (   ) |
| 4) పిల్లల ప్రగతి అంచనా వేసేది | సంగ్రహణ మూల్యాంకనం | (   ) |

**సంప్రదింపు గ్రంథాలు**


1. డి.ఎడ్. అధ్యాపన శాస్త్రం. తెలుగు బోధనా పద్ధతులు. తెలుగు అకాడమి 2001
2. డి.ఎడ్. తెలుగు బోధనా పద్ధతులు. తెలుగు అకాడమి : ప్రచురణ 2010
3. బి.ఎడ్. అధ్యాపన శాస్త్రం. తెలుగు బోధనా పద్ధతులు. తెలుగు అకాడమి 2002
4. నిరంతర సమగ్ర మూల్యాంకనం. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ, ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్.
5. డి.ఎడ్. తెలుగు ఛాత్రోపాధ్యాయుల కరదీపిక రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ సంస్థ ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్.
6. తొలకరి చినుకులు 1 నుండి 5 తెలుగు వాచకములు 1 నుండి 5 తరగతులు. తెలుగు అకాడమి, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్, 2011, 2012, 2013.
7. డిప్లమా ఇన్ ఎడ్యుకేషన్ (దూర విద్యావిధానం) భాషా విద్య–తెలుగు, రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ, ఆంధ్రప్రదేశ్.